
# గుజరాత్ ఫైల్స్

## దుర్మార్గ పాలనపై రహస్యనేత్రం

రానా అయ్యూబ్



954.75
అయ్యూబ్-గుజరా
118658

118658

# గుజరాత్ ఫైల్స్

రానా అయ్యూబ్

తెలుగు అనువాదం

ఎన్. రవి

*GUJARATH FILES*

*Translation of Gujarath Files*
*by Rana Ayyub*

*Translated by  N Ravi*

*© Rana Ayyub*

C. 17104

*Cover design  Ramanajeevi*

*ISBN  978-93-85076-02-2*

*Published by  MALUPU, Hyderabad.*

*http //malupu wordpress com, email  malupuhyd@gmail com*

*For copies  2-1-1/5, Nallakunta, Hyderabad - 500 044*

*Published  November, 2016*

*2nd Edition  December, 2016*

*3rd Edition  April, 2017*

954.75

ప్రచురణ సంఖ్య  13
మొదటి ముద్రణ . నవంబర్, 2016
రెండవ ముద్రణ  డిసెంబర్, 2016
మూడవ ముద్రణ  ఏప్రిల్, 2017

గుజరాత్ ఫైల్స్

మూలం  గుజరాత్ ఫైల్స్
రానా అయ్యూబ్

ప్రచురణ · మలుపు, హైదరాబాద్
ప్రతులకు · 2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్ - 500 044, తెలంగాణ

అనువాదం  ఎన్ రవి

కవర్ డిజైన్  రమణజీవి

₹ 130/-

---

ముద్రణ . చరిత ఇంప్రెషన్స్, హైదరాబాద్  ఫోన్ · 27678411

పోరాడేందుకు నాకొక కారణాన్నిచ్చిన
ముకుల్ సిన్హా, షాహిద్ అజ్మీలకు
అంకితం
అబ్బాకు, అమ్మీకి

# అనధికార చార్జిషీట్

ఈ పుస్తకం చదవడం ఒక హింసాత్మక అనుభవం వాక్యాల వెంట నడుస్తుంటే గుండె వేగంగా కొట్టుకుంటుంది. పేజీలు తిప్పుతుంటే, వేళ్లు వణుకుతాయి. అంతులేని నిస్త్రాణ ఆవరించి, పుస్తకం పూర్తయ్యేసరికి భయభ్రాంతులమవుతాము. రచయిత ప్రదర్శించిన అద్భుత రచనాశైలో, ఉత్కంఠ నింపిన కథనమో అందుకు కారణం కాదు నిజానికి రచనాపద్ధతిలో పెద్ద విశేషం ఏమీ లేదు పాఠకులను కల్లోలపరిచేది ఇందులోని విషయమే అట్లాగని, ఆ విషయం కొత్తదీ కాదు, ఇంతకు మునుపు మన ఊహల్లో అంచనాల్లో లేనిదీ కాదు

రానా అయ్యూబ్ పుస్తకం 'గుజరాత్ ఫైల్స్' ఇటీవలి దేశచరిత్రకు సంబంధించిన అతి కీలకమయిన పరిణామాలను విస్ఫోటనాత్మకంగా స్పృశించింది 2002లో గుజరాత్‌లో జరిగిన మారణకాండ, దాని తరువాత ఆ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్లు, వాటితో ప్రమేయం ఉన్న రాజకీయ వ్యక్తులు జాతీయ స్థాయి నాయకులుగా ఎదగడం – వీటిని ఈ పుస్తకం ఒక దృక్కోణంలో కథనం చేసింది పరిశోధనాత్మక కథనాలకు ప్రసిద్ధి చెందిన పత్రిక 'తెహెల్కా' ఉద్యోగిగా అనేక సంచలనాత్మక సత్యాలను వెలికితెచ్చిన యువపాత్రికేయురాలుగా రానా అయ్యూబ్ ప్రసిద్ధురాలు అమిత్‌షా జైలుకు వెళ్లడానికి కారణమయిన కథనాలు కూడా ఆమెవే గుజరాత్ గురించిన మరిన్ని స్పష్టమైన వాస్తవాలను వెలికితీయడానికి ఆమె 2010–11 మధ్యకాలంలో ఆ రాష్ట్రం వెళ్లి మారు పేరుతో, ఔత్సాహిక చిత్రనిర్మాతగా నటిస్తూ ఎంతో ప్రమాదకరమైన పరిశోధన జరిపారు. 2002 మారణకాండ, అనంతర సంఘటనల కాలంలో కీలకమైన బాధ్యతలలో ఉన్న అధికారులతో, ప్రజాప్రతినిధులతో ఆమె మాట్లాడారు. పరిశోధన నరేంద్రమోదీ దాకా చేరిన సమయంలో, 'తెహెల్కా' రానాను వెనక్కు రప్పించింది ఆమె చేసిన స్టింగ్ ఆపరేషన్‌ల కథనాలను ప్రచురించడానికి నిరాకరించింది మరే పత్రికా, వార్తా ఛానెల్ కూడా ఆమె కథనాలను స్వీకరించలేదు

చివరకు తన పరిశోధనను తానే పుస్తకంగా ప్రచురించి, ఈ ఏడాది మేలో విడుదల చేసింది. పుస్తకం బయటికి వచ్చిన తరువాత కూడా ప్రధాన మీడియా అంతా మౌనమే పాటించింది. ప్రత్యామ్నాయ వేదికలుగా ఉన్న కొన్ని వార్తా వెబ్‌సైట్లు మాత్రమే కొంత పట్టించుకున్నాయి. విస్మరించడం ద్వారానే ఈ పుస్తకంలోని అంశాలను పూర్వపక్షం చేయగలమని నిందితులు కూడా భావించారు

ఇంగ్లీషు మూలం 'గుజరాత్ ఫైల్స్' అనాటమీ ఆఫ్ ఎ కవర్ అప్'ను 'ఫస్ట్‌పోస్ట్'లో సమీక్షించిన ప్రదీప్ మీనన్ అనే పాత్రికేయుడు ఇట్లా రాశాడు "సూక్ష్మ వివరాల్లోనే దేవుడుంటాడని అంటూ ఉంటారు. వేర్వేరు దేవుళ్లకు చెందిన వారు రానా అయ్యూబ్ పుస్తకంలోని సూక్ష్మవివరాలను వేర్వేరుగా చదువుకుంటారు అయినా సరే, ఈ పుస్తకంలో పూసగుచ్చిన సూక్ష్మాతిసూక్ష్మమైన వివరాలే మీ దృష్టిని కట్టిపడేస్తాయి " నిజమే, ఈ పుస్తకంలో చిన్న చిన్న సంగతులు, ముచ్చట్లే ముఖ్యమైనవి అవే మనకు ఒక సారాంశాన్ని గాఢంగా బట్వాడా చేస్తాయి తాను సేకరించిన సమాచారాన్ని, జరిపిన సంభాషణల్ని పుస్తకంగా రూపొందించే క్రమంలోను, రాయడంలోను రానా అయ్యూబ్ ప్రత్యేకమైన ప్రతిభ ఏమీ చూపలేదు మారుపేరుతో ఒక కొత్త ఉనికిని స్వీకరించేటప్పుడు ఎదురయిన ఇబ్బందులు, అన్ని అవరోధాలను విజయవంతంగా అధిగమించినప్పటి విశేషాలు . ఒక్కో సంభాషణ తరువాత తనలో కలిగిన భయోద్విగ్నత – ఈ పుస్తకానికీ నాటకీయతను, ఉత్కంఠను జోడించాయి వాటి వల్ల పఠనీయత కొంత పెరిగి ఉండవచ్చును కానీ, రానా అయ్యూబ్ జరిపిన స్టింగ్ సంభాషణలే ఈ పుస్తకానికి ప్రాణం గుజరాత్ హింసాకాండ సమయంలో హోమ్ సెక్రటరీగా పని చేసిన అశోక్ నారాయణ్, ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఉన్న జి సి రాయిగర్, ఒక దళిత ఐఎఎస్ అధికారి రాజన్ ప్రియదర్శి, హింసాకాండ సమయంలో దుండగుల మూకకు నాయకత్వం వహించినట్టు అభియోగం ఉన్న మాయా కొద్నానీ, గుజరాత్ ఎటిఎస్ చీఫ్‌గా పనిచేసిన జి.ఎల్ సింఘాల్, 2002లో అహ్మదాబాద్ పోలీస్ కమీషనర్‌గా ఉండిన పి సి పాండే, నాడు రాష్ట్ర పోలీసు డిజిగా పనిచేసిన చక్రవర్తి – వీరందరితోనూ రానా అయ్యూబ్ గుజరాత్‌పై తాను నిర్మించాలనుకునే చిత్రం కోసమని చెప్పి ముచ్చటించారు ఈ సంభాషణల్లో గుజరాత్ హింసాకాండ నేపథ్యం, నరేంద్రమోదీ, అమిత్‌షా పాత్ర ఏ మేరకు ఉన్నది, 2002 తరువాతి కాలంలో జరిగిన అనేక ఎన్‌కౌంటర్ల పూర్వాపరాలు, సూత్రధారులకు, పాత్రధారులకు ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్‌లలో ఉన్న ప్రాబల్యం – వంటి అంశాలు అనేకం ప్రస్తావనకు వచ్చాయి వీరిలో కొందరికి నాడు జరిగిన పరిణామాలపై అసంతృప్తి,

వ్యతిరేకతా ఉన్నాయి. అందువల్ల వారు ఇబ్బందులు కూడా పడ్డారు పనిలో పనిగా ఈ సంభాషణలు, పోలీసు వ్యవస్థలోని కులవివక్షను కూడా చెబుతాయి ఒక ప్రత్యేకమైన సామాజిక భావధోరణి ఉన్న రాజకీయ నాయకులు అధికారంలో ఉండగా, రాజ్యయంత్రాంగం వారికి ఎట్లా అనుకూలంగా వ్యవహరిస్తుందో, ఆ యంత్రాంగమే ఆ భావధోరణికి ఎట్లా ప్రభావితమవుతుందో, మనుషుల ప్రాణాలపై వారికి ఉండిన పట్టింపు ఎంతో, మొత్తంగా ఆ క్రమం, దేశ రాజకీయ వాతావరణంలో ఏ మార్పులు తెచ్చి, ఎటువంటి అధికార మార్పిడికి కారణమవుతుందో – ఆ సంభాషణలు చదువుతుంటే పాఠకులకు అంచనా కలుగుతుంది

స్టింగ్ ఆపరేషన్ ద్వారా వాస్తవాలను రాబట్టడం పాత్రికేయ రచనలో ఉత్తమమైన ధోరణి కాదన్న అభిప్రాయం ఉన్నది ఎదుటివారిని మభ్యపెట్టి, సమాచారాన్ని రాబట్టడం కానీ, అనైతికతకు ప్రలోభపెట్టి కెమెరాకు పట్టించడం కానీ అన్నివేళలా ఉదాత్తమైన మార్గాలు కాకపోవచ్చు కెమెరా ముందు గానీ, రికార్డర్ ముందు గానీ చెప్పిన విషయాలు, ఆ వ్యక్తులు న్యాయస్థానాల్లో ప్రమాణపూర్తిగా తిరిగి చెబుతారా అన్నది ఒక ప్రశ్న అట్లా చెప్పకపోతే, ఆ సమాచారానికి ఉన్న చట్టబద్ధ విలువ ఏమిటన్నది సందేహం అయితే, సత్యాన్ని వెలికితీయడానికి అంతకు మించిన మార్గం లేనప్పుడు గత్యంతరం ఏమిటి? ఇటువంటి పుస్తకం పెద్ద సంచలనం తెచ్చి, న్యాయస్థానాలు తమంతట తాము ఇందులోని విషయాలను పరిగణనలోకి తీసుకుని మొత్తంగా విచారణ జరపమని ఆదేశించగలవా? రానా అయ్యూబ్ ఆ ఫలితాన్ని ఆశించారా? ఆశించి ఉండకపోవచ్చు హింసాకాండపైన, ఎన్‌కౌంటర్లపైన న్యాయస్థానాల్లో ఉన్న వ్యాజ్యాలు విఫలమవుతున్న నేపథ్యంలో తమ పరిశోధన కనీసం వాస్తవాలను రికార్డు చేస్తుందని ఆమె ఆశించి ఉంటారు

మైనారిటీలపై పెద్ద ఎత్తున హింసాకాండకు పాల్పడుతున్న మూకలను చూసీ చూడనట్టు వదిలివేయమని నాటి ముఖ్యమంత్రి ఆదేశించారా? అంటే, అటువంటి ఆదేశాలు నేరుగా కానీ, లిఖితపూర్వకంగా కానీ ఉండవని, అటువంటి సందేశం తగినవారికి అందేట్టుగా వ్యవహారం నడుస్తుందని ఇందులో ఇద్దరు ముగ్గురు అధికారులు చెప్పారు ఇక అటువంటి వాటికి కోర్టులు ఆమోదించే సాక్ష్యం ఏముంటుంది? పాఠకులకు విషయం అర్థం కావడమే ఇటువంటి పరిశోధనల ప్రయోజనం న్యాయస్థానాల్లో నిర్ధారణ కాకపోయినా, ఈ పుస్తకం ఒక తీర్పు వంటిదే ఈ తీర్పుకు చట్టబద్ధమైన శిక్ష ఉండదు కానీ, పాఠకుల దృష్టిలో అభియోగాల నిర్ధారణ జరిగినట్టే ఒక చారిత్రక పత్రంగా ఇది వర్తమాన భారత చరిత్రకు సంబంధించిన

కొన్ని ఘట్టాల నేపథ్యాన్ని, వాటి పర్యవసనాల్ని ఒక నిర్దిష్టమైన దృక్పథంతో అందిస్తుంది. చరిత్ర ఉన్నంత కాలం, కొన్ని నేరాలకు సంబంధించిన 'ప్రామాణికమైన' కథనంగా నిలుస్తుంది. ఈ దృష్టిలో చూసినప్పుడు రానా అయ్యూబ్ విజయవంత మయ్యారు.

స్వతంత్ర భారతదేశంలో అత్యంత అమానవీయమైన, క్రూరమైన హింసాకాండగా పేరు పొందిన గుజరాత్ ఘాతుకం నేపథ్యాన్ని ఒకసారి గమనించాలి. కేశూభాయ్ పటేల్‌ను దించివేసి, అసెంబ్లీకాలం మధ్యలో గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ ప్రతిష్ఠితులయ్యారు. ఆయన ముఖ్యమంత్రి అయిన కొద్ది కాలానికే గుజరాత్ హింస జరిగింది ఆ తరువాత కొద్ది నెలలకే ఎన్నికలు జరిగి, మోదీ ఘనవిజయం సాధించారు. ఆ ప్రభుత్వంలో హోంశాఖ సహాయమంత్రిగా ఉన్న అమిత్‌షా తమ ప్రాబల్యాన్ని వేగంగా పెంచుకోసాగారు. ఆ సమయంలోనే హోంమంత్రి హరేన్ పాండ్య హత్య జరిగింది. ఆ హత్యకు కారకులు ముస్లిం తీవ్రవాదులని చెబుతూ అనేక అరెస్టులు జరిగాయి గుజరాత్ హింసకు ప్రతీకారంగా మోదీ హత్యకు ప్రయత్నిస్తున్నారనే పేరుతో అనేక ఎన్‌కౌంటర్లు జరిగాయి. అందులో ఇష్రాత్ జహాన్ అనే యువతి ఎన్‌కౌంటర్, సొహ్రాబుద్దీన్ అనే చిన్న నేరుస్తుడి ఎన్‌కౌంటర్ సంచలనం సృష్టించాయి. సందేహాస్పదమైన ఎన్‌కౌంటర్లతో జాతీయస్థాయిలో వివాదం చెలరేగింది అమిత్ షా అరెస్టు జరిగింది తరువాత దీర్ఘకాలం ఆయనను గుజరాత్‌లో ప్రవేశించకుండా నిరోధించడం జరిగింది గుజరాత్ హింసాకాండ నేపథ్యంలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో మిత్రపక్షాలు కొన్ని తీవ్ర నిరసన చెప్పాయి. మోదీకి వీసా ఇచ్చేది లేదని అమెరికా స్పష్టం చేసింది. 2002 హింసాకాండ ఆ ఏటి ఎన్నికలలో గెలుపునకు దోహదం చేయగా, మోదీ కొత్తగా అందుకున్న అభివృద్ధి అజెండా 2007లో ఆయనను గెలిపించింది అయినా, 2002 ఆయనను, అమిత్‌షాను, ఆనాటి అధికారులను వెంటాడుతూనే ఉన్నది. దేశంలోని అనేక రాష్ట్రాలు మోదీని అవాంఛనీయ వ్యక్తిగానే చూస్తూ వచ్చాయి. మరొకవైపు, మోదీలో ఏదైతే ప్రతికూల అంశమని అనుకున్నారో, దాన్నే ఆరాధించే ధోరణి దేశవ్యాప్తంగా పెరిగిపోయింది ముస్లిములకు బుద్ధిచెప్పిన నాయకుడిగా, శీఘ్రంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రిగా ఒక జమిలి వ్యక్తిత్వం మోదీకి ఆపాదిస్తూ, ఆయన ప్రభావాన్ని పెంచే ప్రయత్నాలు జరిగాయి పార్టీలో కూడా అతని ప్రాబల్యం పెరిగిపోయింది. కాంగ్రెస్ వంటి అనుభవశాలి అయిన పక్షమే ఈ క్రమాన్ని సరిగా అంచనా వేయడంలో విఫలం అయింది మతతత్వం పై సూత్రబద్ధ వైఖరి లేకపోవడం, తరచు దానితో రాజీపడడం, తరచు తాను కూడా దాన్ని ఆశ్రయించడం – ఈ కారణాలతో కాంగ్రెస్ పార్టీ మోదీ – షా ద్వయం

ఎదుగుదలను నిలువరించలేకపోయింది మతతత్వ భావజాలం, నిర్దాక్షిణ్యమైన పరిపాలనాచర్యలు, ప్రచారవ్యూహం - ఇవన్నీ కలిసి భారత అధికార పీఠం మీద అత్యంత ప్రమాదకరమైన శక్తులను ప్రతిష్ఠించగలిగాయి రానా అయ్యూబ్ పుస్తకం చదువుతుంటే, ఈ క్రమం అంతా కాలక్రమంలో మన కళ్లముందు కదులుతుంది అనేక ఘటనల మధ్య కార్యకారణ సంబంధం అర్థమైపోతూ ఉంటుంది 2002లో జరిగింది నిస్సహాయుల మీద దుండగులు జరిపిన మారణకాండ మాత్రమే కాదని, అనంతరం జరిగిన అనేక సంఘటనలు కేవలం స్థానికమయిన అవసరాల కోసం జరిగినవి కావని తెలిసిపోతుంది

ఈ పుస్తకం పాత్రికేయరంగంలో వచ్చిన బాధాకరమైన మార్పులను కూడా మనకు బోధపరుస్తుంది సంపాదకీయ ప్రమాణాలకు అనుగుణంగా లేదని, అసమగ్రంగా ఉన్నదని 'తెహెల్కా' యాజమాన్యం ఈ పరిశోధనను ప్రచురించలేదు చెప్పిన కారణాలు ఏమైనప్పటికీ, వారు పర్యవసానాలకు భయపడి ఉంటారని ఊహించవచ్చు 'తెహల్కా' చిన్న పత్రిక అప్పటికే అది తన తాహతుకు మించిన పరిశోధనాత్మక కథనాలను అందించింది కానీ, జాతీయస్థాయి దిగ్గంత పత్రికలు, మీడియా సంస్థలు కూడా రానా అయ్యూబ్ పరిశోధనకు ముఖం చాటు చేశాయి రాజకీయ పక్షపాతాలు మోతాదుకు మించిపోయి, మీడియా అధికారక్రీడలో భాగం కావడం ఈ మధ్య పెరిగిపోయిన ధోరణి ప్రాంతీయ భాషా మీడియా కంటె ఇంగ్లీష్, హిందీ పత్రికలు, చానెళ్లు - కనీసం జాతీయ సమస్యల విషయంలో - ధైర్యంగా, నిష్పక్షపాతంగా ఉంటాయన్నది గతంలోని మాట ఆర్థిక సంస్కరణల అనంతర కాలంలో రాజకీయాధికారానికీ, కార్పొరేట్ పెట్టుబడులకు సంబంధం గాఢమైంది స్వతంత్ర మీడియా అన్నది అరుదు అయింది సమాచారహక్కు చట్టరూపం తీసుకున్న తరువాత కూడా, సమాచార సాంకేతికత అనేక వెసులుబాట్లను కల్పిస్తుందన్న ఆర్భాటం తరువాత కూడా, సత్యానికి సంకెళ్లు కొనసాగుతూనే ఉన్నాయి ఈ వాస్తవ పరిస్థితిని ఖాతరు చేయకుండా, తనలో సాహసోపేతమైన పాత్రికేయురాలిని, సంకల్పబలం కలిగిన ప్రజాస్వామ్యవాదిని నిలుపుకున్న రానా అయ్యూబ్ అభినందనీయురాలు

కె. శ్రీనివాస్

సంపాదకులు ఆంధ్రజ్యోతి

హైదరాబాద్,

అక్టోబర్ 27, 2016

# ముందుమాట

*హిరణ్మయేన పాత్రేణ సత్యసాపిహితం ముఖం!*
*సత్యం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే!!*
*(సత్యం యొక్క ముఖాన్ని స్వర్ణ పాత్ర కప్పేసింది,*
*సత్యపూరిత ధర్మసందర్శనం కోసం ఓ పుషన్! దాన్ని తొలగించు)*

**- ఈశ్వరోపనిషత్తు**

"సత్యం కల్పనకన్నా వింతైనది ఎందుకంటే, కల్పన తప్పనిసరిగా సాధ్యాసాధ్యాలకు కట్టుబడి ఉండవలసి వస్తుంది. కానీ సత్యం కాదు–" అని మార్క్‌ట్వెన్ వ్యాఖ్యానించాడు. కానీ సత్యం యొక్క స్వభావం యుగాలుగా తత్వవేత్తలను అబ్బురపరుస్తూనే ఉంది 'పవిత్ర కలశం' (Holy Grail) లాగా దాన్ని విభిన్న వ్యక్తులు విభిన్న సమయాల్లో, పరిస్థితుల్లో రకరకాలుగా దర్శించారు ఏకాగ్రచిత్తులై సత్యాన్ని శోధించే వాళ్ళు మాత్రం యితరుల సహాయాన్ని ఆశించకుండా తమ చైతన్యమే తమకు మార్గదర్శనం చేస్తుంటే, కష్టాలు, విపత్తులతో కూడిన మార్గంలో ఒంటరిగా ప్రయాణించవలసి ఉంటుంది

గుజరాత్‌లో 2002లో జరిగిన కల్లోలభరిత ఘటనలకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు సంబంధించి ఈ పుస్తకంలో వివరించిన సత్యాన్ని గురించిన పఠనం చాలా ఆసక్తికరంగా సాగుతుంది సుదీర్ఘకాలం పాటు సాగిన 'స్టింగ్' ఆపరేషన్‌లో విరివిగా ఉపయోగించిన రహస్య కెమెరాలు, రహస్య మైక్రోఫోన్‌లు అందించిన సమాచారంతో ఈ పుస్తకం పాఠకులకు లోతైన అవగాహన కలిగిస్తుందని రచయిత అభిప్రాయం ఈ పుస్తకంలో ముందుకు తెచ్చిన సమాచారం వాస్తవాలను ప్రతిబింబిస్తున్నదా లేక ఆ ఘటనలకు సంబంధించి రచయిత దృక్పథమా అనేది నిర్ణయించుకోవలసిన నిర్ణేతలు మాత్రం పాఠకులే

ప్రత్యక్ష సంభాషణలతో కూడిన కథనం వల్ల పఠనం ఆసక్తికరంగా సాగుతుంది ఇక్కడ ఉల్లేఖించిన వాస్తవాలు ఏ మేరకు నిజమైనవనేది నిర్ణయించి ఈ దేశపు పౌరులకు చట్టబద్ధ పాలనలో విశ్వాసం పునరుద్ధరించడానికి అవసరమైన చర్యచేపట్టవలసింది మాత్రం చట్టబద్ధ పాలనను అమలు చేయవలసిన అధికార యంత్రాంగమూ, ఆ చట్టానికి కాపలాగా నిలబడవలసిన రాజ్యాంగ యంత్రాంగమే

ముంబయ్‌లో డిసెంబర్ 1992–జనవరి 1993 మధ్య జరిగిన మతకల్లోలాలు, హింసాత్మక ఘటనల గురించి ఏర్పాటయిన విచారణా కమిషన్ జరిపిన విచారణ సందర్భంలో నాకు కలిగిన బాధాకరమైన అనుభవం, అటువంటి కల్లోలాల బాధితుల పట్ల చాలా స్పష్టంగా కనిపించిన ఉపేక్షాభావం వలన నాకు అనిపించేదేమంటే - ఇటువంటి కల్లోలాలకు గల కారణాలను తెలుసుకోవడంలో, అవి పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టడంలో రాజ్య యంత్రాంగం, రాజ్యాంగ అధికారులు మరింత గంభీరమైన ప్రయత్నం చేయవలసి ఉంది

ఈ పుస్తకంలో వర్ణించిన వాటన్నింటి నిజానిజాలను నిర్ధారించడం మనకు సాధ్యం కాకపోయినప్పటికీ రచయిత తాను సత్యమని నమ్మిన దాన్ని బయటపెట్టడానికి చేసిన ప్రయత్నాల్లో ప్రదర్శించిన ధైర్యసాహసాలను, అంకిత భావాన్ని ప్రశంసించకుండా ఉండలేం ఆమెకూ, పరిశోధనాత్మక జర్నలిజంలో ఆమె సాహస యాత్రకూ అభినందనలు నిజాయితీరాహిత్యం, రాజకీయ చాణక్యం, మోసం పెరుగుతున్న ఈ రోజుల్లో పైవాటి అవసరం పెరుగుతున్నట్టే ఉంది

ముంబయి,
11 ఏప్రిల్, 2016

*బి.ఎన్.శ్రీకృష్ణ*

# ఉపోద్ఘాతం

*అధికారానికి వ్యతిరేకంగా మనిషి చేసే పోరాటమంటే*
*మరచిపోవటానికి వ్యతిరేకంగా జ్ఞాపకం చేసే పోరాటం*

**- మిలన్ కుందేరా**

లైంగిక అత్యాచారానికి గురై మునిసిపల్ ఆసుపత్రిలో పడి ఉన్న ఒక మూడేళ్ళ చిన్నారిని గురించి 2007లో ఒక వార్తా ఛానల్‌కు రిపోర్టు చేయడానికి సంబంధించిన జ్ఞాపకం నన్ను నిరంతరం వెంటాడుతూ నా జీవితంలో అంతర్భాగమైంది ఒక ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పైరేటెడ్ పుస్తకాలమ్ముకునే ఆ అమ్మాయి తల్లితండ్రులు, మత్తు పదార్థాల ప్రభావంలో వున్నందువల్ల కావచ్చు తమ ఐదుగురు కూతుళ్లలోని ఒకరి బాధగురించిగానీ, ఆ పాప దయనీయ స్థితి గురించిగానీ ఏ మాత్రం ఎరుకలేకుండా ఉన్నారు ఆ పాప ముఖానికి, శరీరానికి దారుణంగా దెబ్బలు తగిలిఉన్నాయి ఆ చిన్నిపాప అమాయకమైన చిరు శరీరంపై పైశాచికత్వపు చిహ్నాలన్నీ కనిపిస్తున్నాయి ఈ కథనానికి సంబంధించిన టేపును ఢిల్లీ స్టూడియోలకు పంపించాక, రాత్రి రెండు గంటలకు నేను ఇంటికి చేరుకున్నాను నేరస్థుడు పట్టుబడ్డాడా అని తెలుసుకోవడానికి పరిశోధనాధికారిని అర్ధరాత్రి వరకు 'మెస్సేజ్'లతో ముంచెత్తాను ఆ పాప కోలుకుంటున్నదా అని చూడటానికి నేను మరుసటి రోజు ఆసుపత్రికి చేరుకున్నా ఆమెకు ఎన్నో ఇన్ఫెక్షన్లు సోకాయి. ఆమె గాయాల మీద ఈగలు ముసురుతున్నాయి ఆమె చిన్ని చేతుల మణికట్ల నిండా సూదులు గుచ్చిన గాయాలు. ఆమె తలిదండ్రులు అక్కడ కనుచూపు మేర లేరు నేను ఆఫీసుకు చేరుకోగానే ఈ కథనాన్ని పెద్ద ఎత్తున ప్రసారం చేయమనీ, అది నేరస్థుణ్ణి పట్టుకొని శిక్షించటంలో దోహద పడుతుందనీ నేను మా బాస్‌ను అర్థించాను అతడు ఒక చిరునవ్వు నవ్వి తన లాప్‌టాప్‌లోకే చూస్తూ ఉండిపోయాడు అప్పుడు ముంబైలో కుంభ వృష్టి పడుతోంది మిలన్ సబ్‌వే

పై, వర్షాలపై కేంద్రీకరించి వరదల గురించి నువ్వు కొన్ని మంచి షాట్స్ తీసుకుంటే మంచిదని అన్నాడు

వర్ష రుతువులో ముంబై వానలంటే చాలా పేరు పొందినవి ఆ సమయంలో మిలన్ సబ్‌వే అంటే కెమెరావాళ్ళకు బాగా ఇష్టమైన స్థలం అక్కడికి వెళుతూ దారిలో మాఅమ్మకు ఫోన్ చేసి 'నా వల్ల కాదు' అనిఅరిచాను నా గుండె వేగంగా కొట్టుకోసాగింది రోజంతా ఏమీ తినలేకపోయాను. ఆ ఘటన జరిగిన మూడవ రోజు మా కుటుంబ డాక్టరు నాకు నిద్ర మాత్రలు ఇవ్వాల్సి వచ్చింది నేను మా ఎడిటర్‌కు ఫోన్ చేసి నాకు ఒక వారం రోజులు సెలవు అవసరమని అడిగాను. ఈ చిన్న పాప గురించిన కథనాని కంటే ముందు నేను స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ గురించి పరిశోధన చేస్తున్నప్పుడు జర్నలిజంలో నైతికత గురించి, నైతిక విలువల గురించి పెద్ద వాదనలు జరిగాయి అతడు ఓపికగా నా మాటలన్నీ విన్నాక అన్న మాట నాకు అట్లాగే గుర్తుండి పోయింది

'ఒక మంచి జర్నలిస్టు తాను చేస్తున్న కథ పట్ల భావనాత్మకంగా తటస్థంగా ఉండి, వ్యవహారికంగా ఉండటం నేర్చుకోవాలి' ఈనాటికీ నేను ఆ కళలో నైపుణ్యం సంపాదించుకోలేకపోయానని విచారిస్తున్నా అయితే చాలా సార్లు కార్పొరేట్ శక్తుల, రాజకీయ శక్తుల ప్రోద్బలంతో ఏదైనా కథనాన్ని తొక్కిపెట్టాలంటే ఈ సాకునే చూపిస్తారు

# మొదటి అధ్యాయం

జర్నలిజం అంటే నా మేరకు పునర్వ్యాఖ్యానం పొందిన సంవత్సరం 2010 వేసవికాలం. మా నాన్న ద్వారా జర్నలిజానికి సంబంధించిన పాత కాలపు విలువలు పొంది, బొటాబొటి సామర్థ్యంతో, కష్టపడి పని చేసే జర్నలిస్టుగా నన్ను నేను భావించుకునేదాన్ని అయితే ఈ సమయంలో, నేను ఒక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నాను ఇటువంటి స్థితి యే జర్నలిస్టుకు రావద్దని కోరుకుంటాను, ప్రార్థిస్తాను.

సుదీర్ఘ కాలం మెడికల్ సెలవు తర్వాత 2010 లో నేను తెహల్కా లో మళ్ళీ పని మొదలు పెట్టాను. ముంబైలో ఏ డాక్టరూ నాకున్న సమస్య ఏమిటో గుర్తించలేక పోయారు. నేను అప్పుడప్పుడే నక్సలైట్ల ప్రాబల్యం బాగా ఉన్న గడ్చిరోలీలో ఒక పని పూర్తి చేసుకొని వచ్చాను ఈ పని కంటే ముందు నాజీవితంలో అత్యంత దారుణమైన ఒక ఘటన జరిగింది. నాకు అత్యంత ఆప్త మిత్రుడైన షాహిద్ అజ్మీ హత్యకు గురయ్యాడు. క్రిమినల్ చట్టంలో చాలా నైపుణ్యం సంపాదించిన అజ్మీ నా జీవితంలో చాలా ముఖ్య పాత్రలోకి వస్తున్న సమయం అది అతను హత్యకు గురైన రోజు సాయంత్రమే నేను అతన్నికలిసి, ప్రభుత్వం నక్సలైట్లుగా ముద్ర వేసి, తప్పుడు కేసుల్లో ఇరికించి జైళ్ళలో తోసేసిన ఆదివాసీలు, మేధావుల గురించి మాట్లాడవలసి ఉండింది

కానీ, విధి మరొకటి తలచింది నా అన్న కూతురు తన ఏడవ పుట్టిన రోజు గురించి పట్టుపట్టడంతో నేను ఇంటిదగ్గరే ఉండిపోయాను. షాహిద్ గురించి నాకు లేటెస్టుగా ఏమైనా తెలుసా అని అడుగుతూ నా ఫోన్లో దజన్ల కొద్ది మిస్ కాల్స్ ఉన్నాయని నేను తర్వాతే చూశాను. ఎడతెగకుండా నా మిత్రులు చేసిన ఫోన్ల ద్వారా, న్యూస్ చానళ్ళ ద్వారా జరిగింది తెలిసింది. 'జాతి వ్యతిరేకుల' కేసులు చేపట్టినందుకు గుర్తు తెలియని దుండగులు షాహిద్‌ను అతని ఆఫీసులోనే కాల్చి చంపారు. 7/11 ముంబై రైలు పేలుళ్ళ కేసుల్లో అమాయకుల తరపున షాహిద్ కేసు వాదించటం

వల్ల వారు ఆ మధ్యనే నిర్దోషులుగా విడుదల అయ్యారు అతని మరణం తర్వాత 26/11 ముంబై దాడుల కేసులో అతడి సహ ముద్దాయిలిద్దరినీ ముంబై కోర్టులు నిర్దోషులుగా వదిలేసాయి. షాహిద్ హత్య వెనకాల ఉన్న ముఖ్యుడు ఎవరనేది ఇప్పటికీ ప్రజలకు అంతుబట్టని విషయమే.

తామెవరినైనా కోల్పోయినప్పుడు ఆ విషాదాన్నుండి బయట పడటానికి ఎన్నో మార్గాలున్నాయి. అంజలి ఘటించి జీవితంలో ముందుకు కొనసాగడం ఒక పద్ధతి లేదా దాన్నుండి పారిపోయి పనిలో సాంత్వన వెతుక్కోవడం మరొక పద్ధతి నేను రెండో పద్ధతిని ఎంచుకున్నాను అతడు చనిపోయిన తరువాత మూడవ రోజు నేను నాగపూర్‌కు బయలు దేరాను. ఇది నా జర్నలిస్టు కెరీర్‌లోనే అతి ముఖ్యమైన కేసుల్లో ఒకటి అవుతుందనుకోలేదు. అది నక్సలైట్లనే ఆరోపణతో అరెస్టు అయిన విద్యార్థులకు సంబంధించినది వీరిలో అత్యధికులు వెనకబడిన వర్గాలకు చెందిన వారు. వాళ్ళకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యం హాస్యాస్పదమైనది. వాళ్ళ వద్ద భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్‌ల గురించిన సాహిత్యం ఉండింది. నా మిత్రుడు షాహిద్ కూడా ఇటువంటి కేసులే చేపట్టాడు కాబట్టి నాకిది బాగా అనిపించింది. ఇది చేపట్టడం అంటే అది నా మనసులో నా మిత్రుడికి జోహార్లు అర్పించడం వంటిది. కానీ విధి మరొకటి తలచింది. త్వరలోనే నేను వెనక్కు వచ్చి అంతుబట్టని అనారోగ్యానికి గురయ్యాను. తరువాత దాన్ని డిప్రెషన్‌గా డాక్టర్లు గుర్తించారు.

నాకున్న సమస్యను గుర్తించక ముందు చాలా బెంగపడిన నా తలిదండ్రులు నాకు బ్రాంకోస్కొపీ నుండి ఎం.ఆర్.ఐ. దాకా అన్ని రకాల టెస్టులు చేయించారు. ఒక డాక్టరైతే నాకు క్షయకు సంబందించిన వైద్యం చేయించమని కూడా సలహా ఇచ్చాడు. అయితే అదృష్టవశాత్తు నేను దక్షిణ ముంబైలో చాలా పేరుగాంచిన డాక్టర్‌ను అనుకోకుండా కలిశాను. డాక్టర్ చిట్నిస్ నా రిపోర్టులను చూశాక నన్ను కొన్ని ప్రశ్నలు అడిగాడు. ఆ తర్వాత అతడు 'నిన్ను ఏ విషయం సతాయిస్తున్నది' అని అడిగాడు. అతడి ప్రశ్నతో నన్నేదో నిద్రనుండి లేపినట్టయ్యింది 'ఏం లేదు డాక్టర్, నాకు నిస్సత్తువగా, నీరసంగా అనిపిస్తుంది అంతే. ఏమయిందో అంతు పట్టటం లేదు', అన్నాను.

ఒక కనిపించీ కనిపించని చిరునవ్వుతో అతడు, 'నీమీద నీవే ఇట్లా జాలి పడటం మానెయ్యి. ఈ రక్త పరీక్షలతో నీ దైన్యాన్ని పెంచి పెద్దచేసుకోకు. నీకేం కాలేదు. చక్కగా ఉన్నావు నీవు నీ పనికి తిరిగి వెళ్ళు. అదే నీకు మందు అంతా నీ బుర్రలోనే ఉంది'.

'ఇది హైపోఖాంద్రియానా?', నా పరిస్థితిని నేనే విశ్లేషించుకునే ప్రయత్నంలో ఈ మధ్యనే ఈ పదం గురించి చదివాను 'కాదు నీ బద్ధకం, పని నుంచి పారిపోవటం తప్ప మరేం కాదు ఇది', అని డాక్టర్ చిట్నిస్ నిర్వికారంగా అన్నాడు

తరువాయి రెండు రోజులు డాక్టర్ చిట్నిస్ చెప్పిన దాని గురించి ఆలోచించా అటువంటి బద్ధకపు రోజుల్లో ఒకనాడు మా అమ్మ ఒక ఉత్ప్రేరకంగా పని చేయాలని నిర్ణయించుకుంది. మా అమ్మ నాకు చాలా సన్నిహిత మిత్రుల్లో ఒకరు ఆమెకు నిజంగా ఆధునిక విద్య అంటే తెలియదు మా అబ్బానే తనకు టీచర్. ఆమె తన కలలను నా ద్వారా సాకారం చేసుకోవాలనుకుంటానని నాతో అన్నది నేను తిరుగుబాటు చేసేదాన్ని తాను నాకోసం పోట్లాడి ఏ ఎత్తులైనా వేసేది. అంతిమంగా అందరం ఒక అంగీకారానికి వచ్చే వాళ్ళం ఆ రోజు ఆమె నాకు కాఫీ ఇస్తూ, 'అయితే ఉద్యోగం మానేస్తున్నావా?' అని అడిగింది.

నేను నాకోసం తెచ్చిన కాఫీ మీద మాత్రమే ఆసక్తి కనబరుస్తూ ఊరకే భుజాలు ఎగరేసాను ఆమె అలవాటుగా నా పక్కన పరుపు మీద కూచుని ఉర్దూ పత్రిక ఇంక్విలాబ్ చదవడం మొదలు పెట్టింది పది నిముషాల పాటు చదివాక ఆమె నన్ను ఏదో అడగటానికి ఆగింది నేను ఆమెను మధ్యలోనే ఆపేసి, 'అమ్మా, నీవు నాకేదో హితబోధలు చేసేది చదవదలుచుకుంటే వద్దు అవేవీ లేకుండానే నేను బాగానే వున్నా', అని అన్నా

'అరె, అది కాదు. ఈ సోహ్రాబుద్దీన్ గురించి నీవు చదివావా?', అని అడిగింది ఎందుకో గాని ఈ పేరు నాలో ఆసక్తిని రేకెత్తించింది అఫ్‌కోర్స్, సోహ్రాబుద్దీన్ గురించి నాకు తెలుసు అని నాలో నేను అనుకున్న. మన కాలంలోని అతి వివాదాస్పద వ్యక్తుల్లో ఒకడైన నరేంద్ర మోదీతో నా మొదటి భేటీ ఈ సోహ్రాబుద్దీన్ కారణంగానే జరిగింది

2007 లో, సోహ్రాబుద్దీన్ అనే ఒక చిన్న పాటి నేరస్థుడిని బూటకపు ఎన్‌కౌంటర్లో చంపివేసినందుకు ముగ్గురు ఉన్నత స్థాయి పోలీసు అధికారులను వారి అత్యంత సన్నిహిత అధికారియైన రజనీష్ రాయ్ అరెస్టు చేయడంతో వార్తల్లోకెక్కారు

డీ.జి వంజారా, రాజ్‌కుమార్ పాండియన్ కటకటాల వెనక్కు చేరారు మోదీ ప్రభుత్వానికి అత్యంత సన్నిహితులైన ఈ పోలీసు అధికారులు అప్పటి దాకా ఒక వెలుగు వెలిగారు. పత్రికా సమావేశాల్లో వీరు పాల్గొన్న ఫోటోలు రోజూ పత్రికల్లో దర్శనమిచ్చేవి. హిందూ హృదయ సామ్రాట్టయిన నరేంద్ర మోదీని చంపటానికి వెళుతున్న జిహాదిస్టులను 2004లో విజయవంతంగా వెంటాడి చంపేసిన ఆఫీసర్లు

వీళ్ళు. కాబట్టి సహజంగానే వీరి అరెస్టు దేశవ్యాప్తంగా దృష్టినాకర్షించింది

2007లో ఒక టెలివిజన్ వార్తా ఛానల్‌కు రాజకీయ విలేఖరిగా నాకు ఉద్యోగం వచ్చింది. 2007 గుజరాత్ ఎన్నికల గురించి కవర్ చేయటమే నా మొదటి పని గుజరాత్ ముఖ్యమంత్రి అయిన నరేంద్ర మోదీ మరోసారి భారీ విజయం దిశగా కదులుతున్నాడని విశ్లేషకుల అంచనా సమాజాన్ని రెండు ధృవాలుగా చీల్చిన 2002 గుజరాత్ కల్లోలాలు అతన్ని మెజారిటీ హిందువుల దృష్టిలో హీరోను చేసాయి 2007లో అతనికి ఘన విజయం లభించడం ఏమాత్రం కష్టంగా కనిపించలేదు

ఒక కెమెరాపర్సన్ వెంట రాగా నేను అతడి మొదటి ఎన్నికల రాలీకి వెళ్ళా నాకు సరిగ్గా గుర్తు లేదు కానీ, బహుశా గుజరాత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆ ర్యాలీ కి ఏర్పాట్లు చేసింది నరేంద్ర మోదీ పక్కనే స్టేజీ పైన ఇతర మంత్రులతో పాటు అతని కుడి భుజమైన అమిత్‌షా కూడా ఉన్నాడు

నేను ఇతర రాజకీయ ర్యాలీలను కవర్ చేశాను వాటికంటే ఇది భిన్నమైనదని మొదట ఏమీ అనిపించలేదు అయితే ఢిల్లీలోని మా నిర్మాతలు చెప్పినదాని ప్రకారం మోదీకి రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చే అలవాటు ఉంది ఆరోజు అతడు ఏమీ నిరాశపరచలేదు 'వాళ్ళు సోహ్రాబుద్దీన్ గురించి అడుగుతారు సోహ్రాబుద్దీన్ లాంటి టెర్రరిస్టును ఏం చేయమంటారు?' అనే అతని ప్రశ్నకు ప్రజలు కరతాళధ్వనులు చేశారు ముందు వరసలో ఉన్న మహిళలు బిగ్గరగా చప్పట్లు కొట్టారు మోదీకి మహిళలలో చాలా ఆదరణ ఉంది అనుకుంటారు కాబట్టి ముందు వరస ఎప్పుడు మహిళలకే కేటాయించేవాళ్ళు గుజరాతీ మహిళలకు మోదీ ఒక సెక్స్ సింబల్ అని కూడా కాలమిస్టు ఆకార్ పటేల్ ఒక కాలమ్‌లో రాశాడు

'వాణ్ణి చంపండి, చంపండి', అని ప్రేక్షకుల స్పందన ఆశించిన రీతిలోనే ఉండింది. అది ఒక రోమన్ నాటక రంగం లాగా అనిపించింది అతడు తన ఉపన్యాసంలో మియా ముషర్రఫ్ గురించి, దిల్లీ కీ సల్తనత్ (ఢిల్లీ సామ్రాజ్యం) గురించి విరివిగా ప్రస్తావించాడు అతడి ఉపన్యాసం అయిపోయి స్టేజి దిగగానే గుజరాత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పూలదండలతో ముంచెత్తారు ఒక గుంపు అతన్ని చుట్టు ముట్టింది మోదీ రక్షణ వలయాన్ని దాటుతూ నేను దూరాను నా వెనకాలే దూసుకు రావడానికి అవస్థ పడుతున్న కెమరాపర్సన్‌ను నా వెంట రమ్మని గాభరాగా అరుస్తూ నేను దూరాను

'మోదీజీ, మోదీజీ ఒక ప్రశ్న' నా అదృష్టం కొద్దీ అభిమానులు, వందిమాగధుల రక్షణవలయంలో వెళుతున్న అతడు బహుశా ఒక రాజకీయ ప్రశ్నను ఆశిస్తూ నా

వైపు చూశాడు 'మోదీజీ, గుజరాత్‌లో ముగ్గురు పోలీసు ఆఫీసర్లను అరెస్టు చేసి సో(హ్రా)బుద్దీన్‌ను బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపిన కేసు పెట్టారు అయినా మీరు మీ ఉపన్యాసంలో చెప్పిన దాన్ని సమర్థించుకుంటారా?', అని అడిగాను జవాబును ఆశిస్తూ నేను నా మైకును అతని వైపు పెట్టాను కానీ ఆ క్షణాలు కెమరాపర్సన్‌వి నరేంద్ర మోదీ పది సెకన్ల పాటు నాకేసి తేరిపార చూసి వెళ్ళిపోయాడు అతడి మంత్రి నన్ను తిరస్కారంగా చూశాడు ఈ దేశంలో అత్యున్నత పదవియైన ప్రధాని పదవిని అలంకరించిన వ్యక్తితో అది నా మొదటి భేటీ

సోహ్రాబుద్దీన్ కథ, బయట పెట్టి తీరవలసిన కథ మా అమ్మ ఇంక్విలాబ్ పత్రిక చదవడం ద్వారా నాకు ఆ అవకాశం కలిగింది నేను వెంటనే లేచి స్థానిక సైబర్ కేఫ్ కు వెళ్ళా

సోహ్రాబుద్దీన్‌కు సంబంధించిన లింకులన్నీ ఆ కేసులో సి బి ఐ చేస్తున్న దర్యాప్తు గురించి, గుజరాత్‌లో ఉన్నత స్థాయి అధికారి అయిన అభయ్ చూడాసమా అరెస్టు గురించి చెబుతున్నాయి నాకు చూడాసమా తెలుసు ఒక సంవత్సరం కిందటే నేను గుజరాత్ పేలుళ్ళ కేసులో అతని కీలక సాక్షుల్లో ఒకరి ఒప్పుకోలు ప్రకటనను ప్రచురించినందుకు అతను నన్ను ఫోన్‌లో బెదిరించాడు గుజరాత్ పేలుళ్ళ విచారణకు బాధ్యుడైన పోలీసు ఆఫీసరు చూడాసమా ఈ పేలుళ్లను అంతిమంగా ఇండియన్ ముజాహిదీన్ అనే గ్రూపుతో ముడిపెట్టారు మీడియాతో నిరంతర సంబంధాల్లో ఉంటూ తన మాటలను స్పష్టంగా చెప్పే ఆఫీసర్లలో ఒకడైన చూడాసమాకు గుజరాత్ గృహ మంత్రిత్వ శాఖ స్టేట్ మంత్రి అయిన అమిత్ షా తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని అంటారు అయితే, బాగా పేరు పొందిన ఇతర ఆఫీసర్లతో పోలిస్తే చూడాసమా భిన్నమైనవాడు ఇతడికి మోసగాళ్ళతో, హవాలా అకౌంట్లతో ఎక్కువ సంబంధాలున్నాయని తరువాత తేలింది సోహ్రాబుద్దీన్ ఇతడి స్వంత మనుషుల్లోని వాడే అని బయట పడ్డది

ప్రింటౌట్లు, నోట్స్ తయారుగా పెట్టుకొని, ఢిల్లీలో నా ఎడిటర్లైన షోమా చౌదరి, తరుణ్ తేజ్‌పాల్‌లకు ఈ కేసు గురించి రాసి ఈ కేసును రిపోర్టు చేయవలసిన అవసరం గురించి రాసాను నేను నాపైనే విధించుకున్న ఒంటరితనం నుంచి, డిప్రెషన్ నుంచి బయట పడటానికి ఇదొక మార్గం అని కూడా నా మనసులోపల ఉంది నా ఇద్దరు ఎడిటర్లు కూడా చాలా ప్రోత్సహించటంతో నేను మళ్ళీ ఒకసారి అహ్మదాబాద్‌కు బయలుదేరాను ఈసారి ఈ ప్రయాణం నా జీవితాన్నే మార్చి వేసింది

నేను వెళ్ళిన ఒక నెలలోనే పేర్లు బయట పెట్టని కొందరు అధికారుల సాయంతో

కాల్‌రికార్డులు, అంతర్గత నోట్స్ బయటకు తీసి రెండు ముఖ్యమైన విషయాలు బహిర్గతం చేసాను. వారు మాత్రమే నాకున్న ఆధారమని తెలిసి వారి వద్దకు చాలా జాగ్రత్తగా వెళ్ళాను అయితే తమ బాధ్యతలు సక్రమంగా చేసినందుకు వేధింపులను ఎదుర్కొన్న గుజరాత్‌లో నమ్మకం సంపాదించటం ఏమంత సులభం కాదని నాకు తెలుసు. అందులో చాలా మంది నన్ను మొదటిసారే కలుస్తున్నారు దానికి తోడు నేను తెహల్కా జర్నలిస్టునైతిని దాని అర్థం నేను ఎల్లవేళలా ఒక స్టింగ్ కెమరా ధరించే ఉంటాననే ఊహ

అయితే నేను గుజరాత్‌లో ఎదుర్కొన్నది గుజరాత్‌కే పరిమితమైన సమస్య కాదు. నేను చాలా ఎక్కువగా రిపోర్ట్ చేసిన ఉత్తరప్రదేశ్, మణిపూర్‌లలో కూడా నిజాయతీపరులైన పోలీసుఆఫీసర్లను వేధించడమనేది సర్వ సాధారణం అయితే ఈ వేధింపు భయమే నాకు మద్దతు తెలపగలదని నేను గుర్తించాను నాకు అత్యధికంగా దోహదపడే నోట్స్ ఇచ్చిన ఆఫీసరు నేను ఏ ఆఫీసరు గురించైతే గతంలో రిపోర్టు చేసానో ఆయన బ్యాచ్‌మేట్ అయిన ఆఫీసరుగా తేలాడు దానితో అడ్డంకులు తొలగిపోయాయి. నాకు సాక్ష్యం సమకూర్చిన ఆఫీసర్లు, మానవ హక్కుల కార్యకర్తల సాయంతో నేను బట్టబయలు చేసినది ఆ సంవత్సరంలోని అత్యంత సంచలనాత్మకమైన వాటిల్లో ఒకటి ఎన్‌కౌంటర్లు జరుగుతున్న సమయాల్లో అప్పటి స్టేట్ హోం మంత్రి అయిన అమిత్ షా కు కొందరు ఉన్నత పోలీసు అధికారులకు మధ్య జరిగిన సంభాషణల కాల్ రికార్డులను బయట పెట్టాను కాల్ రికార్డులతో పాటు అంతర్గతమైన అఫిషియల్ సీక్రెట్స్ ఏక్ట్ నోట్ ఒకటి బయట పెట్టాను. మంత్రి కార్యకలాపాలపై రాష్ట్ర సి.ఐ.డి. నిఘా పెట్టి ఉన్నది. అమాయకులను టెర్రరిస్టులని ముద్రవేసి చంపటానికి ఎన్‌కౌంటర్ ఒక కుటిల చర్య అని అందులో ఉంది

ఇలా బట్టబయలు చేయడం రాజకీయ వర్గాల్లో కల్లోలం రేపింది ఆ రికార్డులను అప్పజెప్పమని సి బి.ఐ. నుండి తెహల్కా కు విపరీతంగా ఫోన్లు వచ్చాయి. ఆ తరువాత వాటిని సుప్రీంకోర్టులో అప్పజెప్పారు. నేను అహ్మదాబాద్ లోని హోటల్ రాజ్‌దూత్‌లోనే కొనసాగాను. ఈ సరికి అది నాకు రెండో ఇల్లు అయ్యింది ముస్లింలు ఎక్కువగా ఉండే ఖాన్‌పూర్‌లో ఈ హోటల్ ఉంది అది ఎటువంటి డాబూ దర్పం లేనిది రాష్ట్ర బీజేపీ ఆఫీసు అక్కడికి రెండు బ్లాకుల దూరంలోనే ఉందని ఆ తర్వాత నాకు తెలిసింది. అకస్మాత్తుగా నేను నలుగురి దృష్టిలో పడ్డాను. అయ్యూబ్ అనే ఒక యువకుడెవరో ఇలా బయటపెట్టాడని బీజేపీ నాయకులు మాట్లాడుకున్నారు. కారణమేదైనా కానీ పరిశోధక జర్నలిస్టుగా ఒక మహిళ మాత్రం వాళ్ళ ఊహల్లోకి రాలేదు. అయితే ఈ

విషయంపై నాకు ఏ ఫిర్యాదు లేదు దీని వల్ల నా పని నేను చేసుకుపోవడం సులువయ్యింది కానీ ఇలా ఎక్కువ రోజులు నడవలేదు నేను బయటపెట్టిన కొద్ది రోజుల్లోనే నా ఫోన్‌కు ఒక గుర్తుతెలియని నంబరు నుంచి ఒక మెస్సేజ్ వచ్చింది – 'నీవు ఎక్కడ వున్నావో మాకు తెలుసు' అని

జీవితంలో నిజంగానే మార్పు వచ్చింది ఆరోజు నుంచి నేను ప్రతి మూడు రోజులకు ఒకసారి నేనుండే స్థలం మార్చవలసి వచ్చింది అహ్మదాబాద్ ఐ.ఐ ఎమ్ కాంపస్ నుండి గెస్ట్‌హౌస్‌లు, హాస్టళ్లు, జింఖానాలు వగైరా, వగైరా దాకా నేనొక పారిపోయినమనిషి లాగా బతికాను ఈ సరికి ల్యాండ్‌లైన్‌ల స్థానంలో నా చేతికి మొబైల్ ఫోన్‌లు వచ్చాయి నేను తవ్వితీసిన ఫైళ్ళతో సాక్ష్యాధారాలన్నీ సి.బి ఐ కి ఇచ్చి అంతిమ రిపోర్ట్ రాసి ఇక కొంచెం సాధారణ జీవితం లాంటిది గడపాలని ముంబైకి తిరిగి వచ్చేసాను

కానీ విధి నా కోసం మరేదో నిర్ణయించింది నేను ఇవన్నీ బట్టబయలు చేసిన కొద్ది రోజుల్లోనే సి బి ఐ అమిత్ షాను అరెస్టు చేసింది స్వతంత్ర భారతంలో పదవిలో ఉన్న హోంమంత్రిని అరెస్టు చేయడం ఇదే ప్రథమం. అది రాత్రికి రాత్రే పెద్ద సంచలన వార్త అయ్యింది జాతీయ మీడియా అంతా గాంధీనగర్‌లోని సి బి ఐ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా తిష్టవేసింది సహజంగానే నేను మళ్ళీ గుజరాత్‌కు తిరిగి వెళ్ళి ఈ సంచలన అరెస్టు తరువాతి పరిణామాల గురించి రిపోర్టు చేయవలసి వచ్చింది

షా అరెస్టుతో అతని హయాంలో వివక్షను ఎదుర్కొన్న పోలీసు అధికారులందరికీ కొత్త ఉత్సాహం వచ్చింది ఈ సమయంలో అధికారులు తాము మాట్లాడాలనుకుంటున్నామని నాకు సంకేతాలు పంపించారు గతంలో జర్నలిస్టులతో మాట్లాడటానికి భయపడిన వాళ్ళు ఇప్పుడు మాట్లాడటానికి ధైర్యం సంతరించుకున్నారు చాలా సంభాషణలు ఆఫ్ ద రికార్డే అయినప్పటికీ, ఎన్‌కౌంటర్‌లనేవి తీగ మాత్రమేననీ, డొంకంతా ఇంకా అలాగే ఉందనీ అర్థం అయ్యింది ఇంతకంటే దుష్టమైనవెన్నో గుజరాత్‌లోని కేసుల ఫైళ్లలో దాగిపోయి ఉన్నాయని అర్థం అయ్యింది మేమెవ్వరం కూడా నిజాన్ని చేరుకోడానికి సమీపంలో కూడా లేము గత దశాబ్ద కాలంలో న్యాయ ప్రక్రియను వక్రీకరించారనడానికి ఆధారాలున్నాయి ఎవ్వరైతే ప్రజల ప్రాణాలను కాపాడాలో వాళ్ళను కొనేసారు మతకల్లోలాల నుండి, ఎన్‌కౌంటర్‌ల నుండి, రాజకీయ హత్యల దాకా ఎన్నో అసౌకర్యవంతమైన నిజాలు బయటకు రావటానికి వేచి చూస్తున్నాయి కానీ వీటిలో దేన్నైనా ఎవరైనా ఎలా నిరూపించగలరు?

జర్నలిజంలోని మూల సూత్రం సాక్ష్యం నా వద్ద మాత్రం ఏ సాక్ష్యమూ

లేదు. కొన్ని సంభాషణలు, పిట్టకథలు, ఆఫ్ ద రికార్డ్ ఒప్పుకోళ్ళు తప్ప నా వద్ద ఏమీ లేవు. వీటన్నింటినీ నేను నిరూపించడం ఎట్లా? సరిగ్గా అప్పుడే నా జీవితాన్ని ఉద్యోగ రీత్యానూ, వ్యక్తిగతంగానూ మార్చి వేసే నిర్ణయం నేను తీసుకున్నా

రానా అయ్యూబ్ స్థానంలో కాన్పూర్‌కు చెందిన మైథిలీ త్యాగి అవతరించింది ఈ అమ్మాయి అమెరికన్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ కన్జర్వేటరీ లో ఒక విద్యార్థి. గుజరాత్ అభివృద్ధి నమూనాపైన, ప్రపంచ వ్యాప్తంగా ఎన్.ఆర్.ఐ లలో నరేంద్ర మోదీకి పెరుగుతున్న ఆదరణ గురించి ఫిల్మ్ తీయటానికి భారత దేశానికి తిరిగి వచ్చింది

# రెండవ అధ్యాయం

లోతుగా పరిశోధన జరపడానికి నేను కొన్ని ప్రతిపాదనలతో నా సీనియర్లకు మెయిల్ పంపాను వారి నుంచి ప్రోత్సాహకరంగా జవాబు రావటంతో నేను నా బుర్రకు పని పెట్టాను గుజరాత్‌లో నేను గడిపిన మూడు నెలలు, నాకు సమాచారం ఇచ్చి సాయం చేయదలుచుకున్న వాళ్ళను ఎటువంటి పరిస్థితుల్లో కలిసానో అవి నా ముందున్న కఠినమైన మార్గానికి సూచికలు అధికార స్థానాల్లో ఉండి నిజాన్ని తమ లోనే దాచిపెట్టుకున్న వాళ్లనుండి నిజాన్ని రాబట్టడం అంతా సులభమైన పని కాదు బాబూ బజరంగీ తదితర స్థానిక బీజేపీ, విహెచ్‌పీ నాయకులు 2002 కల్లోలాలలో తమ క్రూరత్వం గురించి నిర్వికారంగా చెప్పినదంతా నా సహోద్యోగియైన ఆశిష్ ఖేతాన్ స్టింగ్ ఆపరేషన్‌తో బయట పెట్టాడు అయితే నేను వ్యవహరించాల్సింది, కొంచెం రెచ్చగొడితే చాలు తమ వీరత్వం గురించి డబ్బా కొట్టుకునే కింది స్థాయి దొమ్మీగాళ్లతో కాదు, ఢక్కామొక్కీలు తిని పండిపోయిన ఐ.ఏ ఎస్ ఆఫీసర్లతో. వీరిలో ఎంతో మంది 'రా' (RAW)లోనూ, ఐ బి లోనూ విజయవంతంగా పనిచేసినవాళ్లు

వీళ్ళు మొండి ఘటాలైన డిప్లొమాట్లు వీళ్లతో నోరు విప్పించడమంటే సమర్థులు, నేర్పరులైన పరిశోధకులకే సాధ్యం వాళ్ళకు కూడా తగిన అధికారం ఉండాలి నాకు వీటిలో ఎందులో కూడా అర్హత లేదు. పథక రచనతో పాటు, ఆ పథకాన్ని ఎట్లా అమలు పరచాలనే విషయాన్ని కూడా మొత్తం నాకే వదిలేసారు. నేను నాతో పాటు మా ఆఫీసు నుంచే ఒక జూనియర్‌ను తీసుకుంటే ప్రమాదం ఎక్కువ కాబట్టి అలా తీసుకోలేను నా ఎడిటర్లు నా పనిని పర్యవేక్షిస్తుంటారు కానీ మిగిలిన బాధ్యతంతా నాదేనని నాకు వాళ్ళు స్పష్టం చేసారు. నేను రాత ప్రతి (transcript) పంపిన ప్రతి సారీ నాకు షోమా నుండి, తరుణ్ నుండి కూడా 'అద్భుతం', 'ఆశ్చర్యకరం','ముందుకు కొనసాగు' అంటూ చాలా ప్రోత్సాహకరమైన స్పందన లభించేది అవి నన్ను ఇంకా పరిశోధించడానికి ప్రోత్సహించాయి కానీ, వాస్తవమేమిటంటే అసలైన రంగంలో

మాత్రం నేను ఒంటరి సైనికురాలిని నా గురించి నేనే పట్టించుకోవాల్సి వచ్చేది పరిశోధన నిజాయితీతో కూడి ఉండాలి ఫలితాలు వాస్తవాల ఆధారితంగా ఉండేలా చూడాలి

నిజాలు తెలిసి కూడా ఏమీ జరగనట్టు, 2002లో జరిగిన క్రూరమైన మారణకాండతో తమ కెరీర్లకు ఏమాత్రం సంబంధం లేనట్టు జీవితం సాఫీగా గడిపేద్దామనుకుంటున్నవాళ్ళు ఉన్నారు. తెహల్కా వంటి పరిశోధక పత్రికతో ముడిపడి ఉన్నందు వల్ల ఏ మాత్రం సాయం చేయగలిగిన వారి తలుపులైనా నాకోసం తెరుచుకోవని తెలుసు. నా ముందున్నది ఒకే ఒక మార్గం. నిజాన్ని బయటకు తీయాలనుకునే ఏ జర్నలిస్టయినా చివరగా ఉపయోగించే పద్ధతి – మారు పేరుతో అండర్‌కవర్‌గా చేయటం. అప్పటికి నా వయసు 26 సంవత్సరాలు మాత్రమే ఆడపిల్లను. అదీ ముస్లిం ఆడ పిల్లను నేనెప్పుడూ నా అస్తిత్వం (ఐడెంటిటీ) గురించి పట్టించుకోలేదు కానీ మత ఆధారంగా భిన్న ధృవాలుగా చీలిన రాష్ట్రంలో ఇలాంటివాటన్నింటి గురించి జాగ్రత్తగా పట్టించుకోవాలి నా కుటుంబానికి చెప్పవలసి వుంటుంది నా గుర్తింపు ఏమై ఉంటుంది? ఏ సాయం లేకుండా నేను చేయగలనా?

నేను ఒక పేరు పొందిన మాస్ కమ్యూనికేషన్ కోర్స్ చేయడం నాకు అప్పుడు బాగా పనికి వచ్చింది నా తోటి విద్యార్థుల్లో నటులుగా ఎదగాలనుకుంటున్న వాళ్ళు ఉండేవారు. వారు చిత్ర పరిశ్రమలో తమకొక స్థానం సంపాదించుకున్నారు ఇప్పుడు చాలా మంచి నటుల్లో ఒకరైన రిచా చడ్డా నా సహ విద్యార్థి ఆమె ఈమధ్యే ఒక ఇంటర్వ్యూలో తాను ఒక రిపోర్టర్ పాత్ర వేసేందుకు తయారవుతున్నప్పుడు ఒక జర్నలిస్టుగా నా అనుభవాన్ని ఉపయోగించుకున్నానని చెప్పింది నాకు చాలా సన్నిహితమని నేను భావించే మరొక నట స్నేహితురాలికి కూడా 'లాంగ్ టైమ్, నో సీ' కాల్ చేసాను నా ఫ్రెండ్ సాయంతో ఆమె మేకప్ మాన్‌తో అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. మరుసటి రోజు నేను సబర్బన్ ముంబైలో ఒక స్టూడియోలో చాయ్ తాగుతూ, నాకు సరిపోయే విగ్గును ఎంచుకోవడంలో ఏ టెక్నికాలిటీస్ పాటించాలో నేర్చుకోవటానికి కూచున్నా. అతనొక సీనియర్ మేకప్ మాన్ అతని వద్ద ఉన్న కొన్ని విగ్గులను నాకు చూపించాడు వాటితో నేను భిన్నంగా కనిపించాను కానీ ఎందుకో అది కొంచెం కాస్మెటిక్‌గా, అతకనట్టుగా అనిపించింది అందువల్ల విగ్గు వాడటం అనేది మూలన పడ్డది

అసలు నా గుర్తింపునే పూర్తిగా మార్చుకోవటం మెరుగైన ఆలోచన అనిపించింది నా అదృష్టం కొద్దీ నా పూర్వ సహాధ్యాయులతో పాటు ఏర్పరచిన ఒక గ్రూపు ఐ డి లో

నాకొక ఈ మెయిల్ దొరికింది. ఆ మెయిల్ లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత అమెరికన్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ కన్జర్వేటరీలో చేరిన నా స్నేహితురాలిది నాకది యురేకా క్షణం లాగా అనిపించింది దీన్నే నా గుర్తింపుగా చేసుకుందామనుకున్నా గుజరాత్‌లో ఏదో సినిమా తీయడానికి అమెరికా నుండి వచ్చిన ఫిల్మ్ మేకర్! ఈ ఆలోచన కొంచెం అత్యాశపూరితమైనదే అయినా, దీనిపై పని చేయటం అసాధ్యమైన విషయమేమీ కాదు

ఇక తరువాతి కొద్ది రోజులు నేను కన్జర్వేటరీ ఎట్లా పని చేస్తుంది, దాని పూర్వ విద్యార్థులెవరు, అక్కడి నుండి ఏయే సినిమాలు తీసారు వంటి విషయాలను, గుజరాత్ పైన ఏయే సినిమాలు వచ్చాయి, ఏయే విషయాలపై కేంద్రీకరించి వచ్చాయనే విషయాలను అధ్యయనం చేస్తూ గడిపాను అంతిమంగా ఏ స్క్రిప్టు లేని నా కథలోని పాత్రలు నన్ను ఎట్లా ఆహ్వానిస్తాయనే దానిపై ఆధారపడి నిర్ణయం తీసుకుందామని ఫిల్మ్ విషయ వస్తువు పైన తుది నిర్ణయం తీసుకోకుండా వదిలేసాను నాకొక పేరు అవసరమయ్యింది ఆ పేరు ఆత్మీయంగా ఉండాలి సంప్రదాయబద్ధంగానూ ఉండాలి. అది తెలియజేయదలుచుకున్న దాన్ని బలంగా తెలియజేయాలి కూడా

నాకు సినిమాలంటే పిచ్చి ఉండటం కూడా నాకు కలిసొచ్చింది ఆ సమయంలో నేను రాజ్‌కుమార్ సంతోషి సినిమా 'లజ్జ' చూశాను ఢిల్లీ నుండి ముంబై కి వచ్చేటప్పుడు విమానంలో చూశాను బలమైన మహిళా కారెక్టర్లు ఆ సినిమాకున్న బలం దీనికి తోడు మాధురి దీక్షిత్, మనీషా కొయిరాలతో సహా అందులోని ముఖ్య పాత్రల్లోని నటుల మంచి నటన కూడా ఇందుకు తోడయ్యింది ఈ సినిమాలో మనీషా కొయిరాల మైథిలి అనే పాత్ర వేసింది ఈ పాత్ర భారతీయ మహిళల జీవితాలను, కుల, జెండర్ ఆధారిత అణచివేతను బయటకు తీయటానికి ప్రయత్నిస్తుంది మైథిలి అంటే రాముడి భార్యయైన సీత పేరు కూడా ఆ పేరు ఎందుకో నాకు అలాగే గుర్తుండి పోయింది నేను నాకోసం మరో పేరు వెతుకుతున్నప్పుడు, ఒక సాధారణమైన పేరును ఎంచుకోవాలనుకున్నా. అట్లాగే బ్రాహ్మణ కుల పేరునో, దళిత కుల పేరునో సూచించేది కాకుండా ఉండాలనుకున్నప్పుడు 'మైథిలి త్యాగి' అవతరించింది నా విజిటింగ్ కార్డులో 'మైథిలి త్యాగి, స్వతంత్ర ఫిల్మ్ మేకర్, అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ కన్జర్వేటరీ' అని ఉంటుంది

అయితే నేను మళ్ళీ గుజరాత్‌కు వెళ్ళే లోగా, నాకు ఒక సహాయకుణ్ణి/ సహాయకురాలిని వెతుక్కోవలసి ఉంది అతడు/ఆమె త్వరలోనే నా దారికి రావాలి కూడా అలా వచ్చిన వాడు నా జీవితంపై చాలా గాఢమైన ముద్ర వేశాడు మైక్

(పేరు మార్చాను) ఫ్రాన్స్‌లో ఒక సైన్స్ విద్యార్థి. అతడు ఆ సమయంలో ఒక విద్యార్థుల పరస్పర మార్పిడి కార్యక్రమంలో భారతదేశం వచ్చి ఉన్నాడు. మైక్ ఇండియాలో ఇండియన్ జర్నలిస్టులతో కలిసి పనిచేయాలనుకున్నాడు. నేను చేయదలుచుకున్న పరిశోధనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వకుండానే వీలైనంత నిజాయితీగా ఉంటూ ఒక మెయిల్ పంపించాను.

నాతో పాటు పనిచేయటానికి ఒక విదేశస్థుడైన సహచరుడు కావాలనీ, నాతో పాటు ఒక ఫిల్మ్ గురించి పనిచేస్తున్నట్టు నటించాల్సి ఉంటుందని చెప్పాను. ఇది నేను చేయబోయే ఒక సున్నితమైన పెద్ద పరిశోధనలో భాగంగా ఉంటుందని చెప్పాను పూర్తి వివరాలను మైక్‌కు చెప్పనని కూడా చెప్పాను నా గుర్తింపును సాధికారం చేయగలిగేందుకు ఒక 'తెల్ల విదేశస్థుడు కావాలంతే' అని అన్నా

నా విజిటింగ్ కార్డులు, బూడిద రంగు కాంటాక్ట్ లెన్సులు, రంగు రంగుల బ్యాండనాలు (నుదుటి మీదుగా జుట్టుకి ఫ్యాషన్‌గా కట్టుకునే రంగు రంగుల గుడ్డ ముక్కలు), కొన్ని రికార్డింగ్ సాధనాలతో అహ్మదాబాదులో దిగాను మైక్ మరో రెండు రోజుల తరువాత రావాలి నేను మైథిలి త్యాగి పేరుతో ఒక సిమ్ కార్డు సంపాదించాను. నా 'గార్డియన్ కుటుంబం' ఏర్పరచిన డాకుమెంట్ల సాయంతో నేను ఎంత సులభంగా సిమ్ కార్డు సంపాదించగలిగానో చూసి నాకే ఆశ్చర్యం వేసింది ఈ పరిశోధనకు చాలా కాలం పడుతుంది అందువల్ల విలాసవంతమైన హోటల్‌లో ఉండటం ఆర్థికంగా నేను కానీ, నా సంస్థ కానీ భరించలేము పైగా నాది ఇప్పుడిప్పుడే నిలదిక్కుకోవడానికి ప్రయత్నిస్తున్న, ఆర్థికంగా ఎక్కువ వనరులు లేని ఫిల్మ్ మేకర్ పాత్ర. అహ్మదాబాద్ సాహిత్య, సాంస్కృతిక బృందాలలో బాగా పరిచయాలున్న ఒక కళాకారుడైన మిత్రుడు నాకు ఇప్పుడు సాయం చేసాడు. అతడు నన్ను ఎక్కువ ప్రశ్నలతో ఇబ్బంది పెట్టలేదు తన ఇన్వెస్టిగేషన్‌తో గుజరాత్ హోం మంత్రిని కటకటాల వెనక్కు పంపించిన జర్నలిస్టుననే ఒకే ఒక్క కారణంతో అతడు తన పలుకుబడిని ఉపయోగించి నాకు ఒక విద్యాసంస్థ అయిన నెహ్రూ ఫౌండేషన్‌లో ఉండడానికి చోటు ఇప్పించాడు

ఫౌండేషన్ వద్ద హాస్టల్ వార్డెన్‌కు నన్ను ఒక ఫిల్మ్ మేకర్‌గా పరిచయం చేస్తే, అతడు నావైపు ఒక చూపు పారేసి నాకు సాయం చేస్తున్న మిత్రుడితో ముచ్చట్లలో పడిపోయాడు. రోజుకు 250 రూపాయలకు నాకు బాత్రూం కలిసి ఉన్న 250 చదరపు అడుగుల గదిదొరికింది నా పరిశోధనలో నా హాస్టల్‌మేట్‌లు తమకు తెలియకుండా చాలా సాయపడ్డారు ఆ విద్యార్థులు యూరోప్‌లోని విభిన్న దేశాలైన

జర్మనీ, గ్రీన్‌ల్యాండ్, లండన్ నుంచి వచ్చిన వాళ్ళు.

నాకు మొదట డీన్ లేదా మేనేజర్ అయిన మాణిక్ భాయి (పేరు మార్చాను)తో పరిచయం ఏర్పడింది. 'మేడం గుజరాత్ పై ఒక సినిమా తీయటానికి ఇక్కడికి వచ్చింది', అని నా మిత్రుడు నన్ను అతనికి పరిచయం చేశాడు 'చాలా మంచిది మీరు మా పట్టణం గురించి, మా ముఖ్య మంత్రి గురించి మంచి విషయాలు రాయండి అహ్మదాబాద్ చాలా అందమైన పట్టణం', అని అంటూ అదే ఊపులో నాకు నగరాన్ని చూపిస్తానని కూడా ప్రతిపాదించాడు నా గదిలో ఒక మంచానికి, ఒక రాత బల్లకు, ఒక పుస్తకాల అరకు మాత్రమే సరిపడా స్థలం ఉంది అయితే హాస్టల్ మంచి ప్రాంతంలో ఉండడం వల్ల గదిలో స్థలం లేని లోపం పూరింది. అహ్మదాబాద్‌లోని ఒక ఖరీదైన, నడిబొడ్డు స్థానంలో ఇది ఉంది ఆరు నెలల పాటు నాకు ఇదే సొంత ఇల్లులా అయిపోయింది.

మైక్ మరు రోజు ఉదయం వచ్చాడు. అతడు 19 ఏళ్ల పొడుగాటి చురుకైన చింపిరి జుట్టు కుర్రాడు. నేను అతన్ని నా మిత్రుడి ఇంటి వద్ద కలిసి అతడి పాత్ర గురించి వివరించాక అతన్ని హాస్టల్‌కు తీసుకెళ్ళా

మాణిక్‌భాయ్ మైక్‌కు నా గది పక్క గదినే ఒక నెల కోసం ఇచ్చాడు మైక్ కావాలనే అతణ్ణి 'కేంఛో' (ఎలా ఉన్నారు?) అని గుజరాతీలో పలకరించడం కూడా ఇందుకు ఉపయోగపడ్డది కొత్తదేదైనా నేర్చుకోవడంలో మైక్‌కు చాలా ఆసక్తి ఇతర సంస్కృతుల గురించి తెలుసుకోవడం, నేర్చుకోవడం అంటే అతడికి చాలా ఇష్టం అన్నింటికంటే అతడికి తిండి అంటే ఇష్టం. ఆ సాయంత్రం మా మొదటి డిన్నర్ అహ్మదాబాద్‌లో చాలా పేరున్న 'పక్వాన్' అనే థాలీ హోటల్‌లో చేశాము ఆ రోజు మైక్ కనీసం రెండు డజన్ల పూరీలు, ఆరు కప్పుల హల్వా తినడంతో నేను నోరు వెళ్ళబెట్టాను ఆ విషయం నేను, మైక్ ఇప్పుడు ఇష్టంగా గుర్తు తెచ్చుకుంటాము

రాత్రి భోజనం తరువాత మేము హాస్టల్ మెట్లు ఎక్కుతుంటే మైక్, 'మనమిద్దరమే ఉన్నప్పుడు నేను నిన్ను రానా అని పిలవచ్చా?' అని అడిగాడు

'కుదరదు. నీవు దేశం వదిలి వెళ్ళే వరకు నేను నీకు మైథిలీనే', అన్నా మైక్ తన మాట నిలబెట్టుకున్నాడు తాను చివరికి ప్యారిస్ వెళ్ళే ముందురోజు నాకోసం వదిలిన గుడ్‌బై కార్డులో 'ప్యారీ మైథిలీ, అప్నా ఖ్యాల్ రఖ్‌నా – మైక్' (ప్రియమైన మైథిలీ, జాగ్రత్తగా ఉండు) అని హిందీలో రాసాడు

మేము కొద్ది రోజులు నెహ్రూ ఫౌండేషన్‌లో మా కొత్త జీవితాలకు అలవాటు పడుతూ గడిపాము. మైక్ తన గదిలో ఫ్రెంచ్-హిందీ అనువాద పుస్తకం పట్టుకొని

కూర్చునే వాడు నన్ను మధ్యమధ్యలో ప్రశ్నలు అడుగుతుండేవాడు అదే సమయంలో మార్క్ ట్యుల్లి పుస్తకం చదువుతుండేవాడు మైక్ తన వయసుకు మించి చదువుకున్నవాడు. నిశ్చిత అభిప్రాయాలున్నవాడు చాలా నిశితమైన, కుశాగ్ర బుద్ధి కలవాడు చెప్పిన వాటిని వివరాలతో సహా వెంటనే గ్రహించగలిగే వాడు ఫౌండేషన్‌లో ఒక క్యాంటీన్ ఉండేది అందులో 25 రూపాయలకు భోజనం పెట్టేవారు ఆ క్యాంటీన్ పక్కనే ఇన్స్టిట్యూట్ పైకి ఎక్కటానికి వంపుల మెట్లు ఉన్నాయి ఇన్స్టిట్యూట్ పై నుండి చూస్తే అడవి కనిపిస్తూ ఉంటుంది నేను, మైక్ ప్రతి మధ్యాహ్నం మా ల్యాప్‌టాపులు, లంచ్ తీసుకుని పైకి ఎక్కేవాళ్ళం తింటూ పని చేసుకునే వాళ్ళం 'మైధిలీ, ఏంటి ప్లాను? మనం ఎవ్వరిని కలవబోతున్నాం?' అని అడిగేవాడు. నేను మళ్ళీ మళ్ళీ ఒకటే జవాబు చెప్పేదాన్ని, 'సరైన సమయం వచ్చినప్పుడు చెబుతాను', అని

సాయంత్రాల్లో నేను, మైక్ మా మా కెమెరాలు తీసుకొని ఫోటోలు తీసుకోవటానికి పాత సిటీకి వెళ్ళే వాళ్ళం. మా ఇద్దరికీ ఫోటోగ్రఫీ అంటే ఆసక్తి ఇద్దరి వద్దా ఒకేలాంటి ఎస్ ఎల్ ఆర్. కెమెరాలు ఉండేవి అయితే ఇప్పుడు మేము వెళుతున్నదానికీ, ఫోటోగ్రఫీ పై మా ఆసక్తికీ సంబంధం లేదు మా పాత్రలకు తగినట్టు మమ్మల్ని మలుచుకోవటానికి, మమ్మల్ని ఎవరైనా గమనిస్తుంటే వాళ్ళను తృప్తిపరచటానికి ఈ పని చేపట్టాం మేము పెద్ద ఆఫీసర్లను కలవటానికి వెళితే తప్పకుండా మా నేపధ్యం గురించి, మేమున్న ఇన్స్టిట్యూట్ వద్ద ధ్రువపరుచుకుంటారు మా కొత్త గుర్తింపుల గురించి హామీ ఇవ్వగలిగే సోషల్ సర్కిల్ ఒకటి మాకు అహ్మదాబాద్‌లో ఉండటం అవసరం

ఎం ఎఫ్ హుస్సేన్ ఏర్పరచిన చారిత్రకమైన ఆర్ట్ మ్యూజియం అమ్‌దావాద్-ని-గుఫా మాకు చాలా సాయ పడింది. ఈ మ్యూజియం చుట్టూ ఉన్న పెద్ద పార్కు, కెఫేల్లో ఎంతోమంది యువతీయువకులు, అందులో చాలామంది కళాకారులు, ఫోటోగ్రాఫర్లు తచ్చాడుతుండేవాళ్లు కొద్ది మంది గిటార్ వాయిస్తూ మరి కొద్దిమంది తమ కళాకృతులను ప్రచారం చేసుకుంటూ ఉండేవాళ్లు ఇతరుల్లో ఫిల్మ్‌మేకర్లుగా ఎదగాలనుకుంటున్నవాళ్లు, ఫోటోగ్రాఫర్లు, రంగస్థల నటులు ఉండే వాళ్ళు ఇక్కడి సాయంకాలాల్లో నేను మైథిలిగా నా జీవితాన్ని పూర్తిగా ఎంజాయ్ చేసేదాన్ని మైక్ కూడా అంతే

పాత అహ్మదాబాద్‌లోని ఒక ప్రముఖ స్థానమైన లాల్‌దర్వాజా అంటే మైక్‌కు చాలా ఇష్టం ప్రతి గురువారం అక్కడ ఒక సంత లాగా జరుగుతుంది అక్కడ గాలి పటాలు తయారు చేసేవాళ్ళు, కుండలు చేసేవాళ్ళు ఉంటారు. అతడు సాయంత్రం కొన్ని మంచి ఫోటోలతో వెనక్కు వచ్చి - 'ఈ రోజు రాత్రి మనం ఎక్కడ తింటున్నాము?'

అని తన ఇష్టమైన ప్రశ్న వేసేవాడు మైక్ మంచి భోజన ప్రియుడు. గుజరాత్ అతడికి సరియైన స్థలం

నేను అధికారులతో ఏదోరకమైన పరిచయం ఏర్పరచుకోవలసి ఉంది. నా జాబితాలో మొదటి పేరు జి ఎల్.సింఘాల్. అతడు గుజరాత్‌లో ఏ టి ఎస్ (ఏంటి టెర్రరిస్ట్ స్క్వాడ్)తో ఉన్నాడు. అతడే దాని అధిపతి ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో అతడి పాత్ర గురించి విచారణ జరుగుతోంది. నేను నా ఆఫీసర్ మిత్రులు, జర్నలిస్టు మిత్రుల నుండి కనుక్కున్న దాని ప్రకారం అతడు తనను తాను అందరికీ దూరం చేసుకొని ఒంటరిగా ఉంటున్నాడు అతనికి స్నేహితులు కూడా అంతగా లేరు మీడియాను అసలు దగ్గరకు చేరనీయడు. అతడికి ప్రతి ఒక్కరి మీదా అనుమానమేనని నాకు చెప్పారు ఇతని వద్దకు వెళ్ళటమెలా?

నాకు వచ్చిన ఒక ఈమెయిల్‌లో గుజరాత్ సినీ పరిశ్రమలోని పాపులర్ నటులైన నరేశ్ మరియు హితు కనోడియాల వివరాలు వున్నాయి. నరేశ్ కనోడియాను గుజరాత్ సినీ పరిశ్రమకు సంబంధించిన అమితాబ్ బచ్చన్ అంటారు. హితు అతడి కొడుకు దక్షిణ ముంబైలో చదువుకున్నాడు. హిందీ సినీ పరిశ్రమలో బ్రేక్ కోసం వేచి వుండే కన్నా తన తండ్రి అడుగుజాడల్లో నడవటమే తెలివైన పని అని నిర్ణయించుకున్నాడు.

కనోడియాలు వెనుకబడిన తరగతికి చెందిన వారనీ, చాలామంది అధికారులతో మంచి సంబంధాలు ఉన్నాయనీ, దళిత ఆఫీసర్ అయిన జి ఎల్.సింఘాల్ తో కూడా మంచి సంబంధాలు ఉన్నాయని ఆ మెయిల్‌లో సమాచారముంది నేను నరేశ్ కనోడియాకు ఫోన్ చేశాను అతడు మరుసటి రోజు ఉదయం అహ్మదాబాద్ లోని జింఖానాలో తనను కలవమని చెప్పాడు నేను అతన్ని కలిసి బాగా అభ్యాసం చేసిన విదేశీ యాసలో మాట్లాడుతున్నంత సేపు అతను ఏ భావం లేకుండా ఉన్నాడు అతడు అద్దం వైపు తిరిగి తన జుట్టును దువ్వుకొని, నిర్వికారంగా, 'బెన్! (బహన్) హిందీ లో చెప్పరాదూ, అదీ కాస్త నిదానంగా నీవు చాలా వేగంగా మాట్లాడతావు', అన్నాడు.

నేను నా హోంవర్క్ బాగా చేసుకోలేదని అర్థం అయ్యింది తదుపరి గంట నేను అతడికి నా సినిమా గురించి వివరించాను. గుజరాత్ గురించి ఎక్కువగా తెలియని విషయాల గురించి, ఉదాహరణకు గుజరాత్ సినీ పరిశ్రమ గురించీ, గుజరాత్‌లో వెనుకబడిన తరగతుల వారు ఎలా ప్రగతి సాధించారు అనే విషయం గురించీ సినిమా తీయాలని నేను అనుకుంటున్నానని చెప్పాను అతడి కళ్ళల్లో కొంచెం ఆసక్తి నాకు ఇప్పుడు కనపడింది. తనను తాను ఒక స్టార్‌గా పరిగణించుకునే అతను,

హిందీ సినీ పరిశ్రమ కారణంగా తన సొంత రాష్ట్రంలోనే తన సినిమాలకు ఆదరణ తక్కువ అవుతూ పోతున్నప్పుడు ఒక విదేశీ ఫిల్మ్ మేకర్ నుండి తన పని గురించి ఈ రకమైన గుర్తింపు రావడమనేది నేను ఆశించిన ఫలితం కలుగజేసిందనుకుంటా

ఆ మరుసటి రోజు అతడి షూటింగ్ జరుగుతున్న ఊరికి చేరుకుని అతని ఫిల్మ్ స్టంట్స్ చూడటానికీ, అతడి ఇంటర్వ్యూ తీసుకోవటానికీ నన్ను ఆహ్వానించాడు అ ఊరు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది అతన్ని కలిసి నా రూముకు వెళ్ళి నా మంచంపై కూర్చొని ఇదంతా ఒక వ్యర్థమైన పనా అనే ఆలోచనలో పడ్డాను. ఇదంతా చాలా రిస్క్‌తో కూడుకొని ఉన్నది కానీ ఇదొక్కటే నా ముందు ఉన్న మార్గం కూడా నా ఎస్ ఎల్.ఆర్ , నోట్స్ తీసుకొని మరుసటి రోజు ఉదయం నా రూమ్ నుండి బయట పడ్డాను. మైక్ నన్ను ఆపాడు, 'నీవు లెన్సులు పెట్టుకోవటం మరిచిపోయావు', అని నేను ఇంకా నా కొత్త అవతారానికి పూర్తిగా అలవడలేదు

సిటీ బయట ఒక గ్రామంలో ఫిల్మ్ సెట్‌ను ఏర్పరచారు దీన్ని చూడటానికి వేలాది మంది గుమిగూడారు కనోడియా కొడుకు హితు దక్షిణ ముంబై గ్రాడ్యుయేట్ చురుకైన వాడు అతడు ఒక బందీగా వేషం వేయగా, తండ్రేమో పోలీసు పాత్ర వేస్తున్నాడు

కూర్చొని షూటింగ్ చూడమని నాకొక కుర్చీ వేసారు నేను నోట్స్ రాసుకుంటూ, ఫోటోలు తీసుకుంటూ నా పని శ్రద్ధగా చేస్తూ పోయాను అయితే అక్కడ అలా చేస్తున్నది నేనొక్కదాన్నేకాదని గమనించాను. ముప్పైల్లో ఉన్న మరో యువకుడు కూడా ఒక ట్రై పాడ్, లెన్సులతో షూటింగ్‌కు సంబంధించిన మంచి ఫోటోలు తీస్తున్నాడు అతడు ఫిల్మ్ యూనిట్‌లో ఒక భాగం కాదనేది చాలా స్పష్టం కనోడియా అతణ్ణి ఒక డాక్యుమెంటరీ ఫోటోగ్రాఫర్‌గా నాకు, మైక్‌కు పరిచయం చేస్తే అతడు ఒక నిర్వేదమైన చూపు మా వైపు పారేసి, తన పని తాను చేస్తూ పోయాడు ఆ ఫోటోగ్రాఫర్ అజయ్ పంజ్వాని (పేరు మార్చాను) రాబోయే నెలల్లో అతడితో ఒక వింతైన కామ్రేడ్‌షిప్ పెరిగింది నా నిజమైన గుర్తింపుతో ఈ స్నేహం పెరిగేదే కాదు ఈ స్నేహానికి పునాది మోసమే అయి ఉండొచ్చుగాక, కానీ మైథిలికి ఆ మాత్రం స్నేహం అవసరమే ఉండింది.

కొద్ది రోజుల పాటు, కనోడియాల సెట్‌కు వెళ్ళడం, సంభాషణల్లో గడపడం, టీ తాగుతూ ఫిల్మ్‌కు సంబంధించిన అతి చిన్న విషయాలతో సహా చర్చించడం వంటి వాటితోనే గడిచింది

గుజరాతీ సినిమాలపైన తను తీసే డాక్యుమెంటరీ కోసం ఫిల్మ్ సెట్‌ల వద్దకు

క్రమంతప్పకుండా వచ్చే అజయ్ అంతిమంగా మాతో మర్యాదగా ప్రవర్తించాలని నిర్ణయించుకున్నాడు అవసరమైతే మాకు సాయం చేస్తానని కూడా అన్నాడు సినిమా సెట్‌లకు ఇలా వెళుతున్నప్పుడే ఒక సారి నేను గుజరాత్ లోని ఉన్నత స్థాయి పోలీసు అధికారులను, ముఖ్యంగా వెనుకబడిన కులాలకు చెందిన వారిని కలవాలనుకుంటున్నాననే విషయాన్ని లేవనెత్తాను ఆ అధికారులు సాహసాన్ని ప్రదర్శించే అవసరం ఉన్న, సున్నితమైన స్థానాల్లో ఉండి, టెర్రరిజం నుండి గుజరాత్ రక్షణతో ముడిపడి ఉన్నవాళ్లయితే మరీ మంచిదని నేను కనోడియాతో అన్నాను

ఆ చివరి వాక్యం ఆశించిన ఫలితాన్ని ఇచ్చింది 'మీరు సింఘాల్‌గారిని కలవాలి మాకున్న మంచి అధికారుల్లో ఆయన ఒకరు చాలామంది టెర్రరిస్టులను చంపాడు', అనడంతో నేను నా ఉత్సాహాన్ని దాచుకోవటానికి ప్రయత్నించాను నేను ఆ పేరు మొదటి సారే వింటున్నట్టు రాసుకున్నాను

'సింఘాల్ గారు ఏం చేస్తారు సర్? ఆయన ఇప్పుడు ఎక్కడ పని చేస్తున్నారు?', నేను చాలా అమాయకత్వం నటిస్తూ అడిగాను నాకు నా సినిమా మిత్రులనుండి కావలిసినది ఇంతే ఒక ప్రవేశ మార్గం అధికారులకు అనుమానం రాకుండా ఒక పరిచయం ఒక ఫిల్మ్ మేకర్‌ను, అదీ స్థానిక సినిమాకు చెందిన టాప్ ఫిల్మ్ మేకర్ సిఫారసు చేసిన వ్యక్తిని మాత్రం సింఘాల్ అయినా సరే అనుమానించలేడు కదా!

నాకు అహ్మదాబాద్‌లో ఏం సహాయం అవసరమో చెప్పిన ఒక మిత్రుని నుంచి కూడా అదే సమయంలో నాకొక మెయిల్ వచ్చింది ఇందులో సిటీలో చాలా ప్రఖ్యాతి చెందిన గైనకాలజిస్టుకు సంబంధించిన కాంటాక్టు వివరాలు ఉన్నాయి ఈ డాక్టరు పేరు నేను రహస్యంగానే ఉంచదలిచాను

నేను నా గదిలోనుండి మాట్లాడదలుచుకున్నప్పుడల్లా నా యూనినార్ నెట్‌వర్క్ మొరాయించేది దానితో నేను మేడ పైకి వెళ్ళి మాట్లాడవలసి వచ్చేది ఇతర హాస్టల్ వాసులు కూడా ఓ సిగరెట్ వెలిగించుకోవడానికో, ఓ చాయ్ తాగడానికో వచ్చేవారు మైక్ కూడా అలా వచ్చేవారిలో ఒకడు ఆ రోజు సాయంత్రం నేను మేడ పై నుండి ఆ గైనకాలజిస్టుకు ఫోన్ చేశాను గుజరాత్ మీద సినిమా తీస్తున్న ఒక ఫిల్మ్ మేకర్‌గా నన్ను నేను పరిచయం చేసుకున్నాను అందులో ఇక్కడి ఆరోగ్యరంగాన్ని గురించి కూడా తీయదలుచుకున్నానని చెప్పాను ఆ డాక్టరు ఒక మంచి స్నేహశీలిలా అనిపించాడు అదే రోజు సాయంత్రం నేను తన ఆసుపత్రికి రాగలనా అని అడిగాడు నేను చాలా సిద్ధంగా ఉన్నాను నేను వెళ్లబోతుంటే మైక్ పరుగెత్తుకు వచ్చాడు 'మైథిలీ, నేను నిన్ను ఒకటి అడగొచ్చా? నేను ఇలా పని చేయలేను. నీవు నిన్ను

కలిసిన వాళ్ళందరికీ మనం ఒక సినిమా తీస్తున్నామని చెబుతున్నావు కానీ నేను నీతో పాటు పని చేస్తున్నాను నీవు నాకు నిజం చెప్పాలి.' నేను మైక్ కుతూహలాన్ని కొట్టిపారెయ్యడానికి చూశాను. కానీ మైక్ ఈసారి గట్టిగా పట్టు పట్టాడు కొంచెం బాధ పడ్డట్టు కూడా కనిపించాడు. 'నేనొక చిన్న పిల్లవాణ్ణి కాదు. నేను చాలా చదువుతాను. నేను ఈ పరస్పర మార్పిడి కార్యక్రమంలో ఎంపికయ్యానంటే జీవితంలో ఏదో సాధించినందువల్లే అయ్యాను నువ్వు నాకు చెప్పాలి. నీకు నాపై నమ్మకముందా? లేక నేనంటే అందరికీ చూపించటానికి నీకు అవసరమైన ఒక విదేశీ తెల్ల మొఖాన్నేనా?' ఇదంతా బాగా రిహార్సల్ చేసుకొని వచ్చి అడిగినట్టనిపించింది అయితే అతడు ఆ విషయం వెళ్లగక్కిన పద్ధతిలో ఏదో ఉండడంతో అతన్ని విశ్వాసంలోకి తీసుకొని, నా నిజమైన దర్యాప్తు గురించిచెప్పాలనిపించింది. డాక్టరును కలవటానికి వెళ్ళే ముందు నేను గతంలో చేసిన కథనాలకు సంబంధించిన లింకులు కొన్ని అతనికి ఇచ్చాను. అతన్ని అవి చదవమనీ, నేను సాయంత్రం వెనక్కు వచ్చే లోగా అవి చదివితే నేను ఇప్పుడు చేస్తున్న పరిశోధనకు సంబంధించిన నేపథ్యం మొత్తం అర్థమవుతుందని చెప్పాను.

డాక్టరుతో నా సమావేశం చాలా ఫలప్రదంగా ముగిసింది అతడు సాయ పడటానికి ఎంతో ఉత్సాహం చూపించాడు నా ఫిల్మ్ కోసం షూట్ చేసేందుకు గుజరాత్‌లో చాలా పేరున్న మహిళా డాక్టరునెవరినైనా నేను కలవొచ్చా అని అతన్ని అడిగాను. ఆయన చెప్పే జవాబు ఆశించినదే. నేను గైనకాలజిస్టును కలవటానికి కారణం లేకుండా ప్రయత్నం చేయటం లేదు ఈ దేశపు లౌకికత్వం పైనే ఒక మచ్చలా మారిన 2002 గుజరాత్ అల్లర్ల వెనక ఉన్నవాళ్ళు ఎంతోమంది అటువంటి వారిలో మాయా కొడ్నాని కూడా ఒకరు ఆమె అహ్మదాబాద్ ఎం.ఎల్.ఏ.లలో ఒకరు. ఆమె నియోజకవర్గంలో అల్లర్లను రెచ్చగొట్టిన వాళ్ళల్లో ఆమె ముఖ్యమైన వ్యక్తి అని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. నాకు సంబంధించినంత వరకు నేను పరిశోధించాల్సిన వాళ్ళలో కొడ్నాని ఒక ముఖ్యమైన వ్యక్తి ఈ కథనంలోకి ఇంకా లోతుగా వెళ్ళటంలో ఆమె తప్పనిసరిగా సాయపడుతుందని నాకు అనిపించింది.

ఆ సాయంత్రం ఆ డాక్టర్ నా ఎదురుగానే మాయా కొడ్నానీకి ఫోన్ చేసి అమెరికా నుంచి వచ్చిన ఒక మంచి ఫిల్మ్ మేకర్ ఆమెను ఇంటర్వ్యూ చేయాలని అనుకుంటోందనీ, తాను వ్యక్తిగతంగా నా గురించి హామీ ఇవ్వగలననీ చెప్పాడు ఎటువంటి అనుమానం రేకెత్తకుండా ఉండేందుకు, నా నటన కొనసాగుతూ ఉండేందుకు నేను వారానికి ఒక సారి ఆ డాక్టరును నా పరిశోధన పేరుతో కలుస్తూ వచ్చాను

ఆ సాయంత్రం నేను హాస్టల్‌కు తిరిగి వచ్చే సరికి మైక్ నన్ను అడగటానికి ఒక కాగితపు ముక్క మీద కొన్ని ప్రశ్నలు రాసి ఉంచుకున్నాడు అందులో అతను 'నేరస్థులు' అనుకున్న వారి పేర్లు కూడా కొన్ని రాసి పెట్టుకున్నాడు మైక్ చెప్పింది సరియైందే అతన్ని పరస్పర మార్పిడి కార్యక్రమం కింద ఎందుకు ఎంపిక చేసుకున్నారో అర్థం అయ్యింది అతడు ఆ సాయంత్రం చాలా ఏకాగ్రతతో నేను చెప్పేది విన్నాడు సరియైన ప్రశ్నలు వేశాడు చెబుతున్న దాంట్లో సున్నితమైనవాటిని సరిగ్గా పట్టుకున్నాడు. నేను అతనికి నా పథకం ఏమిటో చెప్పి, పథకం ప్రకారం జరగకపోతే అకస్మాత్తుగా సందర్భానుసారం మార్పులు చేయవలసి ఉంటుందని చెప్పాను ఈ పథకాన్ని ఎట్లా అమలు చేద్దామని అతడు నన్ను అడిగాడు 'రేపే మనం మన మొదటి పరీక్షకు కూచోవాలని' చెప్పాను

మరుసటి రోజు నేను మాయా కొడ్నానీని కలవవలసి ఉండింది. మొదటి నుంచే కావలసిన సమాచారం బయట పడదనీ, అయినా మరీ ఎక్కువ ఉత్సాహం కూడా ప్రదర్శించగూడదనీ ఒక ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుగా నాకు తెలిసిన విషయం నేను మైక్‌కు అదే విషయం అర్థం చేయించాను. 'మనం ఈరోజు ఫిల్మ్ మేకర్లుగా మాత్రమే ఉండాలి' మాయాబెన్ క్లినిక్ నరోడా వద్ద ముఖ్య మార్గం మీదే ఉంది మూడు సార్లు ఎం ఎల్ ఏ గా గెలిచిన ఈవిడ క్లినిక్‌కు కూతవేటు దూరంలోనే నరోడా పాటియా మారణకాండ జరిగింది ఈ మారణకాండలో వంద మందిని అతి క్రూరంగా హత్య చేసారు రెచ్చగొట్టే నినాదాలు ఇస్తూ ఈవిడే ముస్లింలపై దాడి చేసిన గుంపుకు నాయకత్వం వహించిందని ఈవిడపై ఉన్న ఆరోపణ

మైక్, నేను కొడ్నానీ క్లినిక్‌లోకి వెళ్ళే సరికి స్థానిక మహిళలు ఆమె క్యాబిన్ బయట ఉన్న సన్నని బెంచిలపై కూర్చొని ఉన్నారు ప్రవేశ ద్వారం వద్దనే ఇద్దరు లావు పాటి మనుషులు వున్నారు. ఒకరి చేతిలో తుపాకి ఉంది నన్ను, మైక్‌ను చూడగానే అతను మమ్మల్ని ఆపి తమ బాస్‌తో నిర్ధారించుకున్నాక లోపలికి వెళ్ళనిచ్చాడు. అతడు కొడ్నానీ బాడీగార్డ్ ఆవిడపై సిట్ (ఎస్ఐటి – స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) నేరారోపణ చేసినప్పటి నుంచి ఆవిడ క్లినిక్‌ను అతడే చూస్తున్నాడు అది రెండస్థుల భవనం ఎందరో ఇతర డాక్టర్ల క్లినిక్‌లు కూడా అందులో ఉన్నాయి క్లినిక్ పక్కనే ఆపరేషన్ థియేటర్ ఉంది

గురువారాల్లో క్లినిక్‌కు వచ్చేరోగుల సంఖ్య రెండింతలు అయ్యేది వీరిలో అత్యధికులు తక్కువ ఆదాయం ఉన్న వాళ్ళు. గురువారాల్లో 50 రూపాయలు మాత్రమే ఫీజు అని ఒక బోర్డు ఉంది మమ్మల్ని అనుమానంగా చూసిన కాంపౌండర్ క్లినిక్

స్థానికులకు మాత్రమే అని మాతో అంది నేను మేడమ్‌ను కలవటానికి వచ్చిన ఫిల్మ్ మేకర్‌ను అని ఆమెకు చెప్పాను.

మైక్ టి.వి చూస్తుండగా నేను నా నోట్‌బుక్‌లో ఏదో గిలకడానికి ప్రయత్నించా తన కోడలితో పాటు వేచి చూస్తున్న ఒక వయసు పైబడిన ఆవిడ టి.వి.లో కనిపిస్తున్న బాబాకు ప్రణామం చేయడానికి టి వి ఎదురుగా సాష్టాంగ పడింది మైక్ బిత్తరపోయి నా వంక చూసాడు. నేను అతని వంక చూసి చిరునవ్వు నవ్వి నా నోట్‌బుక్ కేసి మళ్ళాను

అదే సమయంలో కొడ్నానీ సహాయకురాలు ఆమె క్యాబిన్ నుంచి బయటకు వచ్చి 'మైథిలీ కౌన్ ఛే' అని అడిగింది ఆమె నాకు, మైక్‌కు సైగ చేసి లోపలికి రమ్మంది నేను నన్ను, మైక్‌ను ఒక యాసతో పరిచయం చేసుకున్నాను ఆమె ఆదరంగా కరచాలనం చేసింది.

'నీకు తెలుసా, నీది చాలా అందమైన పేరు అది సీతాజీ పేరు' అని కొడ్నానీ అన్నది. 'అవును మేడమ్, మా నాన్న సంస్కృతం టీచర్ దాంతో మా ఇంట్లో అందరికీ అందమైన పేర్లే ఉన్నాయి'. నేను ఇలా చెప్పడంతో కొడ్నానీకి చాలా భరోసా కలిగింది మైక్ కేసి మళ్ళీ ఒక్క సారి కూడా చూడకపోవటంతో అతడికి చికాకు కలిగింది కొడ్నానీ డెస్క్ పైన మెడిసిన్, గైనకాలజీలకు సంబంధించిన పుస్తకాలు, బిజెపీ కరపత్రాలు కొన్ని, గుజరాత్‌లోని సింధీ సముదాయం పై కొన్ని పుస్తకాలు ఉన్నాయి. వీటి పక్కనే అమెరికాలో సెటిల్ అయిన కొడుకు, కోడళ్ళ ఫోటో ఉంది మేము ఒక గంట పాటు ఆమె కెరీర్ గురించి మాట్లాడాము శీతల పానీయాలు తాగుతుంటే ఆమె తన కుటుంబం గురించి చెప్పింది.

మాయాబెన్ బాలల సంక్షేమం, ఆరోగ్య శాఖల మంత్రిగా పని చేసి ఉండింది కాబట్టి రాష్ట్రంలో మహిళల సంక్షేమం కోసం ఆమె పాటు పడిన దాని గురించి పొగిడాను 'నా నుంచి నీవు ఏం ఆశిస్తున్నావు?', చివరికి ఆమె అడిగింది 'మీ గురించి మరింత తెలుసుకోవాలనుకుంటున్నాను మేడమ్ గుజరాత్‌లో సాఫల్యం సాధించిన వ్యక్తిగా మా సినిమా కోసం మిమ్మల్ని చిత్రీకరించాలనుకుంటున్నాము ' బుర్ర సరిగా ఉన్నవారెవ్వరికీ, ముఖ్యంగా రాజకీయ తెగకు చెందిన వారికి తమ గురించి మంచి, పొగిడే మాటలను వినడానికి ఇష్టముండకపోవడమంటూ ఉండదు అట్లాగే తమను కీర్తించే దానిలో భాగస్వాములు కాకపోవటమంటూ కూడా ఉండదు ఆమె వెంటనే ఒప్పుకుంది రాబోయే ఆదివారం నాడు మమ్మల్ని తన అపార్ట్‌మెంట్‌కు లంచ్‌కు పిలిచింది. అలా అయితే చాలా బావుంటుంది అని నేను వీలైనంత యాసతో చెప్పాను

ఆమె కేబిన్ వదిలిపోయేముందు నేను కొడ్నానీ చీరను, ఇతర అలంకరణను పొగిడానని గుర్తుంది మేము కిందికి వెళుతుంటే సెక్యూరిటీ వాళ్ళకు అంతగా మేము నచ్చలేదనిపించింది మేమొక ఆటో పట్టుకొని తిన్నగా 'పక్వాన్'కు వెళ్ళాం 'ఆమె నాతో కనీసం మాట్లాడటానికి కూడా ఆసక్తి కనబరచలేదని నీవు గమనించావా?', అప్‌సెట్ అయిన మైక్ నాతో అన్నాడు నేను జవాబు చెప్పే లోపే హల్వా, రాబ్‌డి వచ్చేశాయి గుజరాత్‌లో వడ్డించేటప్పుడు డెజర్ట్ (స్వీటు) మొదట వడ్డిస్తారు. మైక్ ధ్యాస పక్కకు పోయింది 'మహారాజా' (ఆ హోటల్‌లో సర్వర్లు ఎయిర్ ఇండియా మహారాజా వేషంలో ఉంటారు–అను) ప్రతి వంటకం పేరును ఎలా పలకాలో నేర్పుతుంటే కొడ్నానీని మర్చిపోయాడు. నాకో పెద్ద ఊరట లభించింది

మేము హాస్టల్ గదికి రాత్రి దాదాపు పది గంటలకు వచ్చాము నా గదిలోకి అడుగు పెట్టగానే ఏదో అజ్ఞాత భయం నన్ను చుట్టుముట్టింది ఏదో అసహజంగా అనిపించింది నేను బయటకు వెళ్ళే ముందు నా పరుపును చక్కగా సర్దుకుని పోయాను కానీ అది ఇప్పుడు నలిగి ఉంది నా లాప్‌టాప్ స్విచ్ ఆన్ అయ్యి ఉంది. నా సూట్‌కేసు, టేబుల్ డ్రాయర్లు అల్లాగే ఉన్నప్పటికీ, నా గదిలోకి వేరే ఎవరో కూడా వచ్చి పోయారని నాకు అనిపించింది నాకేమీ ఆశ్చర్యం కలగ లేదు ఇట్లాంటిది ఏదో జరుగుతుందని నేను ఊహించాను కాబట్టి నేను గుజరాత్‌లోకి రాకముందు నా లాప్‌టాప్‌ను మళ్ళీ ఫార్మాట్ చేయించి అడ్మిన్ పేరు మైథిలి త్యాగి అని సెట్ చేయించాను డెస్క్‌టాప్ పైన సినిమాల తయ్యారీ, గుజరాత్ మ్యూజియంలపై పరిశోధన, సినిమా పరిశ్రమ, అడవులకు సంబంధించిన ఫైల్స్ ఉన్నాయి స్క్రీన్ పైన కృష్ణ భగవానుని బొమ్మ వాల్‌పేపర్‌గా ఉంది. నా పరుపు పక్కన ఉన్న షెల్ఫ్‌లో ఫిల్మ్ మేకింగ్‌పై, ఫోటోగ్రఫి పై పుస్తకాలు ఉన్నాయి ఎవరో నా గదిని వెతికారనే దాంట్లో నాకే సందేహమూ లేదు అలాగే వాళ్ళు ఏదైతే చూడాలని నేను అనుకున్నానో వాటిని కాక వాళ్ళు వేరే ఏమీ చూడలేదు ఆట ఇప్పుడిప్పుడే మొదలయ్యింది

మరుసటి రోజు ఉదయం జి ఎల్ సింఘాల్‌తో టెలికాన్ఫరెన్స్ అందావాద్–ని–గుఫా లో ఉన్న ఫోటోగ్రఫి ఎగ్జిబిషన్‌లో నాకేమైనా ఆసక్తి ఉందా అని నా ఫోటోగ్రాఫర్ మిత్రుడైన అజయ్ నుండి ఫోన్‌లో నాకొక మెస్సేజ్ ఉంది నేను ఫోను పక్కన పెట్టేసాను మైక్ నా గది తలుపులు తట్టాడు అతడు ఫౌండేషన్ ఆవరణలో సాయంత్రపు వ్యాహ్యాళికి వెళుతూ నేను కూడా వస్తానేమోనని అడగటానికి వచ్చాడు గుజరాత్‌లో డిసెంబర్ సాయంకాలాలు చాలా అందంగాను, చలిగాను ఉంటాయి 2010 చలి కాలం మాత్రం కొంచెం ఎక్కువగానే తీవ్రంగా ఉంది దీనికి తోడు మా

హాస్టల్ అడవిలాగా ఉండే ప్రాంతంలో ఉండడంతో మా కష్టాలు మరింత పెరిగాయి

హాస్టల్‌లో మా వద్ద ఒకే బ్లాంకెట్ ఉండేది దాంతో రాత్రి కాగానే అందరూ తమ సూట్‌కేసుల్లో నుండి ఉన్నవన్నీ బయటకు తీసి, టి-షర్టులు, షర్టులు, స్వెటర్లు, జీన్స్, ఇంకా మమ్మల్ని వెచ్చగా ఉంచడానికి ఏముంటే అవి వేసుకునేవాళ్లం

నేను, మైక్ ఒక జాకెట్ మీద మరో జాకెట్ వేసుకుని ఫౌండేషన్ భవనం వద్ద అడవి అంచున నడుద్దామనుకున్నాము. నేను మైక్ వంక చూడటానికి పక్కకు తిరిగాను మైక్ ఎప్పటిలాగే ఆలోచనల్లో నిమగ్నుడై ఉన్నాడు 'నేను బాగానే చేస్తున్నానా మైథిలీ?' అని అడిగాడు 'బాగా చేస్తున్నావు. నీవు చాలా ఆత్మ విశ్వాసంతో ఉన్నావు కొడ్నానీ గురించి పట్టించుకోవద్దు ఆమె నాతో మాటల్లోను, తనను గురించిన పొగడ్తల్లోనూ పూర్తిగా మునిగి పోయి ఉండి పోయింది,' అని నేను భరోసా పలుకులు పలికాను

ఆరోజు నేను నిద్ర పోయే ముందు 'రేపు ఎగ్జిబిషన్ వద్ద కలుద్దామ'ని అజయ్‌కి మెస్సేజ్ పెట్టాను

మరుసటి రోజు ఉదయం కాంటీన్ ఉప్మా తింటూ నేను జి ఎల్ సింఘాల్ కు ఫోన్ చేశాను ఆ రోజుల్లో అతను ఒక సంక్షోభంలో చిక్కుకుని ఉన్నాడు ఇష్రత్ జహాన్ ఎన్‌కౌంటర్[1]ను దర్యాప్తు చేయడానికి హైకోర్టు నియమించిన సిట్ తన పనిలో ముందుకు పోతున్నది అందరి కళ్ళు సింఘాల్ మీదే ఉన్నాయి మరో ఇద్దరు అధికారులతో పాటు ఇష్రత్‌ను 'ఎన్‌కౌంటర్'లో కాల్చిచంపింది ఇతనే ఎన్‌కౌంటర్ అయిన మరుసటి రోజు మరో ఉన్నత పోలీసు అధికారి, ఎ టి ఎస్ ప్రముఖుడు అయిన డి.జి.వంజారా ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించాడు అదో పెద్ద సంచలనం రక్తసిక్తమై పడి ఉన్న ఇష్రత్ మృత దేహం మిగిలిన ముగ్గురి మృత దేహాలతో పాటు రోడ్డు మీద పడిఉన్నది. ఆమె గుజరాత్ ముఖ్య మంత్రి నరేంద్ర మోదీని చంపటానికి వస్తున్న ఒక ఎల్ ఈ.టి కార్యకర్త అయిన ఫిదాయీన్ అని, మన దేశంలోని మొదటి మహిళా ఫిదాయీన్ అని ప్రకటించాడు

ఇష్రత్ ప్రతి చోటా చర్చకు కేంద్రబిందువు అయిపోయింది జిహాదీ ఫండమెంటలిజమ్ గురించి, 2002 గుజరాత్ కల్లోలాల గురించి రాడికల్ ముస్లిం సంస్థలు ప్రతీకారం తీర్చుకోదలుచుకున్నాయని కధనాలు వెలువడ్డాయి డి.జి వంజారాను ఒక హీరోగా ఆకాశానికి ఎత్తేశారు అతడు ఒక్కరోజులోనే పెద్ద సంచలనం అయ్యాడు అతడితో పాటు ఈ ఘటనలో పాల్గొన్నది ఎన్ కే అమీన్, తరుణ్ బారోట్, నాకు ఆసక్తి ఉన్న గిరీశ్ సింఘాల్

తమ కూతురి 'హత్య' గురించి విచారణ జరిపించాలని ఇష్రత్ తలిదండ్రులు

సుప్రీం కోర్టులో పిటిషన్ వేసారు. గుజరాత్ హైకోర్టు ఒక న్యాయ కమిటీని ఏర్పాటు చేసింది 2008లో అది తీర్పు చెప్పింది గుజరాత్ హైకోర్టుకు చెందిన ఒక పూర్వ మేజిస్ట్రేట్ నాయకత్వం వహించిన జస్టిస్ తమాంగ్ కమిటీ 'ఇష్రత్ జహాన్ ఎన్‌కౌంటర్ బూటకపు ఎన్‌కౌంటర్ అనీ, ఈ కేసును ఇంకా దర్యాప్తు జరపాలని' ఇచ్చిన తీర్పు దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది

ఈ తీర్పు తదనంతరం, ఇట్లా అధికారులు అమాయకులను చంపివేయడానికి చేసిన తీవ్ర అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా మానవ హక్కుల కార్యకర్తలు, లాయర్లు ప్రదర్శనలు నిర్వహించారు దర్యాప్తు లోతుగా కొనసాగించాలని ఇష్రత్ కుటుంబం హైకోర్టులో మళ్ళీ పిటిషన్ వేసే దాకా ఆ కేసు ముందుకు కదలలేదు అప్పుడు ఈ ఎన్‌కౌంటర్ గురించి విచారించడానికి త్రిసభ్య బెంచ్‌ను ఏర్పాటు చేశారు తరువాత, 2013లో గుజరాత్ హైకోర్టు నియమించిన సిబిఐ టీం ఈ ఎన్‌కౌంటర్‌ను బూటకమని నిర్ధారించి పై స్థాయి పోలీసులను ఇందులో ముద్దాయిలను చేసింది.

ఇలా సుప్రీం కోర్టు ఆదేశానుసారం సిట్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నప్పుడు, 2010లో నేను మొదటి సారి సింఘాల్‌ను కలవడానికి అపాయింట్‌మెంట్ తీసుకున్నాను ఫోను మోగింది యాస ఇంగ్లీషులో నన్ను నేను పరిచయం చేసుకున్నా సింఘాల్ పెద్దగా స్పందించలేదు తరువాత ఫోన్ చేయమని సింఘాల్ నాతో అన్నాడు నా ఆశలన్నీ ఇతడి మీదే ఉన్నాయి నా పరిశోధన ఇతడితోనే ప్రారంభించాలి నేనెలా ముందుకు సాగాలా అని ఆలోచనలో పడ్డా ఆ రోజు వార్తా పత్రికలు సిట్ అతడిని అరెస్టు చేయటం తథ్యమని రాసాయి ఇటువంటి ఉద్రిక్త పరిస్థితుల్లో సింఘాల్ బయట పడటానికి చట్టపరంగా ఏమి చేయాలనే దానిపై కేంద్రీకరిస్తాడు కానీ, ఎవరో విదేశాల నుంచి తిరిగి వచ్చిన ఫిల్మ్ మేకర్‌తో మాట్లాడాలనుకోకపోవడం సహజమే ఆ రోజు మైక్‌తో పని లేదని నేను చెప్పాను మైక్‌కు ఇతర హాస్టల్ వాసులతో స్నేహం కలిసింది అందులో గ్రీన్‌ల్యాండ్‌కు చెందిన పార్నన్‌గుఆక్ లింజ్ అనే అమ్మాయి ఒకరు మేము ఆమెను పానీ అని పిలిచేవాళ్లం మైక్‌కు ఆమె అంటే అభిమానం కొంచెం ఎక్కువే పెరుగుతోందని నాకు అనుమానం ఆ రోజు అతనితో పని లేదని అర్థం అయ్యాక అతను పానీని ఫోటోగ్రఫీ ట్రిప్పుకు తీసుకెళతానని అంటే ఆమె వెంటనే ఒప్పుకుంది ఆరోజు సాయంత్రం నేను కూడా నా ఫోటోగ్రఫీ ట్రిప్పుకు వెళ్ళానని నాకు గుర్తు పని ఏమి లేకపోవడంతో నేను నా గదికి తిరిగి వెళ్ళి గత కొద్ది రోజులలో జరిగిన విషయాల గురించి నోట్స్ రాసుకున్నాను.

ఆరోజు సాయంత్రం నేను అజయ్ మిత్రుడి ఎగ్జిబిషన్‌కు వెళ్ళేసరికి అతడు

దాని నిర్వహణలో ఉన్నాడు. అందరికీ నన్ను అమెరికా నుండి వచ్చిన ఫిల్మ్ మేకర్‌గా పరిచయం చేశాడు. అంతే ఇక, అందరూ నన్ను టెక్నికల్ ప్రశ్నలతో ముంచెత్తారు 'నీ కెమెరా మ్యాన్ ఎవరు? ఏ కెమెరా వాడుతున్నారు? ఎప్పుడు షూటింగ్ మొదలు పెడుతున్నారు?' వగైరా, వగైరా ఇటువంటి ప్రశ్నలు వస్తాయని ఊహించి నేను మొదటే కొంత రిహార్స్ చేసుకున్నాను కాబట్టి ఎటువంటి కంగారూ లేకుండా వాళ్ళకు జవాబు చెప్పాను. అజయ్ నాకు అందావాద్-ని-గుఫా అంతా తిప్పి ఆ స్థలానికున్న చరిత్రను సంక్షిప్తంగా చెప్పాక మేము కాఫీ, సమోసాల కోసం కూచున్నాం

మా పక్కనే ఒక కాలేజీ బృందం కూర్చొని ఉంది ఎవరో గిటార్ వాయిస్తున్నారు మరొకరెవరో తన ప్రేయసితో కలిసి దూరంగా కూర్చొని ఉన్నారు ఒక క్షణం పాటు పోలీసులను, నేను మారు వేషంలో ఉన్నాననే విషయాన్ని, నా చేతిలో ఉన్న పనిని, నేను ఆందోళనగా ఉన్నాననే విషయం వంటి వాటినన్నింటినీ మరచి పోవచ్చు అనిపించింది. నేను కూడా మరో విద్యార్థిని ఇంటి వద్ద ఉన్న నా కుటుంబం పైన ధ్యాస మళ్ళింది నా తలిదండ్రులతో చాలా రోజులుగా మాట్లాడలేదు నా ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు గురించి వాళ్ళు ఆందోళన చెందుతున్నారు నేను నా సెల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉంచాను ఒక స్థానిక సైబర్ కేఫ్ నుంచి వాళ్ళకు అప్పుడప్పుడు మెయిల్ ఇచ్చేదాన్ని కానీ అవసరమైనంత తరచుగా మాత్రం కాదు. నేను అమిత్ షా గురించి పబ్లిష్ చేసినప్పటినుంచి వాళ్ళు నా క్షేమం గురించి చింతిస్తూనే ఉన్నారు.

ఈ రకమైన ఆలోచనలతో నేను మా హాస్టల్ దగ్గరలో ఉన్న లోకల్ మార్కెట్ వద్ద నన్ను వదిలి వెళ్ళమని అజయ్‌ను అడిగాను నాకు కొన్ని చిన్నచిన్న పనులున్నాయని అతనితో చెప్పాను అతడు నన్ను సాటిలైట్ రోడ్ షాపింగ్ ఏరియాలో వదిలి వెళ్ళాడు. అది బిజీగా ఉండే మార్కెట్ ప్రాంతం నా చిన్న చిన్న పనులు నిజమేనని కనిపింపజేయడానికి నేనొక సూపర్ మార్కెట్‌లోకి వెళ్ళి కొన్ని టాయ్‌లెట్ సామాన్లు కొని, ఆ మార్కెట్ పక్కనే ఉన్న ప్రజాటెలిఫోన్ సెంటర్‌లోకి ప్రవేశించా ఇది చాలా సురక్షితమైన సమాచార సాధనం నేను మా ల్యాండ్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేశా నాకు ఎప్పుడూ బలాన్నిచ్చి, తాను బలమైనదనే ఒక అభిప్రాయాన్ని కలుగజేసే మా అమ్మ ఫోన్ ఎత్తింది ఆమె నన్ను వెనక్కు రమ్మంది కుటుంబంతో రోజుల తరబడి ఎటువంటి సంబంధం లేకుండా ఉండేది ఏం జర్నలిజమని ఆమె ప్రశ్న ఆమెను వీలయినంత సముదాయించి ఫోన్ పెట్టేశాను. నా లోపల మాత్రం ఏదో భారంగా, ఖాళీగా అనిపించింది

మరుసటి రోజు ఉదయం నేను మళ్ళీ సింఘాల్‌కు ఫోన్ చేశాను. ఈసారి అతను నన్ను కలుస్తానన్నాడు నా పరిశోధన నన్ను తీసుకెళ్ళే వ్యాకులమైన ప్రయాణ మార్గం అంతిమంగా మొదలయ్యింది

---

*1 పందొమ్మిదేళ్ళ ఇష్రత్ జహాన్‌ను మరో ముగ్గురితో కలిపి 2004 జూన్ 15న గుజరాత్‌లోని అహ్మదాబాద్ బయట కొంత మంది పోలీసు అధికారులు కాల్చి చంపారు వీళ్ళు పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత లష్కర్-ఏ-తైబాకు చెందిన వారని, గుజరాత్ ముఖ్య మంత్రి నరేంద్ర మోదీని చంపే పథకంలో భాగస్వాములనీ స్థానిక పోలీసులు అనాడు ఆరోపించారు ఆనాడు చనిపోయిన ఇతర వ్యక్తుల పేర్లు జీషన్ జోహార్, అంజాద్ అలీ, జావేద్ షేక్*

# మూడవ అధ్యాయం

***జి.ఎల్.సింఘాల్***

గిరీష్ సింఘాల్ పెద్ద కొడుకు హరీష్ 2012 లో ఆత్మహత్య చేసుకున్నాడు దీనితో సింఘాల్ బాగా కుంగిపోయాడని అతణ్ణి తెలిసిన వాళ్ళు అంటారు

మా ఫోన్ సంభాషణ జరిగిన తరువాతి రోజు ఉదయం నేను అతణ్ణి కలిసాను. మైక్‌కు పరిస్థితి ఎంత సున్నితమైనదో అర్థం చేయించాక నా వెంట తీసుకెళ్ళా సింఘాల్ అంటే ఏదో మామూలు మనిషి కాదు అతడు గుజరాత్ ఏ టి ఎస్ బాధ్యుడు. సింఘాల్ సిట్ దర్యాప్తును ఎదుర్కొంటున్నందుకు అతడి కదలికలపై నిఘా ఉంది అట్లాగే అతడు తాను కలిసే వాళ్ళ గురించి కూడా జాగ్రత్తగా ఉంటున్నాడు అతడి అరెస్టు అనివార్యం. సిట్ తన విచారణను వేగిరపరుస్తోంది ఇద్దరు జూనియర్ అధికారులను ఈ సరికే అరెస్టు చేసారు తదుపరి వాడు సింఘాలే అయ్యే అవకాశం ఉంది అతడిపై, ఇతర అధికారులపై వేరే ఆరోపణలతో పాటు టెర్రర్ పేరు మీద కుట్ర చేసి ఒక అమాయకురాలిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపిన ఆరోపణ ఉంది

ఇది గుజరాత్‌కు కొత్త ఏమీ కాదు కల్లోలాల తరువాత ఒక శత్రుపూరిత వాతావరణం నెలకొని ఉండింది. ఇరు సామాజిక వర్గాల మధ్య పెద్దగా స్నేహపూరితంగా లేని సంబంధాలు ఇంకా దిగజారిపోయాయి నరేంద్ర మోదీని గుజరాత్ 'అస్మిత'ను (ఆత్మ గౌరవాన్ని) కాపాడిన హిందూ నాయకుడిగా చూడటం మొదలైంది గోధ్రా రైలు దగ్ధం ఘటనలో, ఆ తదుపరి జరిగిన కల్లోలాలలో ఇరు వర్గాలూ నష్టపోయాయి బ్యూరోక్రాట్లు, అధికారులపై ఆరోపణలు వచ్చాయి కానీ వాళ్ళకు వ్యతిరేకంగా దేన్నీ నిరూపించలేకపోయారు. ఎన్నో ఎంక్వైరీ కమిషన్లు అధికారులు చేపట్టిన లేదా చేపట్టక పోయిన చర్యలను అతి తీవ్రంగా విమర్శిస్తూ రిపోర్టులు రాశాయి కానీ కొద్ది మంది కింది స్థాయి వారిపై ఏవో చర్యలు తీసుకున్నారు

తప్పు పై వాళ్ళందరూ అధికార స్థానాల్లోనే ఉన్నారు బహుశా దీనివల్ల కలిగిన ధైర్యంతో గుజరాత్‌లో వరుసగా ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. వీటిని ఆ తరువాతి కాలంలో సుప్రీం కోర్టు అంతటిదే బూటకపు ఎన్‌కౌంటర్లని గుర్తించింది గుజరాతీ అస్మితకు ప్రమాదం పొంచి ఉందని చూపడానికి ఈ ఎన్‌కౌంటర్‌లను వాడుకున్నారు

గుజరాత్‌లో బూటకపు ఎన్‌కౌంటర్‌ల పరంపరకు ఒక నీతిబాహ్యమైన పద్ధతి ఉంది సమీర్ ఖాన్ పఠాన్, సాదిక్ జమాల్, ఇష్రత్ జహాన్, జావేద్ అలియాస్ ప్రణేష్ పిళ్ళై, సోహ్రాబుద్దీన్, తులసీరాం ప్రజాపతి. ఇవి గుజరాత్ లోని కొన్ని ఎన్‌కౌంటర్ కేసులు మాత్రమే వీటి దర్యాప్తును ఈ దేశంలోని సర్వోన్నత న్యాయస్థానాలు పర్యవేక్షిస్తున్నాయి ఈ కేసుల గురించి సంక్షిప్తంగా తెలుసుకున్నా చాలు, ఇవి ఎంత పకడ్బందీగా పథకం వేసి, చేసిన హత్యలో తెలుసుకోవడానికి నేను దీన్నంతా బహిర్గతపరుస్తూ తెహల్కాలో 2011 డిసెంబర్‌లో పెద్ద వ్యాసం రాశాను

గుజరాత్ బూటకపు ఎన్‌కౌంటర్‌ల చుట్టూ చేసిన క్రూర, తప్పుడు ప్రచారం ప్రత్యేకించి ఆందోళన కలిగించే విషయం. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపేసిన వారంతా లష్కర్–ఏ–తోయిబాకు చెందిన వారనీ, వారంతా ముఖ్యమంత్రి నరేంద్ర మోదీని, అప్పటి డిప్యూటీ ప్రధాన మంత్రి ఎల్.కే అద్వానీని, ప్రవీణ్ తొగాడియా, జయదీప్ పటేల్ వంటి హిందూత్వ అతివాదులను చంపే ప్రయత్నంలో ఉన్నవారనీ ప్రచారం చేసారు. 2002 తరువాత మతపరంగా రెండు ధృవాలుగా చీలిన గుజరాత్‌లో ఈ ప్రచారం రాజుకోవడానికి సిద్ధంగా ఉన్నదాన్ని ఎగతోసినట్టే దేశంలోని టెర్రరిస్టు పేలుళ్ళ వెనక ముస్లిం యువకులెవ్వరూ లేరని ఎవరూ అనటం లేదు కానీ, చిన్నపాటి నేరస్థులపై టెర్రరిస్టులుగా ముద్ర వేసి దురుద్దేశపూరితంగా ప్రాణాపాయాలు పొంచి ఉన్నాయని ఆపాదించటం మొత్తం ముస్లిం సముదాయాన్నే దేశవ్యతిరేకులుగా చిత్రీకరించడానికి దోహదపడటంతో పాటు, మోదీని 'హిందూ హృదయ సామ్రాట్టుగా', 'హిందువులశత్రువులకు' ఒక గుణపాఠం నేర్పించగలిగేవానిగా, జిహాదీ గ్రూపుల నుండి నిరంతరం ప్రమాదాన్ని ఎదుర్కుంటున్నవానిగా నిలబెట్టడంలో కూడా సాయ పడింది [2]

తెహల్కాలో వచ్చిన మరో పాత కథనం[3]లో సోహ్రాబుద్దీన్ ఒక చిన్నపాటి నేరస్థుడు, బలవంతపు వసూళ్లు చేసేవాడనీ, అతన్ని చంపేసేముందు అమిత్ షాకు బాగా తెలుసనీ వివరించాం సోహ్రాబుద్దీన్‌ను ఎందుకు చంపివేసి టెర్రరిస్టు అని ప్రకటించారనే విషయం పై కూడా అందులో ఇబ్బందికరమైన ప్రశ్నలు లేవనెత్తాం

గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే అప్పుడు అతడు హోం శాఖా మంత్రి

మాత్రమే కాక మోదీకి చాలా సన్నిహితుడు కావడం వల్ల ఓ డజను మంత్రిత్వ శాఖలు అతని వద్దే ఉన్నాయి అప్రతిష్ఠ పాలయిన పోలీసు అధికారి వంజారా కూడా షాకు చాలా సన్నిహితుడు.

కానీ, 19 ఏళ్ల ఇష్రత్ జహాన్ ను పథకం ప్రకారం చంపడంతో సింఘాల్ ఇరుక్కుపోయాడు

నేను సింఘాల్‌ను ఆరోజు పొద్దున అహ్మదాబాద్‌లోని షాన్‌బాగ్ ప్రాంతంలో ఉన్న అతడి హై సెక్యూరిటీ ఆఫీసులో మైక్ తో పాటు కలిసాను అక్షరధామ్ దాడిని విజయవంతంగా హ్యాండిల్ చేయడం సింఘాల్ గతంలో చేసిన పెద్ద పనుల్లో ఎన్నదగినది. దీనికి అతనికి రాష్ట్రస్థాయి సాహస పథకం లభించింది సింఘాల్ వయసులోని అధికారికి అతనికి లభించినంత గుర్తింపు లభించడం అరుదే కానీ అతని డిపార్ట్‌మెంట్ లోని ఎంతోమంది ఈ విషయాన్ని రూఢి పరచగలరు స్కర్ట్ వేసుకుని, తలకు బ్యాండానా కట్టుకున్న ఒక అమ్మాయి, మరో విదేశస్థుడు ఏ టి.ఎస్ ముఖ్యుణ్ణి కలవాలనుకోవటం ఏ.టి ఎస్. ఆఫీసు వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డును గందరగోళంలో పడేసింది లోనకు సింఘాల్ వద్దకు ఒక నోట్ పంపించాడు

కొద్ది నిమిషాల్లోనే ఒక కానిస్టేబుల్ గార్డు వద్దకు వెళ్ళి మేం సినిమాలు తీసే విదేశస్థులమనీ, సాహెబ్‌ను కలవడానికి వచ్చామని గుజరాతీలో మెల్లగా అతనితో చెప్పాడు మైక్‌ను, నన్ను లోపలికి తీసుకెళుతుంటే, అతని మొహంలో ఆశ్చర్యం కనిపించింది మైక్ ఎప్పటిలానే సమ్మోహనంగా ఉన్నాడు వేరే ఎవరైనా 19 ఏళ్ళ కుర్రాడైతే ఆ పరిస్థితిలో చెమటలు పట్టేవి. కానీ అతనికిదేం పట్టలేదు అయితే పరిస్థితి యొక్క సీరియస్‌నెస్, దానితో ముడిపడివున్న రిస్క్ మైక్‌కు పూర్తిగా అవగతమైందా అని నాకు కొంచెం చింత మాత్రం ఉండింది ఈ విషయంలో నాకేమైనా అనుమానాలున్నా మేం వెయిటింగ్ రూంలోకి ప్రవేశించగానే తొలగిపోయాయి కొద్ది మంది కానిస్టేబుల్స్, సివిల్ దుస్తులలో ఉన్న పోలీసు అధికారులతో పాటు మేమూ వేచి వున్నాం వాళ్ళు వేసుకొన్న దృఢమైన తెల్ల బూట్ల వల్ల వాళ్ళు పోలీసులని తెలిసిపోతోంది. ఒక టెలివిజన్ సెట్‌లో ఏదో బాలీవుడ్ సినిమా వస్తోంది. మైక్ దృష్టిని అదే ఆకర్షించింది అది ఒక గోవిందా సినిమా కొందరు అధికారులు దాన్ని ఆసక్తిగా చూస్తుండగా మరికొందరు తమ పనిలో తాము మునిగిపోయారు కొంచెం ఆసక్తి గల వాళ్ళు వచ్చి మైక్ పక్కన కూచున్నారు మైక్ వాళ్ళను మర్యాదగా 'నమస్తే' అని పలకరించాడు. వారి ఆహారమంటే అతనికున్న ఇష్టం గురించి, అతని దేశాని గురించిన వివరాల వరకు వారి మధ్య వచ్చీరాని

ఇంగ్లీషులో సంభాషణ నడిచింది పరిస్థితి పూర్తిగా మైక్ అదుపులో ఉంది ఏ మాత్రం ఆందోళన కానీ, అత్యుత్సాహం కానీ అతను ప్రదర్శించలేదు

'మైథిలీ త్యాగీ, మిమ్మల్ని సారు పిలుస్తున్నారు', ఒక ఆర్డర్లీ వచ్చి చెప్పాడు. నాటకపు ప్రథమాంకం మొదలైంది.

నలభైల్లో ఉన్న గిరీష్ సింఘాల్ చక్కగా డ్రెస్ చేసుకొని, చాలా హుందాగా ఉన్నాడు మేం లోపలికి వెళ్ళేసరికి సగం కాలిన సిగరెట్టు అతని వేళ్ళ మధ్య ఉంది. అతడు తన లాప్‌టాప్‌లో ఒక వీడియో చూస్తున్నాడు అతని టేబుల్‌పై కొన్ని ఓషో పుస్తకాలు ఉన్నాయి. 'మీరు ఓషో అనుచరులా?' అని నేను కుర్చీలో కూచునేటప్పుడు టేబుల్ పైన నా డైరీని జాగ్రత్తగా ఉంచుతూ అడిగాను ఆ డైరీకి నా వీడియో రికార్డరు ఉంది నేను పరిచయం చేసుకునేవాళ్ళతో కొంత పరిచయం పెరిగాక వాళ్ళ సంభాషణలను రహస్యంగా రికార్డు చేద్దామని మొదట అనుకున్నాను కానీ సింఘాల్ ఎప్పుడు ఎలా స్పందిస్తాడో తెలియదు ఒకవేళ అతను ఏదో ముఖ్యమైనది చెప్పినప్పుడే నా వద్ద రికార్డరు లేకపోతే ఎలా? తరువాత అతను నాకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఎలా?

నేను మైక్‌ను సింఘాల్‌కు పరిచయం చేశాను అతను తల పంకించాడు మేం కలవటానికి వెనకనున్న కోణం గురించి నేను అతనికి నా నకిలీ యాసలో చెప్పాను. సింఘాల్ నేను చెప్పే ప్రతి పదాన్ని గ్రహిస్తూ శ్రద్ధగా విన్నాడు. మధ్య మధ్యలో తల ఊపాడు ఒకసారి నేను చేప్పేది శ్రద్ధగా వింటున్నాడని తెలిసాక, కొన్ని తెలిసిన పేర్లు అలా వదిలాను 'నిజానికి మాయ బెన్ మీ గురించి చాలా గొప్పగా చెప్పింది రాష్ట్రంలోని చాలా చురుకైన ఆఫీసర్లలో మీరొకరని చెప్పింది'– అన్నాను ఇది నేనాశించిన ఫలితాన్ని కలిగించింది అతడి సీరియస్ ముఖం కొంచెం రిలాక్స్ అయ్యింది చిరునవ్వు నవ్వుతూ 'ఆమె చాలా మంచి మనిషి. చాలా అధ్యాత్మిక చింతన ఉన్న వ్యక్తి' అన్నాడు

అతడు చిక్కుకొని ఉన్న వివాదం గురించి ఎత్తకపోవడమే మంచిదని అనుకున్నాను అమాయకత్వం, విభ్రాంతి ప్రదర్శించడమే అతడు తానే బయటపడేలా చేసేందుకు సులభమైన పద్ధతి అనిపించింది అతడు తన చిన్నతనపు ముచ్చట్లుచెప్పాడు పై వర్గంపై పోరాడాలనే తన కోరిక, తన దళిత కుటుంబంపై పొరుగువాళ్లు ప్రదర్శించిన బ్రాహ్మణవాద వివక్ష, తానే తన కుటుంబానికి జీవనాధారంగా ఉండటం వంటి వాటి గురించి వివరంగా మాట్లాడాడు పోలీసు వ్యవస్థలో చేరటం వాటి ప్రక్షాళనం కోసమా అని అడిగాను. 'ప్రతిచోటా అసమానత్వమే

ఉంది. నేను భాగమైన ఈ వ్యవస్థలో కూడా అదే రాజ్యమేలుతోంది' అని అతడు జవాబు చెప్పాడు

ఒక పదిహేను నిముషాల కోసమని ఇచ్చిన అపాయింట్‌మెంట్ ఓ గంటపాటు సాగింది. తాను ఇప్పుడున్న స్థితిలోకి ఎలా వచ్చాడో గిరీష్ సింఘాల్ కథనాలుగా చెబుతుండగా చెప్పినప్పుడల్లా మైక్ శ్రద్ధగా వివరాల గురించి నోట్సు రాశాడు

తాను ఒక దుకాణంలో ఏదో ముట్టుకోవడానికి ప్రయత్నిస్తే తాను కింది కులం వాడు కావడం వల్ల దుకాణదారుడు ఎట్లా తనను కొట్టాడనే దాని దగ్గరి నుంచి, అక్షరధామ్ దేవాలయంలోకి ప్రవేశించిన టెర్రరిస్టులను మట్టుబెట్టడంలో తన ధైర్య సాహసాల వరకు అన్నీ మాట్లాడాడు. అతడు మాట్లాడుతుంటే ముఖంలో గర్వం తొణికిసలాడింది. నేను అతను సాధించిన వాటిని గురించి అభినందిస్తే కొంచెం సిగ్గుపడిపోయాడు. అతని చుట్టూ ఉన్నవన్నీ ఏదో టెన్షన్ కలుగజేసే విషయాలే అయిపోయి, అతడి ఉద్యోగమే ప్రమాదంలో పడి ఉన్నప్పుడు, ఒక బయటి వ్యక్తి నుండి ఇట్లా గుర్తింపు లభించేసరికి, అతడికి కొంచెం ఊరటగా అనిపించి ఉండొచ్చు అక్షరధామ్ లోని టెర్రరిస్టులపై దాడి కోసం మొదట చేసిన అభ్యాసపు డ్రిల్లు గురించిన వివరాలు వింటూ మేము అల్లం టీ తాగాం. ఈ సమావేశంతో మాకు తలుపులు తెరుచుకున్నట్టయింది మాకు మరుసటి వారం ఇంకో అపాయింట్‌మెంట్ ఇచ్చాడు అయితే మా సంభాషణలో తలెత్తిన మరో విషయం కొంత ఆశావహంగా కనిపించింది మేం కుల వ్యవస్థ గురించి, మరీ ముఖ్యంగా వెనుకబడిన తరగతులకు చెందిన వాళ్ళైనప్పటికీ పై స్థాయికి ఎదిగిన వాళ్ళ గురించి మాట్లాడినప్పుడు రాజన్ ప్రియదర్శి అనే ఏ టి.ఎస్ మాజీ ప్రముఖుడి గురించి సింఘాల్ పేర్కొన్నాడు అతనంటే తనకు చాలా గౌరవమనీ, తన గురుతుల్యుడనీ అన్నాడు ప్రియదర్శి కూడా ఓ బి.సి.కి చెందిన వాడనీ, మా డాక్యుమెంటరీని తగు విధంగా రూపొందించుకోవడంలో, దానికి ఒక లక్ష్యం ఇవ్వడంలో అతను తోడ్పడుతాడని చెప్పాడు అతడు ఒక సంవత్సరం క్రితం పదవీ విరమణ చేసి తన కుటుంబంతో అహ్మదాబాద్‌లో ఉంటున్నాడని చెప్పాడు మా ఉద్దేశ్యం పట్ల విశ్వాసం గలగడం వల్ల కావచ్చు, 'సర్'ను సులభంగా కలవడానికి తాను సిఫారసు చేస్తానని కూడా అన్నాడు

ఒక గంటసేపు సింఘాల్‌తో మాట్లాడాక నేను, మైక్ ఎంతో రక్షణతో కూడిన ఏటీఎస్ హెడ్ క్వార్టర్స్ నుంచి బయటకు వచ్చాం మేమిద్దరం మౌనంగా ఉండి, బయటకు వచ్చేటప్పుడు సెక్యూరిటీ గార్డుకు తల ఆడించాం. ఇప్పుడతను మా వైపు ఒక చిరునవ్వు నవ్వి మా కోసం ఒక ఆటోను కూడా పిలిచాడు ఒక కిలోమీటరు

దాటాక, మేం ఒకరినొకరు చూసుకొని చిరునవ్వు నవ్వుకున్నాం అంతా బాగానే సాగుతోంది కదా? అని మైక్ అడిగాడు నేను తల ఊపాను

కొద్దిరోజులపాటు సింఘాల్‌ను అతని మానాన అతణ్ణి వదిలెయ్యాలని మేం అనుకున్నాం ఫోన్ కాల్స్ చేసి వెంటపడితే మేమేదో ఆతురతతో ఉన్నామనిపించి, అనుమానస్పదంగా కూడా అనుపించొచ్చు మధ్య మధ్యలో నేను అతడికి కొన్ని మెస్సేజ్‌లు పంపించి, మేం అతనిపై చేసిన పరిశోధనలో రాష్ట్రం పట్ల అతడికి ఉన్న అంకిత భావం, సమర్పితభావాన్ని తెలుసుకొని ఎలా ముగ్ధులమయ్యామో తెలియజేశాను మా తదుపరి అపాయింట్‌మెంట్ తేదీ దగ్గరపడింది

ఈసారి నేను మైక్‌ను వదిలేసి వెళ్లాలని నిర్ణయించుకున్నా రాజకీయ నాయకులను ఇంటర్వ్యూ చేసినప్పుడు, అధికారులతో ఆఫ్ ది రికార్డ్ సంభాషణలు జరిపినప్పుడు నేనీ పాఠం నేర్చుకున్నా తమ చుట్టూ ఎంత తక్కువ మంది ఉంటే అంత ఇబ్బంది లేకుండా ఉంటారు ఎవరైనా నోట్స్ మాత్రమే రాసుకుంటుంటే వాళ్ళు పెద్దగా ఇబ్బందిపడరు ఇక సంభాషణలను రికార్డు చేయడం సంగతికొస్తే నేనే ఆ రోజు మునుపటికంటే ఇంకా బాగా తయారుగా ఉన్నా మా మొదటి సమావేశంలో మాపట్ల సింఘాల్ ఉన్న తీరుతో మా తదుపరి సమావేశంలో అతను ఏదో బయటపెడతాడని నాకు నమ్మకం కలిగింది నా నమ్మకం వమ్ము కాలేదు ఆ మధ్యాహ్నం ప్రత్యేకంగా కుట్టించిన నా కుర్తాను చార్జింగ్ పాయింట్ నుండి తీశాను కుర్తాలోని పై భాగంలో ముదురు రంగు కాశ్మీరీ ఎంబ్రాయిడరీ ఉంది అక్కడ ఉన్న ఆ చిన్న రంధ్రాన్ని ఆ ఎంబ్రాయిడరీ మరుగుపరుస్తుంది ఆ రంధ్రం, లోపల ఉన్న కెమెరాకు ఇన్‌లెట్ ఆ కెమెరాకు ఒక వైర్ ఉండి కిందిదాకా వెళ్లింది దానికి ఒక బటన్ ఉండి రికార్డు చేయదలుచుకున్న ప్రతిసారి ఆన్ ఆఫ్ చేయవలసి ఉండింది అయితే ఇందులో మరొక చిన్న ఇబ్బంది ఉంది కెమెరా బటన్‌ను ఆన్ చేయగానే ఒక ఎర్ర లైటు వెలుగుతుంది నేను చాలా సార్లు అభ్యాసం చేసినప్పటికీ, లైటు వెలగదేమోననే భయం వెంటాడేది. అది నిర్ధారించుకోవడానికి నేను, నా కలాన్ని దొర్లించి టేబుల్ పై నుండి కింద పడేలా చేసి దాన్ని తీసుకునే నెపంతో వంగి గబుక్కున నా కుర్తాలోకి తొంగి చూసి ఎర్ర లైటు వెలిగిందో లేదో చూసుకునే దాన్ని

నేను ఆ రోజు హెడ్ క్వార్టర్స్ లో అడుగుపెట్టగానే సెక్యూరిటీ గార్డు పరిచయంగా నవ్వాడు అతడు నన్నొక ఎన్నారై ఫిల్మ్ మేకర్ అనుకున్నాడు ఆర్డర్లీ నా గురించి చాలా మంది అధికారులకు ఇదే అభిప్రాయాన్ని కలిగించాడు గార్డు, 'మేడమ్ ఈ రోజు షూటింగ్ చెయ్యరా?" అని అడిగాడు నేను త్వరలోనే పని ప్రారంభించ

బోతున్నానని సైగ చేశాను 'హలో' అంటూ హాయిగా పలకరిస్తాడని ఆశిస్తూ నేను సింఘాల్ గదిలోకి ప్రవేశించాను. అయితే అతని ముఖంలోకి చూడగానే ఏదో జరిగిందనిపించింది అతడి వద్దకు చేరిన ఏదో వీడియో ఫుటేజీని అతడు చూస్తున్నాడు అతడి నివాస ప్రాంతంలో కొందరు దుండగులకు సంబంధించిన స్టింగ్ ఫుటేజ్ అది ఏటీఎస్ ఇన్‌ఛార్జ్ స్థాయి అధికారికి అది ఒక పెద్ద విషయమే కాదు విషయం మరేదో ఉంది పోలీసు బలగంలోని వేరే అధికారులు అతణ్ణి ఇబ్బందుల పాలు చేస్తున్నారు

కానీ, త్వరగానే ఆ మూడ్‌లో నుండి బయటపడి తన చిద్విలాస స్వభావానికి తిరిగి వచ్చాడు. నేను అతని గురించి సేకరించిన వివరాల గురించి అతడు చాలా ఆసక్తి కనబరిచాడు. నేను తన గురించి ఇతరులను అడిగానా అనీ, వారు తన గురించి పాజిటివ్ గా చెప్పారా అని అతడు అడిగాడు లాస్ ఏంజెల్స్ నుండి వెనక్కు వచ్చి ఇక్కడి పరిస్థితి గురించి ఏమీ తెలియని ఒక అమ్మాయి పాత్రలోకి నేను మారిపోవలసి వచ్చింది దేశంలోని పెద్ద టెర్రరిస్టు దాడుల్లో ఒక దానిలో టెర్రరిస్టులను మట్టుబెట్టిన సాహసోపేతమైన మనిషి ఎదురుగా సంభ్రమంతో ప్రశంసాపూర్వకంగా కూచున్న ఓ అమ్మాయిలా నటించాను. 'మీరు చాలా ధైర్యస్థులు నేను అక్షరధామ్ దాడుల గురించి గూగుల్ సర్చ్ చేశాను ఓహ్ అది అద్భుతం,' అన్నాను అతడో సిగరెట్ వెలిగించుకొని నన్ను ప్రశ్నలు అడగమన్నాడు. మెలమెల్లగా మాటలు దొర్లేకొద్దీ అతడి కష్టభరిత జీవితం గురించి తెలిసింది జవాబులు చాలా మట్టుకు చాలా సంక్షిప్తంగా ఉన్నాయి కానీ సుదీర్ఘ మౌనాలు, నిశితమైన చూపు, ఇబ్బందికరమైన చూపులతో డెస్క్ పైన వేళ్ళతో కొట్టడం – ఇవన్నీ ఎన్నో విషయాలు చెప్పకనే చెప్పాయి సింఘాల్ తన ఆలోచనలు, జవాబులలో చాలా జాగ్రత్తగా ఉంటాడని నేను అనుకున్నా కానీ, అతని ఎదురుగా ఇంటర్వ్యూ చేయడం కోసం కూచున్న వ్యక్తిని చాలా నిరపాయకరమైన వ్యక్తి అనీ, ఏ ఇబ్బంది ఉండదనీ అనుకోవడం వల్ల అతడికి ఆ రోజు మాట్లాడాలనిపించింది

నేను అతణ్ణి అతని కుటుంబం, భార్య, పిల్లలతో పాటు అతని ఇంటివద్దనే కలుస్తానని ప్రతిపాదించాను 'వద్దు, దయచేసి ఆ పని చేయద్దు వాళ్ళు ఇప్పటికే బాధపడుతున్నారు నేను చేసే పని వాళ్ళకు ఇష్టం లేదు వాళ్ళు నా ఉద్యోగాన్ని అసహ్యించుకోవడం మొదలు పెట్టారు పోలీసు వ్యాను ఇంటికొస్తే దాన్ని దూరంగానే ఆపెయ్యమని, నా ఇంటి దరిదాపుల్లోకి కూడా తీసుకురావద్దనీ చెప్పాను ' కొద్ది సమయం తర్వాత అతనే ఎన్‌కౌంటర్ల గురించి పేర్కొనడంతో వాటి గురించి

ప్రశ్నించడం నాకు సులభమైంది నేనీ పుస్తకం రాస్తున్న సమయంలో, సి బి ఐ. అతనిని అరెస్టు చేసిన తర్వాత తన పాత్ర గురించి ఒప్పుకున్నాడు. అంతేకాదు, తన వాంగ్మూలాలలోనూ, రికార్డు చేసిన సంభాషణల్లోనూ[4] అతను ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్లో ఎందరో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల కుమ్మక్కు గురించి కూడా నిరూపించాడు గుజరాత్ హైకోర్టు నియమించిన సిబిఐ విచారణ బృందం దాఖలు చేసిన చార్జిషీట్ ఇష్రత్ లష్కర్-ఏ-తొయ్‌బా ఆపరేటివ్ కాదనీ, ఎన్‌కౌంటర్ బూటకమనీ నిర్ధారించింది

కోర్టు దాఖలు పరిచిన చార్జిషీట్‌లో[5] సింఘాల్ సిబిఐకి ఇచ్చిన సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకొంది

నేను మొదటిసారి సింఘాల్‌ను కలిసినప్పుడు తన పెద్ద కొడుకు హారిక్ గురించి చాలా ప్రేమగా మాట్లాడాడు ఆ కొడుకు చనిపోయిన వెంటనే అతని ఒప్పుకోలు వచ్చిందనీ, అరెస్టు అయ్యాడనీ మనం గుర్తుంచుకోవాలి నిరంతరం తన తండ్రి గురించి పత్రికల్లో చెడుగా రావటంతో మనస్తాపం చెంది అతని కొడుకు 2013లో ఆత్మహత్య చేసుకున్నాడు దీనితో అతని మనసు మారిపోయిందని సింఘాల్‌తో సన్నిహితంగా ఉన్నవాళ్ళు చెబుతారు అతను పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేసాడనీ, ప్రభుత్వం అర్థించినప్పటికీ తన రాజీనామాను వాపసు తీసుకోవడానికి నిరాకరించాడనీ అతనికి సంబంధించిన తాజా సమాచారం

తాను అప్రూవర్‌ను కాదలుచుకోలేదనీ, లేదా తనకు క్షమాభిక్ష కావాలని కోరడం లేదనీ, ఇతర సహ-ముద్దాయిల వలె తనపై కూడా విచారణ జరగాలనీ సింఘాల్ సిబిఐతో అనడం ఆసక్తికరమైన విషయం ఇతర వ్యక్తుల మనసులను చదవటం కష్టం ఆ వ్యక్తి గురించి మనకు తెలిసిన దాంతోనే వారి మనసులో ఏం జరుగుతోందో మనం ఊహించగలం అంతే అయితే సింఘాల్ సిబిఐని కోరిన వింత కోరికతో నాకు డిసెంబరు, 2010లో మా మధ్య జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది

జి ఎల్ సింఘాల్‌తో జరిగిన సంభాషణ రికార్డులోంచి ముఖ్య అంశాలు

ప్రశ్న *గుజరాత్‌లో మీ పోలీసులు చాలా నిందలు మోయవలసి ఉంటుంది కదా ముఖ్యంగా వివాదాల విషయంలో*

జవాబు ఇదో విచిత్రమైన పరిస్థితి ఎవరైనా మా వద్దకు ఒక ఫిర్యాదుతో వస్తే, మేమా ఫిర్యాదును పరిష్కరిస్తే ప్రభుత్వానికి కోపం, ప్రభుత్వాన్ని మెప్పిస్తే ఫిర్యాదుదారుకు కోపం మేం ఏం చేయగలం? పోలీసులం ఇరుక్కుపోయాం

ప్రశ్న: ఎన్‌కౌంటర్లలో ఉన్న పోలీసు అధికారుల్లో చాలా మంది కిందికులాల వాళ్ళు అందులో చాలామందిని రాజకీయ వ్యవస్థ ఉపయోగించుకొని వదిలేసింది.

జవాబు అవును పోలీసు డిపార్ట్‌మెంట్‌లో వున్న అందరినీ. అది చాలా బలమైన డిపార్ట్‌మెంట్.

ప్రశ్న: మత కల్లోలాలు రాష్ట్రాన్ని, పోలీసులను ఎలా ప్రభావితం చేశాయి?

జవాబు. చూడండి నేను కల్లోలాల సమయంలో గుజరాత్‌లోనే ఉన్నాను. నేనిక్కడ 1991 నుండి ఉన్నాను కాబట్టి నేను చాలా మతకల్లోలాలు చూసాను. మేం 1982లో, 83, 85, 87లో, అయోధ్య తర్వాత 1992లో కల్లోలాలను చూసాం.

అప్పుడంతా ముస్లింలే ఎక్కువ ఆధిపత్యం ప్రదర్శించేవారు 2002లో మాత్రం ఎక్కువ మంది ముస్లింలు చనిపోయారు అంతకుముందు సంవత్సరాలంతా ముస్లింలు హిందువులను చంపేవారు దాంతో ముస్లింలతో అన్నేళ్ళుగా దెబ్బ తిన్నదానికి ప్రతీకారంగా 2002లో జరిగింది ప్రపంచమంతా పెద్ద గగ్గోలు పెట్టింది హిందువులను చంపేసిన పరిస్థితిని వాళ్ళు చూడలేదు

ప్రశ్న: నేను రాజన్ ప్రియదర్శిని కలిశాను. ఆయన ఒక దళితుడనే స్పృహతో మాట్లాడమన్నారు కదా!

జవాబు నేను ఈ రాష్ట్రంలో సాధ్యమైన అందరు అధికారుల కింద విభిన్న స్థాయిల్లో పని చేసాను నేను ఈ అధికారుల దొంతరలో మధ్య స్థాయిలో ఉన్నా కాబట్టి అందరితో పని చేశా కానీ అతనిలాంటి వారెవ్వరినీ కలవలేదు అతడు చాలా నిజాయితీపరుడైన అధికారి పోలీసింగ్ గురించి అన్నీ తెలిసిన అధికారి అతను.

ప్రశ్న: ప్రభుత్వం తనను రాజీ పడమంది కానీ, తానెన్నడూ రాజీ పడలేదని అతనన్నాడు.

జవాబు. అవును. అతనెప్పుడూ రాజీ పడలేదు నాకతను బాగా తెలుసు

ప్రశ్న: రాజీ పడకుండా, వ్యవస్థలో ఒక భాగంగా ఉండటం అంత కష్టమైన పనా?

జవాబు: ఒకసారి నీవు రాజీ పడితే, ఇక ప్రతి విషయంలోనూ రాజీ పడాలి నీతో నువ్వు, నీ ఆలోచనలు, నీ చేతన – అన్నీ

ప్రశ్న: గుజరాత్‌లో ఏ అధికారికైనా తన చేతనను సజీవంగా ఉంచుకొని పనిచేయటం కష్టమంటారా?

జవాబు అవునవును చట్టం గురించిన అవగాహన ఉన్న సీనియర్ అధికారి ఎవరైనా రాజీపడిపోతే, ఇక అది కష్టం

ప్రశ్న: మీతో అదే జరిగిందా? మీరు ఎంత పోరాటం చేయవలసి వచ్చింది?

జవాబు: కొందరు కొంత ప్రయత్నించి కొంత పోరాటం చేస్తారు మరికొందరు తాము చనిపోయేంతవరకు పోరాటం చేస్తూనే వుంటారు. ప్రియదర్శి అటువంటి కోవలోనివాడు

ప్రశ్న: మరి మీ సంగతేంటి?

జవాబు. నేను కూడా పోరాడాను

ప్రశ్న: మరి ఈ వ్యవస్థ మీకు మద్దతు ఇస్తుందా?

జవాబు: లేదు ఏ మాత్రం ఇవ్వదు. నేను ఒక దళితుణ్ణి కానీ ఒక బ్రాహ్మణుడు చేయగలిగినవన్నీ చేయగలుగుతాను. నాకు నా మతం గురించి వాళ్ళకంటే ఎక్కువ తెలుసు. కానీ జనాలకు ఈ విషయం అర్థం కాదు నేనొక దళిత కుటుంబంలో పుట్టానంటే అది నా తప్పా?

ప్రశ్న: వాళ్ళకు ఇంత సేవ చేసినా, మీ కులం కారణంగా మీకు ప్రమోషన్లు ఇవ్వకపోవటమంటూ జరిగిందా?

జవాబు. చాలా సార్లు. ఈ వివక్ష చాలా రాష్ట్రాల్లో ఊడలు దిగి ఉన్నట్టే గుజరాత్ లోనూ ఉంది. ఈ బ్రాహ్మణులు, కాయస్థులు ఒక దళితుణ్ణో, ఓ.బి సి వారినో తమ జూనియర్‌గా ఉంచుకోరు.

ప్రశ్న: మీ సీనియర్ కూడా దళితుడేనా?

జవాబు· కాదు కానీ నేను ఎలాగో ఓలా నెట్టుకొస్తాను నేను లేకపోతే వాళ్ళకి నడవదు నేను వాళ్ళకోసం టెర్రరిజం కేసులను ఎదుర్కొన్నాను వాళ్ళు కూడా వాళ్ళు చేసేది చేస్తుంటారు కానీ, కొన్నిసార్లు కానిస్టేబుళ్ళు చేయగలిగే పనికి నన్ను పంపిస్తుంటారు.

ప్రశ్న: మీరు ఏదో వివాదంలో కూడా చిక్కుకొని ఉన్నారని ఉష (ఉషా రాడా, ఈమె గురించి 5వ అధ్యాయంలో మరిన్ని వివరాలు చూద్దాం) అన్నది

జవాబు. 2004లో మేము నలుగురిని ఎన్‌కౌంటర్ చేసాము ఇద్దరు పాకిస్తానీలు, ఇద్దరు ముంబైకి చెందిన వారు. వారిలో ఒకరు అమ్మాయి పేరు ఇష్రత్ అది చాలా పేరుపొందిన కేసు. ఆ ఎన్‌కౌంటర్ నిజమైనదా, బూటకమైనదా

అనేది దర్యాప్తు చేయవలసిందిగా హైకోర్టు ఆదేశాలిచ్చింది

ప్రశ్న  మరి అది బూటకమైనదా? మీరు అందులో ఎందుకున్నారు?

జవాబు: ఎందుకంటే ఆ ఎన్‌కౌంటర్‌లో ఉన్నాను కాబట్టి

ప్రశ్న: కానీ మీరు అందులో ఎందుకున్నారు?

జవాబు  చూడండి ఈ మానవ హక్కుల కమిషన్లు ఇదే చేస్తుంటాయి. కొన్ని కేసులు కఠినమైనవి వాటితో భిన్నంగానే వ్యవహరించాలి 9/11 తరువాత అమెరికా ఏం చేసిందో చూడండి. గ్వాంటనామో అనే చోట వాళ్ళను నిర్బంధించి చిత్రహింసలు పెట్టారు. అది సరియైందే కదా అందరినీ చిత్రహింసలు పెట్టలేదు ఒక శ్లాతి శాతం మంది నిర్దోషులను కూడా చిత్రహింసలు పెట్టి ఉండవచ్చు. ఒక శాతం తప్పులు ఉండొచ్చు జాతిని, దేశాన్ని కాపాడటానికి ఇలా చేయడం అవసరం.

ప్రశ్న  వీళ్ళు ఎవరు? లష్కర్ టెర్రరిస్టులా?

జవాబు: అవును

ప్రశ్న: ఆ అమ్మాయి కూడానా? ఇష్రత్?

జవాబు: ఆమె కాదు, కానీ అదే ఘటనలో ఆమె చనిపోయింది ఆమె టెర్రరిస్టు అయి ఉండవచ్చు, కాక పోవచ్చు లేదా ఆమెను ఒక కవర్‌గా మాత్రమే ఉపయోగించుకొని ఉండొచ్చు

ప్రశ్న: మీరు, వంజారా, పాండియన్, అమిన్, పర్మారే ఇంకా ఇతరుల్లో చాలా మంది కింది కులాల వాళ్ళు మీరెవ్వరేం చేసినా ప్రభుత్వం తరఫున చేసారు అంటే మిమ్మల్ని వాడుకొని వదిలేసినట్టా?

జవాబు· అవును మేమందరం కింది కులాల వాళ్ళమే ప్రభుత్వం ఈ విషయం ఆలోచించదు. మేం వాళ్ళ మాట జవదాటక పోవడానికి అలవాటు పడ్డామని, వాళ్ళ అవసరాలను తీర్చడానికి సిద్ధంగా ఉంటామని వాళ్ళు అనుకుంటారు ప్రతి ప్రభుత్వోద్యోగి అతడు ఏం చేసినా, ప్రభుత్వానికే పని చేస్తాడు. అయినా ప్రభుత్వం కానీ, ప్రజలు కానీ నిన్ను గుర్తించరు వంజారా ఏం చేశాడనీ! అయినా ఎవ్వరూ అతని పక్షాన నిలబడలేదు

ప్రశ్న  కానీ సర్, మీరందరూ ఏం చేసినా, ప్రభుత్వం, రాజకీయ అధినేతలు చెప్పడం వల్ల చేశారు. మరి వాళ్ళెందుకు. .?

జవాబు· ఈ వ్యవస్థతో పాటు ఉండాలంటే, రాజీపడాల్సి వస్తుంది

ప్రశ్న· కానీ ప్రియదర్శి (సింఘాల్ సీనియర్) ప్రభుత్వానికి సన్నిహితంగా లేడా?

జవాబు అతడు ప్రభుత్వానికి సన్నిహితంగానే ఉండేవాడు కానీ ఏదైనా తప్పుడు పని చేయమని వాళ్ళు అతన్ని అడిగినప్పుడల్లా అతను నిరాకరించేవాడు.

ప్రశ్న అవును పాండియన్‌తో కలిసి ఒక ఎన్‌కౌంటర్ చేయమని వాళ్ళు అతన్ని అడిగారని అతడు చెప్పాడు. అతడు నిరాకరించాడా?

జవాబు: పాండియన్ కూడా కటకటాల వెనుక ఉన్నాడు కానీ నాకు అతని నేపథ్యం గురించి ఎక్కువగా తెలియదు

ప్రశ్న అతడు హోంమంత్రితో అంత సన్నిహితం ఎలా కాగలిగాడు?

జవాబు· అతడు ఏటీఎస్ లోకి రాకముందు ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేసేవాడు

ప్రశ్న· ముఖ్యమంత్రి, హోంమంత్రి ఇద్దరూ ఇప్పుడు తమ విషయాలు తామే చూసుకుంటున్నారని తెలుసు ఇప్పుడు మీకు విషయాలు కొంచెం సులువయినాయా?

జవాబు· కొన్ని విషయాలు మా చేతిలో లేవు మేం ఈ వ్యవస్థ కోసమే చేశాం

ప్రశ్న మీరు ఇంకా విచారణ నెదుర్కొంటున్నారా? లేక అది ముగిసినట్లేనా?

జవాబు కేసు నడుస్తూనే ఉంది.

ప్రశ్న రాజ్యం మీకు సాయం చేస్తోందా? లేదా?

జవాబు· చూడండి అది కాంగ్రెసైనా సరే, బిజెపి ఐనా సరే రాజకీయ పార్టీలు రాజకీయ పార్టీలే. వాళ్ళు మొదట తమకు ఏ లాభం కలుగుతుందో చూస్తారు. ఏ పరిస్థితుల నుండి తాము ఏం రాబట్టుకోవాలో చూస్తారు. మా కేసులో వాళ్ళు సాయం చేస్తున్నారు. కానీ దాని వల్ల తమకు ఎంత లాభిస్తుంది లేదా లాభించదు అనీ, అది ఒకవేళ తిరగబెడితే దాన్నుండి కూడా తాము ఎట్లా లబ్ధి పొందగలమనీ వాళ్ళు చూస్తున్నారు

మా కేసును దర్యాప్తు చేస్తున్న వాళ్ళను చూడండి ఢిల్లీలోని స్పెషల్ సెల్‌కు జాయింట్ కమిషనర్‌గా ఉన్న కర్నైయిల్ సింగ్ (ప్రస్తుతం మిజోరాం కు ట్రాన్స్‌ఫర్ అయ్యాడు) ఆధ్వర్యంలో 44 ఎన్‌కౌంటర్లు అయినాయి అతడు ప్రస్తుతం సిట్‌కి అధ్యక్షుడు మరో అధికారి సతీష్ వర్మ. అతను తాను మానవ హక్కులను గౌరవించానని చెప్పుకుంటాడు. కానీ ఆయన ఓ పది ఎన్‌కౌంటర్లు చేశాడు. కానీ తన చేతికి ఏ మట్టీ అంటలేదన్నట్టుగా అతను చెప్పుకుంటుంటాడు

ప్రశ్న ఇది ఎటు వెళ్ళి ఎటు ముగుస్తుంది మరి?

జవాబు చూద్దాం ఏమీ కాకపోవచ్చు

ప్రశ్న: మీరు, ఇంకా ఇతర అధికారులు ఎంతోమంది సోహ్రాబుద్దీన్ కేసులో ఉన్నారు కదా?

జవాబు: అవును

ప్రశ్న: నేను గీతా జోహ్రీని కలిసాను.

జవాబు: అవును. ఆమె చాలా బాగా దర్యాప్తు చేసింది. ఆ తర్వాత రజనీష్ రాయ్ కూడా. వాళ్ళు బాగా పని చేసారు. వాళ్ళే స్వయంగా పదమూడు మందిని అరెస్టు చేసారు

ప్రశ్న: ఈ అమిత్‌షా సంగతి ఏంటి? నేను మీ ఆఫీసర్ల గురించి కూడా విన్నాను . . అంటే ఎన్‌కౌంటర్లతో ముడిపడి ఉన్న అధికారుల, రాజకీయ నాయకుల ముఠా ఒకటి ఉంది. నేను చాలా మంది మంత్రులను కలవడం వల్ల నాకీ భావం కలిగింది.

జవాబు: ముఖ్యమంత్రి కూడా అందులో భాగం. మంత్రులందరూ రబ్బరు స్టాంపులు మాత్రమే అన్ని నిర్ణయాలను ముఖ్యమంత్రే తీసుకుంటాడు మంత్రులు చేసే ఏ నిర్ణయానికైనా అతని అనుమతి తీసుకోవలసిందే

ప్రశ్న: మరి అతనికి ఏ మట్టి అంటలేదెందుకు? అతను ఎలా తప్పించుకో గలుగుతున్నాడు? ఈ కేసులో కూడా అతడిపై నేరారోపణ ఎందుకు జరగలేదు?

జవాబు: ఎందుకంటే అతడు ప్రత్యక్షంగా రంగంలోకి రాడు కాబట్టి అతడు బ్యూరాక్రాట్లకు ఆదేశాలిస్తాడు.

ప్రశ్న: అవే ప్రమాణాల ప్రకారమైనా, మీ కేసులో అమిత్ షాను అరెస్టు చేశారంటే, ముఖ్యమంత్రిని కూడా అరెస్టు చేయవలసింది

జవాబు: అవును.

2007లో సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ల కేసులో అధికారులను అరెస్టు చేసిన తర్వాత సోనియా గాంధీ ఇక్కడకు వచ్చినప్పుడు అధికారులను "మౌత్ కా సౌదాగర్" (మృత్యు బేహారులు) అని అన్నది. దీని తర్వాత మోదీ ప్రతి సమావేశంలోనూ ఈ విషయాన్ని లేవనెత్తాడు "మౌత్ కా సౌదాగర్‌లా"? సోహ్రాబుద్దీన్ ఎవరు? అతణ్ణి చంపితే మంచి జరిగినట్టా, చెడు జరిగినట్టా?' అని ప్రతి బహిరంగ సభలోనూ మాట్లాడాడు దాని తర్వాత అతనికి పెద్ద ఎత్తున మెజారిటీ లభించింది. అంటే అతను కోరుకున్నది అతనికి లభించింది.

ప్రశ్న: మరి ఏ అధికారుల ద్వారా అతను ఇది చేయించాడో, వాళ్ళకు అతనిప్పుడు సాయం చేయటం లేదా?

జవాబు. లేదు వాళ్ళంతా ఇప్పుడు జైల్లో ఉన్నారు

ప్రశ్న అతడు మిమ్మల్నెప్పుడైనా ఎన్‌కౌంటర్ల గురించి ప్రశ్నించాడా?

జవాబు: లేదు. ఎన్నడూ అడగలేదు. చూడు. అతను అన్నింటి నుంచి లాభం పొందాలని చూస్తాడు. కల్లోలాలు జరిగాయి. ముస్లింలను చంపారు. లాభం పొందాడు వీటినుండి కూడా (అట్లే) లాభం పొందాడు

ప్రశ్న: కానీ షా సాహెబ్ మళ్ళీ ఇప్పుడు హోం శాఖకు వస్తాడా?

జవాబు లేదు అతను రాలేదు ఎందుకంటే ముఖ్యమంత్రికి అతనంటే భయం హోం శాఖలో అతడు చాలా పాపులర్ అయ్యాడు. అతడికి ప్రభుత్వం బలహీనతలు తెలుసు ఏ హోంశాఖ మంత్రికి కూడా అన్నీ తెలిసీ అదే విభాగంలో కొనసాగటం ముఖ్యమంత్రికి ఇష్టముండదు

ప్రశ్న. ఇప్పుడు ముఖ్యమంత్రికి, గృహశాఖ మంత్రికి పడటం లేదా?

జవాబు· లేదు మీరన్నట్టు ఈ ముఖ్యమంత్రి అవకాశవాది. తన పని కానిచ్చేసు కుంటాడు

ప్రశ్న· తన పని అంటే తన మురికి పని అనేగా అర్థం

జవాబు. అవును

ప్రశ్న· మీరు ఇదికాక ఇంకా ఎన్ని ఎన్‌కౌంటర్లు చేసి ఉంటారు?

జవాబు: ఆ .. ఒక పది దాకా ఉండొచ్చేమో.

ప్రశ్న: అన్నీ ప్రముఖమైనవే కావచ్చు. నేను తెలుసుకోవచ్చా?

జవాబు లేదు, లేదు.

గుజరాత్‌లోని అన్ని దినపత్రికల్లోనూ బూటకపు ఎన్‌కౌంటర్ల గురించిన దర్యాప్తు విషయాలే శీర్ష స్థానాన్ని ఆక్రమిస్తూ ఉండటం వల్ల ఎటువంటి అనుమానం రేకెత్తించకుండా నేను సింఘాల్‌ను ప్రశ్నలడగగలిగాను. రోజులు గడిచేకొద్దీ నేను సింఘాల్‌ను కలుస్తూ ఉంటే అతనిలో ఒక అపరాధ భావన కనిపించింది. నాకు అతని పట్ల ఒక సానుభూతిలాంటిది కలిగింది అతడు నిజంగానే వ్యవస్థకు బలియైన అమాయకుడా? నేను అలాగే నమ్మాలని అతను అనుకున్నాడు.

తన పరిస్థితితో పోలికలు తేవడం కోసం అతడు సినిమాల్లోని విభిన్న పాత్రలతో తన పోలిక తెచ్చేవాడు లేదా ఎన్నో ఉదాహరణలు చెప్పేవాడు కొన్ని సార్లు భగవద్గీత శ్లోకాల వైపు సంభాషణ తీసుకెళ్లి తాను ఎట్లా మతం పై ఆధార పడి ఉన్నాడో

చెప్పేవాడు మేము ఓషో గురించి, సిగరెట్లు తాగే నా అలవాటు గురించి మాట్లాడే వాళ్ళం. 'మీకు వీలైతే ఆ అలవాటు మానేయండి మంచిది కాదు' అన్నాడు అతడు నాతో ఒక ఆత్మీయమైన స్నేహం పెంచుకున్నాడు. ఒక లోపల వ్యక్తి దృక్పథంతో అతని గురించి న్యాయ నిర్ణేతగా వ్యవహరించని బయటి వ్యక్తిని నేను

ఇతడు ఎటువంటి వ్యక్తియో నేను సరియైన అంచనాకు రాలేక పోయాను నేను హాస్టల్‌కు తిరిగి వచ్చిన ఒకానొక రోజు తిన్నగా ప్రజాటెలిఫోన్ వద్దకు వెళ్ళాను నాకు చాలా తికమకగా అనిపించి అమ్మను అడుగుదామనుకున్నా నాకు సింఘాల్ పట్ల సానుభూతి కలగ సాగింది కానీ అలా కలగడానికి వీల్లేదు నేను అంతకు ముందు కలిసిన అధికార్లు తాము నిర్మమంగా చేసిన హత్యలు, ఎన్‌కౌంటర్ల గురించి గొప్పలు చెప్పుకుంటున్నట్టుగా ఇతని ప్రవర్తన లేదు కానీ ఇటువంటి నిర్మమమైన హత్యలు చేయడంలో ఎవరైనా భాగస్వాములైనాగానీ, నిజాన్ని దాచి ఉంచాలని అనుకున్నా గానీ అవేవీ ఏ రకంగానూ న్యాయసంగతం కాదు అయితే మా అమ్మ చెప్పినట్టు తమ ప్రవర్తనకు, చర్యలకు సమర్ధనగా ఏవేవో కారణాలు చెప్పేవాళ్లు చాలా మంది ఉంటారు నీవు చేయవలసినదేమిటంటే- వాళ్ళు వాస్తవంగా ఏం చేశారనేది చూడాలి అప్పుడు వాళ్ళు తాము తమ సమర్ధనలో చెప్పుతున్నదాంట్లో ఏమైనా బలముందో లేదో నీకర్థమవుతుంది

ఏళ్ల తరబడి నోరు విప్పకుండా వుండడం వల్ల నేరంలో ఇతరులకు ఎంత భాగస్వామ్యం ఉందో సింఘాల్‌కు కూడా అంత భాగస్వామ్యం ఉన్నట్టే అయితే ఇటువంటి అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఎంత బాహాటంగా వాడుకున్నదనేది మాత్రం గుర్తించకుండా ఉండలేము ఇలా వాడుకుని వదిలేసే పాలసీ గురించి నేను పెట్టుకెళ్లిన రహస్య కెమెరా ఎదురుగా సింఘాల్ చెప్పిన విషయం గురించే కొన్ని ఏళ్ల తర్వాత మరో ఉన్నత అధికారి డి.జి. వంజారా కూడా ఫిర్యాదు చేశాడు. మోదీ హయాంలో అత్యున్నత అధికారుల్లో ఒకరైన వంజారా బూటకపు ఎన్‌కౌంటర్లలో తన పాత్ర కారణంగా కటకటాల వెనక ఉన్నాడు సింఘాల్ చెప్పిన విషయాలన్నీ అతడు రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన తన ఉత్తరంలో రాశాడు.[6] తన వంటి అధికారులను అమిత్ షా వంటి మంత్రులు తమ లాలసను పూర్తిచేసుకోవటానికై వాడుకుంటున్నారననీ, తాను దేవుడిగా చూసిన ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసఘాతుకానికి పాల్పడ్డాడనీ అతను అన్నాడు. (రాష్ట్ర ఐ పి ఎస్. క్యాడర్ నుండి ఆ తర్వాత రాజీనామా చేసిన) వంజారా ప్రకటన వెనుక ఏదైనా రాజకీయ ఆకాంక్ష ఉందా అనేది అస్పష్టంగా ఉంది అయితే సింఘాల్, వంజారా వంటి ఎంతో మంది అధికారులను ఇప్పుడు

గుజరాత్‌ను టెర్రర్-ముక్త రాష్ట్రమని ప్రకటించుకోవడం కోసం వాడుకున్నారు

సింఘాల్ ఏదో మినహాయింపు కాదు. అతడివంటి వారే సాధారణం ఈ విషయాన్ని నేను ఆ తర్వాత, రాబోయే రోజుల్లో అతడి సీనియర్ రాజన్ ప్రియదర్శి నుండి, రాష్ట్ర పూర్వ పోలీసు కమీషనర్ నుండి, ఇతర ఉన్నత అధికారులనుండి తెలుసుకున్నాను నిజం గురించిన వేట ఇప్పుడే మొదలైంది.

---

2 *http www tehelka com/2011/12/dead-man-talkıng/*

3 *http //www tehalka com/2010/07/breakthrough-expose-so-why-ıs-narendra-modı-protectıng-amıt-shah/)*

4 *http //www tehelka com/2013/07/tehelka-expose-valıdated-cbı-says-ıshrat-jahan-encounter-fake/*

5 *http //www outlookındıa com/newswıre/story/ıshrat-jahan-encounter-fake-cbı-chargesheet/802685*

6 *http //tımesofindıa ındıatımes com/ındıa/DG-Vanzaras-letter-to-chıef secretary-gujarat-government/artıcleshow/47201125 cms*

# నాల్గవ అధ్యాయం

***రాజన్ ప్రియదర్శి:***

కార్పొరేట్ భాషలో 'టేక్ అవే' (take away) అనే ఒక పదబంధం ఉంది. అంటే ఏదైనా ఒక సమావేశం కానీ, సంభాషణ కానీ అయ్యాక తీసుకెళ్ళే ఏదైనా లాభకరమైన దాన్ని 'టేక్ అవే' అంటారు 'రాజన్ ప్రియదర్శి' అట్లా నాకు అనుకోకుండా లభించిన ఒక 'టేక్ అవే'. రిటైరైన ఈ అధికారి నా పరిశోధనకు ఎంతగా తోడ్పడ్డాడంటే అది ఏదో దైవ ప్రసాదం అనేలాంటిది అతడి జూనియర్ గిరీష్ సింఘాల్ అతని పేరు ఎత్తేదాకా నేను రాజన్ ప్రియదర్శి అనే పోలీసు అధికారి పేరు కూడా వినలేదనేది నిజం నేను విలేఖరిగా గుజరాత్ నుండి పెద్ద ఎత్తునే రిపోర్టులు రాశాను కాబట్టి నాకు దాదాపు పోలీసు అధికారులందరూ తెలుసు అని అనుకున్నా. నేను చాలా ఎక్కువమందిని ఏం కలవలేదు కానీ, పోలీసు విభాగం గురించి న్యూస్ రిపోర్టులు, ఇంటర్వ్యూలు చేయడం వల్ల అవసరమైన వాళ్లందరి గురించి నా వద్ద తగినంత సమాచారం ఉండేది

అందుకే సింఘాల్ నేను ఎన్నడూ వినని ఈయన పేరును పేర్కొన్నప్పుడు నేను ఆశ్చర్యపోయాను నేను అతన్ని కలవటానికి వెళ్ళే ముందు అతని గురించిన ఏ పరిశోధనా నేను చేయలేదు సింఘాల్ మనసులో ఎటువంటి అనుమానం రేకెత్తించకుండా ఉండటానికి, అతని సలహా ప్రకారమే నా పనిలో ముందుకు సాగుతున్నానని అతనికి దిలాసా ఇవ్వటానికి మాత్రమే నేను ఇతన్ని కలిసాను నేను ఇతర పోలీసు అధికారులను కూడా కలుస్తున్నాననీ, ముఖ్యంగా వార్తల్లో లేనివారిని, ఎటువంటి వివాదం లేనివారిని కూడా నేను కలుస్తున్నానని సింఘాల్‌కు నాపై విశ్వాసం కలగటానికే కలిసాను. రాజన్ ప్రియదర్శికి సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం ఉంది. 2004 జూన్‌లో టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను ఇంత పెద్ద అధికారియైనప్పటికీ తన గ్రామంలో మాత్రం తనను ఇప్పటికీ అస్పృశ్యుడిగా చూస్తారని చెప్పాడు

టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్ట్‌లో ఇలా ఉందింది·

*విభిన్న రంగాల ప్రజలు తమ వివిధ సమస్యలతో చేతులు జోడించి అతని వద్దకు వస్తారు కానీ అదే ప్రియదర్శి, దేహ్గాం తాలూకాలోని తన స్వగ్రామం కదగ్రాకు వెళ్లినప్పుడు దృశ్యం మారిపోతుంది.*

*ఈ సీనియర్ పోలీసు అధికారి ఇప్పటికీ ఉన్నత కులాలున్న వీధిలో ఇల్లు కొనలేదు ఇప్పటికీ అతడి ఇల్లు కదగ్రాలోని 'దళిత వాడ'లోనే ఉంది ప్రియదర్శి ఈ విషయంపై మాట్లాడటానికి ఇష్టపడకపోయినప్పటికీ, గత సంవత్సరం వరకు గ్రామ మంగలి కూడా దళిత వినియోగదార్లను రానిచ్చేవాడు కాదని అంటారు*

సినిమా తీసే కోణం నుండి చూసినప్పుడు టెక్నికల్‌గా నా పని సులువైంది. దానికి తోడు, నా పరిశోధన పూర్తి అయ్యేసరికి, రాజ్య యంత్రాంగం వాడుకొని, దుర్వ్యవహారం చేసిన అధికారులందరూ వెనుకబడిన తరగతులకు చెందిన వారని నిరూపించడానికి తగినన్ని ఆధారాలున్నాయి. అయినా నేను చాలా ముఖ్యమైనదొకటి మిస్ అయ్యాను గుజరాత్ సి ఐ.డి. బూటకపు ఎన్‌కౌంటర్లపై 2007లో విచారణ ప్రారంభించినప్పుడు రాజన్ ప్రియదర్శి ఏ.టి.ఎస్ డైరెక్టర్ జనరల్. అంతేకాదు 2002 కల్లోలాల సమయంలో ఇతను రాజ్‌కోట్ ఐ జి గా చాలా ప్రముఖమైన పదవిలో ఉన్నాడు

నేను, మైక్ రాజన్ ప్రియదర్శిని కలిసాము. అరవైలలో ఉన్న ఈ వ్యక్తిని మొదటిసారి కలిసిన సమావేశాన్ని మేం ఎప్పటికీ మరచిపోలేము అహ్మదాబాద్ లోని నరోడా–పాటియా ప్రాంతంలోని మధ్యతరగతి ఏరియాలో ఇతనికి, ఒక అంతస్తు భవనం ఉంది మాయా కొడ్నానీ ఇదే ప్రాంతపు ఎమ్మెల్యే మత కల్లోలాల్లో అత్యంత క్రూరమైన దాడులు జరిగి, ఎక్కువ మంది చనిపోయినది కూడా ఈ ప్రాంతంలోనే.

ప్రియదర్శి ఇంటిని కనుక్కోవడం మాకు బాగానే కష్టమైంది. ఏ టి.ఎస్ పూర్వ డైరెక్టర్, గత ముప్పై ఏళ్లుగా గుజరాత్ అంతటా ఎన్నో ముఖ్యమైన పదవులు నిర్వహించిన పోలీసు అధికారి ఉండే స్థలంలాగా లేదు అది. ఒక ప్రభుత్వ విద్యాలయాన్ని, ఎన్నో నాలాలను దాటుకుంటూ అతని ఇంటికి చేరుకోవాల్సి వచ్చింది. చాలా మందికి అతడు అక్కడ ఉంటాడని తెలియదు ఇరుగు–పొరుగు మాత్రం తన ఫోటోనే ఫ్రేము కట్టించుకొని ఇంటి ద్వారానికి వేళ్ళాడదీసిన పోలీసాయనగా అతన్ని గుర్తుపట్టారు.

ప్రియదర్శి మా కోసం ఆతృతతో ఎదురు చూస్తున్నాడు మా టాక్సీ ఆ సందు మలుపులోకి ప్రవేశించగానే మాకేసి చేయి ఊపాడు. 'స్వాగతం' అంటూ అతను తన ఇంటి మొదటి అంతస్తు బాల్కనీ నుండి మమ్మల్ని ఆహ్వానించాడు ఆ ఇంటి వివరాలను నిశితంగా పరిశీలిస్తూ మేము అతని ఇంట్లోకి ప్రవేశించాము ప్రవేశద్వారం వద్దనే ప్రియదర్శి తన కెరీర్‌లో చేపట్టిన విభిన్న పదవుల వివరాలతో ఒక ఫలకం ఉంది మేం ప్రవేశించడంతోనే, గ్రామంలోని మల్లయోధుడిలాగా మీసాలు, తెల్లబడుతున్న గడ్డంతో సందడిగా ఉన్న పెద్దమనిషి మాతో కరచాలనం చేసాడు. రెండు నూలు శాలువాలు, పెన్నులు, నోట్ పుస్తకాలు మాకు ఇచ్చాడు

ఆ తరువాతి నిముషాల్లో జరిగినది ఎంతో వినోదాత్మకమైనది ప్రియదర్శికి మైక్ వెంటనే నచ్చేసాడు. నిమ్మకాయ రసం వచ్చింది మమ్మల్ని ఎంత సాదరంగా స్వాగతించారా అని మేం ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోకముందే ఆ గదిలోకి ఒక ముప్ఫైలలో ఉన్న వ్యక్తి, పదేళ్ళ పిల్లవాడు వచ్చారు. పిల్లవాడి చేతిలో ఒక డిజిటల్ కెమెరా ఉంది. వాళ్ళు ప్రియదర్శి కొడుకు, మనుమలు 'విదేశీ ఫిల్మ్ మేకర్లు మా ఇంటికి ఎప్పుడూ రారు కదా! ఇది మాకెంతో గౌరవప్రదమైన విషయం 'ఒక్క ఫోటో ప్లీజ్' అని మమ్మల్ని అడిగారు.

అజ్ఞాతంగా ఉంటున్నప్పుడు బహిరంగంగా అందరి దృష్టిలో పడాలనికానీ, అజ్ఞాత జీవితానికి సంబంధించిన గుర్తులు వదలాలని కానీ కోరుకోవు కానీ అప్పుడున్న పరిస్థితిలో ఫోటోలు వద్దనడం అంత సరిగా ఉండకపోయేది. పైగా ప్రవేశ ద్వారం వద్ద మేం చూసిన ఫలకంలో ప్రియదర్శి ఏయే స్థానాల్లో పనిచేసాడో చూశాక అతడు తప్పక ఉపయోగపడతాడనిపించింది. నేను, మైక్ ఆ కుర్రాడి కోరిక మన్నించి ఓ రెండు ఫోటోలు దిగాక, మమ్మల్ని ముందు గదిలోకి తీసుకెళ్ళారు ఆ గదిలో ప్రియదర్శి సహాయ మంత్రులతో, కేబినెట్ మంత్రులతో, రాజీవ్ గాంధీతో కలిసి దిగిన ఫోటోలు ఉన్నాయి

'మా ఫోటోలు ఫ్రేం కట్టిపెట్టుకుంటారా, సర్?" అని నేను చిలిపిగా అడిగాను మా ఫోటోలతో ఏం చేయదలుచుకున్నారనే కుతూహలం కూడా ఉండింది తానొక సమాచార పత్రిక అనుబంధాన్ని స్థానికంగా నెలకొకసారి ముద్రించి తనకు పరిచయమున్న వారికి ఉచితంగా పంచిపెడతానని చెప్పాడు. దాంతో నాకు ఊరట కలిగింది మేం గుజరాత్‌లో మా ఫిల్మ్ కోసం కలవదలుచుకున్న వారందరినీ కలిసాకే మా ఫోటోలను వాడుకుంటాననే హామీ తీసుకొని ఇక ఆ విషయాన్ని వదిలేసాం 'మేం అనవసరంగా దృష్టిని ఆకర్షించదలుచుకోలేదు సర్! కొంచెం అందుకే " అని నేను కోరితే ఆయన ఎంతో మర్యాదగా ఒప్పుకున్నాడు

సంభాషణంతా ఏకపక్షంగానే నడిచింది

ఒక గంట సమయంలో ప్రియదర్శి తన గురించి ఎంత చెప్పాడంటే అతడి సంక్షిప్త జీవిత చరిత్ర రాయొచ్చని మాకనిపించింది ఏ కోణంలో చూసినా అతడు భలే మనిషి ఒక సినిమాలోనో, నవలలోనో ఎదురయ్యే రకం. కానీ, గుజరాత్‌లో రాజ్య యంత్రాంగం ఎట్లా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి నాకు ఈ సమావేశం బాగా ఉపయోగపడింది అతడు గుజరాత్ సరిహద్దు రేంజ్ ఐ జి అయినప్పటికీ గ్రామ మంగలి క్షవరం చేయటానికి నిరాకరించాడనీ, అతడు దళితవాడలోనే తన నివాసమేర్పరచుకోవలసి వచ్చిందని చెప్పి మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేశాడు దళిత ముద్ర అతడి వెన్నంటే ఉన్నది గుజరాత్ పోలీసు బలగంలో అతడు పని చేసిన కాలంలో ఎన్నోసార్లు తన సీనియర్లకు సంబంధించిన తప్పుడు పనులను చేయమని బలవంతపెట్టేవారు కానీ అతడు ఆ ఆదేశాలు శిరసావహించడానికి నిరాకరించేవాడు 'చాలా విచిత్రంగా ఉండేది. నీవు దళిత్‌వైతే ఆఫీసులో ఎవరైనా ఏమైనా అనేయ్యొచ్చు ఏ మాత్రం గౌరవం ఉండేది కాదు. పథకం ప్రకారం ఎవరినైనా హత్య చేయమని ఒక దళిత పోలీసు అధికారిని అడగొచ్చు ఎందుకంటే (వాళ్ళ దృష్టిలో) అతడికేమీ ఆత్మగౌరవం కానీ, ఆదర్శాలు కానీ ఉండవు గుజరాత్ పోలీస్‌లోని అగ్రకులాలవారిపట్లే అందరికీ సదభిప్రాయం '

మా సమావేశం ముందుకు సాగేకొద్దీ, ప్రియదర్శి కొంచెం ఆందోళనపడ్డట్టుగా అనిపించాడు అయితే ఆ పాటికే అతడు చాలా చెప్పేసాడు. మా మూడవ సమావేశానికి నేనొక్కదాన్నే వెళ్ళాను మేం ఫిల్మ్ షూట్ చేయడానికి మాయా కొడ్నానీ ఆఫీసును పరిశీలించడం కోసం మైక్‌ను ఆ రోజుకు వదిలేసా 'మనం నిజంగానే ఫిల్మ్ మేకర్లమని వాళ్ళు నమ్మేందుకు మనం ఏమైనా చేస్తే మంచిదేమో' అని ఆ సలహా నిజానికి మైక్ ఇచ్చిందే కొడ్నానీ స్టాఫ్ మెంబర్లు సంతోషంగా మైక్‌కు ఇల్లంతా చూపించారు నాకు వాళ్ళింట్లో ఏదైనా ప్రత్యేకమైన స్థలం కావాలా అనీ, ఆదివారం లంచ్‌కు రాగలుగుతానా అనీ సాయంకాలం ఆమె వద్ద నుండి నాకో మెస్సేజ్ వచ్చింది: నేను వెంటనే 'ఓ.కే.' అని మెస్సేజ్ పెట్టా.

నేను మరుసటి రోజు ప్రియదర్శిని కలిసేనాటికి అతడు తాను ప్రచురించిన న్యూస్ పేపర్ల కాపీలను బయటకు తీసాడు 'వీటిలో నీకు ఏది కావలిస్తే అవి తీసుకో నా గురించి కావలసిన సమాచారమంతా ఇప్పుడు నీ దగ్గర ఉంది షూటింగ్ ఎప్పుడు ప్రారంభిస్తారు?' అని అన్నాడు. అతడు కొంత ఆందోళనగా ఉన్నాడని అతని శరీర కవళికలను చూస్తే తెలుస్తుంది అతడు చాలా సమాచారం బయటపెట్టి

ఉన్నాడు అతడు రాష్ట్ర ఎ.టి.ఎస్. ప్రముఖుడిగా ఉన్నప్పుడు జరిగిన ఘటనల వివరాలు చాలా చెప్పాడు. గృహ మంత్రి అమిత్ షాతో అతడి బంగళాలో అర్ధరాత్రి వరకు జరిపిన మంతనాలు, కస్టడీలో వున్న ఒక వ్యక్తిని ఎట్లా అమిత్ షా చంపెయ్యమన్నాడనే విషయం వంటివన్నీ నాతో మాట్లాడాడు నేను రాజన్ ప్రియదర్శిని కలిసి వచ్చిన ప్రతిసారీ నాకు మరింత సమాచారం దొరికిందనిపించింది.

ప్రశ్న: *మీ ముఖ్యమంత్రి నరేంద్రమోదీ ఇక్కడ గుజరాత్ లో చాలా పాపులర్ కదా!*

జవాబు: *అవును. అందరినీ అతడు వెర్రివాళ్లను చేస్తాడు. ప్రజలు వెర్రివాళ్లు అవుతారు*

ప్రశ్న: *అడిషనల్ డి.జి.గా అతడి కింద పనిచేయటం మీకు చాలా కష్టంగా ఉండి ఉంటుంది కదా*

జవాబు: *నాతో చట్టవ్యతిరేకంగా ఏదైనా చేయించే ధైర్యం వాళ్లెవ్వరికీ లేదు*

ప్రశ్న *ఇక్కడ చట్టాన్ని ఉల్లంఘించడమనేది చాలా ఎక్కువ కదా! నిజాయితీపరులైన అధికారులే తక్కువ*

జవాబు: *కొద్దిమంది ఉన్నారు ముస్లింలను (రాష్ట్రవ్యాప్తంగా) చంపించడంలో ఈ నరేంద్ర మోదీదే బాధ్యత*

ప్రశ్న: *పోలీసులు కూడా ప్రభుత్వం ఏం చెబితే అదే చేస్తారని విన్నా*

జవాబు: *ఈ పి.సి. పాండే లాంటి వాళ్ళందరూ అంతే అంతా వీళ్ళ సమక్షంలోనే జరిగింది.*

ప్రశ్న *తమను తప్పుగా ఇరికించారని చాలా మంది అధికారులు చెబుతారు*

జవాబు: *తప్పుగా ఏంటి? వాళ్ళు చేసారు కాబట్టే ఇప్పుడు ఊచలు లెక్కపెడుతున్నారు. వాళ్ళొక చిన్న అమ్మాయిని ఎన్‌కౌంటర్‌లో చంపేసారు.*

ప్రశ్న: *నిజంగానా?*

జవాబు: *అవును. వాళ్ళు ఆమెను లష్కర్ టెర్రరిస్టు అన్నారు. ఆమె ముంబైకు చెందినది ఆమె ఒక టెర్రరిస్టు అనీ, మోదీని చంపడానికి గుజరాత్‌కు వచ్చిందనీ కథ అల్లారు.*

ప్రశ్న: *అది అబద్ధమా?*

జవాబు: *అవును అబద్ధమే.*

ప్రశ్న: *నేను ఇక్కడికి వచ్చినప్పటినుండి ప్రతి ఒక్కరూ సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ గురించే మాట్లాడుతున్నారు.*

జవాబు. దేశమంతటా ఆ ఎన్‌కౌంటర్ గురించే మాట్లాడుతున్నారు మంత్రి ఆదేశాలతో వాళ్ళు సోహ్రాబుద్దీన్‌ను, తులసీ ప్రజాపతిని చంపేశారు. ఈ మంత్రి అమిత్ షాకు మానవహక్కులంటే ఏ నమ్మకం లేదు. నాకు ఈ మానవ హక్కుల కమిషన్లంటే ఏ నమ్మకం లేదని అతడు చెబుతుండేవాడు ఇప్పుడు చూడండి కోర్టు అతనికి బెయిల్ కూడా ఇచ్చేసింది

ప్రశ్న: మీరు ఎప్పుడూ అతడి క్రింద పనిచెయ్యలేదా?

జవాబు: చేసాను నేను ఏ టి.ఎస్ అధిపతిగా ఉన్నప్పుడు చేసాను. అతడు వంజారాను బదిలీ చేసి నన్ను తెచ్చాడు. నేను మానవ హక్కులలో నమ్మకమున్న మనిషిని ఈ షా నన్నొక రోజు తన బంగళాకు పిలిచాడు నేను ఎన్నడూ ఎవరి బంగళాకు వెళ్లలేదు. ఎవ్వరి ఇంటికి లేదా ఆఫీసుకు కూడా వెళ్లలేదు. నేను మీ బంగళా చూడలేదు సర్ అని నేనన్నాను. అతడు ఆశ్చర్యపోయాడు. నా బంగళాను మీరెందుకు చూడలేదు? అని అడిగాడు సరే, నా వాహనాన్ని పంపిస్తాను, రండి అని అన్నాడు సరే, మీ బండిని పంపించండన్నాను. నేను చేరుకున్నాక అతడు, "మీరు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు కదా అతడు ఇప్పుడే ఏ.టి.ఎస్ అధీనంలోకి వచ్చాడు కదా! అతణ్ణి లేపేయ్యాలి' అన్నాడు.

నేను ఏం అనలేదు. 'చూడు! చంపెయ్యి. అటువంటివాడికి బతికే హక్కు లేనే లేదు.'

నేను వెంటనే నా ఆఫీసుకు వచ్చి, నా జూనియర్లను సమావేశపరిచాను. అమిత్ షా వాళ్ళకే తిన్నగా ఆదేశాలిచ్చి, చంపేయిస్తాడని నా భయం. అందువల్ల నేను వాళ్ళతో, అతణ్ణి చంపమని నాకు ఆదేశాలు వచ్చాయి, కానీ ఎవ్వరూ అతణ్ణి ముట్టుకోవడానికి వీల్లేదు. అతణ్ణి విచారించండి అంతే. నాకు ఆదేశం ఇచ్చినా నేను చేయడం లేదు, కాబట్టి మీలో ఎవ్వరూ కూడా చేయడానికి వీల్లేదు, అని చెప్పాను.

ప్రశ్న: భలే ధైర్యం, సర్.

జవాబు. నేను రిటైరయ్యే రోజున ఈ నరేంద్రమోదీ నన్ను పిలిచాడు. 'ఇప్పుడు ఏం చెయ్యదలుచుకున్నారు?– వంటి ప్రశ్నలు అడిగాడు. నన్ను ఎట్లా అణగదొక్కి ఉంచారో చెప్పాను. 'సరే ఒక విషయం చెప్పండి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరెవరున్నారు? అంటే ఎంత మంది ప్రభుత్వానికి వ్యతిరేకులు?' అని

అడిగాడు

'నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడగొచ్చా?' అని మోదీని అడిగాను

'అడగండి' అన్నాడు.

'గత రెండు దశాబ్దాల్లో నేను వివిధ స్థాయిల్లో పని చేసాను. నా గురించి ఏమైనా వ్యతిరేకంగా మీరు విన్నారా?'

నేను చాలా బాగా పని చేసానని అతడు జవాబిచ్చాడు

'సర్, అయితే గత నాలుగేళ్లలో నా ఏ సి ఆర్ లపై 'ఎక్సలెంట్' అని, 'ఔట్ స్టాండింగ్' అని నా పై సీనియర్లు, హోం కార్యదర్శులు రాసారు. మరి మీరెందుకు వాటిని తగ్గించారు? నా పని మూల్యాంకనాన్ని మీరెందుకు తగ్గించారు?' అని అడిగాను. ఈ సమాచారమంతా నేను సమాచార హక్కు చట్టం ద్వారా సంపాదించానని చెప్పాను అతడు దిగ్భ్రాంతి చెందాడు. 'నేను నా ఆఫీసర్లకు, హోం సెక్రటరీకి ఫోన్లు చేయను' అన్నాడు. 'సర్, మీరు హోం సెక్రటరీకి ఫోన్ చేయనవసరం లేదు. ఆ ఫైల్ మీ వద్దకే వచ్చింది' అన్నాను

నేను డి.జి.పి కాగలిగేవాణ్ణి కానీ అతను కానీయలేదు.

ప్రశ్న: మీ రాష్ట్రంలో అసలు డి జి పి ఎందుకు లేరు?

జవాబు ఎందుకంటే మోదీ కుల్‌దీప్ శర్మ అనే అధికారి పై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటున్నాడు కాబట్టి.

ప్రశ్న: అతనికి తన స్వంత అధికారుల టీం ఒకటి ఉందని విన్నాను

జవాబు: నేను రాజ్‌కోట్ ఐ జి గా ఉన్నప్పుడు జునాగఢ్‌లో మత కల్లోలాలు చెలరేగాయి నేను కొందరికి వ్యతిరేకంగా ఎఫ్ ఐ.ఆర్ లు నమోదు చేసాను గృహ మంత్రి నాకు ఫోన్ చేసి "రాజన్‌జీ మీరు ఎక్కడున్నారు' అని అడిగాడు. "నేను జునాగఢ్‌లో ఉన్నానని జవాబు చెప్పాను 'సరే, నేను చెప్పే ముగ్గురి పేర్లు రాసుకొని ఆ ముగ్గురిని అరెస్టు చేయండి" అన్నాడు 'ఆ ముగ్గురు ఇప్పుడు నా వద్దే కూర్చొని ఉన్నారు వాళ్ళంతా ముస్లింలు వాళ్ళ వల్లనే కొంత సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. వీళ్ళే తమ ప్రయత్నం ద్వారా హిందువులు, ముస్లింలను ఒక దగ్గరకు తెచ్చి, కల్లోలాలను అదుపు చేసారు' అన్నాను. "చూడండి, ముఖ్యమంత్రి చెప్పాడు" అన్నాడు. అప్పుడు ఈ నరేంద్ర మోదీనే ముఖ్య మంత్రి "సర్ అది ముఖ్యమంత్రి ఆదేశమైనా సరే నేను చేయలేను ఎందుకంటే వీళ్ళు

అమాయకులు" అని నేను జవాబు చెప్పాను.

ప్రశ్న మీతో ఫోన్లో మాట్లాడింది ఎవరు?

జవాబు. గృహమంత్రి గోర్ధన్ జడాఫియా.

ప్రశ్న ఇదంతా ఎప్పుడు జరిగింది?

జవాబు జులై, 2002లో. జడాఫియా తానే వస్తానన్నాడు

ప్రశ్న: ఇంతకూ వాళ్ళెవరు?

జవాబు అరె, వాళ్ళంతా మంచివాళ్లు, ముస్లింలు కల్లోలాలను అంతం చేయడానికి మాకు వాస్తవానికి సాయం చేస్తున్నవాళ్లు. నా స్థానంలో వేరే ఎవ్వరున్నా వాళ్ళని అరెస్టు చేసేవాళ్ళు

ప్రశ్న: ఈ సింఘాల్ సంగతేమిటి? మీతో మాట్లాడమని అతడే చెప్పాడు

జవాబు. నేను అతడి బాస్‌గా ఉండేవాణ్ణి ఇప్పుడతను ఏ టి ఎస్.లో ఉన్నాడు అతడు నా వద్ద ప్రొబేషనర్ గా డి ఎస్ పి గా పని చేశాడు

ప్రశ్న: అతని (జడాఫియా) క్రింద ఎవరు పని చేసేవాళ్ళు?

జవాబు జైల్లో ఉన్న వాళ్ళలో వంజారా అతని కింద పని చేసేవాడు. నేను బార్డర్ రేంజ్ ఐ జి గా ఉండేవాణ్ణి. వంజారాను తీసుకురావడం కోసం నన్ను బదిలీ చేయించారు. అతన్ని ఇముడ్చడం కోసం పదవి స్థాయిని తగ్గించారు.

ప్రశ్న మరి ఇక్కడి పోలీసులు ముస్లిం వ్యతిరేకులా?

జవాబు. కాదు నిజానికి ఈ రాజకీయ నాయకులు ముస్లిం వ్యతిరేకులు. ఒక అధికారి ఎవరైనా వాళ్ళ మాటలు వినకపోతే వాళ్ళను ఎక్కడో మూలకు తోసేస్తారు మరి అటువంటప్పుడు వాళ్ళేం చెయ్యాలి?

ప్రశ్న మిమ్మల్ని అమిత్ షా చంపమన్నది కూడా ముస్లింనేనా?

జవాబు కాదు. వ్యాపార లాబీ నుండి ఎంతో ఒత్తిడి ఉండడంతో అతణ్ణి చంపించాలనుకున్నాడు

ప్రశ్న ఇష్రత్ జహాన్‌ను ఎన్‌కౌంటర్లో చంపెయ్యమని కొందరు అధికారులను బలవంతపెట్టారని నాతో కొందరు అన్నారు

జవాబు. మనిద్దరి మధ్యే ఉండాల్సిన ఒక విషయం చెబుతున్నా ఒకసారి ఈ వంజారా మురా ఐదుగురు సర్దార్‌లను పట్టుకున్నది. అందులో ఒకరు కానిస్టేబుల్. వీళ్ళు టెర్రరిస్టులు కాబట్టి వాళ్ళను చంపెయ్యాలని వంజారా అన్నాడు అదృష్టవశాత్తు అప్పుడు ఎస్ పి గా వున్న పాండియన్ నిరాకరించడం వల్ల ఈ ఐదుగురు (అమాయకులు) బతికిపోయారు

ప్రశ్న: అధికారులు నిజంగా ముస్లిం వ్యతిరేకులు కారా?

జవాబు: కాదు. రాజకీయ నాయకులు వాళ్ళతో అలా చేయిస్తారు. నీవు నిక్కచ్చిగా ఉంటే వాళ్ళు నిన్ను ఆ పోస్టింగ్‌లో ఉండనివ్వరు. వాళ్ళు రజనీష్ రాయ్‌కి, రాజీవ్ శర్మకు ఏ గతి పట్టిచ్చారో చూడండి.

ఇదొక మతోన్మాద, లంచగొండి ప్రభుత్వం. 1985లో కల్లోలాలను రెచ్చగొట్టడానికి తాను ఏం చేసాడో దాని గురించి అమిత్ షా నా వద్దకు వచ్చి గొప్పలు చెప్పుకునేవాడు. అతడు అందరినీ తన నివాసానికి పిల్చుకునేవాడు. ఉదాహరణకు ఒకసారి హోం కార్యదర్శిని, ప్రధాన కార్యదర్శిని, ఒక ఎం.పి.ని, నన్ను కూడా పిలిచాడు నేనప్పుడు ఐ.జి.గా చేస్తూ ఉన్నా. ఆ ఎం.పి, అమిత్ షా తో 'నీవొక కాన్‌స్టేబుల్‌ను కూడా బదిలీ చేయలేవు' అన్నాడు. అమిత్ షా నావైపు తిరిగి 'ఇది ఎందుకు చేయలేద'ని అడిగాడు. ఆ కానిస్టేబుల్ ఏ తప్పు చేయలేదని నేను జవాబు చెప్పాల్సి వచ్చింది. అతడు ఒక బి.జె పి ఎం పి కొడుకును అపాడంతే

ప్రశ్న: అతడు మీకు అలా చెప్పటమే ఆశ్చర్యం.

జవాబు. అతడు నాతో ఆంతరంగిక విషయాలు కూడా చెప్పేవాడు. నిజానికి ఇష్రత్ గురించి చెప్పింది అతనే వాళ్ళను చంపేసే ముందు ఇష్రత్‌ను కస్టడీలో ఉంచుకున్నానని చెప్పాడు. ఏ ఎన్‌కౌంటరూ జరగలేదనీ, ఐదుగురినీ చంపేసామని చెప్పాడు. ఆమె ఒక టెర్రరిస్టే కాదని అతను అన్నాడు

ప్రశ్న: మిమ్మల్ని ఏ.టి.ఎస్.లో కొనసాగనివ్వడమే నాకు ఆశ్చర్యం. అది అంత కీలకమైన స్థానం కదా?

జవాబు. అవును. వాళ్ళు నేను వాళ్ళ మనిషిననీ, వాళ్ళు చెప్పినట్టల్లా వింటాననీ అనుకున్నారు 'చూడండి, మనకు రెండు ముఖ్యమైన స్థానాలు ఉన్నాయి ఒకటి ఏ టి.ఎస్ మరొకటి కమిషనర్ ఆఫ్ పోలీస్. ఆ రెండు స్థానాల్లో మా మనుషులు ఉండాలని అనుకుంటున్నాము ఆశిష్ భాటియాను సి.పి.గా, మిమ్మల్ని ఏ.టి ఎస్ గా నియమిస్తున్నాం', అని నాతో అన్నాడు నాపై తమకు విశ్వాసముందని, ప్రభుత్వం చెప్పినట్టుగా నేను నడుచుకోవాలని చెప్పాడు నాపై నిజంగా మీకు విశ్వాసముంటే, నన్ను కమిషనర్‌ను ఎందుకు చేయడం లేదని నేను అడిగాను

పి.సి.పాండేని చూడండి! అతడు కల్లోలాలు రేపిన వాళ్లపై ఎటువంటి చర్య తీసుకోలేదు. నిజానికి అతడిపై కేసు పెట్టాలి. కానీ ముఖ్యమంత్రి దయకు

పాత్రుడయ్యాడు  అతడు ముస్లింల హత్యలకు బాధ్యుడు. కాబట్టి ఆయనకు రిటైరైన తరువాత కూడా మంచి పదవి ఇచ్చాడు. నాకు అతనితో చాలా సత్సంబంధాలున్నా, అతడు చేసింది తప్పని నాకు తెలుసు '

2013 మేలో ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన నా దర్యాప్తు గుజరాత్ ప్రభుత్వంపై ఒక పిడుగుపాటు లాగా పడింది. ఇష్రత్ జహాన్, సాదిఖ్ జమాల్ బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో నేను కొన్ని కీలకమైన డాక్యుమెంట్లను వెలికి తీసాను  నా పరిశోధన హోం మంత్రిత్వ శాఖను అతలాకుతలం చేసింది వార్తా ఛానళ్ళన్నీ అదే విషయంపై కేంద్రీకరించాయి. నా పరిశోధనకు సంబంధించిన వివరాలను వివరించడానికి నన్ను అన్ని ఛానళ్ళ వాళ్ళు పిలిచారు. బహుశా మొట్ట మొదటిసారిగా బూటకపు ఎన్‌కౌంటర్లతో, ఇంటలిజెన్సు అధికారులకున్న సంబంధాన్ని తెలుపుతూ ప్రత్యక్ష లింకు బయటపడింది. ఈ ఎన్‌కౌంటర్ వెనకాల ముఖ్యుడు గుజరాత్‌లో పనిచేస్తున్న సెంట్రల్ ఐ.బి. అధికారి రాజిందర్ కుమార్

ఈ విషయమే పత్రికల పతాక శీర్షికలనాక్రమించింది  హోం మంత్రిత్వ శాఖ ఆత్మరక్షణలో పడిపోయింది  సి బి ఐ  స్పెషల్ ఐ బి  డైరెక్టర్ అయిన రాజిందర్ కుమార్‌ను ప్రశ్నించవలసి వచ్చింది  ఇష్రత్ జహాన్ కేసులో ఇతడి పాత్ర నిర్ధారణ అయ్యింది [7] ఈ మధ్య కాలంలో రాజిందర్ కుమార్ మళ్ళీ ఒకసారి వార్తల్లోకెక్కాడు. తాను హోం కార్యదర్శిగా ఉన్నప్పుడు ఇష్రత్‌కు బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇవ్వాలని అన్న పూర్వ హోం కార్యదర్శి జి.కె  పిళ్ళై 2016 ఆరంభంలో అధికారంలో ఉన్న కాంగ్రేసు ప్రభుత్వం చెప్పడం వల్ల తాను అఫిడవిట్‌ను మార్చానని ప్రకటించాడు. దీనితో తనను ఇరికిస్తున్నారని రాజిందర్ కుమార్ ఎన్నో టివి ఇంటర్వ్యూలలో చెప్పడం మొదలుపెట్టాడు. పిళ్ళై తన కర్తవ్యాన్ని నెరవేర్చకపోవటం గురించి, అతడు అద్నానీ గ్రూపు కంపెనీల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఉన్న ప్రస్తుత సమయంలో 'నిజం' బయట పెట్టడం గురించి ప్రశ్నలు తలెత్తాయి. పైగా, దారుణమైన విషయం ఏమిటంటే, ఒక వ్యక్తి పూర్వాపరాలు ఏమైనప్పటికీ బూటకపు ఎన్‌కౌంటర్ అనేది రాజ్యాంగ వ్యతిరేకమనే విషయం పట్ల ఎవ్వరికీ ఇసుమంతైనా పశ్చాత్తాపం ఉన్నట్టు లేదు  ఇష్రత్ జహాన్ కేసు విచారణను అడ్డుకుంటున్న విషయం గురించి దాదాపు గుజరాత్ హోం శాఖ అంతా ఒప్పుకుంటున్న విషయం సింఘాల్ చేసిన స్టింగ్ టేప్ లో బయటపడటం గురించి ఎవ్వరూ మాట్లాడలేదు.

నేను బయటపెట్టిన దాంట్లోని ముఖ్యమైన విషయమంతా మొదటి పేరాలోనే ఉంటుంది.

గుజరాత్ పోలీసులు తొమ్మిదేళ్ల క్రితం టెర్రరిస్టులంటూ నలుగురిని చట్టానికతీతంగా చంపిన కేసులో సి బి.ఐ. ఒక పెద్ద సంచలనం కలిగించబోతోంది 2004 జూన్ 15నాడు ఒక ముస్లిం మహిళ, ముగ్గురు ముస్లిం పురుషులను బూటకపు ఎన్‌కౌంటర్లో చంపివేసిన దాని వెనుక ప్రధాన సూత్రధారి ఇంటలిజెన్స్ బ్యూరోలో ప్రస్తుతం స్పెషల్ డైరెక్టర్‌గా వున్న రాజిందర్ కుమార్ అని ఈ కేసులో నిందితుడైన ఒక అధికారి అహ్మదాబాద్‌లో ట్రయల్ జడ్జి ఎదురుగా ప్రమాణపూర్వకంగా వాంగ్మూలం ఇవ్వబోతున్నాడని తెహెల్కాకు తెలిసింది. పంథొమ్మిదేళ్ళ ఇష్రత్ జహాన్ అక్రమంగా పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు రాజిందర్ కుమార్ కలిసాడని మరో అధికారి వాంగ్మూలం ఇచ్చాడు. చనిపోయిన వాళ్ళ వద్ద దొరికిందంటూ పోలీసులు చూపించిన ఏకే-47 రైఫిల్ నిజానికి కుమార్ ఏ గుజరాత్ ఐ బి యూనిట్‌కు చెందినవాడో ఆ యూనిట్‌దని, దాన్ని చనిపోయినవాళ్ళ శవాలపై పారేసారని మరో అధికారి కూడా వాంగ్మూలం ఇచ్చాడు ఆ రోజు రాత్రి ఆ నలుగురిని చంపిన వాళ్ళలో ఒకరైన ఒక ముఖ్య నిందితుడు జి ఎల్ సింఘాల్ రహస్యంగా రికార్డు చేసిన ఒక ఆడియో రికార్డింగ్ కూడా సి బి ఐ వద్ద ఉంది షా తరువాత సహాయ గృహమంత్రిగా పదవిలోకి వచ్చిన ప్రఫుల్ పటేల్, మోదీ ఆఫీసులో 2008 నుండి పని చేస్తూ అతని సన్నిహిత సలహాదారుల్లో ఒకడిగా ఉన్న ఐ ఏ.ఎస్ అధికారి అదనపు ప్రధాన కార్యదర్శి గిరీష్ చంద్ర ముర్ము, రాష్ట్ర ప్రభుత్వపు అత్యంత సీనియర్ లా అధికారియైన అడ్వకేట్ జనరల్ కమల్ త్రివేది, అతడి సహాయకుడైన అదనపు అడ్వొకేట్ జనరల్ తుషార్ మెహతా, మరో పేరు తెలియని లాయరు, సింఘాల్ 2011 నవంబర్‌లో పాల్గొన్న సమావేశపు సంభాషణల రికార్డింగ్ అది (పటేల్ అంటే అదే పేరున్న యూనియన్ మంత్రి కాదు ఈ పటేల్ డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాక మోదీ మళ్ళీ మంత్రివర్గంలోకి తీసుకోలేదు)

చిక్కుముడిలోని ఒక్కో ముడి వీడుతున్నట్టుగా ఉంది ప్రియదర్శి రాష్ట్ర ఏ టి ఎస్. బాధ్యుడు. ఇష్రత్ జహాన్‌ను పథకం ప్రకారం చంపే ముందు ఒక బంగళాలో కస్టడీలో ఉంచుకున్నామని అమిత్ షా అతనితో అన్నాడు. కానీ, ప్రతి దర్యాప్తులో లాగానే నేను కూడా ఇందుకు మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది. నా జర్నలిజానికి నా మతాన్ని ముడిపెడుతూ కథనాలు వచ్చాయి ఒక సి బి.ఐ అధికారితో నేను సన్నిహిత శారీరక సంబంధంలో ఉన్న సి డి ఒకటి ఉందని హోం మంత్రిత్వ శాఖ అధికారులు నాపై దుష్ప్రచారం చేస్తున్నారని విభిన్న ఛానళ్ళ ఎడిటర్లు, లాయర్లు నాకు ఫోన్లు చేసి చెప్పారు

ఇది విని నేను స్థాణువునైపోయా నా గుణగణాలకు మచ్చ తెచ్చి నన్ను భయపెట్టి నా నోరు మూయించే ప్రయత్నమిదని నాకు తెలుసు. నేను మా నాన్న వద్దకు వెళ్ళాను. అదృష్టవశాత్తు, ఏం జరుగుతున్నదో అతడికి ఏమీ తెలియదు. నాకు దృఢంగా మద్దతుగా నిలబడే నా సోదరుడు ఆరిఫ్‌ను, నా పట్టుదల వెనకాల వెన్నెముకలా నిలిచే మా అమ్మను కూడా పిలిచాను నేను ఆందోళనగా ఉన్నానని మా నాన్న గ్రహించి మా అమ్మ వైపు ప్రశ్నార్థకంగా చూసాడు ఆమె కూడా అంతే ఆందోళనగా, తికమకపడుతూ కనిపించింది

నేను వాళ్ళకు ఫోన్‌కాల్స్ గురించి, ఎటువంటి పుకార్లు వ్యాపింపజేస్తున్నారో వాటి గురించి అంతా చెప్పాను. మా నాన్న ఏమన్నాడో నాకు బాగా గుర్తుంది 'చూడు తల్లీ, ఇదంతా ఒక నాటకం. సీడీ చూపిస్తే మేమందరం కూడా చూస్తామని వాళ్ళకు చెప్పు' అని నవ్వాడు. మా అమ్మ హాయిగా ఊపిరి పీల్చుకుని, నా తల నిమిరింది 'బేటా, మాకందరికీ నీపై నమ్మకముండగా, మేమేవ్వరం నిన్ను ఒక్క ప్రశ్న కూడా అడగనప్పుడు, నీకు ఇంకెవరి గురించి భయం?', అని మా అమ్మ అన్నది

నా సోదరుడు కూడా అంతే మద్దతుగా మాట్లాడాడు ఒక సీనియర్ మీడియా ప్రొఫెషనల్ అయిన అతను అలాగే స్పందించాడు 'వాళ్ళకు ఒక ఉత్తరం రాయి మీకు చేతనైంది ఇంతేనా అంటూ ఆ నీచులను తిడుతూ రాయి,' అన్నాడు.

నేను పెద్దగా ఏమీ చేయవలసిన అవసరం లేకపోయింది నా జర్నలిస్టు బంధుగణంలోని నా సహోద్యోగులు నా వెనుక దృఢంగా నిలబడ్డారు. అప్పుడు మేనేజింగ్ ఎడిటర్‌గా వున్న షోమా చౌదరి నాపై జరుగుతున్న దుష్ప్రచార కాంపెయిన్‌కు వ్యతిరేకంగా ఆ వారం ఎడిటోరియల్ రాసింది

> *సీనియర్ ఎడిటర్ రానా అయ్యూబ్ గత కొన్ని వారాలుగా దీన్ని బాగా ఎదుర్కొంటున్నది తెహెల్కాకు చెందిన అద్భుతమైన, భయమెరుగని విలేఖరి అయిన రానా, గత మూడు సంవత్సరాలుగా గుజరాత్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి పట్టుదలగా నిజాలు వెలికి తీస్తున్నది న్యాయం, రాజ్యాంగ విలువల పట్ల దృఢమైన నమ్మకమే ఆమె జర్నలిజాన్ని పురికొల్పుతున్నది ఇష్రత్ జహాన్ కేసులో ఆమె బయటపెట్టిన విషయాలు జాతీయ స్థాయిలో పతాక శీర్షికలు కావడంతో ఆమెను ఒక ప్రొఫెషనల్‌గా కాక ఒక 'ముస్లిం జర్నలిస్టు'గా చూసే ఒక అవమానకరమైన అనుభవాన్ని*

*ఎదుర్కోవలసి వస్తున్నది ఆమెను గురించి నీచమైన పుకారులు కూడా ప్రచారం చేస్తున్నారు ఆమెకు కొందరు సిబిఐ అధికారులతో ఉన్న శారీరక సంబంధాన్ని బయటపెట్టే సీడీ ఉన్నదనే పచ్చి అబద్ధాన్ని నిజమన్నట్టు గుసగుసలుగా ప్రచారం సాగుతోంది*

*భారతదేశం ఒక అపరిపూర్ణమైన ప్రయోగం దానికి 'ఏ ఆదర్శాలైతే ఆధారమో వాటినే వదిలేస్తే మనకు మిగిలేది ఇవే 'హిందూ జాతీయ వాదులు', 'ముస్లిం జర్నలిస్టులు', పచ్చి అబద్ధపు పుకార్లతో కట్టడి చేయాలనుకునే మహిళా జర్నలిస్టులు*

కొద్ది రోజుల్లోనే ఈ సీడీ కథనం ఆగిపోయింది

మరొకవైపు రాష్ట్ర పోలీసులతో అమిత్ షా కుమ్మక్కై అమాయక పౌరులపై నిఘా పెడుతున్నాడనే కథనాలు ఎన్నో బయటపడసాగాయి అందులో మాన్సి సోని అనే యువ ఆర్కిటెక్టు ఒకరు వీటన్నింటికీ కేంద్రంలో ఉన్నది ఒకప్పుడు అమిత్ షా సన్నిహితుల్లో ఒకరైన జి ఎల్ సింఘాల్ అనేది స్పష్టం ఇష్రత్ జహాన్ కేసును దర్యాప్తు చేయడానికి నియమించబడిన ఎస్ ఐ టి ఆ కేసు గురించి తొలి దర్యాప్తును ప్రారంభించిన ముఖ్యమైన సమయంలోనే ఈ సంభాషణలను రికార్డు చేసాడు వెనుకబడిన కులాలకు సంబంధించిన ఆఫీసర్లను వాడుకోవాలనుకునే రాష్ట్ర ప్రభుత్వ నీతి గురించి అర్థం చేసుకున్న సింఘాల్ తనను తాను కాపాడుకోవడానికి ఇట్లా రికార్డు చేశాడు. గుజరాత్‌లో ఆ కాలంలో విచ్చలవిడిగా చేసిన చట్టవ్యతిరేక ఫోన్ ట్యాపింగ్ కంటే మించిన మార్గం ఏముంటుంది?

అహ్మదాబాద్ లోని కార్యకర్తలు (యాక్టివిస్టులు) సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో అరవై ఐదు వేల నంబర్లను చట్టవ్యతిరేకంగా టాప్ చేసారు. ఈ లిస్టులో ప్రతిపక్ష పార్టీకి చెందిన సభ్యులు, అధికార పార్టీలోని తిరుగుబాటుదారులు, జర్నలిస్టులు, పోలీసులు కూడా ఉన్నారు

ఈ యంత్రాంగం గురించి, డర్టీ ట్రిక్స్ గురించి సింఘాల్‌కు తెలియనిదేం కాదు వాటిని తానూ ఉపయోగించుకున్నానని సింఘాల్ మాతో చెప్పాడు ఈ రకంగానే మంత్రి ఫోన్‌కాల్స్‌ను, సంభాషణలను రికార్డు చేయటం మొదలైంది అట్లా రికార్డు చేసిన వాటిలో, గుజరాత్‌కు చెందిన మాన్సీ అనే యువ ఆర్కిటెక్టుపై నిఘా పెట్టమని షా సింఘాల్‌కు ఆదేశాలివ్వడం గురించిన సంభాషణలు చాలా ముఖ్యమైనవి భుజ్ భూకంపం తరువాత పునరావాసం సమయంలో ప్రదీప్ శర్మ అనే ఐ ఏ ఎస్ అధికారి ఆమెను పరిచయం చేసాడు.

మాన్సీ ఆ సమయంలో బెంగుళూరులో నివాసముంటున్నదని నేను తెలుసుకున్నా ఈ నిఘాకు సంబంధించిన సత్యాలన్నీ నా వద్ద టేపులో ఉండినాయి కానీ ఆ టేపులు ప్రచురించడమంటే మాన్సీ ప్రైవసీని భగ్నం చేయటమవుతుంది పైగా బెంగుళూరులో సాగుతున్న తన జీవితంలోని ప్రశాంతతను కోల్పోతుంది [8]

సమయం దగ్గర పడుతోంది. నేను మా ఎడిటర్ షోమాకు ఇచ్చిన పి సి ఒ నంబరుకు తన పర్సనల్ అసిస్టెంట్ సెల్ ఫోన్ నుండి ఫోన్ చేసేది 'మనకు ఏం సమాచారం దొరికింది' ఆమె అడిగేది నేను నా వద్ద ఉన్న చేతివ్రాత ప్రతుల వివరాలు చెబితే 'రానా, ఇది చాలా గొప్పగా ఉంది', అంటూ ఆమె ఉత్సాహంతో అరిచేది

అయితే ఇంకా అసంపూర్తిగా ఉన్న విషయాలు కొన్ని ఉన్నాయి. వాటిని సరిచేయవలసి ఉంది మోదీ, షా ల నుండి ప్రత్యక్షంగా ఆదేశాలు పొంది, వారిని పట్టివ్వగలిగే డాక్యుమెంట్లపై సంతకం చేసిన ముఖ్యమైన ఉన్నతాధికారులు అయిన హోం మంత్రిత్వశాఖ కార్యదర్శులు, ప్రధాన సలహాదారులను కలవవలసి ఉంది ఇందులో చాలా మందిని నానావతి కమిషన్ విచారించింది కానీ, అక్కడ అందరికీ జ్ఞాపకశక్తి పోయింది అందులోని చాలా మంది కల్లోలాలతో నేరుగా సంబంధం ఉన్నవాళ్ళు కాదు కానీ తప్పు జరిగిన దాని గురించి తమకేమీ తెలియనట్టు మౌనంగా ఉండటమంటే గుజరాత్‌లోని కల్లోలాల బాధితులకు న్యాయం అందటానికి జరగాల్సిన ప్రక్రియలో అడ్డంకులుగా మారటమే గుజరాత్ కల్లోలాల సమయంలో ముస్లిం మహిళలను చంపడంలో తమ శౌర్యాన్ని గురించి స్థానిక గుండాలు గొప్పలు చెప్పుకునేలా చేసి రికార్డ్ చేసిన నా సహోద్యోగి ఆశిష్ పని కొంత సులభమే కానీ కల్లోలాల సమయంలో ఉన్న గుజరాత్ హోం కార్యదర్శి, డి జి పి., కమిషనర్, ఐ బి హెడ్ వంటి పెద్ద తలకాయలతో నేను తలపడాలి రోజురోజుకూ నా తల తిరుగుతోంది

ఈ ఒత్తిడి అంతా సరిపోనట్టు, ఏదో కాన్ఫరెన్సు ప్రతినిధుల కోసం ఫౌండేషన్ లోని అన్ని గదులు అవసరమంటూ మాణిక్ భాయ్ మమ్మల్ని గదులను ఖాళీ చేయమన్నాడు నాకు మళ్ళీ తలదాచుకోవడానికి గూడు కరువైంది

---

7 *http //cbi nic in/newsarticles/pressclips/aug-2013/pc_20130802_4 pdf*

8 *తరువాతి కాలంలో ఈ సంగతంతా బయటపడినప్పుడు మాన్సీ సోనీ అవమానాన్ని (indignity) ఎదుర్కోవలసి వచ్చింది తన కుటుంబం నుండి ఎదుర్కొన్న ఒత్తిడి కారణంగా ఆమె అమెరికాకు వెళ్లిపోవలసి వచ్చింది ఇవన్నీ చూస్తే నాకప్పుడు ఉన్న భయాలు ఆధారరహితమైనవేం కాదు ఈ విషయంలో నా వద్ద వున్న ఫుటేజీని ప్రచురించవద్దనే నేను నిర్ణయించుకున్నా*

# ఐదవ అధ్యాయం

***ఈమధ్యలో***

ఈ కథనంలో ఇతర వ్యక్తుల గురించి రాసే ముందు, గుజరాత్‌లో చాలా పేరుపొందిన మహిళా పోలీసుల్లో ఒకరైన ఉషా రాడా గురించి పరిచయం చేయడం అవసరం ఆమెపై నేను స్టింగ్ ఆపరేషన్ చేయాలని అనుకోలేదు కానీ ఆమెకు సంబంధించి ఏదో అనుమానాస్పదమైనది ఉంది ఆమెను కలవటం వల్ల ఏం నష్టముండదు అనుకున్నా పైగా ఆమె వెనుకబడిన కులానికి చెందిన మహిళ కాబట్టి నా కథనం ఇంకా బలోపేతమే అవుతుందనిపించింది. అభయ్ చూడాసమకు రాడా విశ్వాసపాత్రురాలైన జూనియర్ నేను గుజరాత్‌ను వదిలేసిన కొద్ది కాలానికే, 2003 నుండి 2006 మధ్య గుజరాత్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లను దర్యాప్తు చేయటానికి సుప్రీం కోర్టు నియమించిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ నుండి రాడా రాజీనామా చేసింది

2007-2010 మధ్య ఇద్దరూ క్రైమ్ బ్రాంచ్‌లో పని చేసినప్పుడు చూడాసమ రాడాకు బాస్ సోహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో చూడాసమ అరెస్టయి ఉన్నాడు విచారణలో చూడాసమ పట్ల రాడా పక్షపాతంతో వ్యవహరిస్తుందనే అనుమానాలు ఉన్నాయి

ఈ సరికి గుజరాత్ పోలీసు కంట్రోల్ రూము నాకు ఇష్టమైన స్థలమైంది నాకు ఎవరైనా పోలీసు అధికారికి సంబంధించిన కాంటాక్టు అవసరమైతే నేను అమెరికన్ యాసలో మాట్లాడి నన్ను ఒక అమెరికన్ ఫిల్మ్ మేకర్‌గా పరిచయం చేసుకొని, శక్తివంతమైన గుజరాతీ మహిళలపై డాక్యుమెంటరీ తీస్తున్నానని చెప్పేదాన్ని సంబంధిత పోలీసు అధికారి నేనడిగిన వారి లాండ్ లైన్ ఒక్కటే కాక సెల్ ఫోన్ నంబరు కూడా ఇచ్చేసేవాడు నేను ఉషా రాడాకు ఫోను చేసినప్పుడు ఆమె ఎవరినో ఇంటరాగేట్ చేస్తూండింది. నేను ఆమెకు ఒక మెసేజ్ పెట్టాను రెండు గంటల తర్వాత ఆమె నాకు ఫోన్ చేసి, అహ్మదాబాద్ లోని సర్క్యూట్ హౌజ్ దగ్గర కలవమని

చెప్పింది నేను ఒక జీన్స్ స్కర్ట్, నల్ల టి షర్టు వేసుకొని చాలా ఆభరణాలు ధరించి ఆమెను కలవటానికి వెళ్ళాను నా తలకు బ్యాండనా కట్టుకొని, ఒక కెమెరా, స్లింగ్ బ్యాక్ బ్యాగు వేసుకొని వెళ్ళాను రిసెప్షనిస్టు నన్ను కూర్చోబెట్టింది.

కొద్ది నిమిషాల్లోనే రాడా వచ్చింది. ఆమె బక్క పలుచగా, పొడుగ్గా, కురచ జుట్టుతో ఉన్న 30 ఏళ్ళ ఆమె. ఒక కాలరు ఉన్న టి షర్టు, జీన్స్, స్పోర్ట్సు షూస్ వేసుకోవడంతో ఆమె విగ్రహానికి ఒక గాంభీర్యం వచ్చింది ఆమె నన్ను ఆదరంగా కౌగలించుకుంది 'హలో మైథిలీ, ఎలా ఉన్నావు?' అంటూ స్నేహపూర్వకమైన కరచాలనం, విశాలమైన చిరునవ్వుతో అడిగింది

ఒకసారి కూర్చున్న తరువాత నేను ఆమెను పొగడ్తలతో ముంచెత్తాను. అందులోనిదంతా అబద్ధమేం కాదు ఉషకు సమ్మోహన వ్యక్తిత్వం ఉంది ఆమె నవ్వుతో నా భయాలన్నీ తొలగిపోయాయి ఒక గంట పాటు మా సంభాషణ సాగగానే ఆమె నన్ను సినిమాలకు, షాపింగ్‌కు, గుజరాత్‌లో ప్రఖ్యాతి చెందిన ధాలీ జాయింట్‌కు (హోటల్ కు) తీసుకెళతానని వాగ్దానం చేసింది

నన్ను మళ్ళీ ఒకసారి ఆలింగనం చేసుకొని, తన ఆఫీసు జీపులో నెహ్రూ ఫౌండేషన్ వద్ద వదిలేసే ముందు 'నన్ను నీ స్నేహితురాలిగా భావించు నీకేం సహాయం కావాలన్నా అడుగు' అని అంది

మరుసటి రోజు సాయంత్రం ఉష నాకు ఒక మెసేజ్ పెట్టింది 'మైథిలీ రాత్రి 9-30 గంటలకు నన్ను ఎస్ జి. హైవే వద్ద కలువు', అని నేను వెంటనే సరే అని జవాబు పెట్టాను కానీ పెట్టేసిన వెంటనే నా శరీరమంతా ఒక ఆందోళన పాకిపోయింది. నన్ను రాత్రి 9-30 గంటలకు ఎస్ జి హైవే వద్ద ఎందుకు కలవాలనుకున్నది?

చాలా ఆందోళనతో పాటు కొంత భయంతో నేను ఎస్ జి. హైవే వెళ్ళటానికి ఒక ఆటో తీసుకున్నా తాను చెప్పిన స్థలానికి వెళ్ళాక నేను ఉషకు ఫోను చేశాను ఆటో డ్రైవరుకు ఫోను ఇస్తే సరిగ్గా ఎక్కడికి రావాలో చెబుతానని అంది అంత దూరం వెళ్లవలసి ఉంటుందని తనకు ముందే చెప్పవలసిందని అతడు సణుక్కుంటూ నాకు ఫోను వాపసు ఇచ్చాడు అప్పటికి రాత్రి 10 కావచ్చింది ఉష చెప్పింది వినటం తప్ప నేను చేయగలిగిందేమీ లేదు. నాలో భయం ఉన్నా నేను దాన్ని బయటపడనీయకూడదు చాలా కిలోమీటర్లు ప్రయాణించాక రోడ్డు పైన ఉష వాళ్ళ పోలీసు వ్యాను కనిపించింది వ్యాను వద్ద మరో ముగ్గురు పోలీసులు మాత్రమే ఉన్నారు. నన్ను అక్కణ్ణుంచి దూరంగా తీసుకెళ్ళమని ఆటోడ్రైవరును రిక్వెస్టు చేద్దామా అనిపించింది కానీ అప్పటికే ఆలస్యమై

పోయింది. 'హలో' అంటూ ఉష నావైపు వచ్చి తన జీపులో కూర్చొమ్మంది 'పద మనం వెళ్దాం. నేను తీసుకెళ్ళే స్థలం నీకు నచ్చుతుంది.'

జీపులో కూర్చుంటుంటే నాకు ఏడవాలనిపించింది. గుజరాత్‌లో ఉన్న కాలంలో మొదటిసారి నాకు చేతులు చల్లబడ్డాయి. నేను నా స్వభావానికి విరుద్ధంగా మౌనంగా ఉంటే, ఉష మాట్లాడుతూనే ఉంది. నాకు ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే నేను చివరిగా ఎవరిని కలిసానో చెప్పటం కోసం ఒకసారి మా కుటుంబానికి ఫోను చెయ్యాలనిపించింది

కానీ, నేను ఉషను తప్పుగా అర్థం చేసుకున్నా మేం అహ్మదాబాద్ లోని బిజీ రెస్టారెంటుల్లో ఒక దాని వద్ద ఆగాము. మా అహ్మదాబాద్ మీ అమెరికా కంటే ఏ మాత్రం తక్కువ కాదని నీకు చూపించాలని తెచ్చాను అని ఆమె గర్వంతో అన్నది. నేను చిరునవ్వు నవ్వాను ఆ చిరునవ్వులో ఎంత రిలీఫ్ ఉందో ఉషకు ఎప్పటికీ అర్థం కాదు. కొంచెం సేపటి తర్వాత నేను వాష్‌రూమ్ కోసమని వెళ్ళాను ఆ టాయిలెట్‌లో ఏడ్చినంతగా బహుశా నేను ఎన్నడూ ఏడవకపోయుంటాను నేను దగ్గుతుండినాను. నా కళ్ళలో నుండి, ముక్కులో నుండి నీళ్ళు కారుతూ ఉన్నాయి నాకు దాదాపుగా వాంతి వచ్చినంత పనయ్యింది

మా మధ్య జరిగిన సంభాషణతో ఆమె అంటే నాకు చాలా అభిమానమని ఆమె నమ్మిన తరువాత హోటల్ వదిలి వెళ్ళే ముందు, మరుసటిరోజు ఆమె ఇంటి వద్ద కలుద్దామని అనుకున్నాం గుజరాత్‌ను భయోత్పాతంతో ముంచెత్తుతున్న ముస్లింల గురించి మొదలు పెట్టి తన సీనియర్ అభయ్ చూడాసమ అంటే తనకున్న హీరో వంటి ఆరాధనా భావం దాకా విభిన్న విషయాల గురించి మా సంభాషణలో దొర్లాయి.

మరుసటి రోజు ఉషను వాళ్ళ ఇంటివద్ద కలవవలసి ఉండింది. నా ప్రత్యేకమైన కుర్తాను చార్జింగ్ నుండి తీసి, కెమెరా సరిగ్గా పనిచేస్తోందో లేదో చూసి వేసుకొని నెహ్రూ ఫౌండేషన్ నుండి బయలుదేరాను నేను కిందకు వెళుతుంటే, నాకు రాజీ అనే ఒక కొత్త అమ్మాయిని పరిచయం చేశారు. ముంబయికి చెందిన ఆమె నా పక్క గదిలో ఉండబోతోంది. పానీ, ఆమె స్నేహితులు అప్పుడే హాస్టలుకు తిరిగి వచ్చారు. మరో జర్మన్ అమ్మాయి హాస్టలులో చేరింది ఆమె స్కైప్ లో తన కుటుంబంతో మాట్లాడుతోంది. ఆమె గదిని దాటిపోతుంటే వాళ్ళ అమ్మకు హలో చెప్పి వెళ్ళమని పిలిచింది.

షాహీబాగ్‌లో పోలీసుల క్వార్టర్ల వద్దకు నేను చేరేసరికి ఉష ఇంటి దుస్తుల్లోకి మారి డిన్నర్ కోసం థాలీ తయారు చేసి ఉంచింది. ఆమె కూతురు ఆమె లాప్‌టాప్‌లో

పని చేస్తోంది ఆ అమ్మాయికి నన్ను పరిచయం చేసి తన స్కూలు చదువు అయిపోయాక ఏ కాలేజీల్లో అప్లై చేస్తే బాగుంటుందో నన్ను అడిగి తెలుసుకోమంది ఉష భర్తతో విడాకులు తీసుకొని తన తలిదండ్రులు, పిల్లలతో కలిసి జీవిస్తోంది. 'ఈ రోజు మీ పోలీసు బలగాల గురించి నీ నుండి నోట్స్ తీసుకోవాలి' అన్నా. 'ఈ రోజు కాదు ఈ రోజు సినిమాకు పోదాం' అని ఆమె అంది నేను నిరాశకు గురయ్యాను. కానీ మొహం మీద కనిపించనివ్వలేదు.

కొద్ది నిముషాల్లోనే మేము అహ్మదాబాద్‌లోని ఒక సినిమా థియేటర్ వద్దకు చేరుకున్నాం. అయితే అక్కడికి చేరుకోగానే నా గుండె జారిపోయింది. ప్రవేశ ద్వారం వద్ద మెటల్ డిటెక్టర్ ఉంది. అందరినీ సోదా చేస్తున్నారు నా కుర్తాకు కెమెరా ఉంది. భయంతో నా గొంతు తడారిపోయింది ఇక నా పని ఇంతటితో సరి అనుకున్నా మేం క్యూలో ఉన్నాం ఉష ఏదో మాట్లాడుతూనే ఉంది. నా దృష్టంతా సోదా జరుగుతున్నా చోటుపైనే ఉంది. కొద్ది నిముషాల్లోనే డిటెక్టరు కెమెరాను కనిపెడుతుంది, నేను పట్టుబడిపోతాను అనుకున్నా అయితే అద్భుతాలు జరుగుతాయి సోదా జరిగే స్థలానికి దగ్గరలో నిలబడి ఉన్న కానిస్టేబుల్ ఉషను, నన్ను క్యూలో నిలబడి ఉండడం చూసి వచ్చి మమ్మల్ని వేరే ద్వారం గుండా తీసుకెళ్ళాడు. అది డిసెంబరు నెల రాత్రిపూట బాగా చల్లగా ఉన్నప్పటికీ నా మెడ పైన చెమటలు పట్టడం నాకు తెలుస్తూనే ఉంది మళ్ళీ ఒకసారి నేను పట్టుపడకుండా బయటపడగలిగానని అనుకున్నా పాప్ కార్న్, కోక్ తీసుకొని 'నో ఒన్ కిల్డ్ జెస్సికా' చూడటానికి మేం లోపలికి వెళ్ళాం అది జెస్సికా లాల్ హత్య గురించి తెహెల్కా చేసిన పరిశోధన పైన ఆధారపడిన సినిమా కావటమే ఒక వైచిత్రి

సినిమాలో పేర్లు పడుతున్నప్పుడే 'తెహెల్కా' చేసిన కృషి గురించి కృతజ్ఞతలు పడ్డాయి ఉష నా చెవిలో గుసగుసగా అన్నది 'నీవు తెహెల్కా గురించి విన్నావా? వీళ్ళు ఒక వెధవల గుంపు, వాళ్ళు తమ ఫోన్లకు కెమెరాలు తగిలించుకొని స్టింగ్‌లు చేశారు ' 'నిజమా?' అని నేను కొంచెం ఎక్కువే అమాయకత్వం నటించడానికి ప్రయత్నించా, 'తెహల్కా అంటే? అదొక టీవి చానలా?" 'కాదు కాదు అదొక వెబ్ సైట్ దాన్నెప్పుడూ చూడొద్దు భారతదేశం గురించి అన్నీ చెడ్డ విషయాలే ఉంటాయి', అని ఉష జవాబిచ్చింది. మేము ఇక సినిమా చూడసాగాము

ఆరాత్రి నేను గదికి తిరిగి వచ్చాక నేను ఎటువంటి ఆటలో భాగమయ్యానో తలుచుకుని నవ్వుకున్నా అంతకుముందు నేను నా సీనియర్ల అంచనాలకు సరిపడా చేయగలుగుతానా అని ఎలా భయపడ్డానో కూడా గుర్తు తెచ్చుకున్నా నేను నిజాన్ని

వెలికి తీయగలుగుతానా? నేను ఉండటానికి మరొక స్థలం వెతుక్కోవడానికి కూడా ఇంకా రెండు రోజుల సమయం ఉంది. తన గదిలో ఉండమని పానీ అన్నది కానీ నేను ఏ రిస్క్ తీసుకోలేను. ప్రతి రాత్రి నేను నా కుర్తా, డైరీ, వాచీలను చార్జ్ చేస్తాను వాటన్నింటిలో కెమెరాలు ఉన్నాయి ఈ చిన్న పొరపాటో చేసి ప్రమాదంలో పడలేను నేను నా పర్సనల్ ఈ -మెయిల్ చూసుకోవటం కోసం నా లాప్ టాప్‌ను ఉపయోగించలేను కాబట్టి పానీని తన లాప్‌టాప్ ఇవ్వమని అడిగాను

నేను ఆ రాత్రి రానా అయ్యూబ్ గా నా మెయిల్ ఐ డిలోకి లాగిన్ కాగానే ఓ వెయ్యి మెయిల్స్ ఉన్నాయి. చాలా మంది మిత్రులు నేను మాయం కావడం గురించి కుతూహలం ప్రదర్శించారు రానా అయ్యూబ్ ఫోటో ఏదీ ఉండకుండా చేయటం కోసం నేను నా ఫేస్‌బుక్ అకౌంట్ తీసేశాను నాకు హోటళ్ళలో ఉండి ఉండి బోరు కొట్టింది కాబట్టి తన స్నేహితులెవరితోనైనా కలిసి ఉండవచ్చా అని ఓ స్నేహితురాలికి మెయిల్ పెట్టా అహ్మదాబాద్‌కు చెందిన ఆమె ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నది.

నేను ఆశించనంత వేగంగా ఆమె జవాబిచ్చింది తన కుటుంబం, స్నేహితులు రాజ్‌కోట్‌లో ఉన్నారని, తన కుటుంబ స్నేహితులొకరికి ఎస్ జి హైవే పై ఒక బంగళా ఉందని ఆమె జవాబు పెట్టింది ఇంటి యజమానులు దేశంలో లేరు ఆ ఇంటి కాంపౌండ్‌లోనే ఉంటూ ఆ ఇంటిని ఒక హౌస్ కీపర్ కుటుంబం చూసుకుంటోంది నాకేమేమి అవసరమౌతాయని అడిగి, సామానంతా ప్యాక్ చేసుకొని మరుసటి రోజు ఉదయం మాణిక్ భాయిని కలిసి డబ్బులు చెల్లించడానికి అతని క్యాబిన్‌కు వెళ్ళా పది రోజుల తర్వాత డెలిగేషన్ అంతా వెళ్లిపోతుంది కాబట్టి, నేను మళ్ళీ రావచ్చని అతను హామీ ఇచ్చాడు అప్పటికి నాకొక గది మళ్ళీ దొరుకుతుంది

ఆ బంగాళా పెద్ద తోట, పచ్చికతో వున్న అందమైన నిర్మాణమే అయినా ఒక మహిళ ఒంటరిగా ఉండగలిగే స్థలం కాదు. ఆ బంగాళా కుడి ఎడమల్లో నిర్మాణంలో ఉన్న భవనాలు, ఆ నిర్మాణ కూలీలు ఉండటానికి గుడిసెలూ ఉన్నాయి చీకటి పడితే అంతా అంధకారమే ఎక్కడికైనా వెళ్లాలన్నా ఏ సాధనమూ లేదు ఆ ఇంటి కేర్‌టేకర్ కాలూభాయి మార్కెట్‌కు వెళ్లాలంటే ఒక కిలోమీటర్ దూరం సైకిలుపై వెళ్ళేవాడు. బంగళా ఆవరణలో తెగిన వైర్లు, కర్రలు, ఇటుకలు, గుట్టల కొద్దీ సిమెంట్ ఉన్నాయి నా రాక గురించి కాలూభాయికి తెలియజేసారు అతడు మెయిన్ గేట్ తెరవక ముందే రెండు ఊర కుక్కలు నన్ను స్వాగతించాయి కాలూభాయికి ముగ్గురు కూతుళ్ళు ఆ కుక్కలు కూడా ఆ కుటుంబంలో సభ్యులు. తరువాతి కాలంలో నా ఒంటరితనంలో అవి నాకు తోడయ్యాయి

ఆ ఇంట్లో నాకు మరో సర్‌ప్రైజ్ ఎదురైంది దాని గురించి నాకు చెప్పాలన్నంత ముఖ్యమైన విషయంగా కూడా కాలూభాయి అనుకోలేదు ఒక రోజు సాయంత్రం నేను ఆటోలో బంగళాకు తిరిగి వచ్చేసరికి చీకటి పడింది గేటు తట్టడం వల్ల ఏ ఉపయోగం ఉండదు కాలూభాయి తన చిన్న ఇంట్లో తలుపులు వేసుకొని రేడియో పెద్దగా పెట్టుకొని ఉంటాడు నేను అతనికి ఫోన్ చేశాను హారన్ మోగించమని ఆటో డ్రైవర్‌కు కూడా చెప్పాను చీకట్లో దారికనుక్కోవడం కోసం ఒక టార్చ్‌లైట్‌ను కూడా వెంట ఉంచుకునేదాన్ని

నేను గేటు లోపలికి లైటు వేయగానే కుక్కలు మొరగటం మొదలుపెట్టాయి హమ్మయ్య, ఇప్పుడైనా కాలూభాయి దృష్టిపడుతుందని నేను సంతోషించా "మైథిలీ బెన్, (గుజరాతీలో సోదరి) వస్తున్నా', అని కాలూభాయి కేకపెట్టాడు కుక్కలు మాత్రం మొరుగుతూనే ఉన్నాయి

నేను స్నానం చేసి భోజనం చేశాక కూడా కుక్కలు మొరుగుతూనే ఉన్నాయి వాటికి ఆకలేసి అరుస్తున్నాయేమోనని నేను బయటకు వచ్చి కాలూ భాయిని పిలిచాను, అతడేమైనా వాటికి తిండి పెడతాడేమోనని 'అరె బెన్, ఆ పాము బొర్రలోకి దూరిపోతే, అవి అరవటం ఆపేస్తాయి", అతడు జవాబిచ్చాడు 'పామా? ఎక్కడ' అని నేను అరిచాను

మరో పదిహేను నిమిషాల పాటు కాలూభాయి, అతని కూతుళ్ళు గత సంవత్సర కాలంగా అక్కడ నివాసమేర్పరచుకున్న నాగుపామును గురించి సంతోషంగా చెప్పారు చూపించడానికి నన్ను తీసుకెళ్లారు ఆ పాము గోడపై కూచుని ఉంది

ఆ రోజు నుంచి నాకు రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టేది కాదు కుక్కలు మొరిగాయంటే చాలు, పాము బయటకు వచ్చిందని అర్థం. ఎవరో కంచె దూకుతున్నారని భయమై అకస్మాత్తుగా నిద్రలేచేదాన్ని నాకేం జరుగుతోందో నాకే తెలియడం లేదు నా నాడి అకస్మాత్తుగా వేగంగా కొట్టుకునేది ప్రతిరాత్రి నాకు చెమటలు పట్టసాగాయి నా గొంతు ఎండుకపోయేది ఏ తిండి సహించేది కాదు నేనెవరనేది ఏ అధికారైనా గుర్తుపడితే ఏమవుతుంది? నాకు హాని కలిగించడానికి ఈ బంగాళా చాలా అనువైన స్థలం

ఏ పనీ లేని మధ్యాహ్నాలలో కాలూభాయి కూతుళ్ళు తమ స్కూలు పుస్తకాలు పట్టుకొని నా వద్దకు వచ్చేవాళ్లు నేను టీ చేసేదాన్ని పార్లే జీ బిస్కట్లతో మేమంతా టీ తాగేవాళ్లం కుక్కలకు నేనంటే అభిమానం చాలా పెరిగింది మెలమెల్లగా పాము, కుక్కలతో ఆడటం నాకు వినోదాత్మకంగా అనిపించసాగింది కాలూభాయి పిల్లలు, నేను కలిసి దానికి ముఖియా అని పేరు పెట్టాం ఆ పిల్లలు ముఖియాపై చిన్న చిన్న రాళ్ళు వేసేవాళ్ళు నేనేమో నా సెల్ ఫోన్‌తో అదంతా చిత్రీకరించేదాన్ని

# ఆరవ అధ్యాయం

***అశోక్ నారాయణ్***

మైక్ ఢిల్లీ నుండి ఇంకా తిరిగి రావలసి ఉంది అతడి కుటుంబం అతడిని కలవటానికి ఇండియా వచ్చింది. తను గుజరాత్‌లో చేస్తున్న పని గురించి ఎక్కువ మాట్లాడొద్దని నేను చెప్పాను. దాదాపు ఇదే సమయంలో తెహల్కా సంజీవ్ భట్ అనే ఐపీఎస్ అధికారిది కవర్ పేజీ కథనం ప్రచురించింది. ఇన్వెస్టిగేషన్స్ ఎడిటర్ అయిన ఆశిష్ ఖేతాన్ ఇతడి వాంగ్మూలాన్ని ప్రచురించాడు. 2002 కల్లోలాల సమయంలో మోదీ పోలీసు అధికారులతో, ఇతర పౌర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో[9] ముస్లింలను చంపడానికి వారికి స్వేచ్ఛనిచ్చాడని సంజీవ్ భట్ అభియోగం ఆ సమావేశంలో తాను పాల్గొన్నానని అతడు చెప్పాడు గుజరాత్ కల్లోలాల గురించి రాస్తున్న జర్నలిస్టులు, కార్యకర్తలు, లాయర్లు ఆశ్చర్యపోయారు. నాకు తెలిసినవాళ్లు, నేను ప్రత్యక్షంగా మాట్లాడిన వాళ్ళు ఎవ్వరూ ఈ వాదనతో ఏకీభవించలేదు. డజన్ల కొద్దీ ఉన్నత బ్యురాక్రాట్లు, పోలీసు అధికారులు ఉన్న సమావేశంలో అటువంటి ఆదేశాలు ఏ ముఖ్యమంత్రి ఐనా సరే జారీ చేసి తన రాజకీయ జీవితాన్ని ప్రమాదంలో పడవేసుకోరని వారి వాదన ఎన్నో జవాబులేని ప్రశ్నలున్నాయి. ఇట్లా బయటకు వచ్చి ప్రకటన ఇవ్వడానికి సంజీవ్ భట్‌కు ఇంత కాలం ఎందుకు పట్టింది? గుజరాత్ గురించి ఎన్నో ఏళ్ళుగా రాస్తున్న నేను ఎప్పుడూ సంజీవ్ భట్ గురించి గానీ అతడు ఇంతకు ముందు ఏదైనా చెప్పాడని గానీ వినలేదు

షోమా నాకు ఫోను చేసి ఇతర అధికారులతో సంజీవ్ భట్ గురించి మాట్లాడించగలనా అని అడిగింది. దీని గురించిన ప్రశ్న అడగాలంటే నాకు కొంచెం సంశయంగా ఉంది ఇంత నిర్దిష్టమైన ప్రశ్న అంటే అది కొంచెం అనుమానాన్ని రేకెత్తించవచ్చు. ఎన్నో టెక్నికల్ కారణాల రీత్యా నేను సంజీవ్ భట్ చెప్పింది నిజమని నమ్మలేకపోతున్నానని షోమాతో చెప్పినట్టు గుర్తు అతడి వాంగ్మూలంలో లేశమాత్రమైనా

నిజమున్నా నేను కనుగొంటానని ఆమెకు హామీ ఇచ్చాను.

గుజరాత్ కల్లోలాల సమయంలో నిర్ణయాలు తీసుకునే అధికారుల్లో అతి ముఖ్యమైన వారిని కలవాలని నేను అనుకున్నా ఆ సమయంలో కీలక స్థానాల్లో ఉన్నది నలుగురు అధికారులు. హోం కార్యదర్శి అశోక్ నారాయణ్, డి.జి.పి. చక్రవర్తి, పోలీసు కమిషనర్ పి సి పాండే, 2002 కల్లోలాల సమయంలో ముఖ్యమంత్రికి ప్రధాన సలహాదారుగా ఉన్న స్వర్ణకాంత వర్మ నేను అప్పటికే అశోక్ నారాయణ్‌ను కలవటం మొదలుపెట్టాను

భట్ వాంగ్మూలాన్ని ప్రచురించిన 'తెహల్కా' రిపోర్టు ప్రకారం నానావతి కమీషన్ ఎదుట క్రాస్-ఎగ్జామినేషన్‌ను ఎదుర్కొన్నప్పుడు నేను పైన పేర్కొన్న చాలా మంది అధికారులకు మతిమరుపు ఆవహించింది

1988 బ్యాచ్‌కు చెందిన గుజరాత్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్ వాంగ్మూలం ప్రకారం అతను గుజరాత్ ముఖ్యమంత్రి మోదీ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నాడు ఆ సమావేశంలో మోదీ, మైనారిటీ సమూహానికి వ్యతిరేకంగా హిందువులు తమ ఆగ్రహాన్ని వ్యక్తపరచనిమ్మని పోలీసు అధికారులకు చెప్పాడు

తరువాత, 2014 అక్టోబరులో సుప్రీం కోర్టు సంజీవ్ భట్ విజ్ఞప్తిని కొట్టివేస్తూ, రాజకీయాలు, యాక్టివిజం ద్వారా కోర్టును ప్రభావితం చేసే ప్రయత్నమిది అని వ్యాఖ్యానించింది

> *తొమ్మిదేళ్ళ తరువాత అంతటి సంచలనాత్మక విషయాలు బయట పెట్టినవాడు ఈ-మెయిల్స్ ఎందుకు బయటపెట్టడం లేదో, అందుకు ఏం అడ్డుపడుతున్నదో, మౌనంగా ఎందుకు ఉన్నాడో అర్థం కాదు జస్టిస్ నానావతి కమీషన్ ఎదుట ఇచ్చిన వాంగ్మూలంలో ఈ-మెయిల్స్ గురించి ఏం పేర్కొనలేదు ప్రతిపక్ష రాజకీయ పార్టీ తనను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవటం లేదని అర్థమొచ్చేలా మెయిల్స్ పంపిన వాడు ఆ మెయిల్స్ గురించి కమిషన్ ఎదుట చెప్పకుండా ఏం ఆపిందో వివరించడం కష్టం మొత్తం పైన పిటిషనర్ ప్రవర్తన భరోసా కలిగించేది కాదు*

మోదీ అధికారంలోకి వచ్చాక 2015 ఆగస్టులో కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ సంజీవ్ భట్‌ను ఐపిఎస్ నుండి తొలగించివేసింది. సంజీవ్ భట్ సహోద్యోగుల ప్రకారం అతడెప్పుడూ వివాదాస్పదుడే అతడు చెప్పే వాటిలో ఎన్నో వైరుధ్యాలుండేవి

కాబట్టి 2002 రహస్యాలకు సంబంధించిన ఈ ప్రశ్నను అశోక్ నారాయణ్‌కు సంధించడం ఎంతో సబబు.

నేను అశోక్ నారాయణ్‌ను కలిసేనాటికి అతడు తన భార్యతో పాటు గాంధీనగర్‌లోని ఒక అందమైన పాత బంగాళాలో నివసిస్తున్నాడు. చాలా సమర్థవంతమైన గుజరాత్ పోలీస్ కంట్రోల్ రూం పుణ్యమా అని అతడిని చేరుకోవడం కూడా పెద్ద కష్టమేం కాలేదు 2010 డిసెంబర్ చివర్లో మా సమావేశం జరిగింది గుజరాత్‌లోని అత్యంత ప్రముఖ వ్యక్తులకు నివాళిగా నేను తీస్తున్న డాక్యుమెంటరీ గురించి అతడికి చెప్పాను అతడి ప్రతిభా పాటవాలు చాలా ఎన్నదగినవనీ, నా కొలీగ్‌తో పాటు నేను అతణ్ణి కలవాలనుకుంటున్నాననీ అన్నాను

అశోక్ నారాయణ్ ఇంటికి వెళ్ళే ముందు రోజు రాత్రి లెన్స్ సొల్యూషన్ అయిపోయిందని గమనించాను రాత్రి ఎనిమిది గంటలకు అత్యవసర వస్తువులు దొరకడమే కష్టం కాబట్టి నా సొల్యూషన్ ఎక్కడైనా దొరకగలదని ఆశించడమే దురాశ అవుతుంది. ప్రత్యామ్నాయంగా ఏం చేయవచ్చని నెట్‌లో వెతికాను నెట్‌లో ఒక చోట లెన్స్‌లను ఉప్పునీటిలో నానబెట్టవచ్చని ఉంది మరుసటి రోజు ఉదయం రోజువారీలాగే పార్లే జీ బిస్కట్లతో పాటు టీ తాగాక లెన్సులను ఉప్పు నీటి నుండి బయటకు తీసి కళ్ళకు పెట్టుకున్నా నా కళ్ళు మండసాగాయి పెనం పై నుండి పొయ్యిలోకి దూకానని అర్థమైంది ఐస్ ముక్కలు ఇవ్వమని కాలూభాయ్‌ని అడిగాను నా కళ్ళు ఎరుపెక్కి మండుతుండగా నేను ట్యాక్సీని పిలిచి నారాయణ్ ఇంటి అడ్రసు చెప్పాను నేను వెళుతుంటే తాను గాంధీనగర్‌లో ఉన్నాననీ, నేను కూడా చుట్టుపక్కలే ఉన్నానేమోనని కనుక్కుందామని మెస్సేజ్ చేస్తున్నట్టుగా అజయ్ నుండి ఒక మెసేజ్ వచ్చింది నేను చేరగానే నారాయణ్ భార్య నన్ను స్వాగతించింది. ఆమె చాలా స్నేహశీలియైన వ్యక్తి. బాగా పేరు పొందిన దుకాణం నుండి తెచ్చిన నమ్‌కీన్ (చిరుతిండి) పెట్టి మొత్తం నాతో తినిపించింది నారాయణ్ డెబ్భైల్లో వున్న పెద్ద మనిషి. ఆయన తయారవుతున్నాడనీ, వచ్చేస్తాడనీ చెప్పింది రెండు కప్పులు టీ తాగేలోగా నా కుటుంబ జీవితం గురించి, కాన్పూర్‌లో మా పూర్వీకుల ఇల్లు గురించి, నా పెళ్లి విషయం గురించి మాట్లాడేసింది ఆమె ఒక చదువుకున్న సాధారణ మధ్య తరగతి మనిషి. ఆమె కూతుళ్ళిద్దరూ విదేశాల్లో ఉన్నారు ఆమె తన గృహస్థ జీవితంతోనే చాలా సంతోషంగా ఉంది. ఆమె తన ఇద్దరు కూతుళ్ళ ఫోటోలు చూపించింది రెండో సారి నేను వెళ్లినప్పుడు పెళ్లి ఆల్బమ్ కూడా చూపిస్తానంది

చాలా స్నేహపూర్వకంగా హలో అని పలుకరిస్తూ అశోక్ నారాయణ్ గదిలోకి

వచ్చాడు తాను లేని సమయంలో తన భార్య మర్యాదలు సరిగ్గా చేసిందా లేదా అని అడిగాడు అశోక్‌జీకి మా నాన్న వయసుంటుండవచ్చు, లేదా బహుశా ఆయనకంటే పెద్దవాడే కావచ్చు "జీవించు, జీవించనివ్వు' అనే దాంట్లో విశ్వాసముంచే ఆధ్యాత్మికమైన మనిషి పౌరాణికాలపై, సాహిత్యంపై అతనికున్న పట్టు చూసి నేను ఆశ్చర్య పోయాను అతడో కవి కూడా. అతడికి ఉర్దూ కవిత్వమంటే చాలా ఇష్టం అతడు తానే రెండు సంకలనాలు వెలువరించాడు కూడా.

నేనొక ఉర్దూ రచయిత కూతురును. మా నాన్న రచనలకుగాను ఎన్నో ప్రశంసలు, పురస్కారాలు లభించాయి మా ఇంట్లో జరిగే మెహఫిల్‌లు, ముషాయిరాల (కవితా గోష్ఠులు) మధ్య నేను పెరిగాను అశోక్ నారాయణ్‌కు ఉర్దూ కవితలోనే జవాబు చెప్పాలని చాలా బలంగా అనిపించింది కానీ నన్ను నేను నిలువరించుకోవలసి వచ్చింది మైథిలి ఒక సంప్రదాయ సంస్కృత అధ్యాపకుడి కూతురు. విదేశాల్లోనే నివసించింది తన గుర్తింపులో భాగంగా మైథిలీకి ఒక సామాజిక వర్గంగా ముస్లింలంటే పెద్దగా అభిమానం లేదు.

అయితే గుజరాత్ కల్లోలాలతో ముడిపడి ఉన్న ఇతర అధికారుల వలె నారాయణ్ ఎటువంటి విద్వేషం కనబరచలేదు మతానికి సంబంధించిన విషయాలలో అతడు ఉదారవాది చాలా తరచుగా నేను ఆందోళనకు గురి కావడం గురించి అతనితో చెబితే నాకు ఆధ్యాత్మికత గురించిన ఒక ఈ-బుక్‌ను నాకు ఆ రాత్రి మెయిల్‌లో పంపించాడు ఈ కారణాలన్నింటి వల్ల కూడా గుజరాత్ అల్లర్లకు సంబంధించి, బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి కూడా అతడి నుంచి నేను సమాచారాన్ని రాబట్టగలననే విశ్వాసంతో ఉన్నాను నా విశ్వాసం వమ్ము కాలేదు గుజరాత్‌కు హోం కార్యదర్శిగా తాను పనిచేసినప్పుడు ప్రవీణ్ తొగాడియా తలపెట్టిన ర్యాలీతో సహా ఏ రాజకీయ ర్యాలీకి కూడా అనుమతినివ్వనని ఖచ్చితంగా చెప్పానని అన్నాడు గుజరాత్‌లో చాలా మంచి అధికారుల్లో ఒకరైన రాహుల్ శర్మను సస్పెండ్ చేయడాన్ని కూడా తాను వ్యతిరేకించానని అతనన్నాడు గుజరాత్ అల్లర్లు జరిగిన కొద్ది కాలానికే మోదీ ప్రభుత్వం రాహుల్ శర్మను సస్పెండ్ చేసింది

నాలుగు రోజులపాటు మా సంభాషణలు నడిచాయి ఈ సంభాషణలు చాలాసార్లు టీ తాగుతూనూ, ఒకరోజు మాత్రం భోజనం చేస్తూ నడిచాయి వాళ్ళు నన్ను భోజనానికి పిలిచిన రోజు మాత్రం నేను కొంచెం ఇబ్బంది పడ్డాను వాళ్ళు నన్ను తమదానిలాగా చూడటం మొదలుపెట్టారు తమ కూతుళ్ళు ఇంట్లో లేని లోటును నేను పూడుస్తున్నానని చాలాసార్లు అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ యంత్రాంగం

గుజరాత్ అల్లర్లకు మౌన ప్రోత్సాహం ఇవ్వడానికి వ్యతిరేకంగా అశోక్ నారాయణ్ దృఢంగా నిలబడకపోవడాన్ని గురించి విన్నప్పుడు నా హృదయం మౌనంగా ఏడ్చింది. ఇదేదో నేను వ్యక్తిగతంగా నిర్ధారణకు వచ్చినది కాదు. అశోక్ నారాయణే స్వయంగా తన మాటల్లో అన్నాడు

నేను నారాయణ్ కుటుంబంతో భోజనం చేయవలసిన రోజు వాళ్ళ గురించి సరిగా వివరాలన్నీ సేకరించేందుకు రెండు గంటల వెసులుబాటు అడిగాను నేను నాకు ఇష్టమైన ఆకుపచ్చ రంగు కుర్తా వేసుకొని ఒక శాలువా కప్పుకున్నా నేను ధరించిన రిస్ట్ వాచిలో కెమెరా మొదలైనప్పుడల్లా దాన్నుండి బలహీనమైన ఫ్లోరసెంట్ కాంతి వెలువడుతుంది కెమెరా అమర్చి ఉన్న నా డైరీని కూడా వెంటపెట్టుకున్నా ఇటువంటి సమావేశాలలో ఎటువంటి చాన్సు తీసుకోకూడదు. అందుకే వీలయినన్ని కెమెరాలు వెంటపెట్టుకుంటే మంచిది.

నేను వెళ్ళేసరికి లంచ్ తయారుగా ఉండింది. గుజరాత్ హోం కార్యదర్శిగా అత్యంత కీలకమైన అతని బాధ్యతల గురించి ఆ రోజే నేను లేవనెత్తాను అప్పుడున్న వాతావరణం సరిగ్గా సరిపోయింది. భోజనం చేస్తూ మాట్లాడే ముచ్చట్ల లాగానే నేను ఆ విషయం గురించి తేలిగ్గా మొదలు పెట్టాను నారాయణ్ ఎటువంటి శషభిషలు లేకుండా మాట్లాడాడు

భోజనం తరువాత మేం టీ తాగడానికి కూర్చున్నప్పుడు గుజరాత్ అల్లర్ల సమయంలో నరేంద్ర మోదీ ఎట్లా వ్యవహరించాడనేదాని వివరాల గురించి అతడు మాట్లాడటం ప్రారంభించాడు. 'నారాయణ్ గారూ, గతవారం రోజులుగా నేను మీ గురించి గూగుల్ సర్చ్ చేస్తున్నా. మీ పేరుతో గుజరాత్ అల్లర్లు, మోదీ, విభిన్న కమిషన్ల గురించి ఎన్నో లింకులను నా ముందుంచింది. నాకు చాలా తికమకగా ఉంది గుజరాత్ అల్లర్ల కాలంలో తప్పు చేసిన మోదీ లాంటి వివాదాస్పద వ్యక్తితో వ్యవహరించడం మీకు చాలా కష్టతరమై ఉంటుందనుకుంటా. మీ వంటి మానవతావాదీ, ఆదర్శవాద వ్యక్తిలో ఎటువంటి భావనలు చెలరేగి ఉంటాయో నేను ఊహించగలను

అట్లా మా సంభాషణ మొదలైంది

ప్రశ్న: అల్లర్లను నియంత్రించడంలో మీరు కొంచెం చూసీ చూడనట్టు వ్యవహరించమని ముఖ్యమంత్రి మీతో అన్నప్పుడు మీ ముఖం ఎర్రబారిపోయి ఉంటుంది

జవాబు: అతడెప్పుడు అలాంటి పని చేయడు ఏదీ కాగితం మీద కూడా పెట్టడు. అతడికి తన స్వంత మనుషులు ఉన్నారు. వారి ద్వారా విహెచ్‌పికి, విహెచ్‌పి

నుండి అనధికార ఛానల్ల ద్వారా కింది స్థాయి ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యేవి

ప్రశ్న దాంతో మీరు నిస్సహాయులై పోయేవారు కదా!

జవాబు అవును, అయ్యో ఇలా ఎందుకు జరిగింది అనుకుంటాం కానీ ఈ లోపే అది జరిగిపోయి వుంటుంది

ప్రశ్న విచారణ కమిషన్లకు మాత్రం ఏ సాక్ష్యం దొరకదు?

జవాబు ఎన్నోసార్లు మంత్రులే రోడ్లపై నిలబడి అల్లరి మూకలను రెచ్చగొట్టేవారు. నేనొకసారి ఆయన గదిలోనే ఉండగానే ఒక ఘటన జరిగింది అప్పుడు మాకొక ఫోన్ వచ్చింది ఒక మంత్రి ఇదంతా చేస్తున్నాడని నేను ఆయనకు చెప్పాను అతడు ఆ మంత్రిని వెనక్కి పిలిపించాడు కనీసం అప్పుడైతే ఆయన (మోదీ) ఆ మంత్రిని వెనక్కు పిలిపించాడు.

ప్రశ్న: ఆయన బిజెపి మంత్రినా?

జవాబు మరి ఇంకెవరు? అతడి మంత్రే ఒక పురుష మంత్రి.

ప్రశ్న మాయా కొడ్నాని కూడా ఉండింది కదా ఆమె ఇప్పుడు బాగా ప్రభుత్వ వ్యతిరేకిగా మారిందని విన్నాను.

జవాబు ఆమె కూడా ఉండి ఉండొచ్చు అవును

ప్రశ్న అంతా ఉన్మాదం కదా!

జవాబు నేను ప్రత్యక్షంగా నాకు తెలిసిన ఒక విషయం గురించి చెబుతాను నాకు ఒక ముస్లిం సివిల్ సర్వీసెస్ అధికారి తెలుసు పాలనా యంత్రాంగపు అధికారి అతడు నాకు ఫోన్ చేసి, సర్ నా జీవితాన్ని కాపాడండి, నా ఇంటిని (హిందువులు) చుట్టుముట్టి ఉన్నారని చెప్పాడు నేను పోలీసు కమిషనర్‌కు ఫోన్ చేశాను అతడు రికార్డు చేశాడో లేదో తెలియదు కానీ, ఆ మనిషైతే బతికి బయట పడ్డాడు మరుసటి రోజు ఆ అధికారి మళ్ళీ ఫోన్ చేసి, సర్, నిన్న ఎట్లాగో బయట పడ్డాను కానీ, ఈ రోజు మాత్రం బతికేలా లేము అన్నాడు

నేను మళ్ళీ కమిషనర్‌కు ఫోను చేసి అతణ్ణి కాపాడమని చెప్పాను పదిహేను రోజుల తరువాత ఆ అధికారి నా కేబిన్‌లోకి వచ్చాడు సర్, అంతటా ఉన్న కథే మా దగ్గర కూడా మా కాలనీలో హిందువులు మెజారిటీ ముస్లింలను చంపుతున్నారు 'మీరు ఫోన్ చేసినప్పుడు పోలీసు బలగం వచ్చింది ఒక మంత్రి బయట నిలబడి గుంపుకు నాయకత్వం

వహిస్తున్నాడు పోలీసు అధికారి అతడికి సెల్యూట్ చేశాడు అంతా బాగానే ఉంది అని అతడు పోలీసు అధికారితో అన్నాడు ఆ తరువాత, ఒక పోలీసు అధికారి నన్ను గుర్తించి రక్షించాడు

ప్రశ్న. కానీ ఆ మంత్రి జైల్లో ఉన్నాడు కదా?

జవాబు· అందరూ బయటకు వచ్చారు. ఎవరో ఒకరు చేయాలి కానీ, ఎవరో ఒకరు సాక్ష్యం చెప్పకపోతే ఎలా చేయగలరు?

ప్రశ్న: అలా చెయ్యడానికి ఎవ్వరికీ దమ్ములేవంటారా?

జవాబు: ఎవ్వరికీ దమ్ములేవు.

ప్రశ్న: మంత్రులపై ఎవరు చర్యలు తీసుకుంటారు?

జవాబు. హోం కార్యదర్శిగా పనిచేసిన తర్వాత నేను విజిలెన్స్ కమిషనర్ గా వున్నాను ప్రతి రాష్ట్రంలో లోకాయుక్త ఉంటాడని మీకు తెలుసా? మంత్రుల సంగతి అతనే చూస్తాడు నేనొకరోజు అతని గదిలోకి వెళ్ళాను ఏసీ గదిలో ఈగలుండవు కానీ లేకపోతే ఈగలు తోలుకుంటూ కూచున్నాడని అనేవాణ్ణి ఏం జరుగుతోందండీ అని అన్నా. "ఏం చెయ్యమంటారు సర్, ఎవ్వరూ మంత్రుల గురించి ఫిర్యాదు చెయ్యరు లంచగొండితనం గురించే మంత్రులకు వ్యతిరేకంగా నిలబడటానికి ఎవ్వరూ సిద్ధం కాకపోతే ఇక అల్లర్లకు బాధ్యులైన మంత్రులకు వ్యతిరేకంగా నిలబడే ధైర్యం ఎవరు చేస్తారు? ఎవరు కొరివితో తలగోక్కుంటారు? వాళ్ళు చాలా తెలివి మంతులు. ఫోన్లో చాలా తెలివితో మాట్లాడతారు పోలీసు అధికారులకు ఫోన్ చేసి 'ఆ ప్రాంతాన్ని కొంచెం చూసుకో' అంటారు ఒక సాధారణ వ్యక్తికి దీనర్థం 'ఆ ప్రాంతంలో అల్లర్లకు ఎటువంటి ఆటంకం కలిగించవద్దని ' వాళ్ళు తామే ప్రత్యక్షంగా చెయ్యరు. వాళ్ళకు ఏజంట్లు, ఏజెంట్లకు ఏజెంట్లు ఉంటారు ఎఫ్ ఐ ఆర్ లేమో సమూహాలపై రిజిస్టర్ చేస్తారు సమూహాన్ని ఎట్లా అరెస్టు చేస్తారండి?

ప్రశ్న. మరి మతకల్లోలాలపై విచారణ కోసం నియమించిన కమిషన్ల మాటేమిటి?

జవాబు నానావతి కమిషన్ అని ఉండేది దాని వల్ల ఇంకా ఏమీ ఒరగలేదు వాళ్ళు ఇంకా ఏ నివేదికా ఇవ్వలేదు

నేను హోం కార్యదర్శిగా ఉన్నప్పుడు, లిఖిత ఆదేశాలు ఉంటే తప్ప ఏమీ చెయ్యగూడదని ఆదేశాలిచ్చాను బంద్ పిలుపునిచ్చినప్పుడు ముఖ్య కార్యదర్శి సుబ్బారావు నన్ను పిలిచి, విహెచ్‌పి నాయకుడు ప్రవీణ్ తొగాడియా ఒక ర్యాలీ

తీయాలని అనుకుంటున్నాడు, నీ అభిప్రాయమేమిటని అడిగాడు. అనుమతి నివ్వకూడదనీ, ఇస్తే పరిస్థితులు అదుపు తప్పుతాయనీ చెప్పాను. ముఖ్య మంత్రికి ఈ విషయం తెలిసింది మీరెలా అట్లా అంటారని అడిగాడు అనుమతినివ్వాలని చెప్పాడు సరే అట్లాగయితే నాకు లిఖిత ఆదేశాలివ్వండని అడిగాను అతను నన్ను తేరిపార చూస్తూ ఉండిపోయాడు

గుజరాత్‌లో హిందుత్వ పెరుగుదల మోదీ, తొగాడియాల పేర్లతో ముడిపడి ఉన్నది మోదీ(64), తొగాడియా(58) లు కలిసి ఆరెస్సెస్ శాఖలకు వెళ్ళేవారు వీరిద్దరూ మోటారు సైకిల్‌పై లేదా స్కూటర్ పై గుజరాత్ రాష్ట్రమంతా తిరిగి సంఘ పరివార్ సిద్ధాంతాన్ని ప్రచారం చేసేవారని కథనంలా చెప్పుకుంటారు తొగాడియా బైక్ నడుపుతుంటే మోదీ వెనక కూర్చునేవాడు తొగాడియా క్యాన్సర్ సర్జన్. ఇతడు 1983లో విహెచ్‌పిలో చేరాడు మోదీ ఆరెస్సెస్‌కు పూర్తి కాల ప్రచారక్ 1984లో బిజెపిలో చేరాడు కేశుభాయి పటేల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వీరిద్దరూ కోర్ కమిటీలో ఉండి ప్రభుత్వానికై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేవారు. కేశుభాయ్ పటేల్‌పై శంకర్ సింగ్ వాఘేలా తిరుగుబాటు చేసినపుడు మోదీ పటేల్ వెనుక దృఢంగా నిలబడ్డాడు వాఘేలా తొగాడియాను జైల్లో కూడా పెట్టించాడు.

1995 నుండి 2001 దాకా మోదీ గుజరాత్ నుండి దాదాపు బహిష్కరణకు గురైనవాడిగా జీవించాడు ఆ కాలంలో అతడు అతణ్ణి స్వాగతించని బిజెపి కార్యాలయంలో కంటే ఎక్కువగా విహెచ్‌పి కార్యాలయంలోనే గడిపేవాడు

మోదీని గుజరాత్ ముఖ్యమంత్రిగా తీసుకురమ్మని అక్టోబరు 2001లో తొగాడియాను ఒప్పించింది అద్వానీ అని భోగట్టా [10] తొగాడియా ఈ మార్పుకు ఒప్పుకొని తన కుడిభుజమైన గోర్ధన్ జడాఫియాను మోదీ మంత్రివర్గంలో గృహ మంత్రిత్వ శాఖలో సహాయమంత్రిగా చేర్పించాడు కాషాయీకరణ చెందిన పోలీసు అధికారుల నియామకాలలో తొగాడియా ముఖ్య భూమిక నిర్వహించాడు. గోధ్రా ఘటన అనంతరం 2002 ఫిబ్రవరి-మార్చిలో విహెచ్‌పి, బజరంగ్‌దళ్ కార్యకర్తలు రాష్ట్రమంతటా అల్లర్ల సమయంలో సృష్టించిన భయోత్పాతంలో పై పోలీసు అధికారులు చాలా వివాదాస్పదమైన పాత్ర నిర్వహించారు

ఈ మధ్య కాలంలో, పటేల్ సముదాయానికి నాయకుడిగా ముందుకు వచ్చిన 21ఏళ్ళ హార్దిక్ పటేల్ రిజర్వేషన్ల డిమాండుతో రాష్ట్రాన్నంతా స్తంభింపజేసాడు అతడు ఒరలోంచి ఒక కరవాలం బయటకు తీసి తాను ఎన్ని చేతులను నరికేసానో తెలుసా అని ఒక న్యూస్ రిపోర్టర్‌ను అడిగాడు కేశుభాయ్ పటేల్, ప్రవీణ్ తొగాడియాలే

హార్దిక్‌ను పెంచి పోషించారని అనుకుంటారు మోదీ వారిద్దరినీ పక్కన పెట్టేశాడు మోదీకి అత్యంత సన్నిహితురాలైన ప్రస్తుత గుజరాత్ ముఖ్యమంత్రిని తొలగించేందుకు హార్దిక్‌ను ఒక సాధనంగా వాడుతున్నారని అంటారు.[11] ఆనందిబెన్ కూడా ఒక పటేల్ ఆమె స్థితి గుజరాత్‌లోకి మోదీ రాకముందు కేశుభాయ్‌కు ఉన్న పరిస్థితి లాగానే ఉంది.

2002 గుజరాత్ అల్లర్ల కాలంలోనూ, ఆ తర్వాతా ప్రవీణ్ తొగాడియా హిందూ సమూహాన్ని రెచ్చగొట్టేవాడు విహెచ్‌పి కార్యకర్తలు ఇష్టారాజ్యంగా దాడులు చేశారు గుజరాత్‌లో ఇచ్చిన ఒక ఉపన్యాసంలో ఇలా రెచ్చగొట్టాడు [12]

> *'ఈ దేశం గాంధీని అనుసరిస్తుంది కాబట్టే గోద్రా స్టేషన్‌లో టెర్రరిస్టు దాడి జరిగింది మనం ఫిబ్రవరి 28వ తేదీన గాంధీని మూలకు పడేశాం (ముస్లింలారా) మిమ్మల్ని మీరు మార్చుకోండి లేదా మేము గాంధీని ఎప్పటికీ మర్చిపోతాం మనం గాంధీ అహింసా సిద్ధాంతాన్ని అనుసరించినంత కాలం, ముస్లింల ఎదుట తలవంచినంత కాలం ఉగ్రవాదాన్ని రూపుమాపలేము నా సోదరులారా, మనం గాంధీని వదిలెయ్యాలి మీకు రామాయణం తెలుసు కదా గోద్రా ఘటనతో దీనికి సంబంధం ఉంది ఫాలియా సిగ్నల్ వద్ద ఉదయం 7 45కు ఐ6 కోచ్‌కు నిప్పు పెట్టడమంటే, ఆంజనేయుడి తోకకు నిప్పు పెట్టడమే '*
>
> *శ్రోతలు కరతాళధ్వనులు చేస్తూ జై శ్రీరామ్ అనే నినాదాలు ఇస్తారు ఇక అప్పుడు అతను ఆ రాత్రి వేలాది సంఖ్యలో హాజరైన సమూహాన్ని ప్రశ్నిస్తాడు*
>
> *'ఆంజనేయుడి తోకకు నిప్పు పెట్టిందెవరు?' 'రావణుడు!' 'ఆంజనేయుడు వ్యాహ్యాళికై బయలుదేరి గోద్రాకు వచ్చాడట (నవ్వులు, జై జైకారాలు) హనుమాన్‌జీ హలోల్, కలోల్, సర్దార్‌పురా వెళ్ళాడు కర్ణావతికి (అహ్మదాబాద్) వచ్చి అక్కడే ఉండిపోయాడు మళ్ళీ వెనక్కు పోవడానికి ఇష్టం లేదట '*

ఎవరిని ఉద్దేశించి అంటున్నాడో స్పష్టం రావణుడంటే ముస్లింలు గుజరాత్‌లో ముస్లింలను చంపమని, ఊచకోత కొయ్యమని అది ఒక పిలుపు తొగాడియా ఇట్లా బాగా కష్టపడుతుంటే, మోదీని మెజారిటీ హిందూ ప్రజల హిందూ హృదయ

సామ్రాట్టుగా భావించటం రోజు రోజుకూ పెరిగింది. హిందువులను అంతం చేయడానికే ముస్లింలు ఉన్నారని నిరంతరం గుర్తు చేసేవారు అయితే ఈ స్నేహమంతా మోదీ ముఖ్యమంత్రి ఐన కొద్ది రోజులకే అంతమైంది వాళ్ళిద్దరూ విడిపోయారు టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన ఒక రిపోర్టు దీన్నంతా స్పష్టంగా బయటపెట్టింది

> *'2002 డిసెంబరు అసెంబ్లీ ఎన్నికలలో తొగాడియా బిజెపి సమర్థనలో నూరుకు పైగా ర్యాలీలను సంబోధించాడు హెలికాప్టర్‌లో రెండు వారాల పాటు ఏకబిగిన సుడిగాలిలా పర్యటించాడు అయితే మోదీ ఎన్నికలలో గెలిచాక పరిస్థితి మారిపోయింది వెంటనే జొడాఫియాను తన మంత్రివర్గంలో నుండి తొలగించి తన పాలనలో తొగాడియా జోక్యం అనవసరమని స్పష్టమైన సంకేతం ఇచ్చాడు తొగాడియాతోనూ, ఇతర సంఘ పరివార్ సంస్థలతోనూ సంప్రదించడం ఆపేసాడు '*

అశోక్ నారాయణ్‌ను కలిసిన కొద్ది రోజుల్లోనే, గుజరాత్ అల్లర్ల పైన అతను చెప్పింది రికార్డు చేసుకున్నాక, నేను అతని సన్నిహిత మిత్రుడు, విశ్వాసపాత్రుడు అయిన చక్రవర్తి గారిని కలవాలనుకుంటున్నానని చెప్పాను చక్రవర్తి కల్లోలాల సమయంలో పోలీసు డి జి ఆ భయానక రోజులలో నారాయణ్ జీవితంలో కొంత కష్టాలు తగ్గించింది చక్రవర్తేనని నారాయణ్, అతని భార్య చాలా సార్లు అనటంతో నాకు అతని పాత్ర గురించి కొంత తెలిసింది ఆ సమయంలో పోలీసు అధికారుల్లో అత్యధికులు మోదీ ప్రభుత్వానికి తమ నిజాయితీనంతా తాకట్టు పెట్టేసిన సమయం చక్రవర్తితో జరిగిన సమావేశాలు, అతను బయటపెట్టిన విషయాల గురించి వచ్చే అధ్యాయంలో చర్చిస్తాను కానీ, ఈ అధ్యాయంలో అశోక్ నారాయణ్‌తో జరిగిన మిగిలిన సంభాషణను పాఠకులతో పంచుకోవటం ముఖ్యం ఈ సరికే నేను ముంబయిలో చక్రవర్తిని కలిసి నా మొదటి సమావేశాన్ని ముగించాను కాబట్టి గుజరాత్ అల్లర్ల కాలంలో ఇతర అధికారుల పాత్ర గురించి మాట్లాడటం సులభమైంది అనుమానం రేకెత్తించలేదు

ప్రశ్న *చక్రవర్తి అటువంటి వివాదాస్పదమైన వ్యక్తా?*

జవాబు *అప్పుడు అతడు పోలీసు శాఖ అధిపతి ఏం జరిగినా దాని గురించిన నింద అతడిపై, గృహశాఖపై వస్తుంది సంజీవ్ భట్ ఐ బి లో ఉన్నాడు చక్రవర్తి అప్పుడు డి జి*

ప్రశ్న: మీరు ఆ సమావేశంలో లేరా?

జవాబు: ఏ సమావేశంలో ?

ప్రశ్న: ముఖ్యమంత్రి పోలీసు అధికారులను, ఇతర ఉన్నత అధికారులను (అల్లర్లను నియంత్రించడంలో) చూసీ చూడనట్టు వ్యవహరించమని చెప్పాడన్న చాలా వివాదాస్పద సమావేశం.

జవాబు అవును, అవును నేను ఆ సమావేశంలో ఉన్నా నీకు చెప్పాను కదా!

ప్రశ్న: అయితే మిమ్మల్ని సిట్ పిలవలేదా?

జవాబు: అయ్యో, పిలిచారు, బాగా ప్రశ్నించారు కూడా. అందుకే ఆ సమావేశం అందరినీ ఇరికించిందని చక్రవర్తి అన్నాడు చక్రవర్తి కూడా ఆ సమావేశంలో ఉన్నాడు

ప్రశ్న: ముఖ్యమంత్రికి సన్నిహితులైన పి సి పాండే లాంటి కొందరు అధికారులను (ముఖ్య మంత్రి) కాపాడాడని చక్రవర్తి అన్నారు

జవాబు: కాదు సిట్ కారణంగానే పి సి ఆ తరువాత వివాదాస్పదుడయ్యాడు అతడు కూడా వివాదాస్పదుడయ్యాడని నా ఉద్దేశ్యం

ప్రశ్న అతడు ముఖ్యమంత్రికి చాలా సన్నిహితుడని విన్నాను

జవాబు. అవును నీవు పాలక పార్టీ చెప్పినట్టు విని వారి కనుసన్నల్లో మెలిగితే, నీకే సమస్య రాదు.

ప్రశ్న. అతడు పూర్తిగా ముఖ్య మంత్రి మనిషా?

జవాబు అవును ఒకవేళ అతడలా ఉండకపోతే, చక్రవర్తిలాగానే అతణ్ణి కూడా తీసి అవతల పారేస్తారు నా విషయంలోనైతే నా జూనియర్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించాలనుకున్నారు. కాబట్టి నాకు ఓ రిటైర్‌మెంట్ జాబ్ ఇచ్చారు.

ప్రశ్న: ఎంత కుటిలత్వం కదా!

జవాబు అట్లా నేను విజిలెన్స్ కమిషనర్‌ను అయ్యా

అతనే కాదు, అతని వంటి ముగ్గురు అధికారుల విషయంలో కూడా అలాగే చేశారు (అని అతడి భార్య జోడించింది)

ప్రశ్న మీరు చెప్పిన శ్రీకుమార్ విషయం కూడా అంతే కదా!

జవాబు: అవును. అతడు నీ డాక్యుమెంటరీకి చాలా మసాలా అందివ్వగలడు చాలా మట్టుకు సంచలనాత్మకమైనవి చెప్తాడు నవ్వు తెప్పించే విషయమేమిటంటే, అల్లర్ల కాలంలో శ్రీకుమార్ సైడ్ పోస్టింగ్ లో ఉన్నాడు

అల్లర్ల తర్వాత నేను, చక్రవర్తి చేసిన సిఫారసు కారణంగా ఈ పోస్టులోకి వచ్చాడు. అతడికి సిబిఐ అనుభవముంది.

కానీ, తరువాత కాలంలో అతడు తాను లేని కాలంలోని ఘటనల గురించి కూడా అఫిడవిట్లు దాఖలు చేయడం మొదలుపెట్టాడు. దాంతో తరువాత అతణ్ణి కూడా పక్కకుపెట్టి అతని జూనియర్‌కి పదోన్నతి కల్పించారు నిజానికి ముఖ్య మంత్రి అతణ్ణి సస్పెండ్ చేయాలనుకున్నాడు. మేమే వద్దన్నాం. అతడు పత్రికల్లో ప్రచారం కోసమే పని చేస్తున్నట్టు అనిపించాడు. మా విషయాలు పత్రికలకు లీక్ చేసేవాడు

ప్రశ్న ముఖ్యమంత్రి పై ఎందుకంత విరుచుకుపడుతున్నారంటారు? ఆయన బిజెపి వాడనా?

జవాబు కాదు అల్లర్ల సమయంలో అతడు విహెచ్‌పి కి మద్దతు నిచ్చాడు కాబట్టి. హిందువుల ఓట్లు పొందడానికి అతడలా చేశాడు అతనికి దొరికాయి అతడు ఏం చేయదలుచుకున్నాడో అది చేశాడు అదీ జరిగిన విషయం

ప్రశ్న కానీ, అతను అల్లర్లను చూసీ చూడనట్టు వదిలెయ్యమన్నాడు కదా!

జవాబు అతడు ఒక సమావేశంలో ఆ మాట చెప్పడు అతడు ఆ విషయం తన మనుషులకు చెప్తాడు. వాళ్ళు విహెచ్‌పికి, టాండన్ వంటి అధికారులకు తెలియజేస్తారు ఒక అధికారిగా ఎవరైనా వాళ్ళు చెప్పింది వినాలా లేదా నిర్ణయించుకోవాలి

ప్రశ్న చక్రవర్తి వినలేదా?

జవాబు మేమిద్దరమే వినలేదు మా పని మేం చేసాం ప్రజలకు సేవ చేసేందుకు ఉద్యోగంలో చేరాను కానీ పాలక పార్టీకి సేవ చేసేందుకు కాదని నేను వాళ్ళతో చెప్పాను

ప్రశ్న మిగిలిన వాళ్ళు కూడా అలాగే ఎందుకు చేయలేదు.

జవాబు ఎందుకంటే వాళ్ళు ఏ ఇబ్బందీ కలుగకూడదనుకున్నారు తాము తమకొక లక్ష్యం నిర్దేశించుకున్నారు అందుకోసం రాజీ పడ్డారు.

చక్రవర్తి లాంటి వాళ్ళను చూడండి వాళ్ళకు ప్రమోషన్లు రాలేదు. విదేశాలకు పంపలేదు కానీ అంతరంగం చెప్పింది అతడు చేసాడు.

ప్రశ్న ఈ వివాదాస్పద సమావేశం గురించి బయటివాళ్లకు ఎలా తెలిసింది?

జవాబు హరేన్ పాండ్యా అనే ఒక మంత్రి ఉండేవాడు. మీడియాకు మొదట చెప్పింది అతనే

ప్రశ్న: ఆ సమావేశంలో ఎవరెవరు ఉన్నారు?

జవాబు: ప్రధాన కార్యదర్శి, సహాయ ప్రధాన కార్యదర్శి, హోం కార్యదర్శి, డిజిపి, మరి కొందరు అధికారులు.

పై సంభాషణను చూస్తే గుజరాత్ అల్లర్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఏ మేరకు కుమ్మక్కై ఉందో ప్రతి సాధారణ వ్యక్తికి కూడా అర్థమవుతుంది అశోక్ నారాయణ్ చెప్పిన విషయాలు చాలా మందికి తెలిసిన విషయాలే కానీ ఏ అధికారి కూడా ప్రత్యక్షంగా చెప్పని విషయాలు అదీ గుజరాత్ అల్లర్ల కాలంలో ఏ అధికారిపై అందరి చూపులు నిలిచాయో ఆ అధికారి నోటిగుండా వెలువడిన విషయాలివి. గుజరాత్ అల్లర్ల గురించి మాట్లాడినప్పుడు అప్పటి సామాజిక, రాజకీయ సందర్భాన్ని గురించి పూర్వ హోం కార్యదర్శి చెప్పిన విషయాలు, నరేంద్ర మోదీకి వాటికున్న ప్రాముఖ్యత ముఖ్యమైనవి అతడు వాస్తవాలను, కల్పనలను ఎప్పుడూ జోడించలేదు కనుక నిజానికి దగ్గరలో ఉన్నాడని భావించవచ్చు శ్రీకుమార్ మీడియాకు అఫిడవిట్లను లీక్ చేసిన దానిగురించి కూడా తన సందేహాలను వ్యక్తం చేశాడు గుజరాత్ అల్లర్ల కాలంలో గాంధీనగర్‌లో జరిగిన సమావేశం గురించి కూడా అతడు మాట్లాడాడు కానీ, ముస్లింలపై దాడులు చేయాలని ముఖ్యమంత్రి స్వయంగా ఆదేశాలు జారీ చేశాడని మాత్రం ఎక్కడా అనలేదు తమ సన్నిహిత అధికారులకు వ్యక్తిగతంగా ఆదేశాలు ఇచ్చారని సున్నితమైన వాదన చేసాడు

మర్యాదస్థుడు, నిరాడంబరుడైన ఈ వ్యక్తి నానావతి కమిషన్ ముందు క్రాస్-ఎగ్జామినేషన్ సమయంలో కూడా బహిర్గతం చేయని విషయాలు నాతో చెబుతుంటే విన్నా.

*జవాబు: బిజెపి ప్రోద్బలంతో విహెచ్‌పి బంద్‌కు పిలుపిచ్చింది దాంతో మొదలైంది*

*ప్రశ్న: దానితో వ్యవహరించడం మీకు పెద్ద సమస్య అయిందా?*

*జవాబు అవును బిజేపి నుండి సంకేతం వెళితే తప్ప దానితో వ్యవహరించడం చాలా కష్టం*

*ప్రశ్న: మోదీకి ఉన్న ప్రతిష్ఠ ఎటువంటిది?*

*జవాబు. మోదీని పూజిస్తారు సంప్రదాయ హిందువులు అతడే తమ జెండాను ఎత్తిపడుతున్నాడని అనుకుంటారు*

*ప్రశ్న. అతడి పాత్ర పక్షపాతపూరితంగా లేదా?*

*జవాబు. అతడు గోధ్రా ఘటనకు, కల్లోలాలకు క్షమాపణ అడిగి ఉంటే బావుండేది*

*ప్రశ్న కానీ మోదీ పక్షపాతపూరితంగా వ్యవహరించాడనీ, గోధ్రా నుండి శవాలను*

అహ్మదాబాద్ తెప్పించడం వంటి చర్యలతో రెచ్చగొట్టాడనీ, నిర్ణయాలపై తాత్సారం చేశాడనీ నాతో కొందరు అన్నారు.

జవాబు అహ్మదాబాద్‌కు శవాలను తీసుకురావాలనే నిర్ణయం తీసుకున్నది అతనేనని నేనొక ప్రకటన ఇచ్చాను

ప్రశ్న ప్రభుత్వం మీకు వ్యతిరేకంగా మారిపోయి ఉంటుంది కదా!

జవాబు అహ్మదాబాద్‌కు శవాలను తీసుకురావడం వల్ల పరిస్థితి పూర్తిగా అగ్గిరాజేసినట్టయింది కానీ ఆ నిర్ణయం తీసుకున్నది అతడే

మేం మాట్లాడుతున్నప్పుడే అశోక్ నారాయణ్ వద్దకు అనుకోకుండా కైలాస్ నాధన్ అనే అతను వచ్చాడు అతడు మోదీకి అత్యంత సన్నిహితుడు ఆ కాలంలో మోదీకి ప్రధాన సలహాదారుగా ఉండేవాడు. తన బావమరిది రాబోయే హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయాలను కుంటున్నాడని నారాయణ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో మెసేజ్ పెట్టి రావడంతో కైలాస్ నాధన్ కలవడానికి వచ్చాడు ముఖ్యమంత్రి కాకముందు మోదీ హిమాచల్ ప్రదేశ్ బాధ్యతలు చూసే వాడు దాని వల్ల అతడికి ఆ రాష్ట్రంలో ఇంకా చాలా పట్టు ఉండేది

ఇది చాలా ఇబ్బందికరమైన విషయం అధికారులు నరేంద్రమోదీకి వ్యతిరేకంగా గట్టిగా నిలబడకపోవడానికి ఇది ఒక కారణమా? అతడు జాగ్రత్తగా చూపే దాతృత్వ గుణం ఇందుకు కారణమా? ఇది నన్ను చాలా అసౌకర్యానికి గురిచేసింది

కైలాస్ నాధన్ వెళ్లిపోయాక, ఆయన ఎంత ముఖ్యమైన వ్యక్తో అశోక్ నారాయణ్ భార్య నాతో చెప్పింది ఫిల్మ్ తీయడంలో నాకేదైనా సమస్య ఎదురైతే ఇతని సాయం తీసుకొమ్మని చెప్పింది

ప్రధాన సలహాదారు వెళ్లిపోయాక, మా సంభాషణ కొనసాగింది.

ప్రశ్న మీ ఉద్యోగ కాలంలో ఎక్కువ సవాలునెదుర్కొన్న విషయమేది?

జవాబు కల్లోలాల సమయంలో అంత మంది చనిపోవటం నా కెప్పుడూ బాధాకరమే మేమేందుకు రాజీనామా చేయలేదని చాలా మంది విలేఖరులు అడిగారు నేను తప్పు చేశానని అనిపిస్తే రాజీనామా చేసేవాడినని నేను వాళ్ళతో చెప్పాను

ప్రశ్న కానీ వాళ్ళ తప్పేమీ లేదు. కాకపోతే మీరు ఒక అనిశ్చిత రాజకీయ పరిస్థితిలో చిక్కుకుపోయారు .

జవాబు ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటువంటి అల్లర్లను ఎదుర్కోవలసి రాలేదు అల్లర్లను అదుపు చేయడానికి మా వద్ద నాలుగు కంపెనీల బలగాలు

మాత్రమే ఉన్నాయి. సి.ఆర్ పి.ఎఫ్ కూడా అంత సమర్ధవంతమైనదేమీ కాదు. కానీ, మావద్ద కనీసం ఒక్క టీం ఉండినా బావుండేది. పైగా కేంద్రంలో కూడా బి జె పి ప్రభుత్వమే ఉండింది

ప్రశ్న: అంటే ముఖ్యమంత్రి చాలా సులభంగా మరిన్ని బలగాల కోసం కేంద్రాన్ని అడిగి ఉండేవాడు. కేంద్రం, రాష్ట్రం కుమ్మక్కైనాయంటారా?

జవాబు: కుమ్మక్కు ఉంది మా ముఖ్య మంత్రి ఎప్పుడు కావలిస్తే అప్పుడు అద్వానీజీతో మాట్లాడగలిగేవాడు.

ప్రశ్న: వాళ్ళు మంచి మిత్రులని నేను విన్నా

జవాబు: చాలా మంచి స్నేహితులు ఇది కూడా ఒక అంశమే.

ప్రశ్న: ఏ బలగాలు లేవన్నమాట. మరి మీరు ముఖ్యమంత్రితో చెప్పలేదా?

జవాబు: అతడికంతా తెలుసు. అతడికి తెలవదని నీవనుకుంటున్నావా? రెండవది హిందూ సముదాయం. వాళ్ళ ప్రవర్తనతో నా తల తిరిగిపోయింది. సిగ్గు, లజ్జ లేకుండా ఇళ్ళు దోచుకున్నారు. కార్లలో వచ్చి లూటీ చేసి పోయేవారు మహా ఘోరమైన మనుషులు

ప్రశ్న: వాళ్ళెందుకు ఇలా ప్రవర్తించారు?

జవాబు. గోద్రా ఘటన.

ప్రశ్న: అదే మనుషులకు మళ్ళీ రిపోర్టు చేయవలసి రావటంతో మీరు చాలా ఘర్షణ పడి ఉండొచ్చు కదా!

జవాబు: తప్పు పనులు చేయమని నాకు చెప్పే ధైర్యం ఎవరికీ లేదు.

ప్రశ్న మీ పైన ప్రభుత్వం ఆగ్రహించిందా?

జవాబు: సహజంగానే ఆగ్రహించింది. ఆదేశం ఏదైనా కానియ్యండి. నాకది లిఖితపూర్వకంగా ఇవ్వమని అడిగేవాణ్ణి కింది స్థాయిలో ఉన్న అధికారులందరికీ అటువంటి నేరాలు చేస్తున్న రాజకీయ నాయకులను అరెస్టు చేసే అధికారం ఉంది కానీ రాజకీయ ఒత్తిడి వల్ల వారంతా రాజీపడిపోయారు

ప్రశ్న అల్లర్ల సమయంలో ఇదేనా జరిగిందా?

జవాబు: అవును. మొబైల్ ఫోన్ల ఈ కాలంలో, కాగితాల మీదే ఆదేశాలు ఇవ్వనవసరం లేదు ఒక కాల్ చేస్తే చాలు.

ప్రశ్న ముఖ్య మంత్రికి మీరంటే ద్వేషంగా ఉండి ఉంటుంది.

జవాబు: అతడికి నా పట్ల ద్వేషం ఉండేదని చెప్పలేను కానీ, నా స్థానంలో

ఇంకెవ్వరైనా ఉంటే బావుండని అనుకొని ఉంటాడు

ప్రశ్న అల్లర్లు ఎలా జరిగాయి?

జవాబు ఇదంతా విహెచ్‌పి ప్లాను చేసింది చాలా ఘోరం. గోధ్రా ఘటన, అల్లర్లు ఏవీ సమర్థనీయం కాదు

ప్రశ్న రైలు తగలబెట్టడానికి ప్రతిక్రియగా అల్లర్లు జరగలేదా?

జవాబు ఒక తప్పు మరో తప్పు వల్ల న్యాయసంగతం అయిపోదు.

ప్రశ్న ముఖ్యమంత్రి పదవినుండి దిగిపోవలసింది ఆయన ముఖ్యమంత్రి కదా, అంత జరిగిన తర్వాతైనా దిగిపోవలసింది.

ప్రశ్న: ఒక దశలో అతణ్ణి మార్చబోయారు గోవా సమావేశంలో బహుశా అతడు రాజీనామా చేశాడు కానీ రాజీనామాను ఆమోదించవద్దని అద్వానీ వాజ్‌పేయిపై ఒత్తిడి తెచ్చాడు అల్లర్ల గురించి నేను ప్రధాన మంత్రి వాజ్‌పేయికి ఒక ప్రెజెంటేషన్ ఇచ్చాను అప్పుడు మోదీ కూడా అక్కడే ఉన్నాడు

ప్రశ్న దీని గురించి ముఖ్యమంత్రి అసంతోషంగా ఉండి ఉంటాడు కదా?

జవాబు ఇది సంతోషంగా వుండడానికీ, లేకపోవడానికీ సంబంధించిన విషయం కాదు నేను ఒక ప్రెజంటేషన్ ఇవ్వవలసి ఉండింది అప్పుడు కూడా వాజ్‌పేయి మోదీపట్ల, అతడి పాత్ర పట్ల సంతోషంగా లేదు

ప్రశ్న అతడు కావాలనే చూసీ చూడనట్టు వ్యవహరించాడు. అతడు మరింత చురుకుగా చర్యలు చేపట్టి ఉండవచ్చు అతడు రాజకీయం ఆడాడు

జవాబు అతడు అప్పుడు దిగిపోయి ఉంటే అతడికి రాజకీయంగా లాభించేది ఇప్పుడు తన ఆ ఇమేజ్‌ను వదిలించుకోవటానికి అతడు ప్రయత్నిస్తున్నాడు

ప్రశ్న అతడు అధికారంలోకి వచ్చిందే మత ప్రాతిపదికన కదా! అతడి ..

జవాబు. 2002లో అతడికి అల్లర్ల కారణంగానే ఓట్లు వచ్చాయి 2007లో 'అభివృద్ధి' కారకుడు అనే ఇమేజ్ వలన ఎక్కువ ఓట్లు వచ్చాయి.

ప్రశ్న: ఇతర అధికారులు ఎలా వున్నారు?

జవాబు ఒక పూర్వ కార్యదర్శిగా నిర్మొహమాటంగా చెప్పాలంటే, డి జి పి నిజాయితీపరుడైన వాడే కానీ మెతక మనిషి ఒక పోలీసు అధికారి అంత మెతకగా ఉంటే సమర్థవంతంగా పని చేయలేడు. ఈ బలహీనత తప్ప, అతడు నిజాయితీపరుడే అల్లర్ల సమయంలో రాజకీయ ఆదేశాలకు అతడు తలఒగ్గలేదు. ఉదాహరణకు అధికారులను బదిలీ చేయమని ప్రభుత్వం

నుండి ఏదైనా ఒత్తిడి ఉంటే, అతడు ఒప్పుకునేవాడు కాదు. లిఖిత పూర్వకంగా ఆదేశాలు ఉంటేనే చేస్తాననేవాడు

ప్రశ్న: ప్రభుత్వానికి అతని పట్ల తిరస్కార దృష్టే ఉండి ఉంటుంది కదా

జవాబు. అవును నా మట్టుకు నాకు మంచి విషయమేమిటంటే, అల్లర్ల సమయంలో అతడు నాతో ఉన్నాడు. కనీసం ఒక నిష్పక్షపాతమైన మనిషి ఆ రకంగా అది మంచి మద్దతే.

సాంకేతికంగా చూస్తే కలెక్టర్లకు, జిల్లా మెజిస్ట్రేట్‌లకు ఉండే కొన్ని ప్రత్యేకమైన అధికారాలను మినహాయిస్తే, కేబినెట్ మంత్రులకు అన్ని అధికారాలు ఉంటాయి కానీ, కేబినెట్ మంత్రులు చట్టవ్యతిరేకమైన ఆదేశాలు ఇస్తే, నిరాకరించడానికి నీకు భారత రాజ్యాంగం అనుమతినిస్తుంది

ప్రశ్న: అల్లర్ల సమయంలో అట్లా నిరాకరించడానికి మీకు ధైర్యముండిందా?

జవాబు: మేమేం చెప్పాలో అది చెప్పాం. ఏదేమైనా అటువంటి ఆదేశాలు లిఖితపూర్వకంగా జారీ చేయటానికి వారెవరికీ దమ్ముల్లేవు కాబట్టి లిఖితపూర్వకంగా ఏముంటే దాన్ని నేను అమలు చేస్తానని చెప్పాను

ప్రశ్న: మరి మీరు ప్రభుత్వ ఆగ్రహాన్ని చవి చూసి ఉంటారే

జవాబు: చవి చూశాను. నాకు ముఖ్య కార్యదర్శి పదవి ఇవ్వలేదు ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్ల వంటి అధికారులకు ముఖ్యమంత్రితో సహా ఏ మంత్రినైనా అరెస్టు చేసే అధికారముంది. కానీ వాళ్ళు ప్రభుత్వ పక్షం వహించాలని నిర్ణయించుకున్నారు

ప్రశ్న: జరిగింది ఇదేనా?

జవాబు అవును మొబైల్ ఫోన్ల ఈ కాలంలో, 'పని' చెయ్యండని చెప్తారంతే ఈ అధికారులంతా తమ పదోన్నతుల కోసం పాకులాడుతారు

సైన్యం వచ్చినప్పుడు వాళ్ళకు రకరకాల సాధన సామాగ్రి అవసరమైంది నిజానికి అల్లర్లను నియంత్రించడానికి సరిపడిన బలగాలు మా వద్ద లేవు, బలగాలన్నీ అయోధ్యలో వున్నాయి కేంద్ర ప్రభుత్వం మాకు ఇవ్వలేదు

ప్రశ్న. అల్లర్లు ఎంత రాజకీయరంగు సంతరించుకున్నాయి?

జవాబు: మతోన్మాదంతో నిండి ఉండేవి విహెచ్‌పి ఇచ్చిన బంద్ పిలుపుకు పాలక పార్టీ మద్దతు నిచ్చింది అది ఒక పెద్ద సమస్య బిజెపి నుండి రాజకీయ సంకేతాలు పోతే తప్ప అల్లర్లు ఆగవని సీనియర్ పోలీసు అధికారులు మాతో అన్నారు. ఎందుకంటే మేం అల్లర్లకు పాల్పడుతున్న ప్రజల పక్షానే

ఉన్నామని వాళ్ళు భావిస్తారు

ప్రశ్న కానీ మోదీ విజయం మిగిలిన దేనికంటే కూడా, ప్రజాసంబంధాల (పి ఆర్ ) ఫలితమే ఎక్కువ అనిపిస్తుంది

జవాబు పూర్తిగా

ప్రశ్న 'వైబ్రంట్ గుజరాత్' అనే దాని వెనక ఉన్న ప్రచార ఆర్భాటం చూడండి 'అతడు తల ఊపాడు'

ప్రశ్న కానీ అతణ్ణి ఎందుకంతగా లక్ష్యం చేస్తున్నారంటారు?

జవాబు అతడు విహెచ్‌పి కి మద్దతుగా నిలబడ్డాడు కాబట్టి అతణ్ణి లక్ష్యంగా చేసుకున్నారు అతడు ఏం చేయాలనుకున్నాడో సరిగ్గా అదే చేసాడు ఏం కావాలనుకున్నాడో అదే పొందాడు చక్రవర్తి వంటి వాళ్ళు తమ అంతరంగం చెప్పింది విన్నారు కాబట్టి వారిని ఎవ్వరూ పొగడలేదు ఏ బహుమానం వారికి రాలేదు.

ప్రశ్న ప్రతి ఒక్కరూ ముఖ్య కార్యదర్శి జి సుబ్బారావును పొగుడుతున్నారే

జవాబు నిజమా?

ప్రశ్న నేను వ్యంగ్యంగా అంటున్నాను

జవాబు దురదృష్టవశాత్తు సుబ్బారావు ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని సంతోష పెట్టాలని అనుకుంటాడు కానీ అట్లా చేసి కూడా అతడేమీ విజయం సాధించలేదు (చిరునవ్వు నవ్వాడు)

ప్రశ్న ఎందుకు?

జవాబు అతడు పదవీ విరమణ చేశాక ప్రభుత్వం అతడికి ఐదేళ్ళపాటు పదవీకాలాన్ని పొడిగించింది

ప్రశ్న నేను నా ఫిల్మ్‌లో అల్లర్ల గురించి ఏ మేరకు పేర్కొనవచ్చు?

జవాబు అలా చేస్తే అల్లర్లు వివాదాస్పదమైనవి కాబట్టి నీ ఫిల్మ్ కూడా వివాదాస్పదమౌతుంది

ప్రశ్న నేను మీ ముఖ్యమంత్రిని అల్లర్ల గురించి ఒక్క ప్రశ్న కూడా అడగలేదు

జవాబు నీవు ఒకవేళ అడిగి ఉంటే, అతడు నిన్ను పక్కదారి పట్టించి ఉండేవాడు రెండవసారి కలిసేవాడు కాదు

ప్రశ్న భట్ వంటి వ్యక్తి ఎందుకని ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారాడు?

జవాబు ఏదైనా కారణం తప్పక ఉండిఉంటుంది అతడి బాస్ ఎవరైనా కావచ్చు

కానీ వాళ్ళు చెప్పి ఉంటారు వాళ్ళ ప్రోద్బలంతోనే అట్లా బయటపడి ఉండవచ్చు

ప్రశ్న అతన్ని ఏ మేరకు విశ్వసించవచ్చు?

జవాబు. అతడు విశ్వసనీయుడు కాదు

ప్రశ్న: సరే మరో విషయం. మాయా కొడ్నాని నాకు జయంతి రవి గురించి చెప్పింది. –

జవాబు అచ్ఛా .

ప్రశ్న . ఆమె చాలా ప్రభుత్వ వ్యతిరేకిలాగా అనిపించింది

జవాబు: ఇప్పుడు అలా ఉంది. మొదట అలా కాదు మొదట ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని సమర్థించేది

ప్రశ్న: ఆమెకు రక్షణగా ఎవరూ నిలబడలేదని ఆమెకు చాలా కోపం

జవాబు రాజకీయ నాయకులు ఎవరి రక్షణకూ రారు

ప్రశ్న: ఆమె తాను పూర్తిగా అమాయకురాలినని చెబుతుంది

జవాబు: అల్లర్ల సమయంలో ఆమె నిస్సంశయంగా ఆరెస్సెస్, ముఖ్యమంత్రి, విహెచ్‌పిల పక్షమే వహించింది

ప్రశ్న అంటే ఆమె అల్లర్లలో చాలా చురుకుగా పాల్గొన్నదనే కదా అర్థం.

జవాబు: అవును

ప్రశ్న రాహుల్ శర్మ ఎటువంటి వాడు?

జవాబు. తిరుగుబాటుదారుల్లో అతను ఒకడు

ప్రశ్న ఎలా?

జవాబు. అతడు ఎవ్వరికీ సాయం చేయలేదు అతడు అల్లర్లను నియంత్రించాలనుకున్నాడంతే

ప్రశ్న అతణ్ణి కూడా గెంటివేసారా?

జవాబు. అతణ్ణి బదిలీ చేసారు. డిజిపి చక్రవర్తిగారు, నేను సిఫారసు చేసినప్పటికీ అతనిని బదిలీ చేశారు

ప్రశ్న ముఖ్యమంత్రిని వ్యతిరేకించినంత మాత్రాన్నే?

జవాబు. ఖచ్చితంగా అందుకే

ఇక్కడ ఆఫీసర్ రాహుల్ శర్మ గురించి సంక్షిప్తంగా చెప్పాలి. అతణ్ణి నేను రెండు, మూడు సందర్భాలలో కలిసాను విద్యావంతురాలు, సంస్కారవతి ఐన తన భార్యతో కలిసి రాహుల్ ఒక లాయర్ మిత్రుణ్ణి కలవటానికి వచ్చినప్పుడు

మొదటిసారి కలిసాను. శర్మ ఒక శాంతమైన మనిషిలా కనిపించాడు తన గొప్పతనాల గురించి జర్నలిస్టుల వద్ద ప్రగల్భాలు పలికేవాడులా అనిపించలేదు తన పనే తన తరఫున మాట్లాడుతుందని నమ్మేవాడు నేను అక్కడ ఉన్నంతసేపు తన లీగల్ కేసు గురించి ఏం మాట్లాడలేదు ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అతడి వెంటపడి వేధిస్తూ ఉన్నది అతణ్ణి కాదని అతని జూనియర్లకు పదోన్నతి కల్పించారు అతడి వార్షిక రహస్య నివేదిక (ఎ సి ఆర్ )లో నెగెటివ్‌గా రాశారు అతడికి వ్యతిరేకంగా రెండు శాఖాపరమైన ఛార్జ్ షీట్లు ఇచ్చారు సమయానికి ముందే పదవీ విరమణకై అతడు చేసిన విజ్ఞప్తిని 2015లో గుజరాత్ ప్రభుత్వం ఆమోదించింది.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో 2015 ఫిబ్రవరిలో వచ్చిన వార్తలో అతడి గురించి ఈ క్రిందివిధంగా వచ్చింది

> *2002లో గోధ్రా అల్లర్ల కేసుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడిన అధికారుల్లో శర్మఒకరు నరోడా పాటియా, నరోదాగామ్, గుల్బర్గా సొసైటీ ఊచకోత కేసుల విచారణలో సహకరించేటప్పుడు అతడు చాలా కీలకమైన సాక్ష్యాధారాలు సంపాదించాడు అతడు కేంద్ర అడ్మినిస్ట్రేటివ్ (పాలనా యంత్రాంగ) ట్రిబ్యూనల్‌లో మూడు అంశాలపైన పోరాడుతున్నాడు. అతడి వార్షిక రహస్య నివేదిక (ఏ.సి ఆర్)లో రాసిన నెగెటివ్ వ్యాఖ్యల గురించి, అతనిపై శాఖావరంగా జారీచేసిన రెండు చార్జిషీట్ల రద్దు కోసం ట్రిబ్యూనల్‌లో కేసులు నడుస్తున్నాయి ఇవి నడుస్తుండగానే మూడు నెలల క్రితం అతడు 2015 ఫిబ్రవరి నాటి నుంచి తనను పదవీ విరమణ గావించాలని విజ్ఞప్తి చేసాడు అయితే అతడు కోరిన తేదీకి రెండు రోజుల ముందు మాత్రమే అతడి విజ్ఞప్తిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది* [13]

రాహుల్ శర్మకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఆగ్రహాన్ని అర్థం చేసుకోవాలంటే సుప్రీంకోర్టు నియమించిన సిట్ ఇతని వేధింపులను గురించి ఏమని వ్యాఖ్యానించిందో తెలుసుకోవడం అవసరం 2002లో హింసను ఆపడానికి ప్రయత్నించిన పోలీసు అధికారులను నరేంద్ర మోదీ ప్రభుత్వం వేధించిందని, ఆ తర్వాతి కాలంలో కూడా ప్రభుత్వం వారిని వెంటాడి వేధించడం కొనసాగించిందని సిట్ తన నివేదికలో పేర్కొన్నది ఇది ఆ నివేదికలోని ముఖ్యమైన అంశాల్లో ఒకటి

సీనియర్ రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల ఫోను రికార్డులను ప్రభుత్వ అనుమతి లేకుండా విచారణ కమిషన్‌కు ఎట్లా సమర్పించాడని గుజరాత్ ప్రభుత్వం సీనియర్ ఐపిఎస్ అధికారి రాహుల్ శర్మకు నోటీసు జారీ చేసింది అల్లర్లు జరిగిన తొమ్మిదేళ్ళ తరువాత ఇచ్చిన ఈ నోటీసులో శర్మపై ఎందుకు చర్య తీసుకోరాదో చెప్పాలని ఉంది

అల్లర్ల కాలంలో మోదీ ప్రభుత్వం కీలక సమావేశాలకు సంబంధించిన ఎటువంటి రికార్డులు కానీ, మినిట్స్ కానీ ఉంచలేదని సిట్‌నే వ్యాఖ్యానించిన సమయంలో ఈ నోటీసు వచ్చింది

1992 బ్యాచ్ ఐపిఎస్ అధికారియైన శర్మ, ఏప్రిల్ 2002లో, అహ్మదాబాద్‌లోని కంట్రోల్ రూంలో డి సి పిగా పని చేశాడు నరోడా పాటియా, గుల్బర్గా సొసైటీల వద్ద జరిగిన హింస గురించి విచారాణ జరుపుతూ, అతడు ఎ టి. & టి నుంచి, సెల్ ఫోన్స్, మొబైల్ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి అల్లర్ల కాలంలో అహ్మదాబాద్‌లోని అన్ని కాల్స్‌కు సంబంధించిన రికార్డులు సేకరించి క్రైమ్ బ్రాంచికి ఇచ్చాడు సీనియర్ మంత్రులు, పోలీసు అధికారులు, ఆరెస్సెస్, విహెచ్‌పి సభ్యులు పరస్పరం చేసుకున్న ఈ ఫోన్ రికార్డులు ఉన్న సి. డిలు తరువాతి కాలంలో కనిపించకుండా పోయాయి కానీ అల్లర్లను విచారించడానికి మార్చి 2002లో నియమించిన నానావతి కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చేటప్పుడు శర్మ తన వద్ద ఉంచుకున్న ఈ సి డి కాపీని కమిషన్‌కు సమర్పించాడు [14]

నా కొలీగ్ అనుమేహ యాదవ్ 'తెహల్కా'లో ఒక రిపోర్టు రాసాడు

నేరస్థుల నేరనిరూపణలో ఈ ఫోన్ రికార్డులు అత్యంత ప్రముఖమైన సాక్ష్యాధారాలు 2009లో మాయా కొడ్నాని, గుజరాత్ విహెచ్‌పి అధ్యక్షుడు జయదీప్ పటేల్‌ల అరెస్టుకు, వారి ముందస్తు బెయిల్ రద్దుకు ఈ రికార్డులే కారణం కాంగ్రెస్ పూర్వ ఎమ్‌పి ఎహసాన్ జాఫ్రితో సహా గుల్బర్గా సొసైటీ వద్ద హత్యకు గురైన ముప్పై మంది విషయంలో విచారణ జరపటంలో కూడా ఈ ఫోను రికార్డులు కీలకపాత్ర వహించాయి అధికారిక లెక్కల ప్రకారమే 105 మంది ముస్లింలను చంపివేసిన నరోడా పాటియా హింస విషయంలో కూడా ఈ సి డి లు చాలా ముఖ్యమైన సాక్ష్యాధారాలు

కానీ నిష్పక్షపాతమైన దర్యాప్తు కోసం చేసే ఏ ప్రయత్నాన్నైనా కాలరాయడం గుజరాత్‌లో చాలా సహజం అనిపిస్తుంది శర్మకు నోటీసు అందేకంటే ఒక వారం ముందర, ఇష్రత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసును దర్యాప్తు చేయడానికి నియమించిన మరో సిట్ లో సభ్యుడైన సీనియర్ ఐపిఎస్ అధికారి సతీష్ వర్మ ఈ కేసులో అందిన సమాచారాన్ని పట్టుకొని ముందుకు పోవడాన్ని ఆటంకపరుస్తున్నారని ఆరోపించాడు రాజకీయ బాసులను సంతోషపరచడానికి గుజరాత్ పోలీసు అధికారులు చేసిన ఈ ఎన్‌కౌంటర్‌ను దర్యాప్తు చేస్తున్న ముగ్గురు పోలీసు అధికారుల్లో ఒకరైన వర్మ ఏయే సందర్భాలలో తమ పనిలో జోక్యం చేసుకున్నారో ఆ ఉదాహరణలను పేర్కొంటూ ఒక అఫిడవిట్ కూడా దాఖలు పరచాడు

వర్మ జనవరి 28న హైకోర్టులో 80 పేజీల అఫిడవిట్ సమర్పించాడు ఇష్రత్ ఎన్‌కౌంటర్లో పోలీసులు వాడామని చెబుతున్న ఆయుధాలకు ఇష్రత్ శరీరంలో దొరికిన బుల్లెట్లకు పొంతన లేదని ఫోరెన్సిక్ నిపుణులు చేసిన నిర్ధారణతో సహా ఇతర ఫోరెన్సిక్ సాక్ష్యాధారాలను పట్టించుకోకుండా గుజరాత్ ప్రభుత్వం 2009లో ఏర్పాటు చేసిన సిట్ పక్కన పెట్టేసిందని రాశాడు మోహన్ ఝా అనే గుజరాత్ క్యాడర్ అధికారి, కర్నైయిల్ సింగ్ అనే ఢిల్లీ అధికారి ఇద్దరూ గతంలో ఏర్పరచిన సిట్ సభ్యులు వీరు ఒక ముఖ్య సాక్షి తను ఇచ్చిన సాక్ష్యాన్నుండి వెనక్కు మళ్ళిన విషయంపై ఎటువంటి వ్యాఖ్య చేయకుండా హైకోర్టుకు సమర్పించి, హైకోర్టు మనసులో అనుమానం, అనిశ్చితత రేకెత్తించడానికి ప్రయత్నించారని వర్మ వర్ణించాడు ప్రస్తుతం జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, డిటెక్షన్ క్రైమ్ (బ్రాంచ్)(డిసిబి) గా పని చేస్తున్న ఝా వైబ్రంట్ గుజరాత్ శిఖరాగ్ర సమావేశానికి రక్షణ కోసం అవసరమంటూ 26 మంది పోలీసు అధికారులను తన ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపుతో ఉంచుకున్నాడని బహిర్గతపరచాడు ఈ ఇరవై ఆరు మంది ఎన్‌కౌంటర్ జరిగిన రోజు డిసిబిలోనే పని చేశారు

సిట్ పనిచేయడం ప్రారంభించిన 19రోజుల తరువాత డిసెంబరు నుండి సిట్‌లో పని ఎట్లా సాగుతుందో అధికారిక నోట్ రాయడం మొదలుపెట్టానని వర్మ చెప్పాడు అంటే జరుగుతున్న అక్రమాలను రికార్డు చేయవలసిన అవసరాన్ని అతడు గుర్తించాడనీ, నిష్పక్షపాతమైన దర్యాప్తుకు

అడ్డంకులు కల్పిస్తారని ఊహించాడని తెలుస్తుంది 'ఇది బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ జరపటానికి చేసే ప్రయత్నం ఎంత కఠినమైందో తెలుపుతుంది' అని తన పేరు బయటపెట్టడానికి ఇష్టపడని ఒక పోలీసు అధికారి అన్నాడు [15]

అల్లర్ల తరువాత జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి అశోక్ నారాయణ్ చాలా స్వేచ్ఛగా మాట్లాడాడు.

ప్రశ్న. *మరి ఎన్‌కౌంటర్ల మాటేమిటి?*

జవాబు: *ఎన్‌కౌంటర్లకు మతపరమైన కారణాలకంటే రాజకీయ కారణాలే ముఖ్యమైనవి సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ సంగతే చూడండి రాజకీయ నాయకుల ప్రోద్బలంతో అతణ్ణి చంపారు ఈ కారణంతోనే అమిత్ షా జైల్లో ఉన్నాడు. ప్రతి చోట ఇదే జరుగుతున్నది ఇక్కడ కూడా అదే జరుగుతోంది. బూటకపు ఎన్‌కౌంటర్లు రాజకీయ కారణం వల్ల గానీ లేదా పోలీసుల అత్యుత్సాహం వల్ల గానీ జరుగుతున్నాయి*

ప్రశ్న *మీరు హోం కార్యదర్శిగా ఉన్నప్పుడు జరగలేదా?*

జవాబు. *సోహ్రాబుద్దీన్‌ది కాదు వేరే ఒకటి జరిగింది. 'ఏంటి మీరు చేస్తున్న పని' అని నేను డిజిపితోనే అన్నాను. అవి రాజకీయ ప్రోద్బలంతోనే జరిగినట్టున్నాయి*

ప్రశ్న: *అల్లర్ల కాలంలో వాస్తవంగా ఏం జరిగిందనేది మీరు ఒక పుస్తకం రాయాలి*

జవాబు *కానీ నన్నెవరు నమ్ముతారు?*

ప్రశ్న: *మీరు అప్పుడు హోం కార్యదర్శి కదా!*

జవాబు. *కాంగ్రెసు వాళ్ళు, 'నీవు అప్పుడు ప్రభుత్వంలో భాగస్వామివి', (కాబట్టి) 'అతడు ప్రభుత్వ పక్షం రాశాడు,' అంటారు బిజెపి కూడా నేను చెప్పే దాంతో ఏకీభవించదు రాజకీయపార్టీలు వాళ్ళేం నమ్మాలనుకుంటారో అదే నమ్ముతారు*

ఇది అశోక్ నారాయణ్‌తో నా చివరి సమావేశాల్లోనిది ఏళ్ళ తరబడి ఆఫ్-ద-రికార్డ్ నేను అధికారులతో సంభాషణల్లో విన్నదాన్నంతా ఆయన నిర్ధారించాడు ప్రభుత్వ పక్షాన నిలబడిన వాళ్ళకు ప్రోత్సాహకాలు లభించాయనీ అలా చేయని వాళ్ళను పక్కనబెట్టి జూనియర్లకు పదోన్నతి కల్పించారని చెప్పాడు వాదన కోసం మనం అశోక్ నారాయణ్ మొదలే అభిప్రాయాలను కలిగిఉన్నాడని, పూర్వ నిర్ధారణలకు

వచ్చి ఉన్నాడని అనుకుందాం. కానీ ప్రభుత్వయంత్రాంగానికి వ్యతిరేకంగా నిలిచిన అధికారుల బదిలీలు, వారి పట్ల మోదీ ప్రభుత్వ ప్రతీకార ధోరణి అందరికీ తేటతెల్లమైన విషయాలు రాహుల్ శర్మ, రజనీష్ రాయ్, సతీష్ వర్మ, కుల్‌దీప్ శర్మ వంటి అధికారులందరిపై ఇరవై ఏళ్ళకు పైబడిన పాత, చిన్న కేసులను తవ్వి తీసి వారికి వ్యతిరేకంగా వాడారు గుజరాత్‌లో న్యాయం అడుగంటి పోతున్న కాలంలో న్యాయపతాకాన్ని ఉన్నతంగా ఎగురవేయడానికి ప్రయత్నించిన అధికారులు వీళ్ళు ఆ కారణంగా వీరిని ఇప్పటికీ వేధిస్తున్నారు

మాధోపురా కో ఆపరేటివ్స్ కేసులో అప్పటి గృహమంత్రి అమిత్ షా పై విచారణ ప్రారంభించినందుకు డి జి కావాల్సిన కుల్‌దీప్ శర్మకు పదోన్నతి నిరాకరించారు దీని వివరాలు తరువాతి అధ్యాయంలో చూస్తాం ఒక మదర్సా వద్ద అల్లరి మూకలను నివారించినందుకు, గుజరాత్ అల్లర్ల సమయంలో వివిధ మంత్రుల కాల్ రికార్డులను తరువాత విచారణ కమిషనర్లకు అప్పగించినందుకు, ఎస్ పి. రాహుల్ శర్మను సస్పెండ్ చేసి అతడిపై కేసులు బనాయించారు పొరలు వీడటం మొదలైంది. మూడు నెలల పాటు కొనసాగిన అత్యంత క్రూరమైన మతపరమైన దాడుల్లో రక్తపుటేరులు పారించడంలో రాజ్యం ఎట్లా కుమ్మక్కైందో, ఎట్లా పక్షపాతపూరితంగా వ్యవహరించిందో అశోక్ నారాయణ్ నిర్ధారించాడు

ఇక, తరువాయి వ్యక్తి గురించి తరువాయి అధ్యాయంలో చూద్దాం!

---

9 *http //www tehelka com/2011/04/gujarat-ex-intelligence-chief-blames-modi-for-gujarat-riots*

10 *http //timesofindia indiatimes com/defaultinterstitial_as cms*

11 *http //blogs timesofindia.indiatimes com/masala-noodles/is-parveen-togadia-getting-back-at-modi-through-hardik-patel/*

12 *http //www youtube com /watch?v=f0HfmQY8aOW*

13 *http //indianexpress com/article/india/india-others/Gujarat-ips-officer-rahul-sharma-who-took-on-govt-to-retire/*

14 పై వ్యాసం

15 *http //www tehelka com/2011/02-senior-ips-officer-sanjeerbhat-arrested-in-ahmedabad/?singlepage=1*

# ఏడవ అధ్యాయం

***జి.సి రాయ్‌గర్:***

ప్రతి ఒక్కరు జరగబోయే ఇండియా–పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ గురించి చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్న సమయంలో నేను జి సి. రాయ్‌గర్‌ను కలిసాను ఇతను 2002 గుజరాత్ అల్లర్ల కాలంలో ఇంటలిజెన్స్ శాఖ అధిపతిగా ఉన్నాడు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ సమయంలో డి జి పి గా పని చేసాడు అజయ్ తన ఇంటి వద్ద తన ఫిల్మ్ ప్రదర్శన ఏర్పాటు చేసాడు దానికి తన మిత్రులందరినీ ఆహ్వానించాడు. నన్ను కూడా పిలిచాడు. నాకు వెళ్లాలని చాలా అనిపించింది, కానీ అజయ్ మిత్రులందరికీ నన్ను పరిచయం చేసుకోవాలనుకోలేదు వారిలో చాలా మందికి చాలా రాజకీయ పరిచయాలున్నాయి అతని మిత్రుల్లో ఒకరు అనర్ పటేల్ అని అజయ్ నాకు గతంలో చెప్పి ఉన్నాడు ఆమె సిటీలో ఒక ఎన్ జి వో నడుపుతుంది ఆమె గుజరాత్ ముఖ్యమంత్రి ఆనంది బెన్ పటేల్ కూతురు

అతడు మ్యాచ్ ప్రారంభం కావడం కోసం ఆతృతతో ఎదురుచూస్తున్నాడు 'మన బౌలింగ్ చాలా బలహీనమైంది అఫ్రిదీ సిక్స్‌లు కొట్టడని ఆశిద్దాం', అని నేను నా వంతుగా రెండు మాటలు కలిపాను రాయ్‌గర్ నాకు రాజస్థానీ చివ్‌డా (అటుకులు), టీ ఇచ్చి గుజరాత్ ఐ బి అధిపతిగా తన రోజులను గుర్తు చేసుకున్నాడు సోహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో అతడు సి బి ఐ ఎదుట హాజరై ఉన్నాడు పత్రికల కథనం ప్రకారం[16] ఆ సమయంలో అతడు చాలా ఒత్తిడిలో ఉన్నాడు

ఈయనతో సమావేశం గురించి నాకు కొంచెం భయసందేహాలుండినాయి. ఈయన ఏ పక్షమో నాకేమాత్రం అంచనా లేదు అతడి నుండి ఏ మేరకు నిజాలు రాబట్టగలనో కూడా నాకు అంచనా లేదు. మైక్ తిరిగి వచ్చేశాడు మేం మళ్ళీ నెహ్రూ ఫౌండేషన్‌కు తిరిగి వచ్చాం రాయ్‌గర్‌కు పదవీ విరమణ తర్వాత దొంగ మద్యం గురించిన కేసులు చూసే ఉద్యోగం అప్పగించారు. ఆయన ఆఫీసులోనే

మేం ఆయనను కలిసాం గుజరాత్ అల్లర్ల సమయంలో ఇంటలిజెన్స్ ఎడిజిపిగా పనిచేసిన ఆర్ బి శ్రీకుమార్ ఒక ఇంటర్వ్యూలో,

> *'పై వారిని సంతోషంగా ఉంచడానికి చాలా మంది అధికారులు ఏమీ చేయకుండా చేతులు కట్టుకొని కూర్చొని ఉన్నారు నా కంటే ముందు ఈ పదవిలో వున్న జి సి రాయ్‌గర్ కూడా వెనుకంజ వేసాడు అతడు నాకంటే జూనియర్ అయినప్పటికీ, తరువాతి కాలంలో అతడికి ప్రమోషన్ ఇచ్చారు పదవీ విరమణ తరువాత కూడా అతడికి అక్రమ మద్య కమిషన్‌లో సభ్యుడిగా పదవి ఇచ్చారు ఈ కమషన్ హైకోర్టు జడ్జి ఆధ్వర్యంలో నడుస్తుంది' అని చెప్పాడు*

సుప్రీం కోర్టులో దాఖలు చేసిన తన అఫిడవిట్‌లో భట్ రాయ్‌గర్ పేరు కూడా పేర్కొన్నాడు 2002 ఫిబ్రవర్ 27న ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో భట్ పాల్గొన్నాడా, లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు కూడా రాయ్‌గర్ నిరాకరించాడు తను ఆ రోజు సెలవులో ఉన్నానని ఒక స్థానిక పత్రికతో చెప్పాడు

అప్పటి డిజిపి చక్రవర్తి తనను ఆ సమావేశానికి హాజరై అతనికి సాయం చేయమని చెప్పాడని భట్ తన అఫిడవిట్ లో పేర్కొన్నాడు అయితే చక్రవర్తి మాత్రం 2002 అల్లర్ల గురించి మీడియాతో మాట్లాడటానికి నిరాకరించాడు అతని నుండి ఎటువంటి సమాచారం బయటపడటంలేదు

గుజరాత్ అల్లర్లలోనూ, ఆ తర్వాత జరిగిన ఎన్‌కౌంటర్ విషయంలోనూ రాయ్‌గర్ ఒక ముఖ్యమైన వ్యక్తి, గుజరాత్‌లో జరిగిన నేరపూరిత కుట్రకు ఈ రెండూ దురదృష్టపూరితమైన ప్రముఖ ఉదాహరణలు సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ విచారణలో ముఖ్యమైన పోలీసు అధికారియైన వి.ఎల్. సోలంకి సిబిఐ కి ఒక లిఖిత వాంగ్మూలం ఇచ్చాడు దాన్ని చార్జిషీటులో భాగంగా చేర్చారు. ఆ వాంగ్మూలం ఈ క్రింది విధంగా ఉంది

> *"2006, నవంబరు మొదటి వారంలో ఆమె (గీతా జోహ్రీ ఐ జి) నన్ను తన ఆఫీసులో కలవమంది ఆమె చెప్పినట్టు గాంధీనగర్ కు వెళ్ళాను విచారణ ఎట్లా నడుస్తోందని మొదట ఆమె చర్చించింది కొద్దిసేపటి తర్వాత ఆమె ఆ రోజు ఒక ఘోరమైన ఘటన జరిగిందని అన్నది*

*గృహశాఖలో సహాయ మంత్రియైన అమిత్ షా తనతో పాటు, ఎడిజిపి జి సి రాయ్‌గర్‌ను, డిజిపి వి సి పాండేను పిలిచి విచారణ ఎలా కొనసాగుతున్నదని అడిగాడన్నది*

*గృహ శాఖ సహాయ మంత్రి చాలా కోపంగా ఉన్నాడనీ, నా వంటి ఒక పోలీసు ఇన్‌స్పెక్టరుకు సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్‌కు బాధ్యులైన సీనియర్ పోలీసుఅధికారులైన డీ జి.వంజారా, రాజ్ కుమార్ పాండ్యన్ వంటి వారిని చాలా తీవ్రమైన ఇబ్బందిలో పడేసే విధంగా నివేదికలు రాయడానికి ఎంత ధైర్యం అని నా గురించి ఆమెను అడిగాడని చెప్పింది*

ఈ సమావేశం గురించి సిబిఐ మరిన్ని వివరాలు సుప్రీం కోర్టుకు సమర్పించింది. 2006 డిసెంబరులో జరిగిన ఈ సమావేశంలో గుజరాత్ డిజిపి విసి పాండే, ఎడిజిపి (సిఐడి) జి.సి. రాయ్‌గర్, ఐ.జి (సిఐడి) గీతా జోహ్రీలతో అమిత్ షా సమావేశమయ్యాడు ఆ కేసులో ముఖ్య విచారణాధికారిగా అప్పట్లో గీతా జోహ్రీయే ఉండింది జోహ్రీకి డిప్యూటీ అయిన సోలంకి నేరాన్ని పట్టిచ్చేలా తయారు చేసిన నివేదికలో మార్పులు చేయమని అమిత్ షా డిమాండ్ చేశాడు కానీ సోలంకి నిరాకరించాడు పైగా సోహ్రాబుద్దీన్, కౌసర్ బీలను పోలీసులు ఎత్తుకపోవడానికి ప్రముఖ సాక్షిగా ఉన్న ప్రజాపతిని విచారించాలనుకున్నాడు 2006 నవంబర్ లో ప్రజాపతి ఈ కేసు గురించి తనకు చాలా తెలుసు కాబట్టి పోలీసులు తనను చంపేస్తారని బహిరంగంగా కోర్టులో మొత్తుకున్నాడు. సోలంకి అతడితో మాట్లాడటానికి కొద్ది రోజుల ముందు అతణ్ణి కూడా 'ఎన్‌కౌంటర్' చేసారు

18 నెలల పాటు విచారణ జరిపిన తరువాత, సిబిఐ దాఖలు చేసిన చార్జిషీట్‌లో షాను మరి 19 మంది పోలీసు అధికారులను గ్యాంగ్‌స్టర్ సోహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్‌లో సాక్షి ఐన ప్రజాపతిని చంపడానికి చేసిన కుట్రలో నిందితులుగా పేర్కొన్నది. ఇందులో పోలీసు ఉన్నతాధికారులు పి.సి పాండే, జోహ్రీ, ఓ.పి మాథుర్, రాజ్‌కుమార్ పాండియన్, డి.జి వంజారా, అర్ కె పటేల్ కూడా ఉన్నారు. తొమ్మిదిమంది గుజరాత్ క్యాడర్ ఐ పి ఎస్ అధికారులు సాక్షులుగా ఉన్నారు జి.సి రాయ్‌గర్, రజనీష్ రాయ్, ఐ.ఎమ్ దేశాయ్ (అప్పుడు సి.ఐ.డి క్రైమ్‌లో ఉన్నాడు, ఈ కేసును పర్యవేక్షిస్తున్నాడు ) పి పి. పాండే (ఎడిజిపి, సిఐడి, క్రైమ్), వి వి రబరీ (సిఐడి, క్రైమ్, పూర్వ అధిపతి), రాజన్ ప్రియదర్శి (విశ్రాంత) సుధీర్ సింహా (రాష్ట్ర

ఐబి, ప్రముఖుడు), ఎ.కె శర్మ (డిఐజి క్రైమ్ బ్రాంచ్, అహ్మదాబాద్), మయూర్ చావ్డా (ముఖ్యమంత్రి సెక్యూరిటీ లో డి వై ఎస్ పి) సాక్షులు.

రాయ్‌గర్, రాయ్ ప్రధాన సాక్షులని సిబిఐ పేర్కొంది

చార్జ్ షీట్ ప్రకారం, 2006 డిసెంబర్‌లో అప్పటి సహాయ గృహమంత్రి ఐన అమిత్ షా తన కార్యాలయంలో ఒక సమావేశం నిర్వహించాడు అందులో పాండే, జోహ్రీ, రాయ్‌గర్ పాల్గొన్నారు షేక్ కేసులో జరుగుతున్న విచారణపై తన అసంతోషాన్ని వ్యక్తపరిచేందుకు అమిత్ షా ఈ సమావేశాన్ని నిర్వహించాడు పాండే, జోహ్రీ, రాయ్‌గర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు కొన్ని డాక్యుమెంట్లను నాశనం చేయమని షా జోహ్రీకి చెప్పాడు

'రాయ్‌గర్ తనను ఈ వ్యవహారం నుండి బయటే ఉంచమని కోరాడు. కానీ, ఈ కుట్రపూరిత సూచనలను అమలుపరచటానికి పాండే, జోహ్రీ ఇద్దరూ సిద్ధమయ్యారు '

తాను సోహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసును చూస్తున్నప్పుడు అప్పటి సహాయ హోం మంత్రి ఐన అమిత్ షా నుండి తనకు నిరంతరం ఒత్తిడి ఎదురయ్యేదని రాయ్‌గర్ సిబిఐ కి చెప్పాడు 'నేను చేస్తున్న పనితో అతనికి చాలా అసంతృప్తిగా ఉండింది అతడు నా ద్వారా కొన్ని చట్ట వ్యతిరేక పనులు చేయించాలనుకున్నాడు దీనివల్ల నాకు చాలా ఒత్తిడి పెరిగింది దాంతో నన్ను బదిలీ చేయమని నేను కోరాను అదే రోజు నన్ను కరాయ్ కి బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చాడు. మరో అధికారి ఓ పి. మాథుర్‌ను నా స్థానంలో నియమించాడు బదిలీ అయ్యేందుకు నాకు కొన్ని రోజులు సమయం ఇవ్వమని షాను అడిగాను కానీ అదే రోజు నన్ను బదిలీ చేసాడు

ఈ కేసును విచారిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎ ఎల్. సోలంకి ఈ కేసు గురించి ఉదయ్‌పూర్ వెళ్లడానికి తన అనుమతిని అడగలేదని కూడా రాయ్‌గర్ చెప్పాడు

నాథుభా జడేజా అనే సాక్షి తాను మొదట చెప్పినదాన్ని నిరాకరించడంలో (హోస్టైల్‌గా మారడంలో) డి ఎస్ పి. జి బి పథేలియా హస్తం ఉందని అనుమానించడంతో అతనితో ఐ జి గీతా జోహ్రీకి విభేదాలు తలెత్తాయని అప్పటి ఎడిజిపి ఓ పి మాథుర్ తన వాంగ్మూలంలో చెప్పాడు ఈ మొత్తం వ్యవహారాన్ని హోం శాఖ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళితే, ఇది మీలో మీరే పరిష్కరించుకోండని అతడు చెప్పాడు

తరువాత ఇది పరిష్కారమైంది కానీ జోహ్రీ తనను విశ్వాసంలోకి తీసుకోలేదని మాథుర్ సిబిఐకి చెప్పాడు

నేను నా స్టింగ్ ఆపరేషన్ తర్వాత 2011 మార్చిలో గుజరాత్ వదిలాక ఈ వాంగ్మూలాల వివరాలన్నీ బయటకు వచ్చాయి

మైక్‌తో పాటు నేను మొదటిసారి రాయ్‌గర్‌ను అతని ఆఫీసులో కలిసినప్పటికి అతనికి ఇంకా విచారణ కోసం సిబిఐ సమన్లు పంపిస్తూనే ఉంది విషయం ఎంత సున్నితమైందో నేను మైక్‌కు వివరించి, మనం అతణ్ణుండి ఎటువంటి సమాచారం రాబట్టలేకపోవచ్చని అతనితో చెప్పాను 'మైక్! ఈ రోజు మనం అతణ్ణి రాజకీయాల గురించి ఏమీ అడగొద్దు మనం ఫిరంగీలలాగే (తెల్లవాళ్లలాగే) నటించి మనకు ఏమీ తెలియదన్నట్టుగానే ఉందాం" అన్నాను. మైక్ రాయ్‌గర్‌కు నచ్చాడు గుజరాత్‌లో అతని అనుభవం గురించి అడిగాడు. మైక్ అతనికి తాను అమ్దావాద్-ని-గుహ, పాల్డి, సర్వేజ్ రోజాలో చేసిన షూటింగ్ గురించి చెప్పాడు. విదేశీయమైనదో, అమెరికాకు చెందినదో అయితే చాలు, దేని గురించైనా అబ్బురపడిపోవటం ఒక్క గుజరాతీల లక్షణమేనా కాదా నాకు తెలియదు లేదా మేము ఇద్దరం ఎంతో బాగా నటించడం వల్లనే ఈ అధికారులంతా మేం చెప్పిన కధను అంతా సులభంగా నమ్మేసారేమో.

రాహుల్ ధోలకియా ఒక బాలీవుడ్ ఫిల్మ్ మేకర్. అతడొక గుజరాతీ గుజరాత్ అల్లర్లపై అతడు తీసిన సినిమా పర్జానియాను గుజరాత్ సినిమా హాళ్ళలో ప్రదర్శించకుండా నిషేధించారు. అతడితో జరిగిన సంభాషణ నాకు బాగా గుర్తు. ముంబయ్‌లోని జూహూలో కోస్టా కాఫీలో కూచుని పర్జానియా చిత్రీకరణలో, దానికోసం ఫండ్స్ సమకూర్చుకోవటంలో తన అనుభవాల గురించి చెబుతూ రాహుల్ నాకు పొట్ట పగిలేలా నవ్వు తెప్పించాడు. హిందూ మతోన్మాదులు ఆ సినిమాకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేసేదాకా ఆ సినిమా రాష్ట్రంలో అల్లర్ల సమయంలో మైనారిటీలకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా తీసిన సినిమా అని ఆ చిత్ర నిర్మాతకు తెలియదు రాహుల్ ఒక అమెరికా ఛానల్‌కు పనిచేసేవాడు ఆ విషయాన్ని అతడు వాడుకొని తాను ఎన్ ఆర్.ఐల కోసం గుజరాత్‌పై ఒక సినిమా తీస్తున్నానని ఆ నిర్మాతతో చెప్పాడు గుజరాత్‌లో నేను కలిసిన చాలామందికి నేను కూడా అదే కధనం చెప్పాను. ధోలకియాను నిర్మాతలు, సంబంధిత అధికారులు విశ్వసించడానికి ఆ ఒక్క విషయమే సరిపోయింది. గుజరాత్ అల్లర్లకు సంబంధించిన ఫుటేజ్ ఒక సందర్భంలో అతనికి అవసరమైనప్పుడు, ఆ టేపులు ఉన్న పత్రిక వద్దకు అతను వెళ్ళాడు. ఆ టేపులకు బాధ్యుడిగా ఉన్నతను రాహుల్ అమెరికావాడని చాలా ముగ్ధుడయ్యాడు. ధోలకియా తాత హిందూ మహాసభకు అధ్యక్షుడిగా పని చేశాడని

తెలిసినపుడు అతడు ఇంకా ఎక్కువ ముగ్ధుడయ్యాడు దాంతో అతనికి అవసరమైనవన్నీ వెంటనే అతనికి ఇచ్చాడు

నాకున్న సంశయమల్లా రాయ్‌గర్ గురించే కానీ, మా మొదటి సమావేశంలోనే అతడు చాలా మాట్లాడాడు నా పెళ్ళిని ఇంకా ఆలస్యం చేయవద్దనీ, ఒక వయసు దాటాక ఆడపిల్లలకు సరియైన జోడీ దొరకడం కష్టమని కూడా ఒక తండ్రిలా ఉపన్యాసం ఇచ్చాడు అతడు రాజస్థాన్‌కు చెందిన ఒక పాత తరపు కుటుంబానికి చెందినవాడు. అమిత్ షా కోపానికి భయపడి అతడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి బాగా ఇబ్బంది పడుతున్నాడు. కానీ బూటకపు ఎన్‌కౌంటర్లలో అమిత్ షాకు వ్యతిరేకంగా సాక్ష్యం రోజురోజుకూ పెరుగుతుండటంతో అంతిమంగా తాను కూడా సాక్ష్యం చెప్పాలని నిర్ణయించుకున్నాడు కానీ రెండవ రోజు అతనితో సమావేశమైనప్పుడు అతను చాలా ఆశ్చర్యం కలిగించే విషయాలు చెప్పాడు

బూటకపు ఎన్‌కౌంటర్లలో ఎవరెవరు పాల్గొన్నారనేది నాకు తెలుసు. కానీ ఆ వ్యక్తులను ఒక్కొక్కరినీ ఎట్లా భ్రమపెట్టి, ప్రభుత్వం ఉపయోగించుకున్నదో అర్థం కాలేదు నేను ఇదివరకే పి.సి పాండేను, అశోక్ నారాయణ్‌ను, రాజన్ ప్రియదర్శిని కలిసి మాట్లాడానని తెలియటంతో రాయ్‌గర్ ఇబ్బందిగా భావించలేదు గుజరాత్‌లోని పోలీసు బలగపు గొప్పతనం గురించే నేను ఫిల్మ్ తీస్తున్నానని నమ్మాడు

నేను అతనితో భుజ్ భూకంపం గురించి మాట్లాడాను భూకంపం ఎంత తీవ్రంగా ఉండిందో, ఎన్ని ప్రాణాలు పోయాయో, భూకంపం తర్వాత గుజరాత్ పోలీసులు ఎంత కష్టపడి పని చేయవలసి వచ్చిందో చెప్పాడు ఎంతో అమాయకత్వం నటిస్తూ నేను, గుజరాత్‌లో అందరూ అనుకునేటంత స్థాయిలో ప్రజలు భిన్న ధృవాలుగా విడిపోయి ఉన్నారా అని అడిగాను 'ఆ! 2002లో ఇక్కడ ఏం జరిగిందో నీకు ఏ మాత్రం అంచనా లేదు' అల్లర్ల గురించి అతను మాట్లాడటం మొదలుపెట్టడంతో నా అమాయకత్వ నటన కుతూహలంగా మారింది ఇతర అధికారుల నుండి తీసుకున్న కొంత నోట్స్ నా వద్ద ఉందని నేను అతనితో అన్నాను. అల్లర్ల సమయంలో రాయ్‌గర్ ఇంటలిజెన్స్ విభాగానికి అధిపతిగా చేసాడు. అంటే అప్పుడు అతడు కీలకమైన పోస్టులో ఉన్నాడు

ప్రశ్న *మోదీ గురించి చెప్పండి. ప్రతి ఒక్కరూ అతణ్ణే బాధ్యుణ్ణి చేస్తున్నారు*

జవాబు *దాని గురించి ఇప్పుడు మళ్ళీ మాట్లాడించద్దు ఇప్పుడిప్పుడే నేను దాని నుంచి బయట పడ్డాను*

ప్రశ్న: *ఆ ఘటనలు జరుగుతున్నప్పుడు మీరు ఆ మధ్యలోఉన్నారా?*

జవాబు· ఉన్నాను.

ప్రశ్న: అది చాలా బాధాకరమైన సందర్భం కదా!

జవాబు: అవును. నేను ఆ మూడు నెలల కాలపు అల్లర్ల గురించి మరచి పోవాలనుకుంటున్నాను కొన్ని జరగకూడని ఘటనలు జరిగిపోయాయి.

ప్రశ్న: నిజమా? అవి మీ మనస్సాక్షిని కూడా బాధించాయా?

జవాబు: అవును.

ప్రశ్న: అశోక్ నారాయణ్ కూడా ఇదే మాట అన్నాడు.

జవాబు: అవును. ఆయన కూడా వాటిల్లో నిండా మునిగి ఉన్నాడు అవన్నీ ప్రజల మనసుల్లో ఇంకా తాజాగా ఉన్నాయి. అవి సర్వత్రా ఉన్నాయి మోదీకి అంత ప్రజామోదం ఉన్నా అమెరికా ఇంకా తమ దేశంలోకి రావడానికి అతనికి అనుమతినివ్వడం లేదు ఈ మధ్యకాలంలో బయటపడిన వికిలీక్స్ ప్రకారం, ఇప్పుడు అమెరికా అతనితో సత్సంబంధాలు కోరుకుంటున్నది. కానీ అదే వికిలీక్స్ ఆ తర్వాత అతని గురించి చెడ్డ విషయాలు బయటపెట్టింది దాంతో కేవలం మంచి విషయాలతో అతడు మీడియా ముందుకు వచ్చాడు

ప్రశ్న కానీ, ఈ కల్లోలాలు దేశంలోని అతి ఘోరమైన అల్లర్లా? ముంబయి అల్లర్ల కంటే దారుణమైనవా?

జవాబు· అవును ముంబయి అల్లర్లు రెండు రోజుల పాటే జరిగాయి ఇవి ఏకబిగిన కొన్ని నెలలపాటు జరిగాయి

ప్రశ్న· ఎలా? అంతా సుదీర్ఘకాలం వాటినెలా కొనసాగనిచ్చారు

జవాబు· ఆ నారాయణ్ మీకు చెప్పే ఉంటాడు. ఆయన అప్పుడు హోం కార్యదర్శి కదా

ప్రశ్న· అవును తాను చాలా మనస్తాపానికి గురయ్యానని అతడు అన్నాడు అతడు రాష్ట్ర ప్రభుత్వం పట్ల చాలా విమర్శనాత్మకంగా ఉన్నాడు, ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేదని.

జవాబు. అతడు గృహ కార్యదర్శి ప్రభుత్వంలో అతడు అందరికంటే ముఖ్యమైన అధికారి అతడు చెబుతున్నాడంటే నిజమే అయి ఉండాలి

ప్రశ్న. కానీ మీరందరు కూడా నిరాశ చెందారా?

జవాబు: అవును చాలా మందికి నిరాశ కలిగింది, బాధ కలిగింది. ప్రభుత్వం అవలంబిస్తున్న పంథాను సమర్థించే వారు మాత్రమే ఇందుకు

మినహాయింపు ఇందుకు ఒక్క రాజకీయవేత్తలే కారణం కాదు పోలీసులు కూడా ఇందుకు బాధ్యులు

ప్రశ్న అంటే, రాజకీయ నాయకులు - పోలీసులు అల్లర్ల సమయంలో కుమ్మక్కైనారంటారా?

జవాబు కొంతవరకు అవును ఎందుకంటే ఒకసారి పరిస్థితి చేజారిపోయిందంటే, ఇక పెద్దగా చేయగలిగేది ఉండదు

ప్రశ్న కానీ అల్లర్లు మోదీకి రాజకీయంగా చాలా లాభం చేకూర్చాయి కదా. అల్లర్ల కారణంగానే అతడు ఈ రోజు ఉన్న స్థితికి వచ్చాడు

జవాబు ఆ అవును మరుసటి ఎన్నికలలో ఏమవుతుందో అని కొంత ఆందోళన పడ్డారు, కానీ, అదీ అతనికే సహకరించింది. ప్రజలంతా ఇది తమ నాయకుడి కోసం చేస్తున్నామని అనుకున్నారు

త్వరలోనే మా సంభాషణ బూటకపు ఎన్‌కౌంటర్ల వైపు మళ్ళింది. విచారణలు జరుగుతున్న కాలంలో రాయ్‌గర్ అడిషనల్ డిజిపి. బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి సిబిఐ మే, జూన్‌లలో ఇతణ్ణి రోజుకు పది గంటలపాటు విచారించింది అయినా ఎన్‌కౌంటర్ల గురించి తన కథనం నాకు వినిపించడానికి అతడు సిద్ధ పడ్డాడు

ప్రశ్న ఈ ఎన్‌కౌంటర్ల మాటేమిటి? మీరు ఉన్నారా?

జవాబు నేను ఒక్క దాంట్లోనే ఉన్నాను. సోహ్రాబుద్దీన్ అనే నేరస్థుణ్ణి బూటకపు ఎన్‌కౌంటర్లో చంపేసారు వాళ్ళు తెలివి లేకుండా అతని భార్యని కూడా చంపారు.

ప్రశ్న ఎవరో మంత్రి కూడా ఇందులో ఉన్నాడా?

జవాబు హోం శాఖా మంత్రి అమిత్ షా.

ప్రశ్న అతడి కింద పనిచేయడం కష్టంగా ఉండి ఉండవచ్చు

జవాబు మాకు అతనితో విభేదాలు ఉండేవి. మేం ఆదేశాలు పాటించడానికి నిరాకరించాం అందుకే ఎన్‌కౌంటర్ల విషయంలో అరెస్టు కాకుండా బయటపడగలిగాం

ప్రశ్న అంతటా పరిస్థితులు బాగా లేవా?

జవాబు పదేళ్ళ క్రితం గుజరాత్ చాలా మెరుగ్గా ఉండేది.

ప్రశ్న రాజకీయ మార్పు కారణంగానే ఇలా అయ్యిందంటారా?

జవాబు ప్రజాస్వామ్యంలో ఏ వ్యక్తి కూడా చాలా పెద్దవాడు కాకూడదు అది

హానికరంగా మారుతుంది. ఉదా హోం శాఖా మంత్రి అమిత్ షా అతడు బదిలీలు, పోస్టింగులు, పదోన్నతులు అన్నింటినీ నియంత్రిస్తాడు ఒక వేళ ఎవరైనా ఆయన చెప్పిన పని చేయక పోతే, అతణ్ణి ఒక సైడ్ పోస్టింగ్‌కు పంపించి వేసేవాడు ఎవ్వరూ అట్లా సైడ్ పోస్టింగ్ కావాలని కోరుకోరు. అందుకే నేను సోహ్రాబుద్దీన్ కేసు సమయంలో నన్ను బదిలీ చేయమని కోరాను.

ప్రశ్న మీరు దర్యాప్తు చేయడం వాళ్ళకి ఇష్టం లేనందువల్ల బదిలీ చేశారా?

జవాబు. నాకు తప్పుడు పద్ధతిలో విచారణ జరపడం ఇష్టం లేదు కాబట్టి

ప్రశ్న: మీరు విచారణ తప్పుడు దిశలో జరపాలని వాళ్ళు అనుకున్నారా?

జవాబు: అవును.

ప్రశ్న. ఒక్క మనిషే ఇవన్నీ చేయడం ఎట్లా సాధ్యం? ఇవన్నీ చేసినా అమిత్ షాను ఎలా తప్పించుకోనిచ్చారు?

జవాబు. అతడికి తన మార్గం తనకు దొరికింది. అధికారంలో ఉన్నవాళ్లకు అతడు చాలా సన్నిహితుడు

ప్రశ్న. అతడు ముఖ్యమంత్రికి చాలా సన్నిహితుడా?

జవాబు. అవును. అతడు చాలా సన్నిహితుడు. అందరికంటే ఎక్కువ సన్నిహితుడు

ప్రశ్న కానీ అతడు అరెస్టు కాకుండా ముఖ్యమంత్రి కూడా ఆపలేక పోయాడా?

జవాబు ఆపాలనుకున్నా ఆపలేకపోయాడు. (అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం ఉండింది)

ప్రశ్న అవును. ఒకవేళ అలా చేస్తే స్వయంగా అతనే ఇరుక్కునేవాడు

జవాబు: అతడు జోక్యం కలిగించుకుంటే అతడే పోయేవాడు ఈయన (ముఖ్యమంత్రి) తెలివైన వాడు అతడికి అన్నీ తెలుసు. కానీ కొంత దూరంలో ఉన్నాడు. కాబట్టి అతడు ఇందులో ఇరుక్కోలేదు. ఇక్కడ ఒక చట్టం అనేది ఒకటుంది నీవు ఎన్‌కౌంటర్లు చేస్తూ పోలేవు ఒకవేళ ఏదైనా కారణం వల్ల ఒకటో, అరో చేసినా, నీవు మనుషులను చంపుతూ పోలేవు. ఇక ఈ మంత్రులైతే, వాళ్లకేం కాకుండా తప్పించుకుంటారు వాళ్ళు ఎక్కడా సంతకం పెట్టవలసిన పని లేదు అంతా మౌఖికంగా పనికానిచ్చేస్తారు ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఫోన్లు చేయడం సులభమై పోయింది కానీ వాటిని ట్రాక్ చేయవచ్చు.

ప్రశ్న అవును. కాల్ రికార్డ్స్ వల్లనే మంత్రి దొరికిపోయాడని మీ కేసులో చదివాను

జవాబు అవును

ప్రశ్న కానీ ఈ రాష్ట్రంలో మనం చూస్తున్నదానికి భిన్నంగా నిజాయితీపరులైన నిక్కచ్చి అధికారులు కూడా ఉన్నారా?

జవాబు ఉన్నారు చాలామంది ఉన్నారు కానీ కడివెడు పాలల్లో ఒక చుక్క విషం చాలు అయితే కొంతమంది మంచి అధికారులు ఉన్నందుకే ఇప్పుడు మంత్రులను అరెస్టు చేశారు

ప్రశ్న అవును ఎవరో నాకు రాహుల్ శర్మ అనే అధికారిని కలవమని చెప్పారు బహుశా అతడు నిజాయితీపరుడైన అధికారి అందుకే ప్రభుత్వానికి అతడంటే కోపమనుకుంటా

జవాబు ముస్లింల జీవితాలను కాపాడినందుకు అతడంటే ప్రభుత్వానికి కోపం. అతడు ఒక బళ్ళో ముస్లిం పిల్లలను కాపాడాడు అతడు వీళ్ళను కాపాడటమే కాక, కొన్ని అరెస్టులు కూడా చేశాడు అధికార పార్టీ సభ్యుణ్ణి కూడా అరెస్టు చేయడం వల్ల అతణ్ణి అక్కడి నుండి బదిలీ చేసారు

ప్రభుత్వం తరఫున కొంత సమస్య ఉంది పరిస్థితి ఇంత దారుణంగా ఉంటుందని ప్రభుత్వం మొదట్లో గ్రహించలేదు మొదట్లో అల్లరి మూకల పైన బల ప్రయోగం చేయదలుచుకోలేదు దానివల్లనే పరిస్థితులు అదుపు తప్పాయి

ప్రశ్న ముస్లింలపై దాడి చేసే హిందువులను చూసీ చూడనట్టు వదిలెయ్య మన్నారట నిజమేనా?

జవాబు మొదట్లో నిజమే అది ఇంత దారుణంగా అవుతుందని గ్రహించలేదు కానీ నీవన్నది నిజం

ప్రశ్న హిందూ అల్లరి మూకలను చూసీ చూడనట్టు వదిలెయ్యమని అధికారులకు చెప్పటం నిజమేనా?

జవాబు మాకు అని అందరినీ కలిపలేం అవసరమైన వాళ్ళకు, కొన్ని ప్రాంతాల్లో ముఖ్యమైన స్థానాల్లో ఉన్నవారికి ఈ విషయం తెలియజేసారు

ప్రశ్న మోదీకంటే ముందు వాళ్ళకు కేశుభాయ్ అనే ముఖ్య మంత్రి ఉండేవాడు అతడెలాంటి వాడు?

జవాబు మోదీతో పోలిస్తే అతడొక యోగి పోల్చినప్పుడు! నా ఉద్దేశ్యం కేశుభాయి కావాలని ఎవరికీ హాని తలపెట్టడు మతమేదైనా కానీ ముస్లింలు కాబట్టి అని వారికి హాని కలగనివ్వడు

ప్రశ్న: కానీ, ఒక నిష్పక్షపాతమైన దృష్టితో చూస్తే, చాలా వాస్తవాలు, కల్పనలు కలగలిసిపోయినట్టు అనిపిస్తాయి కదా!

జవాబు. అది అట్లా వేరు చేయడం కష్టం. వీళ్ళు ప్రత్యక్షంగా ఆదేశాలు జారీ చేయరు. కాబట్టి వాళ్ళంతా తెరవెనుక ఉంటారు చట్టంలో కూడా అలాగే ఉంది. ఉదాహరణకు, ముఖ్య కార్యదర్శి ఒకవేళ నీవు చెప్పింది నేను వినను అన్నప్పుడు, ముఖ్యమంత్రి, కాదు నీవు చెయ్యాల్సిందే అంటే అప్పుడు ఏం జరిగినా బాధ్యత ముఖ్యమంత్రిది అవుతుంది కానీ, పోలీసు బలగంలో అలా కాదు. అది నా బాధ్యత అవుతుంది.

ప్రశ్న చక్రవర్తి గారు కూడా అదే అన్నారు. కొన్ని ఆదేశాలు ఇచ్చారు కానీ, అవి వాళ్ళే ప్రత్యక్షంగా ఇవ్వలేదని ఆయన అన్నాడు. దీన్ని అర్థం చేసుకోవాల్సిందే అంతేనా?

జవాబు: గతంలో వాళ్ళ మాట విన్నవాళ్లకే చెప్తారు ఎవరు వాళ్ళకు సాయం చేస్తారో వాళ్ళకు తెలుసు ఇన్‌స్పెక్టర్లతో, కింది స్థాయి పోలీసు అధికారులతో యధాలాపంగా చెప్తారు. అయితే అందరు అధికారులూ వాళ్ళ ఆదేశాలనేం ఆమోదించరు. తమ విశ్వాసాలకు కట్టుబడి ఉన్న పై స్థాయి అధికారులు ఇంకా కొందరు మిగిలి ఉన్నారు

ప్రశ్న: కాబట్టి అటువంటి అధికారులకు ముఖ్యమంత్రి చెప్పినా అది తిరిగి ఆయన మీదకే మళ్ళుతుందన్నమాట.

జవాబు అవును నీవు గాంధీ నగర్‌లో కలిసిన వ్యక్తి అశోక్ నారాయణ్, ఏది బడితే దానికి తల ఊపి, ఓ కె సర్ అనడు.

ప్రశ్న: పైగా ఆయన ఒక ఐఏఎస్ అధికారి!

జవాబు· వాళ్ళకైతే లిఖిత ఆదేశాలు అందుతాయి మాలాగా కాదు

ప్రశ్న: సర్, మీరు ఆసక్తిదాయకమైన ఒక విషయం చెప్పారు మీరు ఎన్‌కౌంటర్ల గురించి విచారిస్తున్నప్పుడు మీపై రాజకీయ ఒత్తిడి ఉండిందన్నారు. అటువంటప్పుడు అట్లా ఒత్తిడి తెచ్చినవాళ్లను, ఉదాహరణకు గృహ మంత్రి అమిత్ షాను, మీరు అరెస్టు చేయలేరా?

జవాబు· దానికి కొంత సాక్ష్యం ఉండాలి. కొన్ని పనులు నన్ను చేయమంటే నేను చేయనని షా తో చెప్పాను. 'సరే సర్ మేం చేస్తాం', అనే చాలా మంది అధికారులు కూడా ఉంటారు వాళ్ళకు వేరే ప్రయోజనాలు ఉంటాయి.

ప్రశ్న: అంటే మీరు గృహమంత్రికి వ్యతిరేకంగా నిలబడినా ప్రభుత్వం మీకు

ప్రత్యక్షంగా ఏ హానీ చెయ్యజాలదన్నమాట.

జవాబు ప్రత్యక్షంగా చేయలేదు, నన్ను పరోక్షంగా చంపిస్తే తప్ప. అవును. ఇక్కడ ప్రజాస్వామ్యం ఉంది కాబట్టి మేం బతికి బయటపడగలం.

ప్రశ్న నేను మీ గురించి తెలుసుకోవడానికి కొన్ని చదివాను. సంబంధిత అధికారులను సాక్షుల గురించి, వాంగ్మూలాల గురించి అడిగేవాడని మీ గృహమంత్రిపై ఒక ఆరోపణ ఉంది

జవాబు కానీ అవేవీ ఆయనకు దొరకలేదు. అతడు పరోక్షంగా అడిగేవాడు· నాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారెవరు అని?

ప్రశ్న జోఫ్రీ ఏమయ్యింది? సోహ్రాబుద్దీన్ ఒక టెర్రరిస్టు అని ఆమె అన్నది

జవాబు చూడు, విషయం ముఖ్యంగా సోహ్రాబుద్దీన్ గురించి కాదు ఆయన భార్య గురించి సోహ్రాబుద్దీన్‌ను ఒక నిజమైన, చట్టబద్ధమైన ఎన్‌కౌంటర్‌లో చంపినా అదో పెద్ద సమస్య కాదు కానీ, ఆయన భార్యనెందుకు చంపారు? అది కూడా మూడు రోజుల తర్వాత.

ప్రశ్న దాన్ని మీరు దర్యాప్తు చేస్తుండినారా?

జవాబు ఈ ఎన్‌కౌంటర్లన్నీ బూటకమనే విషయం బయటపడినప్పుడు మేం దాన్ని దర్యాప్తు చేస్తున్నాం గీత ఈ పని చేస్తుండింది ఆమె నా కింద పని చేసేది, అప్పటివరకూ ఆమె బాగానే పని చేసింది ఆ తర్వాత నీకు తెలుసు (అంటూ నవ్వాడు)

ప్రశ్న అందుకే మిమ్మల్ని బదిలీ చేశారా?

జవాబు. అవును.

ప్రశ్న నేను పి సి పాండేను కూడా కలిసాను.

జవాబు అలాగా అతడు పోలీసు కమిషనర్‌గా చేసేవాడు.

ప్రశ్న అంటే అల్లర్లు జరిగినప్పుడు మీరిద్దరూ కలిసి పనిచేసేవాళ్ళన్న మాట

జవాబు చేయవలసి వచ్చేది నేను ఐ.బి ముఖ్యుణ్ణి కదా!

ప్రశ్న ముఖ్య మంత్రికి పాండేపై పూర్తి విశ్వాసముండేదని అల్లర్ల సమయంలో అతని ద్వారానే పనంతా కానిచ్చేవాడని చాలా మంది అధికారులు నాతో అన్నారు.

జవాబు అల్లర్ల గురించి ఈ పాటికి నీకు అంతా తెలిసిపోయింది (అని నవ్వాడు)

రాయ్‌గర్ చెప్పవలసినవన్నీ చెప్పేశాడు, ఏవీ చెప్పకుండా వదలలేదు. అతడు పలికిన ప్రతి పలుకులోనూ, మోదీ, షా లకు, వారితో కుమ్మక్కైన పోలీసులకు అల్లర్లలో

ఉన్న పాత్ర మనకి కనిపిస్తుంది నేను లోలోపల ఉడికిపోయాను మైక్‌కు నా క్రోధం అర్థమైంది మేం రాయ్‌గర్ ఇంటి నుండి బయలుదేరినప్పుడు అతడు నా చేయి నొక్కాడు గుజరాత్ అల్లర్లలో, బూటకపు ఎన్‌కౌంటర్లలో రాష్ట్ర ప్రభుత్వం పాత్ర ఎట్లా ఉందో ఎన్నో అనధికార సంభాషణల్లో తెలిసిన విషయాలను రాయ్‌గరే ధృవీకరించాడు

గుజరాత్‌లోని ఒక మదర్సాలో ముస్లిం విద్యార్థులను కాపాడినందుకు ఐపీఎస్ అధికారి రాహుల్ శర్మను రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తున్నదని రాయ్‌గర్ నిర్ధారించలేదా? గుజరాత్ ముఖ్యమంత్రికి అతని మంత్రులకు వ్యతిరేకంగా మీడియా పనిగట్టుకొని దుష్ప్రచారం చేసిందని అంటే ఇప్పుడు కూడా మనం నమ్మగలమా? ఈ టేపుల్లో రికార్డయిన సాక్ష్యం మనకు వేరే కథనే చెబుతుంది

నాకు బాగా తలనొప్పి వచ్చేసింది నా కుటుంబాన్ని, నా స్వంత మనుషుల ఆత్మీయతను నా మనసు కోరుకుంది ఈ అభాగ్య రాష్ట్రంలో ప్రతిరోజూ ఎవరో ఒకరు బయటపెడుతున్న ఈ విద్వేషం నుండి పారిపోవాలని నాకనిపించింది నాకు కొంచెం విరామం కావాలి

నేను పానీ తలుపు కొట్టాను స్థానిక హస్త కళాకారుల నుంచి ఆమె కొంత అలంకరణ సామాగ్రి కొని గోడకు అమర్చడానికి ప్రయత్నిస్తున్నది. ఆమె తలుపు తెరిచి ఆత్మీయంగా నవ్వి, 'హాయ్, నాక్కొంచెం సాయం చెయ్యి' అన్నది. గుజరాత్ ఎంత అందమైన ప్రదేశమో కదా అంటూ వర్ణిస్తూ పోయింది, అవును అని నేను గొణిగాను. అవును నిజమే, కానీ నేను చూసిన ద్వేషాన్ని పాని చూసి ఉంటే కదా! గుజరాత్‌లోని అత్యధిక యువ జనాభా లాగానే ఆమె వయసూ పద్దెనిమిదేళ్ళే వాళ్ళలో ఎందుకంత విద్వేషాన్ని నింపుతున్నారు? కొంతకాలం నేను పని చేయదలుచుకోలేదు అజయ్‌కి ఫోన్ చేసాను

ఒక కళాశాల ఉత్సవం జరుగుతోంది దానికి అతని వద్ద కొన్ని పాసులు ఉన్నాయి అతడు తీసుకెళతానన్నాడు నేను ఒక నల్లని కుర్తా వేసుకొని, కళ్ళకు కాటుక (కోల్) పెట్టుకొని, మేకప్ చేసుకొని, హీల్స్ వేసుకుని బయలుదేరా దగ్గరలోనే పుస్తకం చదువు కుంటున్న మైక్ నాతోపాటు రానన్నాడు. నన్నొక్క దాన్నే వెళ్ళి ఒక్కరోజు ఒక కాలేజీ విద్యార్థినిలాగా మారి డాన్స్ చేసి సాయంత్రాన్ని బాగా గడపమని సలహా ఇచ్చాడు. నాకు అది చాలా అవసరం ఆ రోజు సాయంత్రం నెహ్రూ ఫౌండేషన్ బయట ఎవరో కారు పార్క్ చేసి ఉన్నారనిపించింది ఉదయం కూడా నేను దాన్ని చూసాను.

బహుశా అది ఒక భ్రమే కావచ్చు ఉత్సవం జరిగే కళాశాలకు నేను ఆటో తీసుకోకుండా, నన్ను తీసుకెళ్లమని అజయ్‌కు మెసేజ్ పెట్టా ఆ సాయంత్రం నేను ఫోటోలు తీసుకున్నా విద్యార్థులతో డాన్స్ చేశా. గట్టిగా పాటలు పాడా. బయట పార్క్ చేసి ఉన్న కారు మరుసటి రోజు అక్కడ లేదు

---

*16 http //epaper timesofindia com/default/Layout/Includes/ MIRRORNEW/ArtWin asp? From=Archives&source=page&skin=MIRRORNEW&BaseHref=P MIR%2F2010%2F07%2F27&ViewMode=HTML&PageLab el+9&EntityId=Ar00900&AppName=1*

# ఎనిమిదవ అధ్యాయం

**పి.సి. పాండే**

పోలీసుల్లో చాలా మంది అతన్ని ఉష్ట్రపక్షి అంటారు. కొందరేమో మంచి ప్రవర్తన కలిగి, చక్కగా మాట్లాడగలిగిన ఒక స్మార్ట్ అధికారి అని అంటారు ఇతనంటే ముఖ్యమంత్రికి ఎనలేని నమ్మకం. రాష్ట్రంలోని ముఖ్యమైన విషయాలన్నిటిపైన ఇతను చెప్పే మాటల్ని మోదీ, షా వింటారు జీవితంలో సౌకర్యవంతమైనవంటే ఇతనికి చాలా ఇష్టం విదేశీయాత్రలన్నా, తన గురించిన మంచి సమీక్షలన్నా, క్లబ్బులోనో, జింఖానాలోనో స్నేహితులతో మందు కొడుతూ సాయంత్రాలు గడపడం అన్నా అతనికి ఎంతో ఇష్టం

2002 మార్చి 2వ తారీఖున టెలిగ్రాఫ్‌లో అతడి గురించి ఇలా వచ్చింది

> *అహ్మదాబాదు పూర్వ పోలీసు కమీషనర్ శ్రీ పి సి పాండే (మారణకాండ జరిగినపుడు అతను కమీషనర్) పోలీసులు పాత్ర గురించి చెప్పిన దానికంటే బాగా ఇంకెవరూ చెప్పలేరు. "సమాజపు గందరగోళం నుండి పోలీసుల ప్రభావితం కాకుండా ఉండరు సమాజపు భావాల్లో మార్పులొచ్చినపుడు పోలీసులు కూడా అందులో భాగమే కాబట్టి వారిపై కూడా దాని ప్రభావం ఉంటుంది "*

పాండేకు మొదట నేను మైక్ ద్వారా ఫోన్ చేయించి ఆ తరవాత షెడ్యూలు నిర్ధారించుకోవటానికి స్వయంగా ఫోన్ చేశాను. అతడు బాగా ఇంప్రెస్ అయ్యాడని ఫోన్‌లోనే తెలుస్తోంది. మేము అహ్మదాబాద్‌లో అతని ఇంటికి వెళ్ళినపుడు అతడు వీల్ చెయిర్‌లో ఉన్న తన తల్లిని తోటలో తిప్పడానికి తీసుకెళ్తున్నాడు "నమస్తే!" అంటూ నేను అయననీ ఆయన తల్లినీ పలకరించాను మైక్‌ను నా సహాయకుడిగా

పరిచయం చేశాను మమ్మల్ని లోపలికి తీసుకెళ్ళారు. క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్న ఆయన భార్య ముందు గదిలోకి వచ్చి తనను తాను పరిచయం చేసుకుంది. కాఫీ టేబుల్‌పై పత్రికలు, వార్తా పత్రికలు, ఇండియా టుడే, ఇతర గుజరాతీ దినపత్రికలు ఉన్నాయి

అతను నన్ను మొట్టమొదట అడిగినది నా పేరులోని త్యాగి గురించి. నేను నా ఆర్ ఎస్.ఎస్ మూలాల గురించి, సంస్కృత అధ్యాపకుడైన నా తండ్రి గురించి, నా అమెరికా నేపథ్యం గురించీ చెప్పాను నేనొక కాయస్థ కుటుంబానికి చెందిన దానిననీ, నా కుటుంబం, ముంబయిలోనూ, కాన్పూర్‌లోనూ ఉందనీ, మతంతో నాకు పెద్దగా సంబంధం లేదని చెప్పాను. కానీ దేశంలో ముస్లింలను బుదగరించే విధానాల వల్ల నేను నా మతానికి దగ్గరవుతున్నానని నేను అతనికి భరోసా ఇచ్చాను.

దాంతో నేను ఆశించిన ప్రభావం కనిపించింది అయితే పాండే ధక్కా మక్కీలు తిన్న వ్యక్తి అతన్ని కలిసే ముందు మీడియాలో అతనిపై ఉన్న చెడు చిత్రణ గురించి ఎవరైనా మాతో అన్నారా అనేది తెలుసుకోవడానికి చాలా కుతూహలం కనబరిచాడు. అతడు తన జాగ్రత్తలో తానున్నాడు నేను నా సాధనాలు వేటినీ పెట్టుకోలేదు గుజరాత్‌లో మాకు పరిచయం ఉన్న ఒకే ఒక వ్యక్తి ఫిల్మ్‌మేకర్ నరేష్ కనోడియా అనీ, అతడి నుండి ఈయన గురించి అన్నీ మంచి విషయాలే విన్నానని నేను చెప్పాను

'ఇప్పుడు నాకర్థమైంది' అని అతడన్నాడు. "లేకపోతే మీరు కూడా అల్ జజీరా లాగానో, లేదా ఈ దేశంలోని ఇతర ఎల్లో జర్నలిస్టుల లాగా నా గురించి పూర్వాభిప్రాయం ఏర్పరచుకొని వచ్చేవాళ్ళు" ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సూరత్ వజ్రాల వ్యాపారులను కలవాలనుకుంటున్నాని నేనతనితో చెప్పాను పాండే కొడుకు సూరత్‌లో వజ్రాల వ్యాపారంలో ఉన్నాడు దాంతో అతని కాంటాక్టు వివరాలు ఉత్సాహంగా ఇచ్చాడు గుజరాత్ గురించి చాలా భయానకమైన విషయాలే విన్న నేను వైబ్రెంట్ గుజరాత్ గురించి ప్రచార విభాగాన్ని లేదా ఫిల్మ్ విభాగాన్ని చూస్తున్న వ్యక్తులను కూడా పరిచయం చేయడంలో సాయం చేయమని పాండేని అడిగాను "నాకు కచ్ గురించి తెలుసుకోవాలనుంది సార్, అక్కడి తెల్లటి ఇసుక గురించి, కొత్త హైవే గురించి, గుజరాత్‌లో పెరుగుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించీ తెలుసుకోవాలనుంది. ఇవి గుజరాత్‌ను దేశంలో అత్యంత పురోగామి రాష్ట్రంగా నిలబెట్టాయి. అట్లాగే ఇక్కడి సంస్కృతి గురించి కూడా తెలుసుకోవాలి "

అల్లర్ల సమయంలో అతడి వివాదాస్పదమైన పాత్ర గురించి పాండే

రెచ్చగొట్టినప్పటికీ దానిపట్ల నాకేమీ ఆసక్తిలేనట్టు ప్రవర్తించాను దక్షిణ భారతానికి చెందిన ఒక బ్యూరోక్రాట్ తిరుపుగ్గా అనే వ్యక్తి నంబర్ నాకు ఇచ్చి గుజరాత్‌కి సంబంధించిన, ముఖ్యంగా 'వైబ్రెంట్ గుజరాత్' క్యాంపెయిన్ గురించిన సమాచార సామాగ్రినంతా అతను ఇస్తాడని చెప్పాడు

"మైథిలీ, చాలా గౌరవనీయులైన మేధావుల్లో ఒకరైన సుహేల్ సేథ్ ఒక దిన పత్రికలో రాసిన వ్యాసాన్ని కూడా నువ్వు తప్పక చదవాలి" అన్నాడు అతడు బాగా తయారయి ఉన్నాడు మోదీని గురించి పొగుడుతూ ఉన్న వ్యాసాల ప్రింటవుట్లు, దేవ్‌బంద్‌కు చెందిన మౌలానా వాస్తాన్వి మోదీ గురించి పొగిడిన విషయం వచ్చిన ఇండియా టుడే కాపీ కూడా ఆయన వద్ద ఉంది అయితే తాను అన్నదాన్ని తప్పుగా ప్రచురించారని ఆ మౌల్వీ తరవాత అన్నాడు. సుహేల్ సేథ్ వ్యాసం పన్నెండు కాపీలు పాండే వద్ద ఉన్నాయి. దాన్లోంచి ఒకటి నాకిచ్చాడు ఈ ఫిల్మ్ అమెరికాలోని గుజరాతీయుల కోసం అయితే మోదీజీ కూడా నీతో మాట్లాడటానికి ఇష్టపడతాడు. నాకు చెపితే నేను సమావేశానికి ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

నేను పెద్దగా ఆసక్తి చూపకుండా పాండే ఎవ్వరిని కలవమంటే వాళ్ళని కలుస్తాననీ, ఎందుకంటే గుజరాత్‌లో విషయ పరిజ్ఞానం ఉన్న వ్యక్తులలో ఆయనొకడని నాకనిపించిందనీ, ఫిల్మ్‌ని తీయడం గురించి అతని మార్గ నిర్దేశికత్వం అవసరం అవుతుందనీ అన్నాను. దీంతో పాండే చాలా సంతోషపడినట్టు కనిపించాడు

ఆ తరవాత క్యాంటీన్‌లో మా 20 రూపాయల భోజనం తింటున్నపుడు మనమేదో కింది స్థాయి సాధారణ సైనికులతో వ్యవహరించడం లేదని నేను మైక్‌తో అన్నాను. నా పళ్ళెంలో నుండి అప్పడం తీసి మైక్‌కు ఇచ్చాను. చాలా ఇష్టంగా తిన్నాడు తెహల్కాలోని నా సహోద్యోగి గతంలో ఒక స్టింగ్ ఆపరేషన్ చేశాడనీ అయితే అతడు చేసింది కల్లోలాల్లో పాల్గొన్న మామూలు మూకలు, గుండాలను అని మైక్‌తో అన్నాను కానీ ఇక్కడ మనం ఆరితేరిన డిప్లొమాట్లతో వ్యవహరిస్తున్నాం కాబట్టి మనం ఏం చెబుతున్నామో దాని గురించి మనకు పూర్తి విశ్వాసమూ, ఆత్మవిశ్వాసమూ ఉండాలి స్టింగ్ అయిపోయాక మనం ఒక ఫిల్మ్ స్క్రిప్టు రాద్దామని మైక్ అన్నాడు మేమిద్దరం నవ్వుకున్నాం.

పి.సి.పాండేని కలుస్తున్న రోజుల్లోనే మేం రాయ్‌గర్, అశోక్ నారాయణ్, మాయాకొడ్నానీలను కూడా కలిసాము. ఇతరులను కలుస్తున్నామని వాళ్ళందరికీ చెప్పాం ఒక రోజు నేను పి సి. పాండేతో సమావేశానికి ఆయన బంగళాకి వెళుతుంటే తృటిలో ఒక ప్రమాదం తప్పింది. నేను ఆయన ఇంటి సమీపంలోకి రాగానే రానా

అయ్యూబ్‌గా నన్ను తెలిసిన ఒక అధికారి ఆర్డర్లీ మూడు ఇళ్ళ అవతల ఒక బంగాళా నుండి బయటకు వస్తూ ఉన్నాడు. అదృష్టవశాత్తు చాలా సులభంగా పట్టిచ్చే నా ఉంగరాల జుట్టు ఆ సమయంలో శుభ్రంగా కట్టి ఉంది నా బ్యాండానా మొఖాన్ని సగం కప్పి ఉన్నది నన్ను లోపలికి తీసుకెళ్ళటానికి పాండే గేటు వద్దే ఉన్నాడు నా పాపిటలో చెమటలు పట్టి చుక్కలు నా బుగ్గ మీదికి జారాయి. నా ఒంటి వేడి కూడా పెరిగిపోయింది నాకు చెమటలు పట్టాయనీ, నా మొఖం రంగు మారిందనీ పాండే గుర్తించాడు 'నీకు ఒంట్లో బాగుందా మైథిలీ?' అని అడిగాడు. బాగానే ఉంది సర్ అని జవాబిచ్చాను కానీ ఒక్క నిముషం క్రితం నా కవర్ దాదాపు ఎగిరిపోయిందనే షాక్ నుండి తేరుకోలేదు వాతావరణంలో మార్పు వల్ల బహుశా కొంచెం జ్వరమొచ్చిందేమోనని గొణిగాను

అతడు వెంటనే నన్ను కూర్చోబెట్టి, పని మనిషితో కాఫీ తెప్పించి మెడికల్ కిట్ తేవటానికి తన గదిలోకి వెళ్ళాడు. అతడు థర్మామీటర్ బయటకు తీసి, నా నాలుక కింద ఉంచుకొమ్మన్నాడు నేను వణుకుతుండినాను నన్ను డాక్టరు వద్దకు తీసుకెళ్తానన్నాడు ఇదేం పెద్ద విషయమేం కాదు నాకది సాధారణమేనని నేను చెప్పాను థర్మామీటర్ 99 చూపించింది. నన్ను బిస్కట్లు తినమని బలవంతం చేసి కాఫీ ఇచ్చి ఒక పారాసెటమాల్ టాబ్లెట్ ఇచ్చాడు నాక్కొంచెం నయంగా అనిపించింది నేను చిర్నవ్వు నవ్వి శ్రీమతి పాండే గురించి వాకబు చేసాను కొద్ది నిముషాల తర్వాత ఆమె వచ్చింది

తన బంధువుతో పాటు నేపాల్ యాత్రకు వెళదామని అనుకుంటున్నట్టు ఫోన్లో అతడు తన సోదరుడితో మాట్లాడుతుంటే తెలిసింది అంటే నా వద్ద ఎక్కువ సమయం లేదని నేను మనసులో లెక్కించుకున్నా సంవత్సరాంత సెలవుల్లో ఖాట్మండు వెళ్ళాలని అనుకుంటున్నాడు నూతన సంవత్సర సందర్భంగా వెళ్ళటం కోసం దేశంలోని కొన్ని మాంచి స్థలాల గురించి నాకు సూచించాడు నేను సరేనంటూ తల ఊపాను గుజరాత్‌లో హిందువులు - ముస్లింలు రెండు ధృవాలుగా చీలిపోవడం గురించి మాట్లాడుతున్న సందర్భంలో తన ఇంటి వద్దకు తరచుగా వచ్చే లాయర్లు, మంత్రులలో ఒకరు ముస్లిం అని అతడు చెప్పాడు. అహ్మదాబాదుకు చెందిన ఈ లాయరును నేను గతంలో ఆయన చేస్తున్న ఎన్నో క్రిమినల్ కేసుల విషయంలో మాట్లాడటానికి కలిసాను అప్పటి నుండి పాండే ఇంట్లో కూచొని ఉన్నప్పుడల్లా నాకు టెన్షన్‌గానే ఉండేది ఒకవైపు నా నరాలు ఉత్కంఠతో చిట్లి పోతున్నా, పి సి.పాండేతో నా సంభాషణలు మాత్రం సజావుగానే సాగాయి

ప్రశ్న: గుజరాత్‌లో ఆరెస్సెస్‌కు ఉన్న ప్రాముఖ్యం ఎంత?

జవాబు: గుజరాత్ ప్రభుత్వానికి అది వెన్నెముక. ఇస్లామిక్ సంస్థలకు ధీటైన సంస్థ అదొక్కటే.

ప్రశ్న. అతడు (ముఖ్యమంత్రి) ఆరెస్సెస్‌కు ఎంత సన్నిహితుడు?

జవాబు. చాలా సన్నిహితుడు. అది అతనికి చాలా కీలకం అతడు ఆరెస్సెస్ క్యాడర్ ఇక్కడి ఆరెస్సెస్ ముఖ్యుడైన అమృత్‌భాయ్ కడీవాలాకు అతడిపై చాలా ప్రభావం, పట్టు ఉంటుంది

ప్రశ్న. అల్లర్ల గురించి కానీ లేదా ఇక్కడి వ్యవహారాల గురించి గానీ మీ మంత్రుల గురించి ఏవేవో వింటుంటాం. హరేన్ పాండ్యా అంటే ఆరెస్సెస్‌కు చాలా అభిమానమా?

జవాబు. అవును అతడు చాలా పాపులర్ నాయకుడు. హోం మంత్రి హరేన్ పాండ్యా ఆరెస్సెస్‌కు చాలా సన్నిహితుడు ఇంకా చెప్పాలంటే, ఇప్పుడు కటకటాల వెనక ఉన్న అమిత్ షా కూడా ఆరెస్సెస్‌కు సన్నిహితుడు. మధ్యలో కొంతకాలం మరో నాయకుడు గోర్ధన్ జడాఫియా కూడా విహెచ్‌పికి చాలా సన్నిహితుడు.

ప్రశ్న: అందరూ గృహ శాఖ మంత్రులే వాళ్ళకు ఆ శాఖ అప్పగించడం కావాలని తీసుకున్న నిర్ణయమంటారా?

జవాబు: అవును హోం శాఖనే పోలీస్ అధికారులను నియంత్రిస్తుంది కాబట్టి నీ (స్వంత) మనుషులుంటే మంచిది. కాబట్టి కేశుభాయ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరేన్ పాండ్యా హోం మంత్రిగా ఉండేవాడు

ప్రశ్న: నేను గోర్ధన్ జడాఫియాను కలవొద్దని మీ సలహా కదా.

జవాబు· అవును. కలవటం మంచిది కాదని నా అభిప్రాయం లేకపోతే నీవు పక్కదారి పడతావు... అంటే అది నీ ఫిల్మ్‌లో భాగం కాదు

ప్రశ్న· నేను ఢిల్లీ వెళితే అమిత్ షాను కలవమని కూడా మీ సలహా కదా!

జవాబు. అవును కలిస్తే మంచిది అతడు సిద్ధాంత కర్త

ప్రశ్న. ఎందుకు నేను అతణ్ణి కలవాలని మీరు సలహా ఇస్తున్నారు?

జవాబు: నీకు రాష్ట్రం గురించి ఒక భిన్నమైన దృక్పథం కలుగుతుంది. అతడిది చాలా నిశితమైన దృష్టి. అతడు ఆరెస్సెస్ గురించి, రాష్ట్రం గురించి చెబుతాడు

ప్రశ్న· నేను మీ పరిచయం వాడుకోవచ్చా? అతడెక్కడ ఉంటాడు?

జవాబు· వాడుకోవచ్చు. అతణ్ణి అడిగానని చెప్పు. అతడు గుజరాత్ భవన్‌లో ఉంటాడు

ప్రశ్న మోదీజీని అల్లర్ల గురించి అడగవచ్చా?

జవాబు· వద్దు అతడేం మాట్లాడడు.

ప్రశ్న. అది అతని బలహీనమైన అంశం కదా?

జవాబు. అవును

ప్రశ్న: మత కల్లోలాల సమయంలో మీరు ఉన్నారా?

జవాబు· ఉన్నాను నా జీవితంలో అవి అత్యంత దారుణమైన దినాలు నేను అప్పటికే ముప్పై ఏళ్ళుగా ఉద్యోగంలో ఉన్నాను 85లో, 87లో, 89లో, 92లో కూడా మత కల్లోలాలు చెలరేగాయి. చాలాసార్లు హిందువుల పైనే దాడులు ఎక్కువగా జరిగాయి. ముస్లింలు పై చేయి సాధించారు. కాబట్టి ఇప్పుడిక 2002లో ఇది జరగక తప్పేది కాదు. ఇది హిందువుల ప్రతీకారం. పైగా 1995 తర్వాత ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం కాబట్టి ప్రజలు (హిందువులు – అను) దాన్ని తమదిగా భావించారు.

నేను ప్రజలను చేరుకోలేదని నాపై అభియోగం మోపుతారు కానీ ఒక్క వ్యక్తి కూడా నాకు ఫోన్ చేయలేదు. ఎవరు నాకు ఫోన్ చేస్తున్నారో తెలుసుకోవటానికి నాకేం అతీంద్రియ శక్తులు లేవు

ప్రశ్న అంటే మోదీ ఒక పోస్టర్ బాయ్ లాంటి వాడంటారా?

జవాబు: మల్లికా సారాభాయ్, డాన్సరు నీకు తెలుసా. ఆమె పెద్ద మోదీ వ్యతిరేకి 2002 కల్లోలాలు మోదీ కారణంగానే జరిగాయని వాళ్ళ అభియోగం నేను పోయి గోధ్రాలో రైలు తగలబెట్టలేదని మోదీ జవాబు. నేను అది చేయనప్పుడు ఆ తరువాత జరిగిన పరిణామాలకు నన్నెట్లా నిందిస్తారు? అది నేను చేసి ఉంటే, ఇది కూడా నేను చేసినట్టు. అంతకు ముందంతా జరిగిన దానికి ఇది ప్రతి క్రియ. చూడు, తార్కికంగా చూస్తే ముస్లింల గుంపొకటి పోయి రైలును తగలబెడితే, దాని ప్రతి క్రియ ఎట్లా ఉంటుంది?

ప్రశ్న వాళ్ళ పైన తిరిగి దెబ్బ కొడతారు?

జవాబు· అవును వాళ్ళ పైన దెబ్బ కొడతాము. 85, 86, 92 తదితర కల్లోలాలలో హిందువులే దెబ్బ తిన్నారని నీవు ఇది వరకే నీ పరిశోధనలో తెలుసుకొని ఉంటావు ఇప్పుడొక అవకాశం దొరికింది కాబట్టి, వాళ్ళ పైన దెబ్బ కొట్టాలి. దీనికి ఎవ్వరికైనా ఎందుకు అభ్యంతరం ఉండాలి?

ప్రశ్న: అంటే అతడు ఏమాత్రం ఆపకపోయి ఉండేవాడనే నేననుకుంటున్నా

జవాబు: ఒకసారి ప్రజలలో ఆవేశం రగిలిన తర్వాత, ఇక నీవు దాన్ని ఆపలేవు ఈజిప్టులో లాగా

నీవే చెప్పు. ప్రజలపైన కాల్పులు జరపాలంటావా? ఒకవేళ కాల్పులు జరిపి ఉంటే ఏమయ్యేది? అటువంటి వాణ్ణి మళ్ళీ వీధుల్లో తిరగనిస్తారా? ఇటువంటి పరిస్థితిలో మోదీ ఎంత వరకు స్విచ్ ఆఫ్ చేయగలిగి ఉండేవాడు? అతని చేతిలో రిమోట్ లేదు

ప్రశ్న: ఈ కల్లోలాలు ఎన్ని రోజుల పాటు సాగాయి?

జవాబు· మొదటి దఫా రెండు రోజులు మాత్రమే సాగాయి అంతకంటే ఎక్కువ కాదు.

ప్రశ్న· హిందువులు ముస్లింలపై దాడులు చేస్తున్నారనేది మీడియా సృష్టే అంటారా?

జవాబు: అవును వాళ్ళు ఇంక ఎలా చిత్రిస్తారు? ముస్లింలు కూడా హిందువులపై దాడులు చేసారు అదే స్థాయిలో కాకపోయి ఉండవచ్చు అయినా మనమిక్కడ సరిసమానత్వం కోసం చూడటం లేదు. గోధ్రాలో రైలు తగలబెట్టి ముస్లింలే మొదట దాడి చేసిన వాళ్ళయ్యారు. సహజంగానే దానికి ప్రతిక్రియ ఉంటుంది. ముస్లింలు ఎక్కువ నష్టపోయారు కానీ వాళ్ళు కూడా నష్టం కలిగించారు ఒకవేళ హిందువు దొరికితే అతణ్ణి చంపేస్తారు. నీవు అతణ్ణి (హిందువును) అడిగితే, చెబుతాడు.

ప్రశ్న: మొన్న నేను సిట్ నివేదిక పైన ఒక వ్యాసం ఒక పత్రికలో చూసాను

జవాబు· అవును. మత కల్లోలాల గురించి విచారించడానికి ఒక సిట్‌ను ఏర్పాటు చేసారు. దాని నివేదికను సుప్రీం కోర్టులో సమర్పించారు కానీ ఒక కాపీ మీడియాకు లీక్ చేసారు. నిజానికది రహస్య నివేదిక ఈ రిపోర్టు మోదీపై ఎటువంటి ఆరోపణ చేయలేదు. నివేదిక రాసిన వ్యక్తి ఆరోపణ చేయదానికి తనకే ఆధారమూ దొరకలేదని అన్నాడు.

ప్రశ్న వాళ్ళు మిమ్మల్ని కూడా దోషిని చేయాలని చూసారు కదా!

జవాబు: అవును. అతని కోసం పని చేసిన అధికారులకు పదవీ విరమణ తరువాత కూడా పోస్టింగ్ ఇచ్చారన్నారు. ఏం పోస్టింగ్? నాకిచ్చిన పోస్టింగ్‌లో నాకు డబ్బేం దొరకదు

ప్రశ్న· కానీ, మీరు రాష్ట్రం కోసం పని చేసినప్పుడు అతడు మీకు ప్రతిఫలమెందుకు ఇవ్వకూడదు? లేకపోతే ఆయనకు వ్యతిరేకంగా పనిచేసిన వాళ్ళకు ఇస్తారా

ఏంటి?

జవాబు. అవును ఆయనకు వ్యతిరేకంగా పని చేసిన వాళ్ళకు ఎట్లా పోస్టింగులు ఇస్తాడు?

ప్రశ్న అవును ఎట్లా ఇస్తాడు?

జవాబు· అట్లా ఇచ్చే ప్రశ్నే లేదు.

ప్రశ్న అతడేమీ యోగి కాదు కదా!

జవాబు· కదా!

ప్రశ్న రోడ్డు మీదకు వెళ్ళి ప్రజలను అడిగితే తెలుస్తుంది. కొంచెం అలా పరిమళ్ గార్డెన్‌కు వెళ్ళినా తెలుస్తుంది

జవాబు అవును అతడంటే వారికి చాలా ప్రేమ

ప్రశ్న· బహుశా వాళ్ళు కోరుకున్నది అతడు ఇచ్చినందువల్ల కావచ్చు. వాళ్ళ అభీష్టానికి అతడు ప్రతిరూపం ఇప్పుడు మైనారిటీలను బుజ్జగించటం లేదనీ, తమ ఆత్మగౌరవం తమకు తిరిగి దక్కిందని చాలా మంది అన్నారు.

జవాబు అవును, కానీ ఈ జనాభిప్రాయాన్ని ఎవ్వరూ పట్టించుకోరు

ప్రశ్న· ముస్లింలు అతన్ని ద్వేషిస్తారు కదా!

జవాబు కరడు గట్టినవాళ్ళు మాత్రమే అయితే వాళ్ళు మీడియాలో వస్తున్నదే చూస్తున్నారు ఆ దేవ్‌బంద్ ప్రముఖుడు వాస్తన్వీ చెప్పింది ఇండియా టుడేలో వచ్చింది గుజరాత్ సమాన అవకాశాలనిస్తుందని అతడు అన్నాడు అయితే దీనికి అభ్యంతరాలు వచ్చాయి.
ఎందుకంటే, 2002లో మోదీ చేసిన దానికి ఈయన కితాబునిస్తున్నాడని వాళ్ళనుకున్నారు.

ప్రశ్న నేను (ముకుల్) సిన్హా వద్ద ఉన్నప్పుడు, కొందరు అల్-జజీరా విలేఖరులు అక్కడికి వచ్చి ఉంటే కలిసాను

జవాబు ఆc, అవును గోద్రా తీర్పును కవర్ చేయడానికి ముస్లిం ఛానల్ వాళ్ళు వచ్చి ఉంటారు వాళ్ళు ఏదో చెత్త వాగుతారు

ప్రశ్న సిట్ పై వ్యాసం వచ్చిన ఒక పత్రికనేదో నాకిచ్చాడు

జవాబు అబ్బా అది కమ్యూనలిజం కంబాట్ అయి ఉంటుంది.

ప్రశ్న కాదు కాదు. అదీ . అది తెహల్కా

జవాబు· ఓ అదా ఎల్లో జర్నలిజానికి నిఖార్సయిన ఉదాహరణ అది ఈ తెహల్కా వాళ్లు ఏం చేస్తారో తెలుసా? వాళ్ళు కెమెరాలు పట్టుకొని తిరుగుతూ

షూట్ చేస్తుంటారు. ఒకరు ఇంకో వ్యక్తికి డబ్బులిస్తున్నట్టు చూపిస్తారు. నటిస్తారు కూడా మనకు మాటలు వినిపించవు కానీ, దాన్ని చూపిస్తారు.

ప్రశ్న: వాళ్ళెట్లా చూపిస్తారు?

జవాబు: ఛానళ్ళకు అమ్ముతారు. ఒక ఆయుధాల వ్యాపారి నుండి ఒక మంత్రి డబ్బులు తీసుకుంటున్నట్టు ఇది వరకు చూపించారు. కొన్ని కొన్ని ముక్కలు చూపిస్తారంతే. మొత్తం ఫుటేజీ చూపించరు 2002 గురించి చూపడం కోసం కొందరు ఈ వాగుడుకాయలను చూపిస్తారు. వాళ్ళు ఇట్లాగే డబ్బు సంపాదించుకుంటారు. ఫుటేజీని న్యూస్ ఛానళ్ళకు అమ్ముకుంటారు. ఆ సిన్హా – ఆయన అల్–జజీరాకు ఇంటర్వ్యూ ఎందుకు ఇవ్వాలి? మహిళలను ఎట్లా బలాత్కరించి, కాల్చి చంపారో ఆ ఛానల్ ఒకటే నిరంతరం చూపించింది ఎందుకు? ఎందుకంటే దానితో ఎక్కువ వెసులుబాటు దొరుకుతుందని.

ప్రశ్న. మిమ్మల్ని కమీషన్ బాగా ప్రశ్నించి ఉంటుంది.

జవాబు. ఇప్పటికీ ప్రశ్నిస్తూనే ఉంది.

ప్రశ్న: అది అయిపోవటం లేదా? ఇంకా ప్రశ్నిస్తున్నారా?

జవాబు: అవును నన్ను ప్రశ్నించారు అది కొనసాగుతూనే ఉంది. ఎందుకంటే, ఈ కర్రతో నరేంద్రమోదీని బాదవచ్చు
వాళ్ళకు 2002 అంటే పూర్తి కాలపు ఉద్యోగం. దానితో వాళ్ళకు కాసుల వర్షం కురుస్తుంది.

ప్రశ్న: నాకు నిజంగా తెలుసుకోవాలని ఉంది. అంటే, మీరు పోలీసు కమీషనర్‌గా ఉండినారు కదా, మీరు అప్పుడు దాంతో ఎలా వ్యవహరించారు?

జవాబు. అది భయానకంగా ఉండింది. అటువంటి పరిస్థితి నేను అంతకు మునుపు చూడలేదని కాదు కానీ, ఇది భిన్నమైంది ఈజిప్టులో జరిగినట్టు. ఇప్పుడు ఈజిప్టులో ప్రజలపైన బలాన్ని ప్రయోగించలేకపోతున్నారు కదా అలాగే బయట నిరసన తెలుపుతున్న ప్రజా సమూహంపై బలప్రయోగం ఎట్లా చేస్తాం? అలా చేసి ఆ తరువాత అతడు ఉండగలిగేవాడా? బలప్రయోగమే సమాధానం కాదు.

ప్రశ్న అంటే గోధ్రాయే గుజరాత్‌కు దారి తీసిందంటారా?

జవాబు· అవును. అయోధ్య నుండి ఒక రైలు వస్తుండింది అందులో విహెచ్‌పి మద్దతు దారులే ఎక్కువగా ఉన్నారు. వాళ్ళు అయోధ్యలో ఒక ఆలయం

కట్టాలనుకున్నారు. వాళ్ళు అయోధ్య నుండి తిరిగి వస్తున్నారు 73 మంది ఉన్నారు. కానీ ముస్లింలు వాళ్ళపై దాడి చేసారు. స్థానికులు పెట్రోలు డబ్బాలతో వచ్చి రైలు డబ్బాలోకి ఎక్కి దానికి నిప్పు పెట్టారు. దాంతో 61 మంది చనిపోయారు.

దానికి ప్రతీకారంగా విహెచ్‌పి బంద్‌కు పిలుపునిచ్చింది

ఇరవై ఎనిమిదవ తేదీన హింస చెలరేగింది. ఇక అందరు రోడ్లపైకి వచ్చారు ముసలి, ముతక, యువకులు, అమ్మాయిలు...

ప్రశ్న ఇంతకీ అతనిపై ఉన్న ఆరోపణ ఏమిటి?

జవాబు వాళ్ళనటం ఏమిటంటే అందరూ వీధుల్లోకి వచ్చేలా అతడే చేసాడని. 27న అతడు గోధ్రాకు వెళ్ళాడు

అతడే ముస్లింలకు వ్యతిరేకంగా హింసను ప్రేరేపించాడని కూడా ఆరోపణ.

ప్రశ్న. అంతేకాదు. గోధ్రా వెళ్ళి అల్లర్ల బాధితులను కలవనైనా కలవలేదని ఆరోపణ ఉంది కదా?

జవాబు. ఆయన ఆ పని ఎందుకు చేస్తాడు? అంటే ముస్లింలను ఎందుకు కలుస్తాడు?

ప్రశ్న అవును మరి. హిందువులు చంపబడుతున్నారా?

జవాబు అతడు రాత్రి పది గంటలకో, పదకొండుకో వెనక్కు వచ్చాడు

ప్రశ్న వాళ్ళనేది ఏమిటంటే, ఏం జరిగినా ఏం చెయ్యొద్దని అతడు చెప్పాడని

జవాబు: అవును. కమీషన్ కూడా నన్నీ ప్రశ్న అడిగింది నాకు అటువంటి ఆదేశం ఏమీ ఇవ్వలేదని నేను చెప్పాను (అదుపు చేయమని) నేను ఆదేశాలు ఇచ్చాను అయినా ప్రజలు చనిపోయారు. అందరినీ కాపాడగలనని నేను చెప్పలేను. నేను దేవుణ్ణి కాదు. నాకు చాతనయినంత నేను ప్రయత్నించానని చెప్పాను.

ప్రశ్న (మీకు వ్యతిరేకంగా) ఉన్నది ఇంతేనా?

జవాబు కాదు మరొకటి కూడా ఉంది వాళ్ళు నరేంద్ర మోదీని ఇరికించడానికి ఇదొక్కటే మార్గం. అంటే నా ద్వారా మాత్రమే

ప్రశ్న: మీరు అతనికి చాలా సన్నిహితులు కాబట్టి కూడానా?

జవాబు ఒకవేళ నేను అతనికి వ్యతిరేకంగా ఏమైనా చెబితే అప్పుడు వాళ్ళకు సంతోషం

ప్రశ్న మీకు చాలా మంది శత్రువులు అయి ఉంటారు కదా. పోలీసుల్లో కూడా అయి ఉంటారు.

జవాబు: ఒకరిద్దరు ఐపిఎస్ అధికారులు ఉండొచ్చు

ప్రశ్న: కొద్దిమంది బాగా పనిచేస్తున్నారని నాతో అన్నారు, వాళ్ళేనా?

జవాబు: అవును. రాహుల్‌శర్మ, సతీష్ వర్మ, కుల్‌దీప్ శర్మ వీళ్ళే

ప్రశ్న: అవునవును.

జవాబు: ఆ కుల్‌దీప్ శర్మను గొర్రెలు, ఉన్ని శాఖకు పంపించారు అతడిప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేక పక్షంలో, ముకుల్‌సిన్హా వంటి వారి పక్షాన ఉన్నాడు. అదో పెద్ద కథ. నీకు మొత్తం తెలిస్తేనే అర్థమవుతుంది కుల్‌దీప్ శర్మ అప్పటి గృహ శాఖామంత్రికి వ్యతిరేకంగా నిలబడ్డారు

ప్రశ్న ఎవరతను?

జవాబు: అమిత్ షా.

ప్రశ్న: అరెస్టయిన వ్యక్తేనా?

జవాబు: మీ గృహమంత్రి ఒక వెధవ (స్కౌండ్రల్) అని కుల్‌దీప్ శర్మ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశాడు. దాన్ని నిరూపించమని ముఖ్యమంత్రి చెప్పి ఉంటాడు

ప్రశ్న. కానీ అతడు హోంమంత్రికి వ్యతిరేకంగా చర్య ఎలా తీసుకుంటాడు?

జవాబు అతడి ధైర్యం చూడు ఈ విషయంపై సిబిఐతో దర్యాప్తు చేయించమని ముఖ్యమంత్రికి ఉత్తరం రాసాడు. విశ్రాంత ముఖ్య కార్యదర్శితో విచారణ జరిపిస్తానని ముఖ్యమంత్రి అన్నాడు.

ప్రశ్న: షా అరెస్టయినప్పుడు అతడు చాలా సంతోషించి ఉంటాడు.

జవాబు: అతడు అరెస్టు కావడంలో ఇతడి పాత్ర ఉంది

ప్రశ్న: ఎలా?

జవాబు: సి.బి.ఐ.కి, మొత్తం మీడియాకు సాక్ష్యాధారాలు ఇచ్చింది అతడే పాండియన్ అనే అధికారి కాల్ రికార్డులను బయటపెట్టి నిరూపించాడు

ప్రశ్న: ఎలా?

జవాబు: పాండియన్, కుల్‌దీప్‌లకు ఒకరికి వ్యతిరేకంగా మరొకరిపై కేసులు ఉన్నాయి. పాండియన్ ఒక కేసును పత్రికల్లో బహిరంగపరచాడు కాబట్టి పాండియన్‌ను కుల్‌దీప్ జైలుకు పంపించాలనుకున్నాడు పాండియన్ నిజంగానే ఆ ఎన్‌కౌంటర్లో ఉన్నాడు

ప్రశ్న: ఓహో. అట్లా అతడు గృహమంత్రిని పట్టుకున్నాడా?

జవాబు: అవును పాండియన్ గృహమంత్రికి చాలా సన్నిహితుడు కాబట్టి అతడితో ఫోన్లో మాట్లాడేవాడు. అట్లా అతడు ఎన్‌కౌంటర్లో షా పాత్ర కూడా ఉందని

నిరూపించగలిగాడు

ప్రశ్న: ఇట్లా ఎన్‌కౌంటర్లలో చనిపోయిన వారు ఇంతకూ ఎవరు?

జవాబు. అందరూ చిన్న చిన్న నేరస్థులు. చట్టం వారినేమీ చేయలేనప్పుడు వారినిట్లా తొలగించి వేస్తాం.

ప్రశ్న ఒక మహిళను టెర్రరిస్టు అని చంపేసారని నేను విన్నా.

జవాబు అవునవును

నేనేమంటున్నానంటే, నేను డి.జి.గా ఉండి పదవీ విరమణ చేయ బోతున్నాను. అదే సమయానికి అతడు కూడా విదేశాల నుండి వచ్చేసాడు. అతడు డి జి కావాలనుకున్నాడు కానీ ఎప్పుడూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదో ఒకటి చేస్తూ ఉన్న వాడిని ఎట్లా నియమిస్తారు?

ప్రశ్న. అవును అతడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తుంటే, అతణ్ణెట్లా నియమిస్తారు?

జవాబు అతని (కుల్‌దీప్ శర్మ) వంటి వాడిని ప్రభుత్వం డిజిగా నియమిస్తుందని ఆశించలేవు కాబట్టి అతనికి ఏ ప్రాముఖ్యత లేని పదవి ఇచ్చారు.

ప్రశ్న ఎటువంటిది?

జవాబు: గొర్రెలు, ఉన్ని శాఖకు అధ్యక్షుణ్ణి చేశారు (అని నవ్వాడు).

ప్రశ్న ఓహ్. అది శిక్షించే వాళ్ళకు ఇచ్చే పదవి లాంటిది కదా!

జవాబు అవును అది శిక్షించడానికి ఇచ్చిన పోస్టింగే. నీవు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉంటే. లేకపోతే, డి జి కావడానికి అతడు అన్ని విధాలా అర్హుడైన వ్యక్తి.

అతడు పోలీసింగ్, సంస్కరణలో పి హెచ్.డి. కూడా చేసాడు కానీ, అతడు ఊరికే ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. అక్కణ్ణుంచి ఇక మొదలయ్యింది.

ప్రశ్న కానీ, హోంమంత్రి ఒక రకమైన వ్యక్తి కదా!

జవాబు: కానీ అతణ్ణి నీవు కలవమని నా సలహా అతడు బెయిల్‌పై ఉన్నాడు కానీ, గుజరాత్ వెళ్ళకూడదని అతనిపై ఆంక్షలున్నాయి. కాబట్టి వెళ్ళి అతణ్ణి కలవమని నా సలహా. అతడు చాలా కుశాగ్ర బుద్ధి కలవాడు. చాలా చురుకైన వాడు కూడా. చాలా ఆసక్తికరమైన విషయాలున్నాయి.

ప్రశ్న సిద్ధాంతానికి కట్టుబడి ఉండే మనిషా?

జవాబు అవును. అతడు పక్కా ఆరెస్సెస్ మనిషి

ప్రశ్న ఇదంతా ఎందుకు జరుగుతోంది?

జవాబు. కానీ, ఈ తీస్తాలు (తీస్తా సెతల్‌వాద్), సిన్హాలు మాత్రం సంతోషిస్తారు. నీవేమైనా అను కానీ ఎనభై శాతం ప్రజలు మెజారిటీ హిందువులు. కాబట్టి వాళ్ళను గురించి పట్టించుకోవాలి. అయినా ముస్లింల చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఎందుకు సమర్థించాలి? ముస్లింలు ఎన్ని తప్పులు చేసినా సరే, నీవు వారికి మద్దతు ఇవ్వాలనుకుంటావు. హిందువులు ఎంత మంచి చేసినా కానీ, నీవు వారిని వ్యతిరేకిస్తూనే ఉంటావు

ప్రశ్న: కానీ, హిందువులు విముక్తులైనట్టుగా భావించి ఉంటారు కదా!

జవాబు: అవునవును సిటీలో హిందువులు, ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నడిస్తే తెలుస్తుంది. మేం చాలా కాల్ రికార్డులను జల్లెడ పట్టాక గానీ ఇడియన్ ముజహిదీన్ కార్యకర్తలను (గుజరాత్ పేలుళ్ళ నిందితులు) పట్టుకోలేక పోయాం

ప్రశ్న: వావ్!

జవాబు: ఇంతా చేస్తే వాళ్ళ కేసులపై విచారణ జరపొద్దని సుప్రీం కోర్టు అంటుంది.

ప్రశ్న: ఎందుకు?

జవాబు. ఇంకెందుకు? మైనారిటీలను బుజ్జగించడం కోసం

ప్రశ్న: సుప్రీం కోర్టులో కూడా అలా జరుగుతుందా?

జవాబు: అక్కడ కూడా జరుగుతుంది

అసలు వీళ్ళను గోడకు నిలబెట్టి కాల్చి పారెయ్యాలి. ఒక పేలుడు జరిగింది ఆరుగురు చనిపోయారు మరొకటి జరిగింది. మూడవది ఆసుపత్రిలో ట్రామా సెంటరు వద్ద జరిగింది ఎందుకంటే గాయపడ్డ వాళ్ళు వచ్చేది అక్కడికే కదా. నేను ముఖ్యమంత్రికి ఫోన్ చేసి అతణ్ణి వెళ్ళవద్దని చెప్పాను అప్పటికే అతడు కమీషనర్ ఆఫీసుకు వచ్చి ఉన్నాడు బాంబును ఒక వ్యానులో ఉంచారు. ఇవన్నీ ఎంత దారుణమైనవో చూడు అయినా సరే, వీళ్ళను బుజ్జగించాలనుకుంటారు ఎందుకు? ఓట్ల కోసం

నా ఆప్తమిత్రులు ఒక ముస్లిం కానీ అది వేరు అది ఒక్క వ్యక్తి సంగతి వాళ్ళను అందరిలాగే చూడండి. నాకే సమస్య లేదు

ప్రశ్న: మత కల్లోలాల సమయంలో ముస్లింలకు మంచి గుణపాఠం నేర్పారు చాలా మంచిదయింది.

జవాబు: అవును ఒక్కోసారి జరిగింది మంచిదే అయింది అనిపిస్తుంది. అందుకే

నేను వీళ్ళను (ముస్లింలను) కటకటాల వెనుక తోసానని నాకు సంతోషమౌతుంది అది నాకు చాలా సంతృప్తి కలిగించే విషయం ముకుల్ సిన్హా, తీస్తా సెతల్‌వాద్ వంటి వాళ్ళు ఇక్కడ అరాచకత్వం ఉందంటారు. అవును, ఉంది కానీ ఈ అరాచకత్వాన్ని ఎవరు సృష్టించారు అదే ముస్లింలు

నాకేదో రాజకీయ పార్టీలంటే ప్రేమలేదు కానీ కాంగ్రెసు ఈ రకంగా ఉంటే, నాకు బిజెపితో ఉండటమే ఇష్టం

ప్రశ్న ఎన్‌కౌంటర్ల గురించి మీరు ఏమనుకుంటారు?

జవాబు వ్యక్తిగతంగా నేను ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకిని. అవి హత్యల్లాంటివి. కానీ, కొన్ని సమయాల్లో అవి అవసరం.

ప్రశ్న: నేను మాట్లాడిన ఆఫీసరు కూడా ఈ ఎన్‌కౌంటర్ గురించి చెబుతుండినాడు.

జవాబు: అవునా? అయితే నా పేరు తప్పక వచ్చి ఉంటుంది. నేను డి జి గా ఉన్నాను అయితే ఎన్‌కౌంటర్ సమయంలో కాదు ఎన్‌కౌంటర్ 2005లో జరిగింది కేసును విచారించమని నాకు బాధ్యత ఇచ్చారు.

ప్రశ్న: ఓ కె

జవాబు: ఆ సోహ్రాబుద్దీన్ వద్ద ఏదో ఏ.కే. రైఫిల్ ఉండడంతో అతనికి శిక్ష పడేది. అది అతని వద్ద దొరికింది తరువాత అతనికి శిక్ష పడింది ఇదీ అతని నేపథ్యం. ఆ మహిళ (కౌసర్ బీ) అతని భార్య కూడా కాదు

ప్రశ్న: వాళ్ళకు ఊరికే సంబంధం ఉండిందా?

జవాబు. ఆమె అతడితో పాటు సహజీవనం చేసేది. అటువంటి వాడితో కలిసి ఉంటే, అతడికి జరిగేది నీకు కూడా జరుగుతుంది కష్టాన్ని కొని తెచ్చుకోవటమే ఆయన ఎటువంటి వాడు?ఏదో నీకు తెలియదన్నట్టైనా కాదు అయితే ఒక మనిషిని చంపడానికి ఇది కారణం కాజాలదనుకో

ప్రశ్న కానీ సర్, వాళ్ళు ఇదంతా డబ్బు కోసం చేసారా లేక సిద్ధాంతం కోసమా, హిందూత్వ సిద్ధాంతం కోసమా?

జవాబు: రెండూనూ. సిద్ధాంతం కోసం. డబ్బు కోసం కూడా.

ప్రశ్న: అదే నాతోనూ అన్నారు ఎన్‌కౌంటర్‌కు లంచగొండితనం ఒక ముఖ్య కారణమని నాతో అన్నారు. అందుకే గృహమంత్రి, అధికారులు పట్టుబడ్డారా?

జవాబు. అవును చాలా సార్లు ఇలాంటి వ్యవహారాల్లో డబ్బు కూడా ముడిపడి

ఉంటుంది.

ప్రశ్న: ఈ గృహమంత్రి వల్ల ముఖ్యమంత్రి కూడా దాదాపు ఇరుక్కునేవాడని చాలా మంది అన్నారు

జవాబు: ఈ కేసు విచారణ జరగాలని కోరుకున్నవారి లక్ష్యం గృహమంత్రి కాదు వాళ్ళ లక్ష్యం ముఖ్యమంత్రి

ప్రశ్న. కానీ వాస్తవమేమిటంటే, గృహమంత్రి పాత్ర ఇందులో ఉంది, కాబట్టి.

జవాబు· అట్లా అని ముఖ్యమంత్రికి కూడా అందులో భాగస్వామ్యం ఉందని టెక్నికల్‌గా అనలేము.

ప్రశ్న· ఎటిఎస్‌కు చెందిన ఈ సింఘాల్ గురించి కొంచెం చెప్పండి అతణ్ణి ఒక దళితుడిగా నేను నా ఫిల్మ్‌లో చేరుస్తున్నాను.

జవాబు· సింఘాల్ మంచి అధికారే. రాజస్థాన్‌కు చెందిన వాడు. గుజరాత్‌లో సెటిల్ అయ్యాడు. అతడు కూడా సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్‌లో ఉన్నాడు అతణ్ణి కూడా పట్టుకున్నారు కానీ ఆ కేసులో కొంచెంలో తప్పించుకున్నాడు కానీ ఇష్రత్ ఎన్‌కౌంటర్లో దొరికిపోయాడు

ప్రశ్న. అది ప్రభుత్వానికి ఒక మచ్చలాంటిది కదా

జవాబు అవును కానీ ఏం చెయ్యగలుగుతాం.

ప్రశ్న· 2002లో ఉన్న అధికారుల గురించి గుజరాతీల్లో కూడా చెడు అభిప్రాయ ముందా?

జవాబు. కొందరు అధికారులు మరి కాస్త మెరుగ్గా పని చేయగలిగేవారని గుజరాతీలు కూడా భావిస్తున్నారు వాళ్ళు గట్టిగా నిలబడలేకపోయారు నన్ను ఒక నిష్పక్షపాత అధికారిగా చూసారు.

ప్రశ్న. కానీ మిమ్మల్ని కూడా వెంటాడుతున్నారు కదా

జవాబు లేదు గుజరాతీలు నన్ను వెంటాడటం లేదు. ఎన్.జి ఓ.లు ఆ పని చేస్తున్నాయి.

చూడు. మొదట శవాలను అహ్మదాబాద్ తీసుకొచ్చి సివిల్ ఆసుపత్రిలో ఉంచారు. దాని తర్వాత ఆ ప్రాంతంలో కొంత ఉద్రిక్తత నెలకొంది అక్కడక్కడ కొన్ని ఘటనలు జరుగుతున్నట్టుగా సమాచారం రాసాగింది. నరోడా, మెఘానీ నగర్‌లో హింస చెలరేగినప్పుడు నేను స్వయంగా అక్కడికి పోలేకపోయాననేది మాత్రం నన్ను బాధించే విషయం నేను వెళ్ళి ఉంటే అలా జరగనిచ్చేవాణ్ణి కాదు.

మరొక చోట అయితే, ఈ పూర్వ పార్లమెంటు సభ్యుడు గుంపును సవాలు చేద్దామనుకున్నాడు. తన 12 బోర్ తుపాకి తీసుకొని గుంపు పైకి ఫైర్ చేసాడు

ప్రశ్న: ఎవరీ వ్యక్తి?

జవాబు: ఎహ్సాన్ జాఫ్రి 75 ఏళ్ళ ముసలాయన అతడు గతంలో రాజ్యసభ సభ్యుడు. అతడు కాల్పులు జరిపాడు. అతడి కాల్పుల్లో ఇద్దరు చనిపోయారని పోలీసు రికార్డుల్లో ఉంది నేను ఏం చెయ్యాలనే (ఆలోచన) నుండి దూకుడుతనం వచ్చింది. నీ బలం పదివేల మంది, నా బలం వంద మంది అయినప్పుడు నేనా పని చేయను

ప్రశ్న అప్పుడు నేను నిన్నెందుకు వదిలిపెడతా?

జవాబు. సరిగ్గా అదే జరిగింది పోలీసులు ఏమీ చెయ్యలేదని నీవు అనవచ్చు. కాల్పులు జరపమని మేం చెప్పలేదు కదా నీవు ఊరికే ఉండి ఉండొచ్చు కదా. జరిగింది అది ఒక పిల్లవాడు మసీదు పైకి ఎక్కాడు. ముస్లింలు అతణ్ణి ముక్కలుగా నరికారు హిందువులకు ఆగ్రహం కలిగింది. దాంతో అది కల్లోలాలకు దారి తీసింది.

ప్రశ్న తీస్తా అనే సామాజిక కార్యకర్తను కలవమని ఎవరో నాతో అన్నారు

జవాబు ఆమె అంత పెద్ద స్కౌండ్రల్ మరొకరు లేరు. ఇండియా టుడేలో పని చేస్తున్న విలేఖరి ఉదయ్ మహుర్కర్ ఫోన్ నెంబరు తీసుకో.

ప్రశ్న మరి ఆ లాయరు సిన్హా మాటేమిటి?

జవాబు వాడు మరో స్కౌండ్రల్ అతడు నానావతి కమీషన్‌లో వాదిస్తున్నాడు అతడికి విదేశాల నుండి పెద్ద ఎత్తున డబ్బులు లభిస్తాయి ఈ సెతల్‌వాద్, తీస్తా కుటుంబానికి చెందిన ఆమె జావేద్ ఆనంద్ అనే మరో వ్యక్తి ఉన్నాడు అతడు అప్పుడు ఒక సబ్-ఎడిటర్. అప్పటికే జావేద్‌కు పెళ్ళయ్యింది తీస్తాకు ఈయనతో పరిచయం అయ్యింది. ఆమె నాన్నకు ఇది నచ్చలేదు జావేద్ తన మొదటి భార్యను వదిలేసి ఈమెతో కలిసి ఉంటున్నాడు ముందు తీస్తా అంటే ఎవరికీ తెలీదు కానీ 2002 తర్వాత ఆమె గుజరాత్‌కు వచ్చి గుజరాత్‌లోని పౌరుల సమస్యలు చేపట్టింది ఆమె ఒక న్యాయవాదుల, న్యాయాధికారుల కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన వ్యక్తి కాబట్టి విశ్రాంత జడ్జిలను కదిలించింది వాళ్ళంతా కలిసి 'కమ్యూనలిజం' అనే పుస్తకం కూడా తెచ్చారు. ఆమె బాధితులకు మద్దతు

కల్పించడం మొదలు పెట్టింది దాంతో విదేశాల నుండి కుప్పలు, తెప్పలుగా డబ్బులు రావడం మొదలయ్యింది బిజెపి ఓడిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ గుజరాత్‌లో బిజెపి గెలిచింది. కాకపోతే కేంద్రంలో ఓడిపోయింది. దాంతో కేంద్రానికి ఆమె ఒక పోస్టర్ గర్ల్ అయ్యింది

ప్రశ్న ఆమెను ఆపడానికి మీరేం చెయ్యలేకపోయారా?

జవాబు. మేమెలా చేయగలుగుతాం? మేం చేయాలనుకున్నా కానీ కోర్టులు మా మీద పడిపోయేవి

ప్రశ్న: ఆమెవల్ల కలుగుతున్న ఇబ్బంది గురించి ముఖ్యమంత్రి మీతో అని ఉంటాడు కదా.

జవాబు అవును అన్నాడు.

ప్రశ్న: కానీ, కల్లోలాల కారణంగానే మోదీ, మోదీ అయ్యాడు కదా!

జవాబు అవును అంతకు ముందు అతనంటే ఎవరికి తెలుసు? మోదీ ఎవరు? అతడు ఢిల్లీ నుండి వచ్చాడు. అంతకు మునుపు హిమాచల్ ప్రదేశ్ నుండి అతడు పెద్దగా ప్రాముఖ్యం లేని రాష్ట్రాలకే బాధ్యుడిగా ఉన్నాడు హర్యానా గానీ, హిమాచల్ ప్రదేశ్ కానీ అంత ముఖ్యమైన రాష్ట్రాలు కావు

ప్రశ్న ఇదొక తురుపు ముక్క అయిపోయింది, కదా.

జవాబు. అవును. ఇవి జరగకపోయి ఉంటే, అతడి గురించి అంతర్జాతీయంగా తెలిసేదే కాదు అది అతడికి ఒక పెద్ద ప్రచారాన్ని కలిగించింది వ్యతిరేక ప్రచారమే కావచ్చు, కానీ, అతడి గురించి అందరికీ తెలిసింది

ప్రశ్న. మీరు అతడి మనిషి అనవచ్చా?

జవాబు. అనవచ్చు. 2002 కల్లోలాల సమయంలో నేను అతడితో పాటే ఉన్నా కాబట్టి, అనవచ్చు.

పై సంభాషణలన్నింటినీ రెండు నెలల కాలంలో వివిధ సాధనాలను ఉపయోగించి చేసాను. మోదీకి ఇష్టమైన వ్యక్తిగా తనను తాను భావించుకునే పాండే తనకు మోదీతో ఉన్న సాన్నిహిత్యం గురించి చెప్పడానికేమీ వెనకాడడు. సైద్ధాంతికంగా తనను వ్యతిరేకించే వారికి మంచి పదవులు ఇవ్వడానికి మోదీ ఏం యోగి కాదని నాతో చెప్పడంలో కూడా అతడికెటువంటి ఇబ్బందీ లేదు బూటకపు ఎన్‌కౌంటర్లో చంపి వేశారని సిబిఐ నిరూపించిన సోహ్రాబుద్దీన్‌తో 'కలిసి జీవిస్తున్నది' కాబట్టి 'కౌసర్ బీ'ని హత్య చేయడం సరియైందేనని సమర్థిస్తాడు

అక్టివిస్టుల గురించి సంభాషణా క్రమంలో ప్రస్తావన వచ్చినప్పుడల్లా వారిని

గుజరాత్‌కు చెడ్డ పేరు తెచ్చిన స్కౌండ్రల్స్‌గా వర్ణిస్తాడు

పరిమళ్ గార్డెన్‌లో అలా వాకింగ్‌కు వెళితే కల్లోలాల తరువాత గుజరాతీలు ఎట్లా స్వేచ్ఛ పొందిన వారిలా భావిస్తున్నారో అర్థమవుతుందని ఆయన చివరలో అన్నప్పుడు నేనేం ఆశ్చర్యానికి గురి కాలేదు

వజ్రాల వ్యాపారి అయిన తన కొడుకు నేపాల్ నుండి తిరిగి రాగానే సూరత్‌లో అతనిని కలిసేలా ఏర్పాటు చేస్తానని పాండే అన్నాడు బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో బెయిల్ పై విడుదలయ్యాక గుజరాత్‌లో ప్రవేశంపై నిషేధాన్ని ఎదుర్కొంటున్న అమిత్‌షాను ఢిల్లీలో కలవడానికి కూడా అతడు సాయపడ్డాడు గుజరాత్‌పై ప్రచారం కల్పిస్తూ వచ్చిన సామాగ్రిని, రాష్ట్రంలోకి పెట్టుబడులను తేవడంలో ముఖ్యమంత్రి చేస్తున్న కృషిపైన ఉన్న ప్రచార సామాగ్రినంతటినీ నాకు అందుబాటులోకి రావడానికి సాయం చెయ్యమని తిరుతో చెప్పాడు పాండే విభిన్న కమీషన్లలో విచారణ నెదుర్కొంటున్నాడు. బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో సి బి.ఐ అతణ్ణి నిందితుడిగా పేర్కొంది తన భర్తను, ఇతర ముస్లింలను రక్షించడంలో నిష్క్రియాపరత్వంపై ఎహసాన్ జాఫ్రి భార్య సుప్రీంకోర్టులో కేసు వేసింది అయినా అతనికేం చింతలేదు తననేం చెయ్యలేరని అతడు నిర్వికారంగా నాతో అన్నాడు

పాండేతో నా సంభాషణలు ముగింపుకు వచ్చే సమయానికి, మానసికంగా నాకు యాంక్జయిటీ అటాక్స్ చాలా పెరిగాయి నేను కొద్ది కాలం పాటు ఎక్కడికైనా వెళ్ళాలనుకున్నా కల్లోలాల సమయంలో గుజరాత్ డి జి.గా పనిచేసిన చక్రవర్తిని నేను కలవాలనుకోవటంతో ఇది సాధ్యమైంది చక్రవర్తి ముంబయిలోని విలాస వంతమైన ఖార్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. పాని నాతో పాటు ముంబయి రావాలనుకున్నది. మైక్ మళ్ళీ ఢిల్లీ వెళ్ళాలనుకున్నాడు కాబట్టి నాక్కూడా సహాయకులొకరు కావాలి దాంతో నేను, పాని ముంబయి ఫ్లైట్ ఎక్కాం నాకు చాలా ఆప్త స్నేహితుల్లో ఒకరి పెళ్ళికి నేను పానిని ఆహ్వానించాను. దాంతో ఆమె తన ఆఫీసు కొలీగ్ తనకు బహూకరించిన చీరను కూడా తనతో తెచ్చుకుంది. ఒకసారి పని అయిపొయ్యాక, నేను పానికి భారత సంస్కృతిని పరిచయం చేస్తానని ప్రామిస్ చేసాను.

# తొమ్మిదవ అధ్యాయం

## చక్రవర్తి

చక్రవర్తి ఎక్కువ కలివిడి మనిషి కాదు ముఖ్యంగా మీడియాతోనూ, గుజరాత్ అధికారగణంలో తన సహోద్యోగులతోనూ పెద్దగా కలవడు కాబట్టి నా గురించి అతడికి సిఫారసు చెయ్యమని అశోక్ నారాయణ్‌ను అడిగాను గుజరాత్ కల్లోలాల కాలంలో అతడు డిజిపి కాబట్టి మీడియా, అంతర్జాతీయ ప్రెస్, కమీషన్లు అతడి వెంటపడినాయి ముంబయ్‌లో విలాసవంతమైన ఖార్ ప్రాంతంలో అతడు తన భార్య, ఇద్దరు పిల్లలతో ప్రశాంత జీవనం గడుపుతున్నాడు

అతణ్ణి కలవడానికి నేను వెళ్ళినప్పుడు పానిని ఇంటివద్దే వదిలి వెళ్ళాను నన్ను ఇంట్లో మైథిలీ అని కాకుండా నిమ్మీ అని పిలిస్తే పాని ఆశ్చర్యపోయేది అది నా ముద్దు పేరని ఆమెతో చెప్పాను కానీ పాని నన్ను మైథిలీ అని పిలిచినప్పుడల్లా మా అమ్మకు చికాకు కలిగేది నేను ఒకరోజు పానీకి, నాకు బ్రేక్‌ఫాస్ట్ తయారు చేస్తుంటే 'నీ ఆఫీసులో నీవు చేస్తున్న నటనను, నాటకాలను ఇంటికెందుకు తెస్తున్నావు? ఇది ఇల్లు, రంగస్థలం కాదు', అని నాపై విసుగు ప్రదర్శించింది ఆమెకు కొంచెం కోపం వచ్చి, అప్‌సెట్ అయ్యిందనేది స్పష్టం నా పేరులో మార్పు పట్ల ఆమెకు పెద్దగా ఇబ్బంది లేదు నేను ప్రమాదపు అంచుల్లో జీవిస్తున్నాననేది ఆమెను భయపెట్టటం మొదలుపెట్టింది ఆమె నా గురించి భయపడుతోంది ఒకసారి ఆమె నా గదిలో ఏడుస్తుంటే చూసాను నా కుర్తా నొకదాన్ని పట్టుకొని ఉండింది 'నిన్ను చంపెయ్యడం వాళ్ళకు చాలా సులభం సోనూ ఏ ట్రక్కు క్రిందనో నిన్ను తొక్కేసారనో, లేదా నీవుండే ఆ దరిద్రపుగొట్టు బంగళాలోని పాము నిన్ను కాటేసిందనో నాకు పీడ కలలు వస్తుంటాయి', అని అంది నేను నవ్వి, ఆమెను కౌగలించుకొని, నాకు ఎప్పటికీ ఏమీ కాదని ఆమెకు భరోసా ఇచ్చా అయినా ఆమె వెక్కిళ్ళు పడుతూ ఏడుస్తూనే ఉంది

బాంద్రాకు ఎసి బస్సులో వెళ్ళి అక్కణ్ణుంచి ఖార్ దాకా ఆటోలో వెళ్ళాను. చక్రవర్తి అక్కడ ఒక పేరు పొందిన బిడి పక్కనే నివసించేవాడు అదే భవనంలో ఒక డాక్టరు కూడా ఉన్నాడు అందువల్ల స్థానికంగా ఆ భవనం అందరికీ తెలుసు చక్రవర్తే స్వయంగా నన్ను లోపలికి తీసుకెళ్ళి అతడి భార్యకు పరిచయం చేసాడు ఆమె ఒక రాజ కుటుంబానికి చెందిన ఓ అందమైన వ్యక్తి. ముందు గదిలో లైట్ చాలా తక్కువ వెలుగుతో ఉంది దాంతో నాకు చింత కలిగింది ఇంత తక్కువ వెలుతురులో నేను ఫుటేజీ రికార్డు చేయడమెలా? ట్యూబ్‌లైట్ వేయమని ఏ సాకుతో అడగను?

చక్రవర్తి అమెరికాలో నా జీవితం గురించి అడిగాడు. తన కూతురు అమెరికాలో ఉందనీ, నటిగా ఎదగాలనుకుంటోందనీ ఆయన భార్య అన్నది తనతో పరిచయం పెంచుకొమ్మనీ, ఇద్దరూ మంచి స్నేహితులు కాగలరని తాననుకుంటున్నానని ఆమె నన్ను ప్రోత్సహించింది చక్రవర్తి భార్యతో నేను మాట్లాడుతుండగానే, వారి రెండో కూతురు వచ్చింది ఆమె ఒక విమాన సంస్థలో ఎయిర్ హోస్టెస్‌గా పనిచేస్తున్నానని, కొంత మంది పేరు పొందిన సెలబ్రిటీలు ఎంత అమర్యాదకరంగా ప్రవర్తిస్తారోనని అంటూ నాతో ముచ్చట్లు పెట్టింది. మొదటి సారి చాలా కొద్ది సేపే వారితో మాట్లాడాను కచ్ ప్రాంతంలో నా షూటింగ్‌కు సంబంధించిన వివరాలు, అక్కడ ఎందరో కుండలు చేసే వాళ్ళను కలవటం, గుజరాత్‌లో ప్రసిద్ధమైన ఉత్తరాయణ ఉత్సవం వంటి వాటి గురించి మాత్రమే మాట్లాడటానికి పరిమితమయ్యాను. ఆమె స్నేహితురాలైన అశోక్ నారాయణ్ భార్య నాకు వడ్డించిన మంచి రుచికరమైన తందూరి పనీర్ గురించి ఆమెతో చెప్పాను త్వరలోనే ఆవిడ నాతో హాయిగా ఉండటం మొదలై తన చీరలు, కుటుంబ ఫోటో ఆల్బమ్‌లు చూపించింది

నేను మరుసటి వారం మళ్ళీ వస్తానని చెప్పి, వెళ్ళాను ఈసారి చక్రవర్తి భార్యకోసం కొన్ని పేడాలు పట్టుకెళ్ళాను ఆమె నాకు కాఫీతో పాటు నాకు తెలియని రకరకాల స్నాక్స్ వడ్డించింది కానీ, చక్రవర్తి ముభావమైన మనిషి. ముక్తసరిగా మాట్లాడతాడు అతడు తన ప్రొఫెషనల్ సర్కిల్‌కు సంబంధించిన కొద్దిమంది స్నేహితులు, విజిటర్లతో తనదైన ప్రపంచాన్ని నిర్మించుకున్నాడు అహ్మదాబాద్‌కు వెళ్ళిన కొద్దిసార్లు ఏదో తెలియని స్థలానికి వెళ్ళినట్లనిపించిందని ఆమె అన్నది తన భర్త నిజాయితీపరుడైనప్పటికీ ఏదో బయటి వ్యక్తిలాగా అతనితో వ్యవహరించారని ఆమె అన్నది

కొంచెం ఎక్కువగానే మాట్లాడే అతడి భార్య ద్వారా అతడి మౌనాన్ని ఎట్లా

ఛేదించాలో నేను తెలుసుకున్నా నేను గుజరాత్‌లో కలిసిన అధికారులందరి పేర్లు పేర్కొన్నా నేను విన్న గాలికబుర్ల గురించి చెప్పా ఇదంతా ఎంతో అమాయకత్వం, ఆశ్చర్యం నటిస్తూ చెప్పా దాంతో గడ్డకట్టిన మంచు కరగటం మొదలైంది

చక్రవర్తితో నా సంభాషణలు రాసేముందు, ప్రధాన స్రవంతి మీడియా అంతా అతణ్ణి 2002లో గుజరాత్‌ను ముంచెత్తిన మత కల్లోలాను అదుపు చేయలేని అసమర్థ డిజిగా అతణ్ణి వర్ణించిన అనంతరం గుజరాతీ వార్తా పత్రికల్లో అతడి గురించి వచ్చిన కొన్ని వార్తలను తప్పక పాఠకులతో పంచుకోవాలి 2002 ఫిబ్రవరి 27న నరేంద్రమోదీ పిలిచిన సమావేశంలో సంజీవ్ భట్ ఉన్నాడని ఎన్నో వార్తాపత్రికల్లో రాసిన దాన్ని నేను ఖండించిన సమయంలోనే అతడు వార్తల్లో కెక్కాడు సంజీవ్ భట్ చెప్పిన దాన్ని సమర్థించిన సాక్షుల్లో చాలా మంది అలా చెప్పమని ఆయన బలవంతపెట్టాడని తరువాత అన్నారు ఒక కానిస్టేబుల్ కూడా అదే మాట చెప్పాడు సంజీవ్ భట్ చెప్పిన దాన్లో పెద్దగా బలం లేదు కానీ అదే సంవత్సరంలో ఎస్ఐటి అధికారి ఎ.కె మల్హోత్రా ముఖ్యమంత్రి మోదీ పిలిచిన సమావేశంలో ఎనిమిది మంది ఉన్నారని నిర్ధారించాడు మోదీతో పాటు తాత్కాలిక ముఖ్య కార్యదర్శి స్వర్ణకాంత వర్మ, అడిషనల్ ముఖ్య కార్యదర్శి (హోం) అశోక్ నారాయణ్, డిజిపి కె. చక్రవర్తి, అహ్మదాబాద్ కమీషనర్ ఆఫ్ పోలీస్ పి సి పాండే, హోం కార్యదర్శి పి కె మిశ్రా, ముఖ్యమంత్రి కార్యదర్శి అనిల్ ముకిమ్ ఆ సమావేశంలో పాల్గొన్నారు

ఇంకా, నరేంద్రమోదీ, అమిత్‌షాల ఆధ్వర్యంలోని గుజరాత్‌లో 2002 కల్లోలాల సమయంలోనే కాక ఆ కల్లోలాల పైనా, ఆ తరువాత ఇతర కీలక ఘటనలపైనా విచారణల సందర్భంలోని అతికీలకమైన వ్యక్తుల్లో చక్రవర్తి ఒకరు పోలీసులను బదిలీ చేయడం గురించి డిజి చక్రవర్తి గుజరాత్ ప్రభుత్వం పై ఒక ఆరోపణ సంధించాడని 2002 మార్చిలో టైమ్స్ ఆఫ్ ఇండియా ఒక వార్త ప్రచురించింది [17]

నేను చక్రవర్తి ఇంటికి రెండవ సారి వెళ్ళినప్పుడు ఎట్టకేలకు అతడు నా రహస్య కెమెరా ముందు తన మౌనాన్ని విడనాడాడు తన ఆఫీసర్లకు మద్దతుగా అతడు నిలిచాడని కొన్ని నివేదికలు ఉన్నాయి కానీ అవేవీ నిర్ధారణ కాలేదు ఆయన మీడియాతో కానీ, తన సహోద్యోగులతో కానీ మాట్లాడితే కదా

ఇతర అధికారులతో నా సమావేశాల నుండి ఎన్నెన్నో కథనాలు వినిపించాక అతడు చివరికి తన మౌనాన్ని వీడాడు బహుశా ఎన్నో అనధికారిక సంభాషణలు (ఆఫ్-ది-రికార్డ్) నాకు ఇదివరకే తెలుసని గుర్తించడం వల్ల కావచ్చు చివరికి అతడు గుజరాత్ కల్లోలాల గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు

'అవి అత్యంత దారుణమైనవి ఆ కల్లోలాలు జరగటానికి ఎటువంటి తార్కిక భూమిక లేదు గోధ్రా వద్ద రైలు బోగీని తగలబెట్టడంతో మత కల్లోలాలు మొదలయ్యాయి ఆ బోగీ అయోధ్యకు వెళ్ళిన విహెచ్‌పి వాళ్ళదనడంలో ఏ సందేహము లేదు మొత్తం రైలంతా వాళ్ళే దాంతే రైలు దహనం తర్వాత కల్లోలాలు చెలరేగాయి నేననేదేమిటంటే, సాధారణంగా అల్లర్ల వెనక ఒక కారణముంటుంది అది చాలా సార్లు స్థానికమైనదే ఉంటుంది కానీ ఈ సారి మొత్తం హిందూ సమాజానికే ఒక ప్రమాదం లాగా అది కనిపించింది

'కల్లోలాల్లో పాల్గొనే ప్రజలు సాధారణంగా ఎవరు? పేదవాళ్ళు కానీ ఇక్కడ ధనవంతులు కూడా వీధుల్లోకి వచ్చారు కొన్నిసార్లు 'సర్ మెర్సిడిస్ కారులో వచ్చి 'షాపర్స్ స్టాప్'ను లూటీ చేస్తున్నార'ని మాకు ఫోన్లు వచ్చేవి

'ఘజనీ, బాబర్‌లు భారత్‌పై దండయాత్ర చేసి సోమ్‌నాథ్ దేవాలయాన్ని దోచుకున్నారని హిందువులు తరతరాలుగా చరిత్ర చదువుకున్నారు కాబట్టి హిందువుల బుర్రల్లో ఇది బలంగా కూచుంది భారతదేశంలో 1965 నుండి కూడా అల్లర్లు జరుగుతూనే ఉన్నాయి ముందు కూడా వేలాది మంది చనిపోయారు

ప్రశ్న *బహుశా మోదీ ఆరెస్సెస్‌కు చెందిన వాడు కావటం, కల్లోలాల సమయంలో ఆరెస్సెస్, విహెచ్‌పిలను సమర్థించడం వల్ల మోదీ ఎక్కువ బద్‌నాం అయ్యాడనిపిస్తుంది*

జవాబు *ఆ అనివార్యత అయితే ఉంటుంధి ఆరెస్సెస్ క్యాడర్‌గా పెరిగిన వ్యక్తి వాళ్ళ డిమాండ్లకు తలవంచవలసిందే కదా*

ప్రశ్న *నాతో అదే అన్నారు. కల్లోలాల సమయంలో అతడు ఆరెస్సెస్‌కు తలవంచాడని*

జవాబు *అతడి స్థానంలో అతడింకేమీ చేయలేకపోయేవాడు ముఖ్యంగా ఏ సంస్థ అయితే నిన్ను పెంచి పెద్ద చేసిందో అదే (కల్లోలాల్లో) పాల్గొన్నప్పుడు (ఏం చేయలేవు). అధికార లాలస ఉన్నవాడైతే మరీను*

ప్రశ్న *అతడికి బాగా అధికార లాలస ఉందా?*

జవాబు *అవును*

*తెహెల్కా అంటే నాకు గౌరవమే కానీ..*

ప్రశ్న· *అదేంటి?*

జవాబు *తరుణ్ తేజ్‌పాల్ ప్రచురించే పత్రిక అది దాని గురించి నీవు వినే ఉంటావు కల్లోలాల కాలంలోని అధికారులందరికీ పురస్కారాలు లభించాయని అది*

రాసింది వ్యక్తిగతంగా అంటున్నానని కాదు గానీ, నాకేం దొరికింది? అందరినీ ఒకే గాట కట్టడం సరియైంది కాదు. అది పూర్వాభిప్రాయంతో అనే మాట

ప్రశ్న. మీతో పాటు పని చేసిన చాలా మంది అధికారులు వివాదాల్లో చిక్కుకు పోవడం వల్లనో, లేదా కల్లోలాల్లో ఏదో భాగస్వామ్యం ఉండడం వల్లనో, దాని ప్రభావం మీమీద పడి ఉండొచ్చు?

జవాబు కానీ, నేను పెద్దగా చేయగలిగిందేమీ లేదు

ప్రశ్న. మీ వంటి మనిషికి గుజరాత్ డిజిపిగా పని చేయడం చాలా కష్టతరమై ఉంటుంది కదా.

జవాబు: నా అధికార పరిధిలో నా శక్తి మేరకు చేయాలన్నది నా నియమం నాకు సాధ్యమైనంత మంది ముస్లింలకు నేను సాయం చేసాను. చాలా మందిని కాపాడాము. ఎహసాన్ జాఫ్రీని కాపాడలేకపోయినంత మాత్రాన . .

ప్రశ్న: ఎహసాన్ జాఫ్రీ ఎవరు?

జవాబు: అతడొక పూర్వ ఎం.పి. ఒక గుంపు అతణ్ణి చంపేసింది అతడి ఇంటిని తగులబెట్టింది మొత్తం ఆ ప్రాంతంపైనే దాడి జరిగింది పోలీసులు సమయానికి అక్కడికి చేరుకోలేకపోయారు

ప్రశ్న. మీరు అప్పుడు డిజిగా ఉన్నారు కాబట్టి, మీపై విమర్శలొచ్చాయంటారా?

జవాబు: చూడు. నా కింద చాలా మంది పని చేస్తారు. ఒక దొంతర వ్యవస్థ ఉంటుంది అహ్మదాబాద్ కమీషనర్, అతడి ఐజి, ఆయన జూనియర్.. నేను కమీషనర్‌కు ఆదేశాలు ఇచ్చాను తరువాత నేను అతణ్ణి అడిగాను. తాను తన అధికారులకు చెప్పాననీ కానీ వాళ్ళు అక్కడికి వెళ్ళే సరికే అతణ్ణి (ఎహసాన్ జాఫ్రీని) చంపేసారనీ అతడంటాడు. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నానావతి న్యాయ విచారణ సంఘం దీన్నంతా విచారిస్తోంది సుప్రీం కోర్టు కూడా దీన్ని పర్యవేక్షిస్తోంది.

ప్రశ్న నేనంటున్నదదే ఇతరులు చేసిన దానికి మీరు అనుభవించవలసి వస్తోంది వాళ్ళేమో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పురస్కారాలు పొందుతున్నారు

జవాబు: అది తప్పదు

అందుకే మీడియా పక్షపాత పూరితంగా ఉందని నేనంటున్నాను. ఉభయ పక్షాలను అది వినలేదు

ప్రశ్న. మత కల్లోలాల సమయంలో మీరు చేపట్టిన వైఖరి వల్లే మీడియాకు

మీరంటే ఇష్టం లేదంటారా?

జవాబు అంతే అనుకుంటున్నాను. నేనేం చేసానో బయటపెట్టాలని నేను ఎప్పుడూ అనుకున్నా అదంతా ఏదో అర్థం కాని చెత్త కాదు.

ప్రశ్న మరి కల్లోలాలు జరుగుతున్నప్పుడే మీ అసంతోషాన్ని వ్యక్తపరచారా?

జవాబు అవును కొన్ని విషయాలు నేను దృష్టికి తీసుకువచ్చాను కానీ ఎన్నో దొంతరలుంటాయి. మనం వాటిని ఎదుర్కోవలసిందే

ప్రశ్న మీరు నేరుగా ముఖ్యమంత్రిని కలవలేకపోయేవాళ్ళా?

జవాబు చూడు ఒక వ్యవస్థ ఉంది ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వలేము. వ్యవహరించాల్సిన ఒక పద్ధతి, వ్యవస్థ ఉన్నాయి ఒక దశ తర్వాత నువ్వు ఎక్కువగా ఏం చేయలేవు. కొన్ని విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురాగలవు వాళ్ళు ఏ చర్య తీసుకోకపోతే అంతకు మించి నీవు ఏం చేయగలవు?

ప్రశ్న: మీరు చెబుతున్న వాటిని ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మీరు బాధపడేవారా?

జవాబు పడేవాణ్ణి కానీ ఇదంతా సాధారణమే. భరించవలసిందే.[18]

ప్రశ్న కానీ, అల్లర్ల సమయంలో నిజంగా ఏం జరిగిందో దాని గురించి మీరు మాట్లాడటమో, రాయడమో చేయాలి కదా!

జవాబు. నా కూతుళ్ళు కూడా ఆ సలహా ఇస్తున్నారు

ప్రశ్న ఈ కల్లోలాల గురించి నియమించిన విచారణ కమీషన్ల మాటేమిటి?

జవాబు· ఒకటి బెనర్జీ కమిటీ రిపోర్టు. కుట్ర జరిగిందని ఆ నివేదికలో ఉంది. కానీ ఏ సాక్షులను క్రాస్ ఎక్జామినేషన్ చేయలేదు, న్యాయప్రక్రియను పాటించలేదు. కాబట్టి, దాన్ని పరిగణనలోకి తీసుకోలేము అది కాకుండా ప్రత్యేకంగా ఒక్కొక్క కేసు గురించి విచారించడానికి సుప్రీంకోర్టు నియమించిన ఎస్ఐటి ఉంది. అదికాక, రాష్ట్రం ఏర్పాటు చేసిన నానావతి కమీషన్ ఉంది.

ప్రశ్న అందరూ మిమ్మల్ని విచారించారా?

జవాబు అవును.

ప్రశ్న ఏది ఎక్కువ ప్రభావశాలి ఐనది?

జవాబు నానావతి (కమిషన్) వారికి ఎక్కువ ఉపయోగకరమైంది నా గూడార్థం మీకు అర్థమైందనుకుంటా [19]

ప్రశ్న మీ ఉద్దేశ్యం ప్రభుత్వమా?

జవాబు కరెక్ట్. వాళ్ళ మనుషులు, ప్రాసెక్యూషన్, ముస్లిం డిఫెన్సు లాయర్లు, ఇదంతా చూడండి నేను మీడియా ముందు మాట్లాడను సరియైన కమిషన్ ముందే మాట్లాడతాను

ప్రశ్న సుప్రీం కోర్టు నియమించినది నిష్పక్షపాతంగా ఉండాలి కదా

జవాబు ఫిర్యాదు చేసింది ఎహసాన్ జాఫ్రి భార్య.

ప్రశ్న మీ హోం శాఖ మంత్రిని కూడా అరెస్టు చేసారు మీరు ఆయన కింద కూడా పని చేసారా?

జవాబు పని చేసాను. ఎప్పుడూ అతనితో నాకు గొడవే

ప్రశ్న అల్లర్ల కాలంలోనా?

జవాబు. కాదు వాటి తర్వాత. అక్షరధాం దాడి తర్వాత అతడు హోం మంత్రి అయ్యాడు

ప్రశ్న మీరు లంచగొండి మంత్రి కింద పని చేయలేరా?.

జవాబు. ఒక్క లంచగొండితనమే కాదు. అతడి మనస్తత్వం ఒక సమస్య అతడు అరెస్టయ్యాడు అతడికి వ్యతిరేకంగా బలమైన సాక్ష్యంగా కాల్ రికార్డులు ఉన్నాయి.

ప్రశ్న అతడు మంత్రిగా ఉన్నప్పుడు మీరు ఏ హోదాలో పని చేసారు?

జవాబు. డి జి

ప్రశ్న దాని వల్ల మీరు బతికిపోయారా?

జవాబు. లేదు అతడు నాకు కావలసినంత తలనొప్పి కలుగజేసాడు.

ప్రశ్న కల్లోలాల సమయంలో మీకు అసహాయంగా ఊపిరి సలపనట్టు అనిపించిందా? మీరు పోరాడారా?

జవాబు· నేను పోరాడాను అంతర్గతంగా పోరాడటం కూడా ఒక రకమైన పోరాటం శూరుడిగా పోజు పెట్టడం లేదా మీడియా ముందుకు, ప్రజల ముందుకు వెళ్ళటం మరొకటి చక్రవర్తికి అంతస్సాక్షి అంటూ ఉంటే అతడు రాజీనామా చేయవలసింది అని టైమ్స్ ఆఫ్ ఇండియా నాకు వ్యతిరేకంగా రాసింది. కానీ, నేనెందుకు రాజీనామా చేయాలి?

నేనా కల్లోలాలు జరిపింది? కల్లోలాలలో దాడులు చేస్తున్న వారితో కుమ్మక్కైంది నేనా? నాకు సాధ్యమైనంతగా ప్రజలను రక్షించడానికి ప్రయత్నించాను నా స్థానంలో వచ్చేవాడు వాళ్ళకింకా సాయం

చేస్తాడేమోనని కూడా నాకు భయంగా ఉండింది.[20]

ప్రశ్న: మీరు లేకపోయి ఉంటే అలా జరిగి ఉండేదా?

జవాబు అవును

ప్రశ్న బంద్‌కు పిలుపివ్వక పోయి ఉంటే, పరిస్థితులు భిన్నంగా ఉండేవా?

జవాబు ఖచ్చితంగా ఆ బంద్‌కు పిలుపు విహెచ్‌పి ఇచ్చింది

ప్రశ్న అది ఒక కేంద్రం వంటిది కదా!

జవాబు విహెచ్‌పి అంటే పాలక పార్టీ ఐన బిజెపి అంగం

ప్రశ్న ఏం చేయకుండా చూసీ చూడనట్టు ఉండాలని అతడు ఆదేశాలు ఇచ్చాడా?

జవాబు వాళ్ళు నాకెటువంటి చట్ట వ్యతిరేక ఆదేశాలు ఇవ్వలేదు అతడు తన మరణ శాసనంపై తానే సంతకం చేసుకోడు

ప్రశ్న పట్టుబడకుండా ఆదేశాలు ఇవ్వొచ్చా?

జవాబు అటువంటి ఆదేశాలు ఇస్తే అది వ్యక్తులకు విడివిడిగా ఇచ్చేదిగా ఉంటుంది, ఇరవై మంది ముందు కాదు అందులో ఐదుగురు నీకు వ్యతిరేకంగా కూడా ఉండొచ్చు

ప్రశ్న మీరు రాయదలుచుకున్న పుస్తకం అధికార గణంలోనూ, పోలీసు బలగంలోనూ దుమారం రేపుతుందా?

జవాబు ఎవ్వరి పేర్లు తీయకుండా, ఊరికే కథనాలు రాసినంత కాలం అలా ఏం జరగదు

ప్రశ్న ఆ ఘటనలు జరిగినప్పటి నుండి మిమ్మల్ని పక్కన పెట్టేసారా?

జవాబు. అశోక్ నారాయణ్ రూపంలో నాకొక మిత్రుడున్నాడు. అతడితో నాకు అంగీకారం ఉండేది ముఖ్య కార్యదర్శి సుబ్బారావు కూడా నాకు మిత్రుడే కానీ నిజమైన మిత్రుడు కాదు ఆయన చేసిన దాంతో నాకు ఏకీభావం లేదు

ప్రశ్న ఈ భట్ విషయం ఏంటి? దాని గురించేదో మీరు ఆ రోజు మాట్లాడబోయారు మీరు పేర్కొన్న వెబ్‌సైట్‌లో అతడి వాంగ్మూలం ఉంది అది వాస్తవమేనా?

జవాబు వాస్తవం కాదు ఎందుకంటే ఇంటలిజెన్స్‌లో అతడొక ఎస్ పి. స్థాయి అధికారి రాయ్‌గర్ అడిషనల్ డి జి కీలకమైన ఆ రోజున రాయ్‌గర్ లేదు దాంతో భట్ తాను ఇంటలిజెన్స్ శాఖ ప్రతినిధిగా వెళ్ళాలనుకొని ఉండవచ్చు కానీ, అది శాఖాధిపతుల సమావేశం కాబట్టి అతడు

పాల్గొనలేదు నేను చెబుతున్నదాన్ని అశోక్ నారాయణ్ నిర్ధారించాలి.

ప్రశ్న: నేను దాఫ్నాలా వద్ద మీ స్నేహితులు కొందరిని కలిసాను అందరు అధికారులు, పి సి , పి పి .. వంటి అధికారులను

జవాబు. అవును. అందరు అక్కడే ఉంటారు కుల్‌దీప్ శర్మ కూడా ఉన్నాడు

ప్రశ్న: అవును పి.సి పాండే కూడా నేను గొర్రెలు, ఉన్ని విభాగంలో ఉన్న ఈ వ్యక్తిని కూడా కలవాలని అన్నాడు.

జవాబు: కుల్‌దీప్ శర్మ మంచి వ్యక్తి అతడికి ప్రభుత్వంతో విభేదాలు వచ్చాయి కనుక అతణ్ణి పక్కన పెట్టారు. అంతకు ముందు అతడికి తానే ముఖ్యమంత్రి నన్నంత భావన ఉండేది. అయినా ఆయన మంచి అధికారి అతడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెళ్ళాడు, కాబట్టే అతణ్ణి పక్కన పెట్టేసారు వాళ్ళు అతడు కోర్టుకు వెళ్ళలేనట్టుగా చేస్తారు. అందువల్లే అతడికి సైడ్ పోస్టింగ్ ఇచ్చారు మోదీ చాలా తెలివైన వ్యక్తి [22]

ప్రశ్న అచ్చా. ఆ సుబ్బారావును ఎవ్వరూ ఇష్టపడరు అతడు ప్రభుత్వ బాకా ఊదుతుంటాడని నారాయణ భార్య అన్నది.

జవాబు. అతడు ముఖ్య కార్యదర్శి అతణ్ణి ప్రభుత్వం బాగా పురస్కరించింది. కాబట్టి అతడు ప్రభుత్వం గురించి అన్నీ మంచిమాటలే చెబుతాడు

ప్రశ్న: అయితే ప్రభుత్వంతో పూర్తిగా చేతులు కలిపింది సుబ్బారావేనన్న మాట.

జవాబు. అవునవును. అతడు బాస్‌కు చాలా సన్నిహితం

ఇక్కడ చక్రవర్తి గుజరాత్ ముఖ్య కార్యదర్శి సుబ్బారావు గురించి చెబుతున్నాడు నేను కలిసిన ప్రతి ఒక్కరు కూడా గుజరాత్ కల్లోలాల సమయంలో ముఖ్యమంత్రి మనిషిగా ఇతడు వ్యవహరించాడని అన్నారు.

'సుబ్బారావు 2003లో ముఖ్య కార్యదర్శిగా పదవీ విరమణ చేసాడు అతణ్ణి గుజరాత్ ఎనర్జీ రెగ్యులేటరీ కమీషన్ (జిఈఆర్‌సి) ఛైర్మన్‌గా నియమించారు. సాధారణంగా ఈ పదవిలో పదవీ విరమణ చేసిన జడ్జిలనే నియమించేవారు ఆయనకు ఎందుకు ఈ పదవి బహుమానంగా లభించిందో తమకు తెలుసని విశ్లేషకులు భావిస్తున్నార'ని ఒక వార్తా పత్రికలో నివేదిక వచ్చింది

ప్రశ్న: ప్రభుత్వ పక్షాన ఉన్నవాడిగా మీ పేరు కూడా వచ్చింది కదా

జవాబు: అవును. నాకు ఏదో లభించిందని తెహల్కా పత్రిక అన్నది కానీ, నాకేం దొరికింది? మిగిలిన అందరికీ అంటే ముఖ్య కార్యదర్శి, కార్యదర్శి, హోం కార్యదర్శి, పోలీస్ కమిషనర్ – వీరందరికీ పురస్కారాలు లభించాయి

ప్రశ్న కానీ సంజీవ్‌భట్ కూడా మీ పేరు తీసుకున్నాడు

జవాబు అవును మీరు శ్రీకుమార్‌ను కూడా కలవండి ఒక మంత్రి నా ఆఫీసుకు రావడం గురించి మీరంటున్నారా? ఆ మంత్రి నా ఆఫీసుకు కొద్దిసేపు మాత్రం వచ్చాడు అతడి పేరు ఐ.కె జదేజా అతడు నాపట్ల చాలా కోపంగా ఉన్నాడు నాతో మాట్లాడటానికి మీకు తీరిక లేదా, అని అన్నాడు నాకేమో అతడు నా గదిలో ఉండటం కూడా ఇష్టం లేదు దాంతో నేను అతణ్ణి వేరే గదిలో కూర్చోబెట్టమని మా వాళ్ళకు చెప్పాను. నేను నా పనిలో బిజీగా ఉన్నాను సంజీవ్ అతణ్ణి ఆ వేరే గదిలో చూసి ఉంటాడు అందువల్ల అతడు జోక్యం చేసుకునే సవాలే లేదు.

ప్రశ్న: ఒకవేళ భట్ ఉండినప్పటికీ ఈ రోజు ఎవ్వరూ ఆ విషయం ఒప్పుకోరు ఎవ్వరూ తలారి ఎదుట మెడ వంచుకోవడానికి సిద్ధపడరు

జవాబు: అదే పరమసత్యమైతే నాసూటి జవాబు ఏంటంటే ప్రభుత్వం ఒక న్యాయ కమిషన్‌ను నియమించింది దాని గురించి మార్చిలోనే అసెంబ్లీలో ప్రకటించింది కల్లోలాలు సమసిపోయాక, తమకు అంతా తెలుసని బీరాలు పలుకుతున్న ఈ వ్యక్తులు మరి అప్పుడు ఏమీ చేయలేదెందుకు? వాళ్ళు ఒక అఫిడవిట్ దాఖలు చేసి ఉండవచ్చు శ్రీకుమార్ ఆ పని చేసాడు అతడు ఐదు అఫిడవిట్‌లు దాఖలు చేసాడు

ప్రశ్న కానీ, తెహల్కాలోని ఈ వ్యాసం ఉపశీర్షికలో ఈ వ్యక్తి నిజం చెప్పగలడు అని ఉంది కదా.

జవాబు నేను అతన్ని అడిగాను. రాయ్‌గర్ మే నెలలో బదిలీ అయ్యాడు కానీ ఇంకా కల్లోలాలు సాగుతూనే ఉన్నాయి దాంతో ఈ కుమార్‌ను ఇంటలిజెన్స్ అడిషనల్ డి జి గా నియమించారు అఫిడవిట్ దాఖలు చేయమని అతనికి నేను చెప్పాను అతడు దాఖలు చేసాడు తన స్వంత అభిప్రాయం ప్రకారమే దాఖలు చేసాడు, కానీ నా గురించి గానీ ఇతరుల గురించి కానీ ఒక్క మాట కూడా రాయలేదు చక్రవర్తి ఇలా అన్నాడు, అలా అన్నాడు అంటూ ఓ రెణ్ణెళ్ళ తర్వాత మరో అఫిడవిట్ దాఖలు చేసాడు మరి శ్రీకుమార్ అప్పుడే అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదని నేను జవాబు ఇచ్చాను అతడు అంత సత్య హరిశ్చంద్రుడే అయితే అప్పుడే ఇదంతా చెప్పవలసింది అతడికి పదోన్నతి ఇవ్వనందుకు ఇదంతా. అప్పటికి నేను ముంబయికి మారిపోయాను.

నేనిప్పుడు చెప్పేది ఎక్కడా బయటపెట్టవద్దు 'సర్ మీరొక సారి గుజరాత్ రాగలరా? నేను క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, సిఏటి)లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసు వెయ్యాలని ఈయన ప్రతి రోజు నాకు ఫోన్ చేసేవాడు. నేను ముంబయిలో ఉన్నాను కాబట్టి రాలేనని చెప్పాను చాలాసార్లు నా కుటుంబం వాళ్ళు ఫోన్ ఎత్తేవాళ్ళు. 'శ్రీకుమార్ చెబుతున్నది నిజమని మాత్రమే మీరు క్యాట్ ఎదురుగా చెప్పాలి, అంతే సర్' అనేవాడు నేను అలా ఎలా చెప్పగలనని అన్నాను. అయినా 2002 ఎక్కడ? 2005 ఎక్కడ దాని గురించి ఇప్పుడు మాట్లాడటమెందుకు? దాంతో నాపై ఆరోపణలు చేస్తూ అతడు మూడు అఫిడవిట్లు దాఖలు చేసాడు అతడు ఇంటివద్ద కూర్చొని డైరీలు రాస్తాడు అవి అధికారిక కేసు డైరీలు కావు ఈ భట్ కూడా అదే జాతివాడు వాళ్ళకు బాగానే ఉన్న కాలమంతా వీరంతా ప్రభుత్వ పక్షానే ఉన్నారు.

ప్రశ్న. ఆ జడేజాతో సమావేశం వివాదస్పదమైనదా?

జవాబు కాదు, ముఖ్యమంత్రితో సమావేశం.

ప్రశ్న: ఈ 'భట్' ఆ సమావేశంలో ఉన్నాడా?

జవాబు: లేదు. నేను ముందే చెప్పినట్టు ఈ సమావేశానికి రాయ్‌గర్ హాజరు కాలేదు దాంతో భట్ తన స్వంత నిర్ణయంతో ఈ సమావేశంలో కూర్చోవాలనుకున్నాడు.

కానీ అది శాఖాధిపతుల సమావేశం కాబట్టి అతనిని అనుమతించకూడదని అశోక్ నారాయణ్ భావించాడు. స్వర్ణకాంత వర్మ విషయానికొస్తే ఆ సమావేశానికి రావడానికి ఆమెకు పూర్తి సాధికారత ఉంది

ప్రశ్న: అంటే అందరూ, అన్ని విషయాల్లో – అవి ఎన్‌కౌంటర్లు కావచ్చు, మత కల్లోలాలు కావచ్చు, వివాదంలో చిక్కుకుని ఉన్నారన్న మాట

జవాబు. అవును. ఒక హోం మంత్రిని కూడా అరెస్టు చేసారు

ప్రశ్న: అందరు అధికారులకు అతడంటే అయిష్టమా?

జవాబు. అవును అందరూ అతణ్ణి అసహ్యించుకుంటారు

ప్రశ్న: కానీ అతడి వంటి వ్యక్తి గృహమంత్రిగా ఎలా కొనసాగగలుగుతున్నాడు?

జవాబు రాజకీయ కనెక్షన్ల వల్ల. అమిత్‌షాకు, నాకు ఎప్పుడూ పడేది కాదు కుల్‌దీప్ ఏసిబిలో ఉన్నప్పుడు అతడిపై కేసు నమోదు చేసాడు

ప్రశ్న షా మిమ్మల్ని వేధించాడా?

జవాబు కాగితం మీదైతే నేనేమీ సంతకం పెట్టలేదు

ప్రశ్న మీరందరూ ఎందుకు ఫిర్యాదు చేయలేదు

జవాబు: రాజకీయంగా అతడు చాలా శక్తివంతుడు ఆయన లిఖిత ఆదేశాలు ఇచ్చే వరకు శక్తివంతుడుగా ఉన్నాడు. అయితే ఒక మంచి విషయం ఏమిటంటే అతడు స్వయంగా ఉత్తరాలపై సంతకాలు చేసేవాడు అతడి పిఏ కూడా కాదు. వాళ్ళను బదిలీ చెయ్యాలి, వీళ్ళను మార్చాలి అంటూ మొదట నచ్చజెప్పాలని చూసేవాడు కానీ తరువాత తానే ఆదేశాలపై సంతకాలు చేసేవాడు కిందిస్థాయి అధికారులు జారీ చేయవలసిన ఆదేశాలపై ఆయన సంతకాలు చేసేవాడు ఇట్లా జరగడం దేశంలో ఇదే మొదటిసారి.

ప్రశ్న ఏ ఆదేశాలు?

జవాబు అధికారులను బదిలీ చేసే ఆదేశాలు ఈయన నా మనిషి, ఈయనను ఇక్కడ ఉంచు అంటూ ఇచ్చే ఆదేశాలు ప్రభుత్వం ఆదేశాలిస్తే నేను చేస్తాను సర్ అనేవాణ్ణి. అంతే మరుసటి రోజే ఆదేశాలు వచ్చేవి. అశోక్ నారాయణ్, షా బారిన పడకుండా తప్పించుకున్నాడు

ప్రశ్న ఇక మాయా కొడ్నానీ అనే మరో మంత్రి కూడా ఉంది కదా

జవాబు: ఆ అవును నరోడా కేసులో ఆమె పాల్గొన్నది. ఈ కేసు సుప్రీం కోర్టులో నడుస్తున్నది

ప్రశ్న కానీ, ఆమె చాలా అమాయకంగా కనిపించిందే ఆమె నిజంగానే పాల్గొన్నదా?

జవాబు: ఆమె పాల్గొన్నది ఆరెస్సెస్ వాళ్ళు పైకి కనిపించినట్టే ఉండరు.

తనతో పాటు పనిచేసిన వాళ్ళ గురించి చెప్పడానికి చక్రవర్తి వద్ద కటు సత్యాలున్నాయి వాళ్ళు (శ్రీకుమార్ లాంటివాళ్ళు) న్యాయం కోసం చాలా ఆలస్యంగా తమ గొంతు ఎత్తారని ఆయన ఆరోపణ. శ్రీకుమార్ కొంత ఆలస్యంగా తన గొంతు విప్పాడనే అంగీకరించవచ్చు అట్లాగే సంజీవ్ భట్ చెప్పిన దాంట్లో పెద్దగా బలం లేదని, ఎటువంటి సాక్ష్యాధారాలు లేవని అనవచ్చు కానీ రాష్ట్ర డిజిగా చక్రవర్తి బాధ్యతల నుండి తప్పించుకోగలడా? ప్రభుత్వంలోని అత్యంత శక్తివంతులైన వారికి ఎదురొడ్డి నిలబడటానికి డిజికి కానీ, ఏ ఇతర పోలీసు అధికారికి గానీ చాలా కఠినమైన విషయమే పైగా ఇక్కడ వాళ్ళు అమిత్ షాతో వ్యవహరించాల్సి వచ్చింది

సింఘాల్, రాయ్‌గర్, అశోక్ నారాయణ్, ప్రియదర్శి, చక్రవర్తి వంటి అందరూ అమిత్ షా చట్టాన్ని ఏ మాత్రం లెక్క జెయ్యడనీ, అధికారులకు చట్టవ్యతిరేక, అక్రమ ఆదేశాలు ఇస్తాడనీ చెప్పారు కానీ, మౌనంగా ఉండడం ద్వారా చక్రవర్తి మత హింసకు పాల్పడ్డ వాళ్ళను న్యాయస్థానపు బోనుల్లో నిలబెట్టగలడా?

---

17 *http //timesofindia indiatimes com/city/ahmedabad/Gujarat-DGP-fires-a-salvo-at-govt-over-police-transfers/articleshow/4994912 cms*

18 చక్రవర్తి ఇలా ఒప్పుకోవటం చాలా ముఖ్యమైనది ఎందుకంటే నానావతి కమిషన్ ముందు అతడు తనకేం గుర్తులేదన్నాడు విభిన్న సందర్భాలలో అటూ ఇటూ కాని ప్రకటనలు ఇచ్చాడు

19 నానావతి కమీషన్ ప్రభుత్వానికి ఎక్కువ ఉపయోగపడింది, అని చక్రవర్తి అంటున్నాడంటే, జస్టిస్ నానావతి ఆధ్వర్యంలో ఏర్పాటయిన కమీషన్ మోదీ ప్రభుత్వానికి సానుకూలంగా ఉందని సూచిస్తున్నాడు

20 తాను రాజీనామా చేస్తే తన తరువాత డిజిగా వచ్చేవాడు కల్లోలాల సమయంలో ముస్లిం సముదాయాలపై దాడులు చేయడంలో ప్రభుత్వంతో మరింతగా కుమ్మక్కై పోతాడేమోనన్న భయం వల్ల కూడా తాను రాజీనామా చేయలేదని చక్రవర్తి అంటున్నాడు

21 ఇక్కడ ప్రస్తావిస్తున్నది ఫిబ్రవరి 27న జరిగిన సమావేశం గురించి ఇందులో మోదీ తన అధికారులతో వెళ్ళి ముస్లింలను చంపమని ఆదేశాలిచ్చాడని ఆరోపణ స్టింగ్ ఆపరేషన్ క్రమంలో నేను ఎంతోమందితో మాట్లాడినప్పుడు ఈ రకమైన ఆదేశం మోదీ జారీ చేసినట్టు ఎక్కడా రాలేదు అయితే చక్రవర్తి, అశోక్ నారాయణ్ ఇద్దరూ అన్నదేమిటంటే ఆదేశాలు విడి, విడి అధికారులకు ఇచ్చారని అటువంటి సున్నితమైన పరిస్థితిలో దేశపు చరిత్రలో మొదటిసారి మతకల్లోలాలను ప్రధాన స్రవంతి మీడియా లైవ్‌గా కవర్ చేస్తున్నప్పుడు అటువంటి ఆదేశాలిచ్చేటంత అమాయకపు పని చేయడని పి సి పాండే అన్నప్పుడు పై విషయాన్నే దాదాపుగా నిర్ధారించాడు

# పదవ అధ్యాయం

## మాయా కొద్నాని తదితరులు

అహ్మదాబాద్‌లోని నా జీవితం నాకు నచ్చటం మొదలుపెట్టింది. అజయ్ అన్నట్టు నేను నిజమైన 'అమ్దావాదీ'గా మారుతున్నట్టనిపించింది. అహ్మదాబాద్‌లో రాత్రి ఒంటిగంటకు అప్పర్ క్రస్ట్ (ఒక ప్రఖ్యాత బేకరీ) నుండి ఆపిల్‌పై ఎలా సంపాదించాలో తెలుసుకున్నాను. గుడ్లు తినడానికి, నేను ఇతర హాస్టల్ అమ్మాయిలు తెల్లవారు ఝామున రెండు గంటలకు బయటకు వెళ్ళేవాళ్ళం దుర్గపూజ సమయంలో తొమ్మిది రోజుల గర్బా సమయంలో, పాని, నేను మా కాళ్ళు ఎర్రబడి పోయేలా డాన్స్ చేసాము

మాంచి ఖటియావాడ్ ఘూటియా, ఎర్ర మిరపకాయలతో పోపు చేసిన కూరలతో లంచ్ ఎక్కడ దొరుకుతుందో మేము కనుక్కున్నాం. ఒకసారి నెహ్రూ ఫౌండేషన్‌ను మూడు రోజుల పాటు నేను ఖాళీ చేయవలసి వచ్చినప్పుడు, నాకు ఎన్ఐడి హాస్టల్‌లో ఒక విద్యార్థిగా గది దొరికింది. ఒక అమ్మాయి తెల్లవారు ఝాము వరకు తన బాయ్ ఫ్రెండ్‌తో ఫోన్‌లో ముచ్చట్లు పెట్టేది. అటువంటి అమ్మాయి నాకు రూం మేట్. నా విద్యార్థి జీవితకాలమంతా నాకు హాస్టల్‌లో ఉండాలని తెగ కోరికగా ఉండేది అందువల్ల నా ఇప్పటి జీవితాన్ని నేను బాగా ఆనందించాను

అయితే, అన్ని విషయాలూ సంతోషజనకంగానే ఏం లేవు మైక్ ఇక వెళ్ళిపోయే సమయమయ్యింది అతడికి వీడ్కోలు డిన్నర్ ఇవ్వడానికి మాకు ఇష్టమైన 'పక్వాన్'కు వెళ్ళాం అతడి లాప్‌టాప్‌లో అహ్మదాబాద్‌వి అందమైన ఫోటోలు ఉన్నాయి ఈ సరికి మైక్ హిందీలో కూడా బాగా మాట్లాడడం నేర్చుకున్నాడు. మేం రాత్రంతా మాట్లాడుకొని మా గదుల్లోకి వెళ్లిపోయాం మైక్ విమానం ఉదయం పది గంటలకు ఉంది మరుసటి రోజు ఉదయం నా తలుపు కింద నుండి ఒక ఫోటో, ఒక నెమలి ఈక తోసి ఉన్నాయి వాటితో పాటు ఒక కృష్ణుడి ఫోటో ఈ ఫోటో వెనకాల మైక్ హిందీలో రాసిన మాటలున్నాయి 'ప్యారీ మైథిలీ, అప్‌నా ఖ్యాల్ రఖ్‌నా,' అని

(ప్రియమైన మైథిలీ, జాగ్రత్తగా ఉండు) నా మిత్రుడు, నేరంలో నా భాగస్వామి, నన్ను వదిలి వెళ్ళిపోయాడు. రానా అయ్యూబ్‌గా నన్ను తెలిసిన వాళ్ళతో మాట్లాడటానికి ఇప్పుడిక ఎవ్వరూ లేరు. తరువాత 2011లో చివరి అంకం కోసం ఒక రోజు కోసం అహ్మదాబాద్ వచ్చాడు.

నేను మళ్ళీ అహ్మదాబాద్‌లో 2013లో కొన్ని డాక్యుమెంట్లు సంపాదించడానికి వచ్చాను. మాయాకొడ్నానీ మళ్ళీ కటకటాల వెనుకకు చేరింది స్టింగ్ ఆపరేషన్ అయిపోయింది, అది వెలుగులోకి రావడానికి నేను ఇంకా ఎదురు చూస్తున్నాను. అప్పటికి నేను తెహల్కాలోనే పని చేస్తున్నాను. డాక్యుమెంట్ల కోసం నేను కలిసిన ఆఫీసర్ తాను మాయాబెన్‌ను జైలులో కలిసి వచ్చానని చెప్పాడు. మాయాబెన్ కోసం ఓషో పుస్తకాలు పంపిద్దామనుకుంటున్నానని చెప్పాడు. నేను ఆశ్చర్యపోయాను 'ఆమె ఏడుస్తూ ఉంది. తనను బయటకు తీయమని అడిగింది. ఆమెకు పిచ్చి పట్టేటట్టుగా ఉంది ఆధ్యాత్మికత తనకేమైనా సాయపడుతుందేమోనని అనుకున్నా' అన్నాడు.

మాయాబెన్ ఇంటికి ఒక రోజు మధ్యాహ్న భోజనానికి వెళ్ళినపుడు నాకు మామిడి పళ్ళ రసం ఇచ్చింది మామిడి పళ్ళ కాలం అయిపోయింది. కానీ ఆమె మామిడి పళ్ళ రసం తీసి అమెరికా నుండి రాబోయే తన కొడుకు కోసం ఫ్రీజర్‌లో పెట్టి ఉంచింది. ఆమె నన్ను కౌగిలించుకొని – 'నీవు తిను. నాకు నా కొడుకే తిన్నట్లు అనిపిస్తుంది. నీవు కూడా నా కూతురు లాంటిదానివి మైథిలీ', అని అంది.

ఆ మధ్యాహ్నం నేను 'సంస్కృత అధ్యాపకుడ'ని చెప్పిన నా తండ్రి నుండి నేర్చుకున్నానని గీతాసారం ఆమెకు వివరించాను. విదేశాల్లో నివసించిన ఒక అమ్మాయికి, ఇక్కడి వాళ్ళకంటే ఎక్కువ పరిజ్ఞానం ఉండడం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. 'మైథిలీ, మనం మన సంస్కృతిని పోగొట్టుకున్నాం. ఈ ముస్లింలను చూడు వాళ్ళ పిల్లలు కూడా కరడు కట్టి ఉంటారు' అంది. అవునంటూ నేను తల ఊపాను. భోజనం నిరాడంబరంగా ఉంది రెండు కూరలు, పూరీలు, అప్పడం. మాయాబెన్ స్వయంగా వండి నాకు వడ్డించింది

ఆ రోజు సాయంత్రం మేము మాట్లాడటం మొదలుపెట్టాము. ముస్లిం సముదాయం పట్ల ఆమెకు విపరీతమైన ద్వేషముందనే దాంట్లో ఏం సందేహం లేదు. అయితే నాతో సంభాషణలో ఆమె మోదీ పట్ల ప్రదర్శించిన ద్వేష భావనే ఆశ్చర్యకరం. అతనికి ఇష్టం లేని తనను, గోర్ధన్ జడాఫియా వంటి వాళ్ళను తొలగించుకోవటానికి, తమపై ఉన్న కేసులన్ను మోదీ వాడుకున్నాడని ఆమె నిర్మొహమాటంగా చెప్పింది.

'ఈ కొత్త తరానికి దేనిపట్ల అంకిత భావం లేదు. ఒక సిద్ధాంతమూ లేదు ఏదైనా జరిగినా వీధుల్లోకి మాత్రం రారు.'

'మన మతంలో ఏం చెబుతాం? చీమకైనా హాని తలపెట్టవద్దని అంటాం. మన పిల్లలకు చిన్నప్పటి నుండీ ఇవే విషయాలు చెబుతాం చిన్నప్పటి నుండి వాళ్ళకేం నూరిపోస్తారు? చంపమనీ, చంపితేనే నీవు ముసల్మానువౌతావనీ, నీవు ఒక్కరినైనా ముసల్మానుగా మారిస్తే స్వర్గప్రాప్తి పొందుతావని నేర్పిస్తారు. ఇదంతా మదర్సాలలో బోధిస్తారు కానీ కనీసం ఆ పిల్లలకు మీరు భారతీయులని బోధించండి. పాకిస్తాన్ గెలిచినప్పుడు పటాకాలు కాల్చడం సహించరాని విషయం '

ప్రశ్న: *2002 తర్వాత కూడా వీళ్ళ దూకుడు తగ్గలేదా?*

జవాబు *ఇప్పుడు కొంచెం తగ్గింది*

ప్రశ్న. *మీరు రోజుకు ఎనిమిది గంటలు కోర్టులో గడుపుతారు కదా!*

జవాబు *ఏం చెయ్యగలం? నాకు నా ప్రాక్టీసు కూడా పోతోంది. కానీ వాళ్ళు నన్ను కోర్టు నుండి కాపాడలేరు ఎందుకంటే ఈ కేసులో మరో 80 మంది కూడా ఉన్నారు. తీస్తా వంటి వాళ్ళు మొత్తుకుంటారు.*

ప్రశ్న: *నాకో విషయం చెప్పండి. నరేంద్రమోదీ చుట్టు చాలా వందిమాగధులు ఉన్నారు కదా. అన్ని మంచి పనుల కీర్తిని ఆయనకే ఆపాదిస్తారు*

జవాబు: *ఇప్పటికది బాగానే ఉంటుంది కానీ, దీర్ఘకాలికంగా అది చెరుపు చేస్తుంది*

ప్రశ్న *మీరంటే అతడికి అభిమానమేనా?*

జవాబు: *ఒకప్పుడు ఉండేది.*

ప్రశ్న: *ఏదేమైనా, గుజరాతీల కోసం మీరు చేసింది వాళ్ళెన్నడూ మర్చిపోలేరు.*

జవాబు: *వాళ్ళెన్నడూ మర్చిపోరు వాళ్ళెప్పటికీ నాతో నిలబడతారు.*

ప్రశ్న: *అమిత్ షా ఘటన తర్వాత మోదీకి ఏమవుతోంది?*

జవాబు. *నేను అరెస్టయి, బెయిలుపై విడుదలయ్యాక అతనితో మాట్లాడలేదు మేము రెండు సందర్భాల్లో కలిసామనుకుంటా!*

ప్రశ్న: *మిమ్మల్ని చూసినప్పుడు అతడి ప్రతిస్పందన ఎలా ఉంటుంది?*

జవాబు: *అతడే ప్రతిస్పందన చూపడు. ఏం మాట్లాడడు నేను కూడా ఏం మాట్లాడను ఏదేమైనా అది నా సమస్య. నేను చూసుకుంటా. భగవంతుడే నాకు సాయ పడతాడు. నేను ఎవ్వరి నుండైనా ఎందుకు సాయం ఆశించాలి?*

*నేను నిర్దోషినని నాకు తెలుసు. దేవుడే నాకు అండ నేను అక్కడ లేను*

మైధిలీ. నేను అక్కడికి ఇరవై కిలో మీటర్ల దూరంలో ఉన్నా నేను సోలాలో ఉన్నాను నేను శాసనసభకు వెళ్ళాను అది 8.30కు మొదలైంది నేను నా ఇంటి నుండి బయలుదేరి ఆనందిబెన్ ఆఫీసుకు వెళ్ళా. అక్కడ ముచ్చట్లు పెట్టుకున్నాం

ప్రశ్న: ఆనందిబెన్‌ను కూడా ప్రశ్నించాల్సింది కదా?

జవాబు. అది నేను చెప్పలేను. అక్కణ్ణుంచి నేను సివిల్ ఆసుపత్రికి వెళ్ళా అక్కడే మృతదేహాలున్నాయి. మా నర్సు వాళ్ళ నాన్న కూడా గోధ్రాలో చనిపోయాడు. అతని మృతదేహాన్ని గుర్తించడానికి వెళ్ళా నేను, అమిత్ షా వెళ్ళాం హిందువులు కూడా అక్కడ నన్ను హింసించారు వాళ్ళు చాలా ఆగ్రహంతో ఉన్నారు

నాకు, అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు పిఐ తన కారు వద్దకు తీసుకెళ్ళి అక్కణ్ణుంచి తీసుకొచ్చేసాడు.

ప్రశ్న: అసలు మీపై ఉన్న ఆరోపణలేమిటి?

జవాబు నేను అల్లర్లను రెచ్చగొడుతున్నానని, ఒక గుంపుకు నాయకత్వం వహించానని నిరూపించడానికి సాక్షులను ఉపయోగిస్తున్నారు నేను నా ఆసుపత్రికి వచ్చి ఒక కాన్పు చేసాను. మూడు గంటలకు ఆసుపత్రికి వెళ్ళా అల్లరి మూక అప్పుడు ఈ ప్రాంతంలో ఉంది కాబట్టి నేను ఉన్నానని వాళ్ళు అంటున్నారు

ప్రశ్న గోర్ధన్ జడాఫియా అప్పటి హోంమంత్రి అతణ్ణి కూడా అదే కారణంతో తొలగించారా?

జవాబు కాదు ముఖ్యమంత్రికి అతనంటే ఇష్టం లేదు, కాబట్టి అతణ్ణి తొలగించారు.

ప్రశ్న: గోర్ధన్ భాయ్‌ను రక్షించడానికి ముఖ్యమంత్రి అమిత్ షా కేసులో సాక్షులను ఉపయోగించినట్టు ఉపయోగించలేదన్నమాట

జవాబు లేదు (అని నవ్వింది).

ప్రశ్న అంటే? అల్లర్లను ఉపయోగించుకొని అతడు గోర్ధన్ జడాఫియాను కూడా వదిలించుకున్నాడన్న మాట!

జవాబు అవును.

ప్రశ్న: తనకు ఇష్టంలేని వాళ్ళని వదిలించుకోటానికి అతనికి ఇదో మంచి మార్గం దొరికిందన్న మాట

జవాబు· అవును

ప్రశ్న: మరి అమిత్‌షా మాటేమిటి?

జవాబు: అతడు 'ఆయన' మనిషి చాలా సన్నిహితుడు.

ప్రశ్న ఆనంది బెన్ అతని మనిషనుకున్నానే?

జవాబు ఆనంది బెన్ ఆయనకి కుడి భుజం అయితే, ఈయన ఎడమ భుజం. అమిత్‌షాని విడుదల చేయించడానికి అతడు చేయగలిగిందల్లా చేశాడు అతన్ని కలవడానికి అద్వాని వచ్చేవాడు సుష్మా స్వరాజ్ కూడా అతనింటికి వెళ్ళింది

ప్రశ్న మరి మీరు అరెస్ట్ అయినప్పుడు ఇవన్నీ ఏం చేయలేదే?

జవాబు ఏం చేస్తాం? ఏదయినా సరే భగవంతుడున్నాడు అతన్ని ప్రధానమంత్రి పదవికి అభ్యర్థిగా నిలబెడతారనుకుంటా అతడికి పోటీ ఇచ్చేవారు కూడా ఎవరూ లేరు ఆనంది బెన్‌ను ముఖ్యమంత్రి చేస్తాడు

ప్రశ్న అతని వెనకాల అందరూ అతని గురించి చెపుతారు. మీ ఎన్‌కౌంటర్ పోలీసులు కూడా అదే అంటారు. 'వాడుకొని వదిలేస్తాడని'!

జవాబు అవును వంజారా చాలా మంచివాడు వీళ్ళు ఎన్‌కౌంటర్ చేశారు నిజమే. కానీ ఎన్‌కౌంటర్ల వెనకాల కారణమేమిటనేది ఎందుకు ముందుకు రావటం లేదు? ఉదాహరణకి సోహ్రాబుద్దీన్‌ను టెర్రరిస్టు అని చంపేశారు కానీ ఆయన భార్యనెందుకు చంపేశారు? ఆ కౌసర్‌బీ టెర్రరిస్టు కాదు కదా! అతడు చెడ్డవ్యక్తి. అతన్ని ఎన్‌కౌంటర్ చేసేయొచ్చు కానీ అతని భార్యనెందుకు?

ప్రశ్న హరేన్ పాండ్యా, గోర్ధన్ జడాఫియా ఇద్దరినీ తీసేసాడు కదా!

జవాబు గోర్ధన్ భాయ్ మంచివాడే! హరేన్ పాండ్యా చాలా డైనమిక్ మనిషి.

ప్రశ్న: కానీ గోర్ధన్ భాయ్‌ని కూడా ఇతడు అల్లర్ల సమయంలో వాడుకొని వదిలేశాడు కదా!

జవాబు. అవునవును

గుజరాత్ అంతటా అల్లర్లు జరిగినాయి. కానీ వాళ్ళు మాత్రం నరోడా ఎమ్మెల్యే, అంటే నా వెంటపడ్డారు.

ప్రశ్న: అంటే మిమ్మల్ని బలిపశువును చేశారన్నమాట

జవాబు: అవును

ప్రశ్న మోదీని విచారించినప్పుడేమైంది

జవాబు: అతడు కూడా సిట్‌కు వెళ్ళాడు కానీ అతన్ని వదిలేశారు.

ప్రశ్న: కానీ మీ పట్ల అవలంబించిన పద్ధతి అవలంబిస్తే అతన్ని కూడా అరెస్ట్ చేయవల్సింది కదా!

జవాబు: ఆఁ.. (అని తలవూపింది.)

ప్రశ్న. మీ మోదీని నేను రేపు కలుస్తున్నాను.

జవాబు. మోదీని కలిసినప్పుడు అతడెందుకింత వివాదాస్పదమైన మనిషో అడుగు.

ప్రశ్న. నిజంగానే!

జవాబు: అతడు ప్రతిదాన్నీ తనకు సానుకూలంగా మలుచుకుంటాడు.

ప్రశ్న: వీళ్ళు మిమ్మల్ని జైలులో కలవటానికి వచ్చేవాళ్ళా?

జవాబు: లేదు ఎవ్వరూ రాలేదు

ప్రశ్న: అంటే మీరు ఏనాడైనా జైలుకి పోవచ్చన్నమాట.

జవాబు. అవును! ఏ రోజైనా! తీర్పు వెలువడిన వెంటనే వెళ్ళాల్సిరావచ్చు

ప్రశ్న: నేను మోదీని ఏమడగాలి? అతను జవాబులు దాటవేయవచ్చు

జవాబు. నువ్వు ప్రశ్నను తిప్పి అడగాలి. మొదట అతన్ని పొగుడు తర్వాత అడుగు.

ప్రశ్న. మీ గురించి?

జవాబు: మరోరకంగా అతన్ని అడుగు. ఎందుకు అతని కొందరు మంత్రులు ఇందులో ఉన్నారని అడుగు

పి.సి పాండేని అడుగు. అతనికి అన్నీ తెలుసు అతనికి నిజం తెలుసు. అతనప్పుడు అహ్మదాబాద్ కమీషనర్.

ప్రశ్న. మరి అతను నిజం ఎందుకు మాట్లాడడు?

జవాబు: ఏమో నాకు తెలీదు.

ప్రశ్న. (కొడ్నాని గురించి అడిగినపుడు) అతడు తల ఎందుకు దించుకున్నాడో నాకిప్పుడర్థమైంది

జవాబు: ఇప్పుడు నా గురించి మాట్లాడటానికి ఆయనకేం ఇబ్బంది.

ప్రశ్న: మోదీ సంగతేంటి?

జవాబు: అతడినీ, అతడి పని పద్ధతినీ పొగుడు. అప్పుడు ఆయన మాట్లాడడం మొదలు పెడతాడు అతడేం చెప్తాడో తెలుసా? 'నాకు వివేకానందుడంటే ఇష్టం సర్దార్ వల్లభభాయ్ పటేల్ అంటే ఇష్టం అని జవాబు చెప్తాడు నా గురించి అడుగు 'అచ్ఛా! మేం ఏం చేయగలం? సిట్ ఉంది ఫోన్ రికార్డులున్నాయ్' అని జవాబిస్తాడు. లేదా సంక్షిప్తంగా 'విషయం న్యాయస్థానంలో ఉంది' అని చెప్తాడు

ప్రశ్న: ఇవన్నీ అతడి విషయంలో కూడా వర్తిస్తాయి కదా!

జవాబు. హా.. హా... ఈ విషయం అతన్నడుగు!

ప్రశ్న: నేను జయంతి రవిని కూడా కలవాల్సిండింది. గోధ్రా సమయంలో ఆమె ఉండిన విషయం నాకు తెలియదు.

జవాబు: ఆc. ఆమె ఉండింది ఆమె గోధ్రా కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆఫీసరు. ఆనందిబెన్‌ను అల్లర్లు రేవకుండా ఆపినందుకు ఆమెను కూడా తొలగించాలనుకున్నారు. ప్రభుత్వానికి ఆమె పట్ల సదభిప్రాయం లేదు. కానీ ఆమె ఇప్పుడు తిరిగి వచ్చింది ఆ వివరాలు నాకు తెలీదు నేను నీకు తెలుసని కానీ, నీవు నన్ను కలిసానని కానీ అతనితో అనొద్దు. లేకుంటే అది మనసులో పెట్టుకుంటాడు.

తనకేమో శిక్ష పడిందనీ, మోదీనేమో సిట్ వదిలేసిందనీ, మాయా కొడ్నానీ ఆరెస్సెస్‌కు ఫిర్యాదు చేసిందనే పుకార్లలో సందేహం లేదు. అమిత్ షా మోదీకి సన్నిహితుడని మాత్రమే కాక షాను కాపాడటానికి మోదీ ఏ స్థాయికైనా వెళతాడని కొడ్నానీ గట్టిగా నమ్మింది నాతో జరిపిన సంభాషణల్లో ఆఫీసర్లను అవసరాల మేరకు ఉపయోగించుకొని అవసరం తీరాక వదిలేశాడని గతంలో ఎన్నోసార్లు విన్న విషయాన్నే ఆమె కూడా చెప్పింది

## *గీతా జోహ్రి*

నేను మరుసటి రోజు ఉదయాన్నే పానీని నిద్ర లేపాను. ఆమెతో నాకు అవసరం ఉంది. పానీకి నిండా పద్దెనిమిదేళ్ళు లేవు. గ్రీన్‌ల్యాండ్‌లో కన్ఫెక్షనరీస్‌లో తను షెఫ్‌గా పనిచేసేది. ఆమె చాలా ఆకర్షణీయమైన దుస్తులు వేసుకొనేది. ఆమె ఉంటే ఫౌండేషన్ అంతా కళకళలాడిపోయేది. మేము షీలా కీ జవానీ పాట వేసిన ప్రతిసారీ ఆమె ముఖం వెలిగి పోయి, వెంటనే డ్యాన్సు మొదలుపెట్టేది. మేము అహ్మదాబాద్‌కు వెళ్తుంటే ముంబయి ఎయిర్‌పోర్టు వద్ద కూడా ఇలాగే డ్యాన్సు చేసింది. నా మనసులో ఒక పథకం ఉంది. కానీ అందులో పానీ నాకేమైనా సహాయం చేయగలుగుతుందా అనే నమ్మకం నాకు కలగలేదు. ఆ రోజు వింటున్న లేటెస్ట్ జాజ్ పాట గురించి మాత్రమే ఆమెకు ఆసక్తి ఉండేది

మేడపైన ఒక సిగరెట్ కాల్చుకుందామని ఆమెను పిలిచాను. రాజ్‌కోట రావటానికి ఆమెకేమైనా ఆసక్తి ఉందేమోనని కనుక్కొన్నాను. ఒక గంట పాటు నాకు ఒక సమావేశం ఉందనీ దానికి తన సాయం కావాలనీ అడిగాను మనం బస్సులో

వెళతామా అని ఉత్సాహంగా అడిగింది. అవునని చెప్పాను ప్రయాణం ఆరుగంటలుంటుందని, ఒక హోటల్లో ఉంటామని చెప్పాను మరొకందుకు కూడా పానీ సాయం నాకు అవసరమైంది అహ్మదాబాద్‌లో ఎలాగో ఒకలాగు ఉండటానికి వసతి సంపాదించాను. కానీ, రాజ్‌కోట్ హోటల్లో అధికారిక పత్రాలు అవసరమవుతాయి. ఈ విషయంలో పానీ నాకు చాలా సాయపడగలుగుతుంది. ఆమె పాస్‌పోర్టును ఉపయోగించుకోవచ్చు.

మరుసటి రోజు ఉదయం మేము రాజ్‌కోట్‌కి బస్సులో బయలుదేరాం. నా కెమెరాలతో పాటు, నా ల్యాప్‌టాప్, చిప్స్, చాక్‌లెట్లు తీసుకెళ్ళాం మధ్యలో బస్సాగినపుడు పానీ తిన్నగా లస్సీ అమ్మేవాళ్ళ దగ్గరికి వెళ్ళింది బస్సులో అందరూ మగవాళ్ళే ఉన్నారు. ఎక్కువ మంది వ్యాపారస్తులే దాంతో పానీ సిగరెట్ ముట్టించగానే అందరి దృష్టి ఆమె మీదే పడింది (తోవ అంతా నేను ఆమె చెయ్యి పట్టుకొనే ఉన్నాను.) అనవసరంగా దృష్టిని ఆకర్షించడాన్నుండి తనను ఏదో రక్షిస్తున్నట్టు అహ్మదాబాద్ తిరిగి వచ్చేవరకూ పానీ బాధ్యత నాది ఆమెతో నాకో విధమైన బాంధవ్యం అనిపించింది నాకు లేని చిన్న చెల్లిలా అనిపించింది.

మేము హోటల్ చేరినపుడు పానీ పాస్‌పోర్టు చాలా ఉపయోగపడింది రిజిస్టర్‌లో నా పేరు మైథిలిగా నమోదయింది. గదిలోకి ప్రవేశించగానే పానీ ఉత్సాహంతో ఒక కేక పెట్టింది బాత్‌రూమ్‌లో ఒక బాత్ టబ్ ఉంది. కిటికీ నుండి మొత్తం నగరం అంతా కనిపిస్తోంది ఆమె ఉత్సాహంగా ఉంది, నేనేమో కలవరంతో ఉన్నాను. అప్పటి అత్యంత వివాదాస్పద అధికారుల్లో ఒకరైన గీతాజోహ్రి నాకు అపాయింట్‌మెంట్ ఇచ్చింది. గుజరాత్‌లో పైకెదిగిన మహిళగా ఆమె గురించి చిత్రీకరించదలుచుకున్నానని ఆమెకు చెప్పి ఉన్నాను ఒక నకిలీ స్క్రిప్టు కూడా ఆమెకు పంపించాను

మేమామెను కలవడానికి వెళ్ళినప్పుడు ఆమె మమ్మల్ని గదిలోకి స్వాగతిస్తూ మా గురించి చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నానని చెప్పింది. ఆమె రాజ్‌కోట్ కమీషనర్‌గా పని చేస్తోంది దాంతో ఆమె వద్దకు చేరడం నాకేం సమస్యగా అనిపించలేదు. ఆమెకు పానీ వెంటనే నచ్చేసింది తన బస్సుయాత్రను పానీ ఉత్సాహంగా వర్ణించింది. ఎనిమిదేళ్ళు అమెరికాలో గడపటంతోనే నేను పూర్తిగా విదేశస్థురాలిగా మారినట్టుందని జోహ్రి అన్నది "నీ యాస పూర్తిగా విదేశీయుల్లాగా ఉంది" అన్నది. విదేశాల్లో ఉన్న తన కూతురి గురించి మాట్లాడింది చాలా తరచుగా ఆమె స్నేహితులు వచ్చి తనతో పాటు రాజ్‌కోట్‌లో ఉండిపోతారని చెప్పింది మరోసారి పానీ వస్తే తులితో పాటు ఉండవచ్చని ఆమె అంది. పానీ వెంటనే ఒప్పేసుకొంది.

నేను కూడా తల ఊపాను ఎటువంటి అనంగీకారం తెలపడానికీ అది సమయం కాదు తరువాత ఎప్పుడైనా పానీకి విషయాలు వివరించవచ్చు.

మొదట ఆమె ధైర్యసాహసాల కథనాల గురించి మాట్లాడాను. తరువాత ఏదో ఒక రిపోర్టులో ఆమె గురించిన నెగిటివ్ విషయం ఉండటం గురించి ఆశ్చర్యం వ్యక్తం చేశాను "ఓహ్! అది సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ గురించి. దాని గురించి నీకెక్కువ తెలిసి ఉండదు ఆ ఎన్‌కౌంటర్ గురించే గుజరాత్‌లోని అధికారులంతా విచారణ ఎదుర్కొంటున్నారు," అంది

"అవును! నేను కలిసిన ప్రతి అధికారీ ఈ కేసు గురించే మాట్లాడారు" అని నేను కళ్ళు విప్పార్చుకుని మరీ చెప్పాను. 'ఒక గూండా మొత్తం రాష్ట్రాన్ని ఎట్లా అతలాకుతలం చేశాడో' అని ఆమె నవ్వింది సోహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ గురించి సుప్రీంకోర్టుకు పంపవలసిన నివేదికను మార్చమని చెప్పిందని ఆమె జూనియర్ అయిన వి ఎల్ సోలంకి చెప్పిన గీతాజోహ్రి ఈవిడే అమిత్ షా ఇంటి వద్ద జరిగిన ఒక సమావేశంలో ఈ నివేదిక వివరాలను మార్చమని ఆమెతో చెప్పారు. ఈ విచారణను సరిగా నిర్వహించలేదని సి బి.ఐ విచారణకు ఆదేశిస్తూ సుప్రీంకోర్టు గీతా జోహ్రిని అభిశంసించింది

గీతా జోహ్రి గురించి ఇక్కడే మరికొంత తెలుసుకోవడం పాఠకులకు అవసరం

1982 బ్యాచ్‌కు చెందిన గీతాజోహ్రి గుజరాత్‌లోని మొట్టమొదటి ఐ.పి ఎస్ అధికారిణి. 1990ల నుండీ ఆమె కెరియర్ ఎన్నో ఒడిదుడుకులను చవి చూసింది దరియాపూర్‌లోని పొపటియా వార్డులో మాఫియా డాన్ అయిన అబ్దుల్ లతీఫ్ డెన్ పై దాడి చేసి అతని గన్‌మెన్ షరీఫ్ ఖాన్‌ను అరెస్ట్ చేయడంతో గీతాజోహ్రి బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది అయితే లతీఫ్ తప్పించుకోగలిగాడు.

2006లో ఆమె సి.ఐ డి (క్రైమ్)లో ఉండగా సుప్రీంకోర్టులో సోహ్రాబుద్దీన్ సోదరుడు రుబాబుద్దీన్ పిటిషన్ దాఖలు చేయడంతో సోహ్రాబుద్దీన్ షేక్ అతని భార్య కౌసర్‌బీల బూటకపు ఎన్‌కౌంటర్ గురించిన విచారణకు ఈమెను అధికారిగా నియమించారు ఆమె లోతుగా విచారణ జరిపి ఎన్‌కౌంటర్ బూటకం అని తేల్చింది ఎంతో మంది పోలీసు అధికారుల పాత్ర ఇందులో ఉందని కూడా ఆమె విచారణ బయటపెట్టింది ఆమె సేకరించిన సాక్ష్యం ఆధారంగా వివాదాస్పద డి ఐ జి డి జి. వంజారా, ఎస్ పి రాజ్‌కుమార్ పాండ్యన్, ఎమ్.ఎన్. దినేష్‌లతో సహా పదమూడు మంది పోలీసు అధికారులను ఆ విచారణ అధికారి అయిన రజనీష్ రాయ్ అరెస్ట్ చేశాడు

కానీ త్వరలోనే ఆ విచారణను వదిలేయమని రాయ్‌కు చెప్పి జోహ్రిని మళ్ళీ నియమించారు. తాను వెళ్ళేముందు రాయ్ ముగ్గురు నిందితుల టెలిఫోన్ రికార్డులున్న సిడిలను తన ఉన్నతాధికారులకు ఇచ్చి వెళ్ళాడు. జోహ్రికి తన ఉన్నతాధికారులతో బాగా గొడవయ్యింది. ఆ తరవాత సుప్రీంకోర్టు నేరుగా తనకే రిపోర్టు చేయాలని ఆదేశించింది. జోహ్రి ఆ కేసుతో వ్యవహరిస్తున్న తీరులో సమస్యలుండడంతో ఆ కేసును సుప్రీంకోర్టు సి బి ఐ.కి బదిలీ చేసింది

బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో జోహ్రి చాలా ముఖ్యమైన వ్యక్తి. అంతకుముందు నేనొక వ్యాసంలో "ఒక లోపరహితమైన ప్రపంచంలో అనుకూల పరిస్థితుల్లో గీతా జోహ్రి పోలీసు సర్వీస్‌లో చేరాలనుకునే మహిళలకు ఒక ఆదర్శం అయి ఉండేది. కానీ ప్రపంచం ఆదర్శవంతమైంది కాదు అదృష్టం గీతాజోహ్రిని వరించలేదు" అని రాసాను

ఆమె చాలా ఒత్తిడితో ఉన్నట్టు కనిపిస్తుండటంతో అంతా బాగానే ఉందా? అని నేను నా సంభాషణ మొదలుపెట్టాను.

జవాబు· *గత రెండు నెలలుగా పరిస్థితులేం బాలేవు*

ప్రశ్న *వివాదాలు మొదలయినప్పుడు, వాటి గురించి మీరు ముందే ఊహించగలిగారా?*

జవాబు. *కొన్ని సార్లు మనం వాటిని ఊహించం నేను కూడా ఊహించలేదు. నేనట్లా ఊహించగలగడానికి తగిన కారణం కూడా ఏం లేదు ముఖ్యంగా నువ్వు నీ పని సక్రమంగా చేస్తున్నప్పుడు ఎవరైనా అందులో తప్పులు ఎంచుతారని ఎవరూ అనుకోరు. అయితే కొన్ని కారణాల వల్ల కొన్ని సార్లు పరిస్థితులు విషమించవచ్చు ఆ కారణాలు కొన్నిసార్లు రాజకీయమైనవై ఉంటాయి*

ప్రశ్న· *మీ విషయంలో అవి ముఖ్యంగా రాజకీయమైనవే కదా!*

జవాబు. *అవును నావి ప్రధానంగా రాజకీయమైనవే రాష్ట్రంలో, కేంద్రంలో వేరు వేరు పార్టీల ప్రభుత్వాలు.*

ప్రశ్న· *మీ గురించి నేను చాలా చదివాను. మీరు దాదాపు పార్లమెంట్‌ని స్తంభింపజేశారని విన్నాను.*

జవాబు: *ఆс . అవును. ఆ సోహ్రాబుద్దీన్ కేసు. దాని గురించి కొన్ని దారుణమైన పత్రికా రిపోర్టులున్నాయి. పత్రికల్లో, మీడియాలో నా గురించి ఎంతో చెడ్డగా ప్రచారం చేశారు.*

ప్రశ్న: సి బి ఐ మిమ్మల్నెప్పుడూ అరెస్ట్ చేయాలనుకోలేదా?

జవాబు: లేదు. నన్ను అరెస్ట్ చేయాలనుకుంటున్నదని సి.బి.ఐ ఎన్నడూ అనలేదు. ఆ సమయంలో నేను శిక్షణ పొందుతూ లండన్‌లో ఉన్నాను. వీటన్నిటి గురించి వింటూ ఉండినాను నేను వెనక్కి వచ్చాక ఈ పత్రికా కథనాలన్నీ చదివాను. నీ వద్ద సాక్ష్యం ఉంటే దాన్ని ప్రవేశపెట్టాలి. అదే నేను వాళ్ళతో చెప్పాను ఇదంతా ఆఫ్ ది రికార్డు చెబుతున్నా

వాళ్ళు ముఖ్యంగా నన్ను హోం మంత్రి గురించి అడిగారు. నాకెప్పుడూ హోంమంత్రితో మంచి సంబంధాలు లేవు కాబట్టి సి బి.ఐ. నన్నడిగినప్పుడు నేనదే విషయం చెప్పాను నేనంటే భయపడతారు కాబట్టి ఎవ్వరూ, ఏ రాజకీయవేత్త కూడా నాతో మాట్లాడరు ఈ రెండేళ్ళలో ఎవ్వరూ నాతో మాట్లాడలేదు.

ప్రశ్న: ఇదే హోం మంత్రా?

జవాబు: అవును. హోంమంత్రి అమిత్‌షా ఇది హాస్యాస్పదంగా అన్పించవచ్చు కానీ నేనెప్పుడూ అతనితో మాట్లాడదలుచుకోలేదు వాళ్ళ ఊరికే నన్ను బెదిరించదలుచుకున్నారు

నా భర్త నాకు దృఢంగా మద్దతిచ్చాడు. అన్ని ఒడిదుడుకుల్లోనూ అతను నాతో ఉన్నాడు. అన్ని దరఖాస్తులు రాయడంలోనూ అతను నాకు సాయపడతాడు. అతడు గాంధీనగర్‌లోని ఒక ఫారెస్టు అధికారి

ప్రశ్న. ప్రతి ఒక్కరూ ఈ ఎన్‌కౌంటర్ గురించి మాట్లాడుతున్నారే. ఈ సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ గురించీ! ఆసక్తికరమైన కేసు!

జవాబు: అతనికంటే కూడా ఎక్కువగా ఆయన భార్య కౌసర్ బీ విషయం! ఆమె పెద్దావిడ అంటే నా ఉద్దేశ్యం ఇద్దరు టీనేజి వయసు పిల్లలున్నారు ఆమెకు ముప్పై అయిదో నలభయ్యో ఉండొచ్చు. ఆమెకు ఇది వరకే ఎవరితోనో పెళ్ళయింది. ఆమె తన సోదరితో పాటు ఉండటానికి ఇండోర్ వెళ్ళింది. ఆమె సోదరి అక్కడొక బ్యూటీపార్లర్ నడిపేది. అక్కడే ఈమె సోహ్రాబుద్దీన్‌తో ప్రేమలో పడింది. తన భర్తతో విడాకులు తీసుకొంది వాడొక క్రిమినల్ బలవంతపు వసూళ్ళు చేసేవాడు.

ప్రశ్న. ఒక నేరస్థుడి కోసం మొత్తం రాష్ట్రం అతలాకుతలం అయ్యిందా?

జవాబు: అతను నేరస్థుడు, అతన్ని చంపాలనుకున్నారు. కాని దానిని మూర్ఖంగా చేశారు. జనంతో నిండి ఉన్న బస్సులో నుండి అతన్ని తీసుకువెళ్ళారు.

అలా చేయకూడదు ఇవన్నీ రహస్యంగా చేయాల్సిన పనులు అంత బహిరంగంగా కాదు. ఇట్లాగే వాళ్ళు పట్టుబడ్డారు

ప్రశ్న: అందుకే ఆవిడని కూడా ఎన్‌కౌంటర్ చేశారా?

జవాబు. కాదు వాళ్ళు అతన్ని ఎన్‌కౌంటర్ చేస్తారని గ్రహించింది కాబట్టి ఆమె అతన్ని వదిలిపెట్టడానికి నిరాకరించింది. వాళ్ళతన్ని చంపినప్పుడు కౌసర్‌బీ ఆ విషయాన్ని బయట పెడుతుందనుకున్నారు కాబట్టి ఆమెను కూడా చంపేశారు. అంటే ముఖ్యంగా సోహ్రాబుద్దీన్‌ని ఎన్‌కౌంటర్ చేశారనేది విషయం కాదు కౌసర్‌బీని చంపారనేదే అసలు విషయం సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ నిజమైన దానిలాగే కనిపించింది కానీ కౌసర్ కుటుంబానికి అనుమానం వచ్చి సుప్రీంకోర్టుకు వెళ్ళారు

ఆ సమయంలో నేను సి.ఐ డి క్రైమ్‌తో ఉన్నాను. ఆ కేసును మాకు పంపాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది బహుశా నేనూ ఒక మహిళని కాబట్టి అదృశ్యమైన మనిషి కూడా ఒక మహిళ కాబట్టి కేసు నా వద్దకు వచ్చిందనుకుంటున్నా. నేను ఆమెని వెతకడం మొదలుపెట్టాను ఇక దాంతో తేనెతుట్టె కదిలింది. ఇక విషయం రాజకీయ రంగు పులుముకుంది కౌసర్‌బీని, సోహ్రాబుద్దీన్‌ని అందరూ మర్చిపోయారు

ప్రశ్న: హోంమంత్రిని ఇందులో ఎందుకు ఇరికించారు?

జవాబు. ఇదంతా చట్ట వ్యతిరేకంగా, పథకం వేసి చట్ట వ్యతిరేకంగానే చంపారని గొడవ మొదలయ్యింది. ఒకసారి విచారణ మొదలుపెట్టాక అంతా బయటపడింది హోంమంత్రి చెప్పినందుకే ఇది జరిగినట్టుంది కానీ ఎటువంటి ప్రత్యక్ష సాక్ష్యం లేదు నేను పదమూడు మంది అధికారులను అరెస్టు చేశాను. అంటే అది చాలా ఎక్కువ తెలుసా? అది ఏటికి ఎదురీదడం లాంటిది రాజ్యానికి వ్యతిరేకంగా పనిచేయడం లాంటిది అది చాలా కఠినమైన సమయం.

ప్రశ్న: అవును మీ వాళ్ళకే వ్యతిరేకంగా పనిచేయడం కదా

జవాబు అవును!

ప్రశ్న కాని ప్రభుత్వం మీపై చాలా ఒత్తిడి పెట్టి ఉంటుంది కదా!

జవాబు. అవును ప్రతి ఒక్కరూ ఒత్తిడి పెట్టారు నా సహోద్యోగులు కూడా ఒత్తిడి చేశారు. దానికి తోడు అంతర్గత ఘర్షణ సోహ్రాబుద్దీన్ అంటే నాకేం అభిమానం లేదు. కానీ దానికో పద్ధతుంది చట్టబద్ధంగా కనిపించేలా నీ

చర్యలుండాలి. కనీసం కాగితమ్మీద అయినా చట్టబద్ధంగా సరిగా ఉండాలి.

ప్రశ్న అది మీకు చాలా కఠినమైన సమయం అయివుంటుంది కదా!

జవాబు అవును. సోహ్రాబుద్దీన్‌ను ఎన్‌కౌంటర్ చేసినందుకు పోలీసు అధికారులను అరెస్టు చేయడం గురించి నాకు చాలా ఇబ్బంది కలిగింది కానీ కౌసర్ బీ విషయంలో మాత్రం నేను సరైన పనే చేశాను

ప్రశ్న: మరి హోంమంత్రినెందుకు అరెస్టు చేయలేదు?

జవాబు: లేదు. నేను అరెస్ట్ చేయలేదు ఎందుకంటే మీ వాళ్ళనే నీవు అరెస్ట్ చేస్తున్నప్పుడు పూర్తిగా సాక్ష్యాధారాల ఆధారంగానే చేయాలి.

ప్రశ్న: కానీ మరి సి బి.ఐ. అతన్ని అరెస్ట్ చేసిందే!

జవాబు సి.బి ఐ ఒక్క హోం మంత్రినీ, మరొక అధికారినే అరెస్ట్ చేసింది. పదమూడు మందిని నేనే అరెస్ట్ చేసాను వాళ్ళు ఇంకెవరినీ అరెస్ట్ చేయలేదు నేను చేసినదానికంటే ఒక్క పిసరు కూడా ఎక్కువ చేయలేదు. చట్టపరంగా అతి బలహీనమైన సాక్ష్యాధారాలతో వాళ్ళిద్దరినీ అరెస్ట్ చేశారు నేను, చేయలేదు!

బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో మొదట్లో బాగా పని చేసిన జోహ్రీని ఆ తరువాత ఆమె భర్తకు సంబంధించిన లంచగొండితనం కేసులను చూపించి బ్లాక్‌మెయిల్ చేసారని చాలా మంది అంటారు [23] అటవీశాఖలో అధికారి ఐన ఆమె భర్త అనిల్ కారణంగానే, ఆమె విచారణను తప్పుదోవ పట్టించి, అమిత్ షాను రక్షించిందని సిబిఐకి ఒక నోట్ అందింది. ఒక పెద్ద డాన్ ఇంటిపై రెయిడ్ కోసం ఒక ఆటోలో వెళ్ళిన పోలీసు అధికారి, ఒక బ్లాక్‌మెయిల్ ద్వారా లొంగిపోయిందంటే నమ్మశక్యంగా లేదు ఒత్తిళ్ళ కారణంగా అమిత్‌షాను రక్షించడానికి బాగా ప్రయత్నించిందని సిబిఐ రాసిందంటేనే అది విషయాలను తేటతెల్లం చేస్తుంది సిబిఐ మళ్ళీ ఒకసారి గీతాజోహ్రీని ప్రశ్నించే ముందు, రాజ్యసభలో అప్పటి ప్రతిపక్ష నాయకుడైన అరుణ్ జైట్లీ నాటి ప్రధాన మంత్రి మన్‌మోహన్ సింగ్‌కు 2013 సెప్టెంబరు 17న ఒక ఉత్తరం[24] రాసాడు ఆ లేఖలోని కింది అంశాలు చాలా ఆసక్తిదాయకమైనవి

*జనాదరణ కోల్పోతున్న కాంగ్రెస్ అవలంబిస్తున్న వ్యూహం స్పష్టం కాంగ్రెస్ బిజెపి, నరేంద్ర మోదీలతో రాజకీయంగా తలపడలేదు. ఓటమి అంచులో ఆ పార్టీ ఉంది దర్యాప్తు సంస్థలను దురుపయోగించి, విభిన్న*

*పద్ధతుల ద్వారా గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోదీ, అప్పటి హోం మంత్రి అమిత్‌షా, గుజరాత్ చట్టం, రవాణా, శాసనసభా వ్యవహారాల మంత్రిని, ఇంకా ఇతర ముఖ్య బిజెపి నాయకులను తప్పుడు కేసుల్లో ఇరికించాలని చూస్తున్నది*

సోహ్రాబుద్దీన్, తులసి ప్రజాపతి ఎన్‌కౌంటర్ కేసుల్లో ఏడేళ్ళుగా జైల్లో ఉంటూ, ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో కూడా నిందితుడైన డిజి వంజారా అమిత్‌షా పై నమ్మకద్రోహపు ఆరోపణలు చేస్తూ ఉత్తరం రాసిన రెండు వారాల్లోనే అరుణ్‌జైట్లీ ఉత్తరం ప్రచురితమైంది.[25] ఈ కేసులో అరెస్టయిన పోలీసులందరూ జైల్లో ఉండేలా నిర్ధారించుకొని, న్యాయస్థానాలను మేనేజ్ చేసుకొని అమిత్‌షా తాను మాత్రం ఇబ్బందుల నుండి బయట పడ్డాడని అతడు రాసాడు. మోదీ, షాల ద్వయం వాడుకొని, వదిలేసే పద్ధతిని అవలంబిస్తారని గిరీష్ సింఘాల్ వంటి అధికారులు చెప్పిన విషయాలను వంజారా ధృవీకరించాడు.

*(సమయం గడిచే కొద్దీ) ఈ ప్రభుత్వానికి మమ్మల్ని రక్షించడంలో ఏమాత్రం ఆసక్తి లేదని నేను గ్రహించాను, సిబిఐ నుండి తనను తాను రక్షించుకోవడానికి మరొక వైపు రాజకీయ లబ్ధి పొందడానికి నన్ను, ఇతర అధికారులను జైళ్ళలోనే మగ్గేలా చేయడానికి రహస్యంగా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాడని కూడా గ్రహించాను. గుజరాత్ గగనతలంలో ఎన్‌కౌంటర్ కేసుల వెలుగును సజీవంగా ఉంచుతూ ఈ ప్రభుత్వం గత పన్నెండేళ్ళుగా చాలా రాజకీయ లబ్ధిని పొందిందనేది అందరికీ తెలిసిన విషయమే. అదే సమయంలో అవే కేసుల్లో జైళ్ళ బారిన పడిన పోలీసు అధికారుల విషయంలో మాత్రం ఎంతో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది*

*గౌరవనీయమైన సుప్రీంకోర్టు పట్ల నా గౌరవం ప్రకటిస్తూనే, నేను నిజాయితీగా నమ్మి, చెబుతున్నదేమిటంటే, శ్రీ అమిత్ భాయ్ షా చట్టపరమైన రాజకీయ కుట్రలు, కుహకాలకు, విన్యాసాలకు పాల్పడక ఉండి ఉంటే సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు కానీ, ఆ తర్వాత తులసీరామ్ ప్రజాపతి కేసుకానీ గుజరాత్ రాష్ట్రం దాటి వెళ్ళి ఉండేవే కావు నేను విస్పష్టంగా చెప్పేదేమిటంటే ఈ ప్రభుత్వం శ్రీ అమిత్ భాయ్ షా వేసే చౌకబారు ఎత్తుగడలతో తాను మాత్రం ఈదుతూ, అన్ని దిశలా విస్తరించాలని చూస్తున్నది. (పోలీసు అధికారులను మాత్రం) మునిగిపోయి*

అసహజమరణం పొందేందుకు వాళ్ళను వదిలేసింది నేను దేవుడిలా పూజించిన గుజరాత్ ముఖ్యమంత్రి ఐన శ్రీ నరేంద్ర భాయ్ మోదీ అంటే నాకు అపారమైన గౌరవం, అంతులేని విశ్వాసం ఉన్న కారణంగా ఇన్నాళ్ళూ మౌనంగా ఉన్నాను కానీ సమయానికి తగినట్టుగా నా దేవుడు మద్దతుగా నిలబడలేదని విచారంతో చెబుతున్నా అతని కళ్ళు, చెవులు తానే అయి, గత పన్నెండేళ్ళుగా కుక్కలను మేకలుగా, మేకలను కుక్కలుగా మారుస్తూ తప్పుదోవ పట్టిస్తున్న అమిత్ షా ప్రభావంలో ఇలా జరుగుతోంది. రాష్ట్ర అధికార యంత్రాంగం పై అతడికున్న అపవిత్రమైన పట్టు ఎంత సంపూర్ణ మైనదంటే, ప్రభుత్వాన్ని దాదాపుగా అతడే నడుపుతున్నాడనేటంతగా.

ఈ ఉత్తరం కొద్ది కాలం పాటు వార్తల్లో శీర్ష స్థానాన్ని ఆక్రమించింది ఒకప్పుడు నరేంద్ర మోదీకి, అమిత్‌షాకు అతి సన్నిహితంగా ఉన్న మనిషే వాళ్ళు కుట్రకు పాల్పడ్డారని నిందిస్తూ రానున్న రోజుల్లో మరిన్ని విషయాలు బయట పెడతానన్నాడు. ఇది జరిగిన కొద్దిరోజుల్లోనే, పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న ఇష్రత్ జహాన్ కేసులోని మరో నిందితుడు పూర్వ డి జి పి.పి పాండే కూడా బయటకు వచ్చి, ఈ విషయంపై మీడియాతో మాట్లాడుతానని హామీ ఇచ్చాడు.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లోనే డి.జి. వంజారాకు బెయిల్ దొరికింది గుజరాత్‌లో అతడు విడుదలైనప్పుడు ఒక హీరోలా అతడికి స్వాగత, సత్కారాలు లభించాయి. సోహ్రాబుద్దీన్ కేసులో ముఖ్య నిందితులైన రాజ్‌కుమార్ పాండియన్, అభయ్ చూడాసమ వంటి అధికారులు కూడా బెయిల్‌పై బయటకు వచ్చాక, వారిని గుజరాత్ పోలీసు విభాగంలో పునర్నియమించారు. ఈ సంవత్సరం మొదట్లో సి బి.ఐ. గీతాజోహ్రీపై ఆరోపణలన్నీ వాపసు తీసుకోవడంతో ఆమెకు గుజరాత్ డిజిపిగా పదోన్నతి కల్పించారు. గుజరాత్‌లో అన్ని కేసుల్లోనూ న్యాయ రథపు చక్రాలు వెనక్కు మళ్ళినట్టుగా అనిపిస్తోంది

## హరేన్ పాండ్యా

తెహెల్కా కోసం ముంబయిలో పని చేస్తున్నప్పుడు, 2008లో ముంబయి ఎన్‌కౌంటర్ పోలీసు దయా నాయక్‌ను చాలా సార్లు కలిసాను. దయా ఒక విచిత్రమైన మనిషి. గుజరాత్‌లో సాదిక్ జమాల్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో అతడి పాత్ర గురించి పేర్కొన్నానని, చివరిసారి ప్రయత్నించినపుడు అతడు నాతో మాట్లాడటానికి

ఇష్టపడలేదు. సిబిఐ అతడిని, ప్రదీప్ శర్మను తీవ్రంగా ప్రశ్నించింది వాళ్ళిద్దరూ సస్పెండ్ అయ్యారు ఒక సమయంలో వీళ్ళిద్దరూ ముంబయిలో పెద్ద ప్రభావమున్న పోలీసు అధికారులు ఈ ఇద్దరు పోలీసుల గురించి రామ్‌గోపాల్ వర్మ 'అబ్ తక్ ఛప్పన్' అనే సినిమా కూడా తీసాడు వాళ్ళను ఒకటే పొగిడేవాళ్ళు సొసైటీ సర్కిళ్ళ వాళ్ళంతా వాళ్ళతో పరిచయాన్ని పెంచుకోవడానికి వెంపర్లాడే వాళ్ళు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పట్టుబడే దాకా ఇది సాగింది

దయాకు మీడియాలో చాలా మంది స్నేహితులున్నారు. నిజం చెప్పాలంటే అతడు మీడియాను బాగా మేనేజ్ చేసేవాడు. అతడు లోఖండ్‌వాలా మార్కెట్‌లోని కోస్టాకేఫ్‌లో లేదా కేఫె కాఫీ డేకు రెగ్యులర్‌గా వెళ్ళేవాడు. అతడి జిమ్ స్నేహితులు వచ్చి పలకరించేవారు. నాయక్‌కు తన రివాల్వర్‌ను ప్రదర్శించటమంటే చాలా ఇష్టం. దాన్నెప్పుడూ తన ప్యాంటులో దోపుకుని ఉండే వాడు మహారాష్ట్రలోని మకోకా చట్టపు దురుపయోగం గురించి నేను, నా సహోద్యోగి పని చేస్తున్న కాలంలో, 2008లో అతన్ని కలిసినపుడు అతడన్న ఒక విషయం నాకెప్పుడూ గుర్తుండి పోయింది దేశంలోని అతిపెద్ద రాజకీయ హత్య గుజరాత్‌లో జరిగిందని అతడన్నాడు మోదీకి బద్ధశత్రువైన హరేన్ పాండ్యా హత్య అది. ఆయన వద్ద ఏదైనా సాక్ష్యముందా అని అతణ్ణి అడిగాను 'విలేఖరివి నీవు పరిశోధించడం నీ పని', అని అతడన్నాడు. అక్కడే ఆ సంభాషణను వదిలేసాం

ఇంటికి వచ్చాక, హరేన్ పాండ్యా హత్య గురించిన ప్రతి కథనాన్ని నేను చదవటానికి ప్రయత్నించా హరేన్ పాండ్యాను కొందరు ముస్లిం యువకులు చంపారని అన్నప్పటి నుండి కూడా ఆ విషయంపై కొన్ని సందేహాలుండినాయి కానీ, పాండ్యా తండ్రియైన విఠల్ పాండ్యా తన కొడుకును గుజరాత్‌లోని రాజకీయ శత్రువులే చంపారంటూ తాను బతికున్నంత కాలం ఆరోపిస్తూ వచ్చాడు. పాండ్యా భార్యయైన జాగృతి పాండ్యా కూడా తన భర్త హత్యలో ముఖ్యమంత్రి, అమిత్‌షాల హస్తం ఉందని ఆరోపించింది [26] ఈమె ఆ తర్వాత ఎన్నికల్లో కూడా పాల్గొన్నది కానీ ఆమె ఆరోపణ నంతా విషాదం నిండిన ఆ కుటుంబ సభ్యులు వ్యథతో అన్న మాటల్లాగానే అందరూ భావించారు

ఈ విషయానికి సంబంధించి నాకు బాగా జ్ఞాపకమున్న కథనం పరిశోధనాత్మక విలేఖరి సంకర్షన్ ఠాకూర్ రాసిన నివేదిక. సంకర్షన్ అద్భుత పరిశోధనలోని చాలా విషయాల నుండి కొన్ని అంశాలను నేను ఇక్కడ రాస్తున్నా

ఏకైక ప్రత్యక్ష సాక్షి ఐన యాద్రామ్ తాను చూసిన దాన్నుండి తేరుకోలేక ఒక గంట పాటు ఆ స్థానం నుండి కదలలేదన్నాడు; అతడు తేరుకున్నాక పోలీసులకు కాక తన సేఠ్ అయిన స్థానిక వ్యాపారి స్నేహల్ అడిన్ వాలాకు తెలియజేసాడు. లా గార్డెన్స్‌లోని పార్కింగ్ స్థలంలో మారుతి 800లో చనిపోయి పడి ఉన్నది హరేన్ పాండ్యా అని తెలిసినా, అడెన్ వాలా కూడా పోలీసులకు తెలియజేయక, పాండ్యా సహచరుడైన ప్రకాశ్ షాకు తెలియజేస్తాడు అతడు కూడా పోలీసులకు చెప్పడు. పాండ్యా కార్యదర్శి ఐన నీలేశ్ భట్‌కు చేస్తాడు తన బాస్ ఇంకా ఎందుకు రాలేదని చింతిస్తూ నీలేశ్ భట్ పాండ్యా ఇంటి వద్దే ఉన్నాడు భట్ వెంటనే లా గార్డెన్స్‌కు వెళ్ళి, కారు ఎక్కడున్నదో చూసి తలుపు తెరిచి, తన బాస్‌కు ఎన్నో తుపాకీ గుళ్ళు తగిలి ఉన్నాయని చూసాడు అప్పటికి ఉదయం పది దాటింది గుజరాత్ పూర్వ గృహమంత్రి చనిపోయి నగరం నడిబొడ్డున రెండు గంటల పాటు పడి ఉన్నాడు

ఈలోగా, లా గార్డెన్స్ వద్ద ఏం జరిగిందో తెలుసుకొమ్మనీ అక్కడ గందరగోళం నెలకొని ఉందనీ, కొన్ని పుకార్లు వినిపిస్తున్నాయనీ, కంట్రోల్ రూం నుండి ఎల్లిస్ బ్రిడ్జి పోలీసులకు ఫోన్ కాల్ వస్తుంది ఎస్ ఐ వై.ఎ షేక్ అటుకేసి బయల్దేరాడు లాగార్డెన్స్‌కు వెళుతూ ఉంటే అక్కడికి కాదు, పరిమల్ గార్డెన్స్‌కు వెళ్ళమని అతడికి కంట్రోల్ రూం నుండి మరో ఫోన్ వస్తుంది. అతడు పరిమళ్ గార్డెన్స్ వైపు మళ్ళుతాడు 10.50కి మళ్ళీ ఒక ఫోన్ వస్తుంది లా గార్డెన్స్‌కు వెళ్ళమని అక్కడికి అతడు 10 54కు చేరతాడు అంటే పాండ్యాపై కాల్పులు జరిగాక సుమారు మూడు గంటల తర్వాత. షేక్ తోటి ఎస్ ఐ ఐన నాయక్, అతడి కంటే ముందు లా గార్డెన్స్ వెళ్ళడానికి బయల్దేరాడు, కానీ అతడు ఇప్పటికీ అక్కడికి చేరనే లేదు మరి స్థానిక పోలీసులకు ఆ రోజు ఉదయం ఆదేశాలిచ్చింది ఎవరు? పది నిముషాలకంటే ఎక్కువ దూరం లేని చోటుకు చేరడానికి అంత ఆలస్యం ఎందుకు?

అదే రోజు మధ్యాహ్నం వి ఎస్ ఆసుపత్రి వద్ద చేసిన శవ పరీక్షలో పాండ్యాకు ఐదు బుల్లెట్ల ద్వారా ఏడు గాయాలయ్యాయని తేలింది ఐదు గాయాలు 0 8 సెం.మీ.వి రెండు 0 5 సెం మీ వి. ఒకటే రివాల్వర్ వల్ల కూడా విభిన్న సైజుల గాయాలు కావడమనేది శాస్త్రీయంగా సాధ్యమే

ఐదు బుల్లెట్లు విభిన్న శరీర భాగాల గుండా పోవడం వల్ల ఏడు గాయాలు చేయడం కూడా సాధ్యమే కానీ ఈ కేసును చాలా సన్నిహితంగా పరిశీలిస్తున్న నిపుణులు ఈ కేసులో అలా కావటానికి ఆస్కారం చాలా తక్కువ అని అన్నారు అంటే రెండు బుల్లెట్లు ఏమయ్యాయో తెలియదు

శవ పరీక్ష నివేదికలో ఐదవ నంబరు గాయం చేసిన బుల్లెట్ పాండ్యా వృషణాల కింది భాగం నుండి దూసుకెళ్ళి పై వైపు ప్రయాణించి కడుపు గోడను చీలుస్తూ ఎదలోకి వెళ్ళింది పాండ్యాలాగా ఆరడుగుల పైనే ఎత్తు ఉన్న మనిషిని మారుతి 800 వంటి చిన్న కారులో వృషణాల కింద భాగంలో ఎవరైనా కాల్చగలరా? పాండ్యాను కాల్చినట్టుగా ఎవరినైనా వృషణాలలో కాలిస్తే వారికి విపరీతంగా రక్తస్రావం జరుగుతుంది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే ఈ భాగంలో చాలా రక్త నాళాలుంటాయి పాండ్యాకు రక్తస్రావం అయ్యిందా? అయ్యింది కారులో ఆ ఛాయలు ఉన్నాయా? లేవు పాండ్యాను అతని వృషణాలపై, మెడపై, రెండు సార్లు ఛాతీపై, ఒకసారి చేతిపై కాల్చారు కారు రక్తంతో తడిసి పోయి ఉండాలి కనీసం అతడి సీటైనా తడిసి ఉండాలి కానీ ఫోరెన్సిక్ నివేదికల ప్రకారం, కారులో ముందు సీటుపై తాళపు చెవుల గుత్తిపై మరకలు తప్ప రక్తపు చిహ్నాలేవీ లేవు (సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్సెస్ లాబోరేటరీ రిపోర్టు నం సి ఎఫ్ ఎస్ ఎల్ –2003 / ఎఫ్ 232)

పాండ్యా కారులో గన్ షాట్ పౌడర్‌కు సంబంధించిన చిహ్నాలు కూడా లేవు (మొబైల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ, గుజరాత్) అతడు కారులో కూర్చొని ఉండగా ఐదో ఇంకా ఎక్కువో బుల్లెట్లు కాలిస్తే కారులో గన్‌పౌడర్ చిహ్నాలే లేవా?

అసలు హరేన్ పాండ్యాను కారులోనే కాల్చారా? లేక అతణ్ణి వేరే ఎక్కడో హత్య చేసి అతడి శవాన్ని తర్వాత కారులో ఉంచారా? ఇంటి నుండి బయలు దేరాక ఆ రోజు పాండ్యా ఎక్కడికి వెళ్ళాడు? నిజం తెలుసుకోవడానికి కొన్ని ఆధారాలున్నాయి కానీ అవి మాయమైపోయాయి లేదా అందుబాటులో లేవు

లాగార్డెన్స్ వద్ద పాండ్యా శవాన్ని కారులో నుండి బయటకు తీసినప్పుడు అతడు బూట్లు వేసుకొని ఉన్నాడు కానీ శవపరీక్ష కోసం తీసుకెళ్ళినప్పుడు లేవు వాటి గురించిన ఎటువంటి రికార్డు లేదు ఆ

ఉదయం పాండ్యా ఎక్కడికి వెళ్ళాడననడానికి, ఆ బుల్లెట్లే ముఖ్యమైన ఆధారాలేమైనా అందించగలిగేవేమో!

పాండ్యా కారు నుండి అతడి బూడిద రంగు ఫ్లిప్‌ఫ్లాప్ సామ్‌సంగ్ ఫోను పోలీసులకు దొరికింది ఆ ఫోన్ కాల్ రికార్డులను పోలీసులు చెక్ చేయనైనా చేయలేదు, లేదా దాచిపెడుతున్నారు ఆ రోజు పాండ్యాకు ఎవరి నుండి ఫోన్‌లు వచ్చాయి లేదా అతను ఎవరికి చేసాడు అనేది తెలుస్తుంది ఇది కూడా నిజాన్ని చేరుకోవడానికి కీలకమైన ఆధారాలనివ్వొచ్చు. కానీ ఆ రికార్డులు లేవు పాండ్యా ఫోన్ సర్వీస్ 'హచ్'ను రికార్డుల కోసం అడిగితే, ఆ కంపెనీ 2013 జనవరి, ఫిబ్రవరిల రికార్డులు ఇచ్చింది కానీ, మార్చివి ఇవ్వకపోవడానికి అవి చాలా పాతవనే వింతైన కారణం చెప్పింది జనవరి, ఫిబ్రవరిల తర్వాత మార్చి వస్తుందా? మార్చి తరువాత జనవరి, ఫిబ్రవరిలా?

ఈ కేసులో నిందితుడైన ముఫ్తీ సుఫియా విచిత్రమైన కేసు కూడా ఇందులో భాగమా? అహ్మదాబాద్‌లోని లాల్ మసీదు వద్ద రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా యువ మౌల్వీ అయిన సుఫీయాన్‌కు పేరొచ్చింది 2002 హింస తర్వాత అతడు మరింత కరడు గట్టిన వాడుగా తయారై ప్రార్థనానంతరం రెచ్చగొట్టే బోధలు చేసేవాడు దొంగ సారా వ్యాపారంపై బతికే అహ్మదాబాద్‌లోని అండర్ వరల్డ్‌తో కూడా అతడికి సంబంధమున్నదనేది తెలిసిన విషయమే పాండ్యాను చంపడానికి అస్ఘర్ అలీకి కంట్రాక్టు ఇవ్వడంలో సుఫియాన్ పాత్ర కూడా ఉందని అభియోగం హత్య జరిగిన ఒక వారం లోపే, అతడిపై ఇంకా నిఘా ఉండగానే అతడు దేశం నుండి తప్పుకున్నాడు ఎక్కడికి? ఎవ్వరికీ తెలియదు బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, యెమెన్? ఎవ్వరికీ ఏమీ తెలియదు సిబిఐ సుఫియన్ స్థాయిని పెంచి, ఇంటర్ పోల్ ద్వారా అతడి కోసం రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించింది పాండ్యాను హత్య చేయడానికి కుట్ర చేసిన వాడిగా అతడు ఒక వాంటెడ్ వ్యక్తి – అయినా అంతు చిక్కని విధంగా సుఫియన్ తప్పించుకున్న ఒక సంవత్సర కాలం తర్వాత, అతడి భార్య, పిల్లలు కూడా అలా మాయమై పోయ్యారు "వాళ్ళను ఖచ్చితమైన నిఘాలో ఉంచవలసింది సుఫియన్ ఎక్కడున్నాడో తెలుసుకోవడానికి, వీళ్ళు మాత్రమే మనకు మిగిలిన చివరి ఆధారం", అని ఒక సీనియర్

*పోలీసు అధికారి అన్నాడు అయినా వాళ్ళు తప్పించుకోగలిగారు అది ఎట్లా సాధ్యమైంది? ఎవరైనా అతడికి సాయపడి ఉంటారా? సుఫియన్‌కు అసౌకర్యకరమైన రహస్యాలేమైనా తెలుసా? వారి మధ్య ఏదైనా ఒప్పందం (డీల్) కుదిరిందా?*

నేను నా స్టింగ్ మొదలు పెట్టే కొద్ది కాలం ముందు, ఇంకా సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ గురించి పరిశోధన చేస్తున్న కాలంలోనే 2010లో మొదటిసారి జాగృతి పాండ్యాను కలిసాను. ఆమె భర్త చనిపోయినప్పుడు నిష్పక్షపాతంగా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూన్న చురుకైన మహిళగా ఆమెను టివిలో చూసాను ఆమె అహ్మదాబాద్‌లో ఒక ఉన్నత మధ్య తరగతి ప్రాంతంలో తన ఇద్దరు కొడుకులు, తండ్రితో పాటు ఉంటున్నది. నేను ఆ తరువాత కాలంలో ఆమెను జాగృతి బెన్ లేదా జాగృతిజీ అని పిలవడం మొదలు పెట్టాను. ఆమెలో ఏదో ధైర్యం ఉంది ఈ రోజు నేనామెను ఒక సన్నిహిత స్నేహితురాలు అనగలను. తన భర్త హంతకులను కనుక్కోవడానికి ఆమె చేసిన ధైర్యమైన పోరాటానికి చేతులెత్తి నమస్కరించ వలసిందే హరేన్ పాండ్యా అంటే ఆర్ ఎస్ ఎస్ కు, ఎల్.కె. అద్వానీకి, ఇతర బిజెపి నాయకులకు, ఎంతో మంది పోలీసు అధికారులకు కూడా చాలా ఇష్టం. గుజరాత్ అల్లర్ల కాలంలో అతని పాత్ర వివాదాస్పదమైనదే అయినా, ముస్లిం సముదాయంలో కూడా ఎంతో మందికి అతనంటే ఇష్టం అని అనుకుంటారు.

తన భర్తను ఎవరో ఒక ముస్లిం చంపేసాడు కాబట్టి ముస్లింలంటే ఒక అయిష్టం, కోపం జాగృతిజీలో కనిపించింది రానా అంటే అది ఒక హిందూ పేరు అని ఆమె అనుకున్నది. ఆమె తప్పును సరిదిద్దాలంటే నాకు ఇబ్బందిగా అనిపించింది తరువాత పత్రికలో నా వ్యాసం చదివినప్పుడు తెలుసుకుంటుందిలే అని వదిలేసాను. తన భర్త హంతకుల గురించి మాట్లాడినప్పుడల్లా ఆమె ముస్లింల గురించి 'ఈ మనుషులు' అనేది. కొన్నిసార్లు 'ఆ హింసాత్మక మూక' అనేది. కానీ ఆమెను కలిసిన మొదటి క్షణం నుంచీ, అధికారంలో ఉన్న శక్తిమంతులు ఎవరో ముస్లిం యువకులను వాడుకున్నారని బలంగా విశ్వసించడం చూసి నాకు ఆశ్చర్యం వేసింది ఎనిమిదేళ్ళ క్రితం తన భర్తను కోల్పోయిన మనిషి ఈమె తన తండ్రి అంత్యక్రియల గురించి ఆమె చిన్న కొడుకుకు ఏమీ గుర్తు కూడా లేదు అయినా, తన కొడుకులను క్రమ శిక్షణతో పెంచడంతో పాటు, న్యాయం కోసం తన పోరాటాన్ని ఏ మాత్రం ఆపలేదామె అయితే ఈ పోరాట ప్రభావం తన పిల్లలపై ఎటువంటి నెగెటివ్ ప్రభావం వేయకుండా కూడా ఆమె జాగ్రత్తలు తీసుకుంది ఆమె చిన్న కొడుకు రాష్ట్ర స్థాయి క్రీడాకారుడు

పెద్ద కొడుకు ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు తమ తండ్రి చావు వెనక ఏదో పెద్ద కుట్రనే దాగి ఉందన్న ఆమె విశ్వాసం వెనక వాళ్ళిద్దరూ కూడా చాలా దృఢంగా నిలబడ్డారు ముఫ్తి సుఫియాన్‌ను, అతని కుటుంబాన్ని కలవడానికి ప్రయత్నించింది [27] వారి వివరాలు, పాండ్యా కాల్ రికార్డ్స్ ఆధారంగా తన భర్త మృత్యువు గురించి ఆమెకు కొన్ని ప్రశ్నలున్నాయి

సంకర్షన్ ఠాకూర్ రాసిన రిపోర్టు (పైన నేను పేర్కొన్నది) గురించి కూడా ఆమె ప్రస్తావించింది అమిత్ షాను కటకటాల వెనక్కు పంపించిన వెంటనే నేను ఆమెను కలిసాను. అప్పుడే తులసి ప్రజాపతికి (ఇతణ్ణి కూడా బూటకపు ఎన్‌కౌంటర్లో చంపారు) పాండ్యా హత్య గురించి కీలక సమాచారం తెలుసనే వివరాలు కూడా బయటకు వచ్చాయి నా స్టింగ్ ఆపరేషన్ ముగిసి 2011 అక్టోబరులో నేను ఢిల్లీకి తిరిగి వచ్చాక పాండ్యా హత్య గురించి ఒక వ్యాసం రాసాను. అందులో కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు లేవనెత్తాను

> *అప్పట్లో అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్‌లో ఉన్న చూడాసమాను ఎందుకు సుఫియన్ తండ్రి పొగుడుతాడు? ఇతన్ని విశ్వసిస్తే, చూడసమ ఎందుకు వాళ్ళ కుటుంబానికి ఏ హానీ కలగదని హామీ ఇచ్చాడు? తొలినాళ్ళలో విచారణను క్రైమ్ బ్రాంచ్ సిబిఐకి అప్పజెప్పినప్పుడు, కేసు చాలా పకడ్బందీగా ఉందని సిబిఐ అన్నది మరి అటువంటప్పుడు కేసును విచారిస్తున్న సిబిఐ టీం సుఫియాన్‌ను వెతికి పట్టుకోవడానికి ఎందుకు ఒక లెటర్ రోగేటరీ పంపించలేదు అనే తార్కికమైన ప్రశ్న మనం అడగవచ్చు*
>
> *రెండవ విషయమేమిటంటే, సిబిఐ విచారణాధికారి 2003 మార్చి నెలకు సంబంధించిన రికార్డులు దొరక లేదన్నాడు కానీ అంతకు ముందటి రెణ్ణెళ్ళవి దొరికాయి తెహెల్కా వద్ద ఉన్న ఈ రికార్డుల కాపీ ప్రకారం అహ్మదాబాద్‌లోని ఒక మహిళా జర్నలిస్టు నుండి నలభై కాల్స్ ఉన్నాయి ఆశ్చర్యకరంగా, సిబిఐ కానీ, పోలీసులు కానీ ఆవిడను ప్రశ్నించలేదు మూడవది, లా గార్డెన్ వద్ద ఒక తినుబండారాల బండి నడుపుకుంటున్న అనిల్ యాద్‌రామ్ హత్య జరుగుతుండగా చూసాడన్నారు అతడు పరస్పర విరుద్ధమైన వాంగ్మూలాలు ఇచ్చాడు తాను చాలా గందరగోళ పడిపోవడం వల్ల ఏ ప్రతిక్రియా చూపలేదని పోలీసులకు చెప్పాడు ఒక గంట తరువాత*

*అతను తన బండి యజమానికి ఫోన్ చేసి చెప్పాడు అతడు కూడా పోలీసులకు కాక, పాండ్యా సహచరుడికి ఫోన్ చేసాడు తెహెల్కా యాగ్రామ్‌ను కలిసినప్పుడు మూడు రోజుల్లో మూడు పరస్పర విరుద్ధమైన వాంగ్మూలాలు ఇచ్చాడు మొదటి రోజు అలీ బైక్ పైన వచ్చాడన్నాడు రెండవ రోజు, అతడు కారువైపు నడిచి పోతుండగా చూసానన్నాడు. మూడవ రోజు, తనకు ఆ రోజు ఘటనలు ఏ క్రమంలో జరిగాయో గుర్తు లేదన్నాడు. నాల్గవది, ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం కుర్తా పై నాలుగు రంధ్రాలున్నాయి కానీ, అతడి శరీరంలో ఐదు బుల్లెట్లు ఉన్నాయి అతడు స్టీరింగ్ వెనకాల కూచొని ఉండగా కొంచెం తెరుచుకొని ఉన్న కుడి తలుపు కిటికీ నుండి ఫైర్ చేసి ఉంటే అతడికి కటి భాగంలో ఎటువంటి గాయం అయి ఉండకూడదు అతడు పాసింజర్ సీటులో ఒక పక్కకు ఒరిగి పోయాడని ప్రాసిక్యూషన్ వివరించిన దాన్ని జడ్జి కూడా ఒప్పేసుకున్నాడు కానీ అలా జరిగే అవకాశాలు తక్కువ ఐదవది పోలీసు కంట్రోలు రూం దాఖలు చేసి ఎఫ్ ఐ ఆర్ కు సంబంధించిన లాగ్‌ను బట్టి చూస్తే గందరగోళం లేదా ఆలస్యం జరిగిందని తెలుస్తుంది ఇన్ని లొసుగులు ఉండి సాక్షులు మాట మారుస్తూ ఉంటే, హైకోర్టు గత నెలలో అందరినీ విడుదల చేసింది అలీయే పాండ్యాను కాల్చాడని ఎటువంటి ఆధారం లేదని కూడా వ్యాఖ్యానించింది*

ఆ తరువాత కాలంలో నేను జాగృతిబెన్‌ను చాలా సార్లు కలిసాను మేము అలా కారులో షికారుకు వెళ్ళే వాళ్ళం లేదా డిన్నర్‌కు వెళ్ళే వాళ్ళం తన విషయాలు, మాటలు పంచుకోగల అవ్తరాలు తనకు దొరికితే, నిజాన్ని వెలికి తీసేందుకు నాకు బలం ఇవ్వగల స్నేహితురాలు నాకు దొరికింది ఆమె భర్త హత్య గురించి దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ కోసం నేను ఒకసారి జాగృతిబెన్‌ను కలిసాను అది రంజాన్ మాసం నేను ఉపవాసం ఉన్నాను. నేను ఇంటికి వెళ్ళగానే, తాను నాకు కొంచెం నిమ్మరసం ఇచ్చింది. నేను వద్దన్నాను టీ చేస్తానంది 'లేదు, జాగృతీబెన్, రంజాన్ కదా నేను రోజాలో ఉన్నా. ఏమీ తినలేను, తాగలేను,' అన్నాను ఆమె స్థంభించిపోయింది నా సమక్షంలోనే నా సముదాయం గురించి చెడుగా మాట్లాడినవన్నీ గుర్తుకొచ్చి ఉంటాయి దాంతో బాగా ఇబ్బంది పడి 'మీరు మహమ్మదీయులా? నాకు తెలియదు', అని అనగలిగింది. 'ఫరవాలేదు మీ స్థానంలో నేను ఉన్నా కూడా నేను కూడా తప్పు చేసే

అవకాశం ఉంది మీకు జరిగిన నష్టానికి ఎవ్వరూ కూడా క్షమించలేరు', అంటూ నేను భరోసానిచ్చే మాటలు పలికాను.

ఛార్జిషీట్ చదువుతుంటే ఆమె నాతో పాటే కూచుని, నా ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పింది.

2002 గుజరాత్ మారణకాండ గురించి తన భర్త వి.ఆర్. కృష్ణయ్యర్ నాయకత్వంలోని పౌరబృంద విచారణకు హాజరయి సాక్ష్యం చెప్పాడని చెప్పింది. దాని ఏర్పాటు రహస్యంగా జరిగింది కానీ మోదీకి దాని విషయం తెలిసిందని ఆమెకు అనుమానం మోదీకి హరేన్‌తో అహానికి, ప్రతిష్టకు సంబంధించిన ఎన్నో వివాదాలు ఉన్నాయనీ అందువల్లే బిజెపి హై కమాండ్‌ను కూడా లెక్క చేయకుండా అతణ్ణి ఎల్లిస్ బ్రిడ్జ్ సీటు నుండి ఖాళీ చేయించాడు. పాండ్యాకు ఆరెస్సెస్‌తో మంచి సంబంధాలుండి, ఆ సంస్థ ఆశీర్వాదం కూడా అతనికి ఉండటం వల్ల అతడు మోదీకి రాజకీయ కంటకంలాగా ఉన్నాడు.

నేను బయలుదేరడానికి సిద్ధమైనప్పుడు, అహ్మదాబాద్‌లో నేను ఎక్కడ ఉంటున్నానని ఆమె నన్ను అడిగింది ఆ రోజు సాయంత్రం దాదాపు 6 30 గంటలకు ఇఫ్తార్ (రంజాన్ ఉపవాసం వదలటం) కంటే అర గంట ముందు ఆమె నాకు ఫోన్ చేసింది నా ఉపవాసం వదిలేందుకు నన్ను ఒక హోటల్‌కు తీసుకెళ్ళడానికి ఆమె నా హోటల్ బయట వేచి ఉంది

ఆ రోజు నుండి జాగృతి బెన్ నా రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండేది. ఇది ఎటువంటి స్థితో తనకు తెలుసని ఆమె నాతో అంది 'నా భర్త గురించి నిజాలు బయట పెట్టడానికి నీవు చాలా తీవ్రంగా కృషి చేస్తున్నావు కాబట్టి నిన్ను రక్షించడం నా బాధ్యత ముఖ్యంగా నీవు ముస్లింవు కాబట్టి రక్షణ అవసరం,' అని అంది

హరేన్ పాండ్యా విచారణలో చాలా మంది అధికారులు ఉన్నారు. హత్య జరిగిన కొద్ది రోజుల్లోనే ప్రోటోకాల్ ప్రకారం గుజరాత్ పోలీసులు తయారు చేసి సంతకం చేసిన తర్వాత ఈ కేసు విచారణను, ఎఫ్.ఐ ఆర్.ను సి బి ఐ తీసుకుంది ఎఫ్ ఐ ఆర్ నేను చదివాను. వై ఎ షేక్ (పైనే ఇతని గురించి పేర్కొన్నాను) అనే ఇన్‌స్పెక్టర్ దర్యాప్తు అధికారి

యాదృచ్ఛికంగా ఇతడు వి ఎల్. సోలంకి మిత్రుడు. (ఈ సోలంకి గురించి గీతా జోహ్రి సందర్భంలో ప్రస్తావించి ఉన్నాను) షేక్ సందర్శకులను కలిసేవాడు కాదు మీడియ వాళ్ళనైతే అసలే కలవడు నేనప్పటికి నా స్టింగ్ ఆపరేషన్‌ను ఇంకా మొదలుపెట్టలేదు. షా అరెస్టు తర్వాత నా పరిశోధన చేసేందుకు అహ్మదాబాద్‌లోనే

ఉన్నాను. నేను వి.ఎల్. సోలంకి ఇంటికి రెండు సార్లు వెళ్ళాను. అతడు నా గురించి, నా నేపథ్యం గురించి రెండుసార్లు చెక్ చేసుకున్నాక తన ఇంటికి రమ్మని చెప్పాడు. అతడు గీతా జోహ్రీకి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చిన తర్వాత అతడి ఇంటి బయట ఒక జీపులో పోలీస్ కానిస్టేబుళ్ళు నిరంతరం కాపలా ఉంటున్నారు

సిబిఐకి చెప్పిన ప్రతి మాటపై సోలంకి నిలబడి ఉన్నాడు నేను బయలుదేరి వెళ్ళేముందు, సోలంకితో అతడికి షేక్ అనే అధికారి తెలుసా అని యాధాలాపంగా అడిగాను 'మీరు ఆయనను ఎందుకు కలవాలనుకుంటున్నారు? అతని గురించి ఎందుకు తెలుసుకోవాలను కుంటున్నారు?' అని అతడు కొంచెం తీవ్రంగా అడిగాడు. 'ఒక కేసు గురించి ఆయనను కలుద్దామనుకుంటున్నాని' పేలవంగా నవ్వుతూ చెప్పాను. అతడు చిరునవ్వు నవ్వుతూ, నన్ను ఇంటి బయటి దాకా సాగనంపడానికి వస్తూ, 'రహ్‌నేదో బెన్, వోనహీ మిలేగా ఆప్‌సే ఔర్ ఆప్ యే సబ్‌మే మత్ పడో' (వదిలెయ్యండి బెన్. అతను మిమ్మల్ని కలవడు వీటన్నింటిలో మీరు పడొద్దండి) అన్నాడు.

పాండ్యా కేసులో ఎఫ్.ఐ ఆర్ దాఖలు చేసాడు కాబట్టి షేక్ తన తోటి వాళ్ళన్నా, రాజ్యమన్నా భయపడుతున్నాడు పాండ్యా హత్య విషయంలో విషయాలను దాచేస్తున్నారని పాండ్యా తండ్రి ఆరోపించాక కేసును సిబిఐకి బదిలీ చేసే ముందు, కేసును దర్యాప్తు చేసిన వ్యక్తి షేక్

షేక్‌తో బాగా పరిచయమున్న ఒక లాయరు గుజరాత్‌లో ఉన్నాడు చాలాసార్లు షేక్ సలహాల కోసం అతని వద్దకు వెళ్ళేవాడు షేక్‌తో ఒక్క సమావేశం ఏర్పాటు చేయమని నేను అతణ్ణి కోరాను. అవసరమైతే నా మతపు తురుపు ముక్కను కూడా వాడమని చెప్పాను ప్రస్తుత ప్రభుత్వం కింద ఊపిరి సలపనట్టుగా భావిస్తున్న అతని వంటి పోలీసుల పట్ల సహానుభూతి కలిగిన ముస్లింగా నా గురించి అవసరమైతే చెప్పమన్నాను.

ఆ సమయంలో నేను ముస్లింలు అధికంగా ఉండే ఖాన్‌పూర్‌లోని అంబాసిడర్ హోటల్‌లో ఉన్నాను స్థానిక మసీదు నుండి ప్రతి ఉదయం, సాయంత్రం వినపడే ఆజాన్ రంజాన్ మాసంలో నేను సెహ్రీ, ఇఫ్తార్‌లను తినడానికి సాయపడేది. అంబాసిడర్ హోటల్ ఒక సింధీ వ్యాపారిది అంబాసిడర్ ఎదురుగ్గానే ఒక ముస్లిం నడుపుతున్న రెస్టారెంట్ ఉంది. తమ ఉపవాసం వదిలాక టీ, బిస్కట్లు తీసుకోవడానికి ఇతరులు అక్కడికి వచ్చేవారు.

ఇక్కడే నన్ను కలవడానికి షేక్ మొదటి సారి ఒప్పుకున్నాడు నన్ను నేను

పరిచయం చేసుకున్నాను. సోహ్రాబుద్దీన్, తులసి ప్రజాపతిల కేసుల్లో సాక్ష్యాధారాలు బయట పెట్టి అమిత్‌షాను కటకటాల వెనక్కు నెట్టిన జర్నలిస్టును నేనే అని అతనితో చెప్పాను నేను ఇవన్నీ పెద్దగా వివరించనవసరం లేదని, రానా అయ్యూబ్ అనే అతని గురించి గుజరాత్ అంతటికీ తెలుసని అతను అన్నాడు. నేను నవ్వేసాను

షేక్ కొంత భయపడుతూ ఉన్నాడు. నేను ఒక ధార్మిక ముసల్మాననీ, కల్లోలాల్లో మరణించిన వారి పట్ల నాకు చాలా బాధ ఉందనీ అతడితో చెప్పాను అతడు పేలవంగా జవాబిచ్చాడు. 'మీరు తెహల్కా మనుషులు మీతో మాట్లాడాలంటే భయమౌతుంది ఏం రికార్డు చేస్తారోనని భయమౌతుంది'.

కావలిస్తే నా బ్యాగు, నా డైరీ చెక్ చేసుకొమ్మని చెబితే అతడు ఇబ్బందిగా నవ్వాడు అతణ్ణి నేను మళ్ళీ కలుస్తానని అన్నాను. తరువాతి వారమంతా అతనితో ఏ సంబంధంలో లేను.

ఇది పని చేసింది. మరుసటి వారం నేను షేక్‌ను కలిసాను. ఈ సారి అతడి విశ్వాసాన్ని కూలదోసాను. అది నన్ను లోపలి నుండి తొలచివేసింది నేరం చేస్తున్నానన్న భావన నన్ను తీవ్రంగా ఇబ్బందికి గురి చేసింది నేనెవరో అతడికి తెలుసు. నాకు అందే సమాచారాన్ని రహస్యంగా ఉంచే జర్నలిస్టు రానా అయ్యూబ్‌ను నేను కానీ బహుశా నిజమేమిటో తెలిసిన మనిషి ఇక్కడున్నాడు పాండ్యా హత్య జరిగి పదేళ్ళయ్యింది ఈ కేసు ముందుకు పోతుందనే ఎటువంటి ఆశ కనిపించడం లేదు నేను నా రహస్య కెమెరాను తీసుకెళ్ళి అతడితో సంభాషణను రికార్డు చేద్దామనుకున్నా అయితే మరే మార్గం కనిపించనప్పుడే అలా చేద్దామనుకున్నా. షేక్‌ను కలిసినప్పుడు, ఆ ఒక్క సాక్ష్యాధారం సంపాదించడం కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేసాను ముఫ్తి సుఫియన్ ఇంటికి కూడా వెళ్ళాను కానీ, వాళ్ళు పోలీసులను పొగడటం తప్ప మరేం మాట్లాడలేదు. వారికి బాగానే శిక్షణ ఇచ్చినట్టున్నారు

రెండోసారి మేము కలిసినప్పుడు షేక్ బహిరంగంగానే మాట్లాడాడు

ప్రశ్న: *మొదటనే నన్నొక విషయం చెప్పనివ్వండి ఐబి మీ వెంట పడుతున్నది ఐబిలోని అత్యున్నత అధికారి ఆదేశాల మేరకే మీ వెంటపడుతున్నాడు*

జవాబు: *రాష్ట్ర ఐ.బి నా, కేంద్ర ఐ బి.నా?*

ప్రశ్న *రాష్ట్ర ఐ.బి మీరు నన్ను కలుస్తున్నారని అతడు నాతో చెప్పాడు మీరు నన్ను కలిసారని వాళ్ళకు తెలిసింది నన్ను జాగ్రత్తగా ఉండమని చెప్పారు అది వాళ్ళ పని మీరు జాగ్రత్తగా ఉండడం కోసం చెబుతున్నా*

జవాబు: *కానీ వాళ్ళకు నా పట్ల కోపం ఎందుకు?*

ప్రశ్న. ఈ హరేన్ పాండ్యా కేసు ఒక అగ్నిపర్వతం లాంటిది ఒక్కసారి నిజం బయట పడిందంటే, మోదీ ఇంటికి వెళ్ళిపోతాడు అతడు ఇంటికి కాదు, జైలుకు పోతాడు ఊచలు లెక్కపెడతాడు. హరేన్ పాండ్యా కేసులో ఆజమ్ ఖాన్ ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిశీలించమని జాగృతి పాండ్యా కోరిన రెండు రోజుల్లో ఉదయ్‌పూర్‌లో అతడిపై కాల్పులు జరిగాయి అతడు బతికిపోయాడు కాబట్టి అతనిని భయపెట్టి, రాజకీయంగా ఒత్తిడి చేసారు.

ప్రశ్న. కానీ, నాకు ఆశ్చర్యంగా ఉంది ఐబికి నా గురించి ఎట్లా తెలిసింది?

జవాబు· ఎందుకంటే, ఐబి మోదీ కోసం పని చేస్తుంది కాబట్టి మేడమ్ మీరు ఆ సాక్షి అనిల్ యాద్రామ్‌పై ఎందుకు స్టింగ్ చేయరు?

ప్రశ్న ఎందుకు? అతడు చెప్పేదేముంది?

జవాబు. అరె అతడు నిజమేంటో చెబుతాడు అతడి వద్దకు మొదలు ఎవరొచ్చారు, అతడికి ఏం తెలుసు, ఏం చెప్పమని అతడికి చెప్పారు, వంటివన్నీ చెబుతాడు చూడాసమకు కూడా ఈ కేసులో పాత్ర ఉంది. అతడు ఎంతో మంది నేరస్థులతో చేతులు కలిపి ఉన్నాడు.

బారోత్ వంటి ఇన్‌స్పెక్టర్లతో కలిసి చూడాసమ, తదితర అధికారులు ఇవన్నీ చేస్తున్నారు.

ప్రశ్న. అనిల్ యాద్రామ్ ఎందుకు తప్పు వాంగ్మూలం ఇచ్చాడు?

జవాబు· మేడమ్, ఏం చెప్పాలనేది కస్టడీలో అతడికి నేర్పించారు హత్య కంటే ముందే వాళ్ళ వద్ద అస్గర్ అలీ ఉన్నాడు కాబట్టి వాళ్ళు అతనికి నేర్పించారు పాండ్యాను హత్య చేసాక హంతకుడిగా అస్గర్ అలీని ఉంచాలనుకున్నారు దానికోసం వాళ్ళకొక సాక్షి కావాలి

ప్రశ్న అస్గర్ అలీని ఎందుకు అదుపులో ఉంచుకున్నారు?

జవాబు· ఎవరో ఒక ముస్లిం గుండాపై నేరం తోసెయ్యాలి అతడు అక్రమంగా అదుపులో ఉన్నాడు. అతడు తన డిఫెన్సులో ఏం చెబుతాడు?

పైగా అస్గర్ అలీ ఒప్పుకోలు అవసరమే లేదు వాళ్ళకు కావలసిందల్లా ప్రత్యక్ష సాక్ష్యం

ప్రశ్న అంటే తరుణ్ బారోత్, చూడాసమ, వంజారాలందరూ ఇందులో ఉన్నారంటారా?

జవాబు: అవును

తాను కారులో పోతుంటే, హరేన్ పాండ్యా కారులో పడి ఉండడాన్ని

చూసానని కన్హయ్య చెప్పాడు గుజరాత్ పోలీసుల కట్టు కధనాన్ని సిబిఐ అధికారి సుశీల్ గుప్త ఆమోదించారు తరువాత గుప్త సిబిఐ నుండి రాజీనామా చేసి ఇప్పుడు సుప్రీంకోర్టులో లాయరుగా చేస్తున్నాడు. అతడు రిలయన్స్ పే రోల్‌లో ఉన్నాడు. అతడు సిబిఐ నుండి ఎందుకు రాజీనామా చేసాడో అడగండి సుప్రీంకోర్టులో ప్రాక్టీసు చేస్తున్నాడు అతడిని కలవండి.

ప్రశ్న: అంటే సిబిఐ తాను చేయవలసిన దర్యాప్తు చేయలేదన్నమాట.

జవాబు ఏదో పైపైన చేసింది గుజరాత్ పోలీసు అధికారులు చెప్పినదంతా అది ఒప్పేసుకుంది

ప్రశ్న అది ఒక రాజకీయ హత్యనా?

జవాబు ప్రతి ఒక్కరికీ అందులో పాత్ర ఉంది అద్వానీ కారణంగా కేసును సిబిఐకి అప్పగించారు అతడు నరేంద్రమోదీకి గురువు కాబట్టి నరేంద్రమోదీ పేరును తొలగించడానికి సిబిఐకి అప్పగించారు. ప్రజలు స్థానిక పోలీసులు చెప్పింది నమ్మరు, కానీ సిబిఐ చెప్పిందంటే నమ్ముతారు.
చాలా రోజుల తర్వాత ముష్తి పారిపోయాడు

ప్రశ్న: ఇందులో ఎవరి పాత్ర ఉంది బారోత్‌దా, వంజారాదా?

జవాబు బారోత్ మరెక్కడో ఉన్నాడు చూడాసమను డిప్యూటేషన్ పై తెచ్చారు. అతడు ప్రభుత్వానికి పని చేస్తాడు ఈ ఎన్‌కౌంటర్‌లో పోరుబందరు లింకు ఉంది (ఇది ఒక బ్లైండ్ కేసు) ఇది ఎటూ దారి తీయని కేసు. వాళ్ళు ఊరికే అస్గర్ అలీని, సాక్షిని ఇరికించారు క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసింది ఆ దర్యాప్తును ఎవ్వరూ నమ్మలేదు విరల్ పాండ్యా కూడా నమ్మలేదు.

ప్రశ్న సిబిఐ ఎందుకు నమ్మింది?

జవాబు సిబిఐ ఈ కేసు నుండి మోదీని రక్షించింది

కొన్ని స్టేట్‌మెంట్‌లకు ఎటువంటి వివరణ అవసరం లేదు హరేన్ పాండ్యాను కాల్చాడంటున్న అస్గర్ అలీ హైదరాబాద్‌లోని ఒక జైల్లో ఉన్నాడు. అరెస్టయిన ఇతర యువకులు కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు తులసి ప్రజాపతి, సోహ్రాబుద్దీన్‌ల హత్యలలో పాత్ర ఉన్న వారితో కూడా సంబంధాల్లో ఉన్నారు కాబట్టి హరేన్ పాండ్యాను నిజంగా చంపిందెవరు? ఊరికే ఎవరో అనుకుంటున్న గాలికబుర్లను మాత్రమే షేక్ చెబుతున్నాడా? కానీ ఆయన ఎందుకలా చేస్తాడు? సంబంధిత పేపర్ల పైన సంతకం చేసిన దర్యాప్తు అధికారి అతడు ప్రారంభంలో దర్యాప్తు చేసింది అతనే ఆ తదుపరి

అభయ్ చూడాసమ చేసాడు. చూడాసమను ఆ తరువాతి కాలంలో సిబిఐ అరెస్టు చేసింది

సోహ్రాబుద్దీన్, ప్రజాపతిలను ఎందుకు చంపారు? ఈనాటికి కూడా దీని వెనకాల ఉన్న ఉద్దేశ్యం స్పష్టంగా లేదు. సిబిఐ చార్జిషీట్ ప్రకారం హరేన్ పాండ్యా హత్యకు కీలక సూత్రధారి ఐన ముఫ్తి సుఫియాన్ అంత సులభంగా పక్క దేశానికి ఎలా తప్పించుకోగలిగాడు? అమాయకులను అక్రమంగా కేసులలో ఇరికించాడనే ఆరోపణలతో చార్జిషీటు దాఖలయిన అభయ్ చూడాసమ పట్ల సుఫియాన్ కుటుంబం ఎందుకంత కృతజ్ఞతా భావంతో ఉంది?

గుజరాత్ గృహమంత్రులలో. అత్యంత జనాదరణ ఉన్న వారిలో ఒకడైన హరేన్ పాండ్యా గుజరాత్ అల్లర్ల కేసులో ఒక పౌరుల ట్రిబ్యునల్ ముందు హాజరు కావాలనే తన అభిలాషను వ్యక్తపరచాడు దీని వెనకాల గానీ నిజం దాగి ఉందా? అన్యాయం, పరస్పర విరుద్ధమైన సాక్ష్యాధారాల ఈ చిక్కుముళ్ళ నుండి నిజాన్ని వెలికి తీయాల్సిన సమయం ఆసన్నమైంది

---

*22 గుజరాత్ డిజి కావలసిన కుల్‌దీప్ శర్మ గురించి చక్రవర్తి మాట్లాడుతున్నాడు గుజరాత్ ప్రభుత్వం భుజ్‌లో అతడిపై ఉన్న ఇరవై ఏళ్ళనాటి ఎన్‌కౌంటర్ కేసు తిరగతోడింది ఎందుకంటే శర్మ అప్పటి గృహమంత్రి ఐన అమిత్‌షాను సహకార సంఘాల కుంభకోణం కేసులో సవాలు చేసాడు ఒక మహిళపైన నిఘా పెట్టమని అమిత్‌షా జి ఎల్ సింఘాల్‌తో చెబుతున్నది రికార్డు చేసిన విషయాన్ని బయట పెట్టారని కుల్‌దీప్ శర్మ, ప్రదీప్ శర్మలపై కూడా షా ఆగ్రహంతో ఉన్నాడు అంతేకాదు, సాహెబ్ ఆదేశాల మేరకు నిఘా పెట్టమని అతడు అనడం కూడా రికార్డులో ఉంది ఈ 'సాహెబ్' అంటే నరేంద్ర మోదీయేనని అనుకుంటున్నారు*

*23 http //www tehelka com/2010/09/geeta-johri-was-known-to-be-a-fearless-officer-so-what-accounts-for-her-flip-flops/?singlepage=1*

*24 http //www dnaindia com/india/report-arun-jaitley-writes-to-pm-on-congress-dirty-war-against-narendra-modi-1896969*

*25 http //www ndtv com/cheat-sheet/jailed-cop-dg-vanzara-attacks-amit-shah-gujarat-government-over-fake-encounters-533486*

*26 http //indiatoday intoday in/story/jagruti-haren-pandyas-wife-to-contest-gujarat-polls-keshubhai-patel-gujarat-parivartan-party/1/235242 html*

# పదకొండవ అధ్యాయం

నా పరిశోధన పూర్తయిన తరవాత నేను మళ్ళీ ముంబయికి తిరిగి వచ్చాను వచ్చిన వెంటనే ఫిల్మ్ గురించిన నా పరిశోధన పూర్తయిందా అంటూ పి సి పాండే నుండి నాకొక ఫోన్ వచ్చింది ముఖ్యమంత్రిని కూడా కలవమని నాకతను సలహా ఇచ్చాడు ఈ అవకాశం గురించి నేను ఎగిరి గంతేశాను. దీని గురించి వెంటనే నేను నా సీనియర్లకు మెయిల్ ఇచ్చాను ముందుకు సాగమని షోమా, తరుణ్‌ల నుంచి మెయిల్ వచ్చింది. చివరిసారిగా నాకు సాయం చేయడానికి మైక్‌ను అహ్మదాబాద్ పంపడానికి వాళ్ళు ఏర్పాట్లు చేశారు. మైక్‌ను కలవడానికి ఆయన తల్లిదండ్రులు ఢిల్లీ వచ్చి ఉన్నారు ఒక్క రోజు కోసం అహ్మదాబాద్ రావడానికి అతడేదో ఒక సాకు కల్పించుకున్నాడు

ముఖ్యమంత్రి నివాసం దగ్గర చాలా నిశితంగా సోదా నిర్వహిస్తారని నేను మైక్‌కు వివరించాను. కాని వెళ్ళకపోతే పి.సి పాండే అనుమానిస్తాడు కాబట్టి వెళ్ళాలని కూడా మైక్‌కు చెప్పాను రికార్డు చేయడం కోసం కెమెరా ఉన్న వాచ్‌ను పెట్టుకున్నాను ఆ రోజు ఒక స్థానిక టూరిస్టు కారు తీసుకున్నాము. ఈ సమయంలో నేను ఫౌండేషన్ వద్ద ఉండటం లేదు కాబట్టి ఒక్క రోజు కోసం ఎస్ జి. హైవే పై ఉన్న ఖాళీ బంగళా తాళపు చెవులు తీసుకున్నాము. నేను, మైక్, ఒక గంట ముందే మోదీ గాంధీనగర్ నివాసం చేరుకున్నాం కారుని దగ్గర్లో పార్క్ చేయమని డ్రైవర్‌కి చెప్పి గడియారం మళ్ళీ వేగంగా కదలడం కోసం ఎదురు చూస్తున్నాను మైక్ చిరునవ్వు నవ్వుతున్నాడు కానీ నేను కలవరంగా ఉన్నాను నా గడియారంలోని కెమెరా సెక్యూరిటీ చెకింగ్‌లోనో మెటల్ డిటెక్టర్ వల్లనో బయటపడితే ఇక మా పని అయిపోయినట్టే అరగంట తర్వాత పట్టుపడకుండా సెక్యూరిటీ గుండా మేము లోపలికి వెళ్ళాక గానీ నేను హాయిగా ఊపిరి పీల్చుకోలేకపోయాను

మోదీ ఓ ఎస్ డి సంజయ్ భావ్‌సార్ మమ్మల్ని కలిశాడు చివరికి మమ్మల్ని

ముఖ్యమంత్రి గదిలోకి తీసుకెళ్ళారు మమ్మల్ని పలకరించడానికి అతను లేచి నిలబడ్డాడు. మైక్ తాను ఆటోలలో అతని పోస్టర్లు చూశానని, అతని పాపులారిటీని చూసి ఆశ్చర్యపోయాననీ అన్నాడు టేబుల్‌పై బరాక్ ఒబామా పై రెండు పుస్తకాలు ఉన్నాయి 'సర్! తరవాయి ప్రధానమంత్రి మీరే అవుతారా?" అని నేను వెంటనే అడిగాను. అతడు కొంచెం సిగ్గుపడి బరాక్ ఒబామా గురించి మాట్లాడుతూ అతడు తనకెలా స్ఫూర్తి కలిగించాడో, చెప్పాడు. వివేకానందుని గొప్ప గుణాలను గురించి కూడా చెప్పాడు ఒక అరగంట పాటు ముచ్చటించిన తర్వాత భావ్‌సార్‌ను తన గదికి పిలిపించి తన గురించి రాసిన పుస్తక సామాగ్రిని మాకు చూపించమన్నాడు భావ్‌సార్ మమ్మల్ని తన కేబిన్‌కు తీసుకువెళ్ళాడు అతని టేబుల్ పైన ముఖ్యమంత్రిపై తెహల్కా, హిందూలలో ప్రచురించిన కథనాల ప్రింటవుట్లు ఉన్నాయి నేను వాటి గురించి అడిగితే, ముఖ్యమంత్రికి చాలా మంది శత్రువులున్నారని అతను జవాబు చెప్పాడు మైక్ నవ్వినట్టనిపించింది నాకు ఆ తరవాత ముఖ్యమంత్రి రాసిన వివిధ పుస్తకాలు మాకు చూపించాడు. భారత దేశంలోనూ, విదేశాలలోనూ ఆయనిచ్చిన ఉపన్యాసాలను మాకు వినిపించాడు

వాటన్నిటి ప్రతులను తీసుకొమ్మని, అది నా ఫిల్మ్ తయారీలో ఉపయోగ పడుతుందని భావ్‌సార్ అన్నాడు. నేను మళ్ళీ వచ్చినప్పుడు తీసుకుంటానని చెప్పాను మేము ఇంటికి వెళ్ళిపోయాం. మైక్ తన బ్యాగులు సర్దుకున్నాడు ఢిల్లీకి విమానం ఎక్కాల్సి ఉంది విమానాశ్రయానికి ట్యాక్సీని పిలిచి అతడిని నేను ఆలింగనం చేసుకొన్నాను. కొద్ది నిమిషాల తర్వాత మైక్ నాకు ఫోన్ చేసి తన జేబులో ఒక్క రూపాయి కూడా లేదనీ ట్యాక్సీ డ్రైవర్ కిరాయి తీసుకోకపోగా తన ప్రయాణానికై రెండు వందల రూపాయలిచ్చాడని చెప్పాడు గుజరాత్ నుండి తను తీసుకు వెళ్ళదలుచు కున్నదిదే అని అతను అన్నాడు. నేను హృదయపూర్వకంగా అంగీకరించాను నేను మైక్‌ని చూసింది అదే చివరిసారి. అతడెక్కడ ఉన్నా అతనికి అక్క, కామ్రేడ్ అయిన మైథిలిని గుర్తుంచుకుంటాడు.

నేను వెంటనే షోమాకు ఫోన్ చేసి జరిగిన దాని వివరాలు చెప్పాను నేను ముఖ్యమంత్రిని అల్లర్ల గురించి ప్రశ్నించానా అని ఆమె అడిగింది "భలే ఉన్నావ్ షోమా! మొదటిసారి కలిసినప్పుడే అట్లాంటి పని చేస్తానా?" అని బదులిచ్చాను. ఆ రోజు సాయంత్రమే నన్ను వెనక్కి ఢిల్లీ రమ్మని షోమా నుండి నాకు కాల్ వచ్చింది. నేను నా నిరసన తెలుపుతూనే ఉన్నా, "వచ్చాక మాట్లాడుదాం" అన్నది మరు రోజు ఉదయం ఢిల్లీ వెళ్ళి తిన్నగా తెహల్కా ఆఫీసుకి వెళ్ళాను మోదీ రికార్డింగ్‌కి

సంబంధించిన ఫుటేజ్‌ని నా ల్యాప్‌టాప్‌లోకి అప్పటికే మార్చుకొని ఉన్నాను. తరుణ్ తన క్యాబిన్‌లో ఉన్నాడు షోమా కూడా అక్కడికి వచ్చింది. నేను వాళ్ళకి ఫుటేజి చూపించాను ఒబామా పుస్తకాలను చూసి వాళ్ళు నవ్వారు.

"నన్నెందుకు వెనక్కి పిలిపించారు? కొద్ది రోజుల్లో అతడి ఆఫీసు నుంచి నాకు పిలుపు రాబోతోంది నేను అతన్ని మళ్ళీ కలవాల్సి ఉంటుంది."

"చూడూ రానా! బంగారు లక్ష్మణ్ మీద తెహల్కా స్టింగ్ తర్వాత వాళ్ళు మన ఆఫీసు మూసేశారు మోదీ అత్యంత శక్తివంతమైన మనిషి ఐన ప్రధానమంత్రి కాబోతున్నాడు మనం అతన్ని ముట్టుకున్నామా, మన పని అయిపోయినట్టే" అని తరుణ్ అన్నాడు

నేను కన్విన్స్ కాలేదు మొత్తం స్టింగ్ ఆపరేషనే ప్రమాదంతో కూడుకున్నది కాదా! కాని నేను చేసిన ప్రతి వాదనకూ గట్టిగా లేదనే సమాధానమే వచ్చింది. అదే రోజు సాయంత్రం సంజయ్ భావ్‌సార్ నాకు ఫోన్ చేశాడు నాకు మూడు సార్లు ఫోన్ చేసి ఆ తరవాత రాబోయే ఆదివారం ముఖ్యమంత్రి నన్ను కలవదల్చుకున్నాడని మెసేజ్ పెట్టాడు నేను ఒక ప్రజాటెలిఫోన్ నుంచి భావ్‌సార్‌కు ఫోన్ చేసి ఢిల్లీలో ఉన్నాననీ, ఒక బంధువు చనిపోవడం వల్ల అక్కడే ఉండాల్సి వస్తుందనీ చెప్పాను అయితే ఒక వారం రోజుల్లో మళ్ళీ అతనిని కాంటాక్టు చేస్తానని చెప్పాను రెండు రోజుల తర్వాత నేను నా ఫోన్ నుంచి యూనినార్ సిమ్‌కార్డు తీసేసి విరక్కొట్టి చెత్తబుట్టలో పడేశాను. ఫోన్‌కు కూడా అదే గతి పట్టింది. ఆ రోజు మైథిలీ శాశ్వతంగా నిష్క్రమించింది 'ఈ పరిశోధనను ప్రచురించము' అని సంపాదకులు నిర్ణయం తీసుకున్నారు

అప్పటి నుండీ నేను మౌనంగానే ఉన్నాను.

ఇప్పటి దాకా!

ACC No. 118658
హైదరాబాద్ - 500032

జర్నలిస్టు రానా అయ్యూబ్ ఎనిమిది నెలల పాటు అండర్ కవర్‌లో ఉంటూ గుజరాత్ మత కల్లోలాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, రాష్ట్ర హోమ్ శాఖమంత్రి హరేన్ పాండ్యా హత్యలను దర్యాప్తు చేసి బయటపెట్టిన ఎన్నో విభ్రాంతికర విషయాల సమాహారమే గుజరాత్ ఫైల్స్. అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ కన్జర్వేటరీ నుండి వచ్చిన ఫిల్మ్‌మేకర్ మైథిలీ త్యాగిగా రానా గుజరాత్ రాష్ట్రంలో 2001, 2010 మధ్య అత్యంత కీలక పదవుల్లో ఉన్న ఉన్నతాధికారులను, పోలీసు అధికారులను కలిసింది. రాజ్యం, దాని అధికారగణం మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు చేయటంలో ఎట్లా భాగస్వాములయ్యాయో ఈ స్టింగ్ ఆపరేషన్ ద్వారా బయటపెట్టిన విషయాలు తెలుపుతాయి.

నరేంద్రమోదీ, అమిత్ షాలు అధికార శిఖరాలకు ఎగబాకటం కోసం గుజరాత్ నుండి ఢిల్లీ దాకా వాళ్ళు చేసిన ప్రయాణానికి సమాంతరంగా నడిచిన కేసుల గురించి ఎన్నో సంచలనాత్మక విషయాలను ఈ పుస్తకం బయటపెడుతుంది. విచారణ కమిషన్ల ఎదుట మాట్లాడవలసి వచ్చినప్పుడు మతిమరుపు నటించిన వారు రహస్యంగా టేపు చేసిన వీడియోల్లో ఏ ఒక్క విషయమూ దాచుకోకుండా చెప్పిన నిజాలను చాలా ఆసక్తిదాయకంగా ఈ పుస్తకం బయటపెడుతుంది.

ISBN 978-93-85076-02-2

9789385076022

Communalism ₹ 130

email : malupuhyd@gmail.com

954.75